# సూరసాగరము
# దశమస్కంధ సంగ్రహము

(సూరదాస రచిత భాగవతము)



This book is published with the financial assistance
of Tirumala Tirupathi Devasthanams under their
Scheme - Aid to publish religious books.

ఆంధ్రానుసరణము :

మైలవరపు సూర్యనారాయణమూర్తి

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి.


ప్రథమముద్రణము
ప్రతులు వేయి
1992

ప్రాప్తిస్థానము :
మైలవరపు సూర్యనారాయణమూర్తి
కృష్ణంపాలెం
దేవరపల్లి మండలం - ప॥ గో॥ జిల్లా
534 313

ముద్రణము :
విజయశ్రీ ప్రింటింగ్ వర్క్స్
కందకంరోడ్ - రాజమండ్రి-1

మూల్యం
రూ. 25-00

విజయతే శ్రీ వేంకటేశః ప్రభుః



కొండఁగలట్టిసామి, కయికొండని కోరికలిచ్చుసామి, ఆ
ఖండలువంటిసామి, కొలకండల కొండలఁగూల్ప, చేవయుం
గండ గలట్టిసామి, కడగం డ్లడగించెడు దొడ్డసామి, మా
కండగ నిల్చుసామి, తనయుండను నమ్మిన భుక్తిముక్తికై
దండ లొసంగుసామి, కలిదైవము, వెంకనసామిఁగొల్చెదన్॥

# పండితాభిప్రాయములు:

| | |
|---|---|
| శుభాఽశంసనాలు<br>కవితాప్రశంసలు | ఆర్షధర్మ ప్రచారకులు<br>విద్వాన్ శ్రీ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య<br>దీక్షితులుగారు<br>రిటైర్డు సంస్కృతాంధ్ర పండితులు, హైదరాబాదు |
| అభినందన | భారతీయ జ్ఞానపీఠపురస్కార గ్రహీతలు, తెలుగు<br>విశ్వవిద్యాలయఉపాధ్యక్షులుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ<br>సాంస్కృతికవ్యవహారాలసలహాదారు పద్మభూషణ్<br>ఆచార్య C. నారాయణరెడ్డిగారు<br>MA Ph.D DLitt<br>లలితకళాక్షేత్రం, పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాదు |
| ఆకాంక్ష | భారతీయజ్ఞానపీఠ ఎగ్జిక్యూటివ్-డైరెక్టరు<br>డా॥ శ్రీ ఇ. పాండురంగరావుగారు<br>న్యూఢిల్లీ |
| సూరసాగరము-సమీక్ష | డా॥ M. సంగమేశంగారు MA Ph D DLit<br>రిటైర్డు హిందీప్రొఫెసరు SV ఆర్ట్సుకాలేజీ తిరుపతి |
| శ్రీకృష్ణతత్త్వం | విద్వాన్ "సాహిత్యశిరోమణి" "విశారద"<br>శ్రీ జోస్యుల సూర్యనారాయణమూర్తిగారు<br>రిటైర్డు సంస్కృతాంధ్రపండితులు అశ్వాపురం<br>ఖమ్మంజిల్లా |
| దృష్టికందవిసృష్టి | డా॥ ఎస్. సంజీవదేవ్ D. Litt<br>ప్రముఖ సాహితీవేత్తలు చిత్రకళానిష్ణాతులు<br>తుమ్మపూడి - గుంటూరు జిల్లా |

| | |
|---|---|
| అంకన [illegible] | డా॥ [illegible] ...ములు M.A.Ph.D |
| | హిందీ పార్టంగల్ రీడరు, హిందీశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం |
| | బహుభాషా కోవిదులు, గీతాంజలి [illegible] ఆది [illegible]గ్రంథ రచయితలు "సాహిత్యరత్న" |
| సమాలోకనము | శ్రీ A. హనుమచ్ఛాస్త్రిగారు MA. (త్రితయ) రిటైర్డ్ హిందీ ప్రాధ్యాపకులు ఆలీమర్ విశ్వ విద్యాలయం S.V. N. కోలనీ, గుంటూరు-6 |
| | సాహిత్య విద్యాప్రవీణ, భాషా ప్రవీణ, సుందర సుబోధినీ వ్యాఖ్యాతలు |
| బంధుజనానందము | శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యంగారు రిటైర్డ్ తెలుగు లెక్చరర్, కోరుకొండ. |
| కృతజ్ఞతానివేదనము | 'కావ్యానుకృతి' కర్త స్వీయ నివేదనము. |

# విషయానుక్రమణిక


* ఇష్టదేవతా వందనాదికము — పుట
* సూరదాసకవి సంస్మరణము
* కృత్యాది ప్రస్తావన
* భక్తశిరోమణి సూరదాస మహాకవి
* సూరసాగర కావ్యప్రశస్తి
* గోపి దివ్యానుభూతి ప్రశంస
* కృతిసమర్పణము-షష్ఠ్యంతములు

1 జన్మోత్సవ లీలావైభవము 1
2 వ్రేపల్లెలో పుత్రజన్మోత్సవ వర్ణనము 12
3 డోలికోత్సవము 24
4 బాలముకుందమూర్తి వటపత్రశాయి వర్ణనము 28
5 యశోద శ్రీకృష్ణుని శైశవ క్రీడలకు మురిసి మెచ్చుకొనుట 30
6 తృణావర్తుని అగడము 32
7 యశోద శిశుముఖమున విశ్వరూప సందర్శనము చేయుట 34
8 కృష్ణలీలాభివర్ణనము 36
9 ఒక గోపకాంత తన దివ్యానుభూతిని వర్ణించుట 40
10 మేలుకొలుపు 50
11 విప్రునకు బాలకృష్ణుని సాక్షాత్కారము 58
12 శ్రీకృష్ణుని దివ్యలీలామహిమానుభావ వర్ణనము 67

ఉద్ధవసందేశము

13 భ్రమరగీతాసారము 73
14 కుబ్జాసందేశము 81

| | | |
|---|---|---|
| 15 | ఉద్ధవుడు గోకులమున కరుదెంచుట | 82 |
| 16 | గోపికాగీతము | 91 |
| 17 | ఉద్ధవుని యుపదేశము | 139 |
| 18 | ఉద్ధవుడు గోపికల నభినందించుట | 194 |
| 19 | ఉద్ధవుని మధురాగమనము కృష్ణసందర్శనము | 194 |
| 20 | గోపికాభక్తిమాధురీ మహిమాభివర్ణనము | 194 |
| 21 | భ్రమరగీతాసంగ్రహము | 205 |
| 22 | సూరసాగర కావ్యప్రశస్తి | 207 |
| 23 | సమర్పణము | 208 |

ఆర్షధర్మ ప్రచారకులు
"విద్వాన్ శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారు"
విజయనగరం కాలనీ, హైదరాబాద్.

శ్రీయుతులు మైలవరపు సూర్యనారాయణమూర్తిగారికి

# శుభాశంసనాలు - కవితా ప్రశంసలు

శ్లో॥ ౧ శ్రీకామకోటి పీఠస్థం మిధునం తత్సనాతనం ।
కుర్యా ద్వేదాయు రైశ్వర్యభాజనం త్వాం కుటుంబినమ్ ॥

[1]నాన్న పల్కు ననువదించి యందాల[2]చిలుక
నందనందను నందంబు విందుసేసె
నందఱకు [3]నమరభాష నానంద మధుర
మది పరీక్ష పరీక్షిదభ్యుదయదీక్ష

పలికె నదె తాను వ్రజభాష నా వ్రజేశు
ముద్దుమురిపాలు సూరన హద్దుపద్దు
లేని జ్ఞానము విజ్ఞాన మేని మేను
మఱచి పాల్కడలిం బుద్ధి మంథనముగ

సూరసూర్యు లోకరె సూరసూర్యార్యమా
అనెను గాద అమరు డమరభాష
అమ్మనాన్నలు బారసాలందు నీకు
నదియె పేర్వెట్టినార లభ్యుదయ మదియ

1) నాన్న=వ్యాసభగవానుడు 2) చిలుక=శ్రీశుకులు 3) అమరభాషలో=భాగవతము

సరిగ కృష్ణమపోలె మాస్థాన మయ్యె,
సరిగమపదని రాగవిస్ఫురణ వేణు
వూదితివి సూరసాగర మొద్దు సేరి,
పరమభాగవతా! కవివర్య! సూర్య!

నీ కవితామధుపానము
మైకము రప్పించె నాకు మైలవరశ్రీ
మా కింటి పేరు సార్థక
మాకల్పసుఖానుభూతి నందుము 'మిత్రా!

1). మిత్రా ! — సూర్యనారాయణమూర్తి ! అన్నమాట

"డాక్టర్ ఐ. పాండురంగరావుగారు"
ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు, భారతీయ జ్ఞానపీఠం
18 ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, లోడీ రోడ్, న్యూఢిల్లీ-3,

# ఆకాంక్ష

ఆత్మీయులు

శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తిగారికి
నమస్సుమాంజలి

మీరు నాపయి అభిమానంతో పంపిన "సూరసాగరము-దశమ స్కంధ సంగ్రహము" సాంతం స్వాంతస్సుఖానుభూతితో చదివాను. స్వాంతస్తమఃశాంతికి మీ పదసంపద చక్కని సోపానం. హిందీ భక్తి సాహిత్యంలో సూర్యచంద్రులలాంటి సూరతులసీదాసుల వాగ్విలాసాన్ని చక్కని తెలుగులో పంచదారలాంటి పద్యాలలో అందించిన మీ సారస్వత దీక్ష ప్రణమ్యమైనది. ప్రశస్తమైన పద్యవిద్య మీకు ఉగ్గుపాలతోనే అబ్బినట్లున్నది. సారసూక్తి పరిశోభితమైన మీ కృతిని మన వెంకన్న ఎంతో ఆనందంతో అందుకొని ఉంటాడు. సఖ్య వాత్సల్య రససుధాసాగరాన్ని విభక్తి నెఱుగని భక్తవత్సలుడు మాధవీయ మనోయోగంతో ఆదరించి ఆరగించియుండాలి. అహోరాత్రా లనుసంధించి ఆత్మవంతులకు స్వాత్మానందాన్ని ప్రసాదించే సర్వయోగీశ్వరేశ్వరుడు మీచేత ఇలాంటి మంచిపనులను మరీ మరీ చేయిస్తూ ఉండాలని మనసార కాంక్షిస్తూ మీ మేలుకోరే

5-9-1992

ఇలపావులూరి పాండురంగరావు

భారతీయ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారు
“పద్మభూషణ్” ఆచార్య సి. నారాయణరెడ్డిగారు,
M,A. Ph D. D. Litt హైదరాబాద్

# అభినందన

హిందీసాహిత్యరంగంలో సూరదాసు మనకు పోతనలాంటి వాడు. ఆ భక్తకవిచేతిలో భాగవతగాథ అపూర్వరుచులు సంతరించుకొంది. సూరదాసు రచించిన భాగవతాంతర్గత దశమస్కంధాన్ని ఆంధ్రహిందీభాషాప్రవీణులు శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తిగారు పద్యగేయోభయఫణితిలో అనువదించారు.

శ్రీ సూర్యనారాయణమూర్తిగారి అనువాద కుశలత గురించి మూలజ్ఞులే చెప్పాలి. ఆయన ఆంధ్రపద్యగేయ రచనాశక్తి మాత్రం అత్యంతసమర్థమయినదని నా అభిప్రాయం, మూలచ్ఛందము గేయాత్మకం. అందువల్ల మూర్తిగారు వృత్తాలూ, సీసాలూ, తేటగీతులూ, కందాలూ, ద్విపదలతోపాటు, ద్విరదగతి మున్నగు రగడభేదాలను కూడ, ఈ గ్రంథంలో ప్రయోగించారు. శైలి గ్రాంథికమైనా, మూర్తిగారి లలితపదగుంభనం వల్ల పరమపఠనీయంగా రూపొందింది అనువాదగ్రంథం.

హిందీలోని సూరవాణిని తెలుగువారి కందించిన సూర్యనారాయణమూర్తిగారి కృషికి నా అభినందన.

సి. నారాయణరెడ్డి

డాక్టర్. M. సంగమేశమ్‌గారు
M.A. Ph.D D. Litt
రిటైర్డ్ ప్రొఫెసరు - (హిందీ శాఖ)
శ్రీ వెంకటేశ్వర ఆర్ట్సు, కాలేజి, తిరుపతి.

సూరసాగరము (దశమస్కంధ సంగ్రహము)

## పరిచిక

హిందీజగత్తులో మహాకవిగా, భక్తశిరోమణిగా ప్రసిద్ధిచెందిన సూరదాసు వ్రాసిన పదసంగ్రహమే సూరసాగర్. వేలాదిగా గల అతని పదాలు భాగవతకథ నాధారముగా గొని విస్తరించి వ్రాసినవి. అందులో దశమస్కంధపూర్వభాగపు కథతో సంబంధించిన పదాలు మొత్తం సంకలితగ్రంథంలో మూడు వంతులకుమించి లభిస్తాయి. ఇవన్నీ కృష్ణలీలలను ముఖ్యంగా బాలకిశోరలీలనూ విరివిగా పెంచి వ్రాసినవి. కవి వల్లభాచార్యులవారి శిష్యుడై శుద్ధాద్వైతదీక్ష పొందిన వాడు. కనుక బాలకృష్ణభక్తితోపాటు రాధాకృష్ణభక్తిని కూడ పెంపొందించుకొని రాసక్రీడాదులతో లీలాతన్మయత్వ మనుభవించి తరించిన భక్తుడు అత డంధుడు. కాని ప్రజ్ఞాచక్షువు. అతని మానసిక జగత్తులో స్ఫురించిన భగవల్లీలలు పరిపరివిధాలుగా భాసించి అతని భావుకత్వ కల్పనావిశిష్టతలతో పెనవేసుకొని ముక్తకపదరూపంలో పరిమళించాయి. విస్తారగాంభీర్యాదులలో సూరదాసు కవిత నిజంగా సాగరమే.

ప్రస్తుత తెలుగుఅనువాదకృతికర్త శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తికవి లోగడ తులసీరామాయణాన్ని (రామచరితమానస్‌ను)

పద్యకృతిగా చక్కగా అనువదించారు. ఇప్పుడు సూరదాసు కవిత్వాన్ని తెలుగుసేతకు పూనుకొన్నారు. ఇది ముదావహమైన ప్రయత్నం.

ఈ ప్రయత్నంలో వీరు సూరదాసు వ్రాసిన దశమస్కంధపూర్వ భాగానికి సంబంధించిన కొన్ని పదాలుమాత్రమే స్వీకరించి తెలుగులో ఛందోబద్ధంగా అనువదించారు. మూలకృతి పదరూపంలో ఉన్నదానికి కొంత దగ్గరగా వీ రీఅనువాదంలో మాత్రాచ్ఛందస్సును గూడ విరివిగా వాడుతూ పద్యకృతితోపాటు పదకవితాసౌరభాన్ని కూడ వెలారించారు. వీరు వాడిన ఆ ఛందోమార్గాలు అనూచానమైనవీ, స్త్రీ పామరసాహిత్యాలలో తరచుగా గోచరించేవే' కనుక పాఠకులు వీటిని పద్యకవితలకు వలెనే ఆదరించి గ్రహిస్తారని భావిస్తాను. సూరదాసు పదాలతో పోల్చినపు డివి కొంచెం దీర్ఘమనిపించినా మూలంలోని మూడునాల్గుపదాల కొకేఛందస్సులో ననువాదం సాగినందున అచ్చటి పునరుక్తు లిందులో చాలవరకు తొలగిపోయాయి' కాగా పాట,పద్యం కూడ అందించినట్లయింది.

ప్రస్తుతకృతిలో, శ్రీకృష్ణజన్మప్రసంగం, కొన్ని బాలలీలలు, మొదటు గ్రహించి, పిదప ఉద్ధవసందేశము భ్రమరగీతలు జోడించారు సూరదాసు స్వభావుకత్వానికీ, ప్రసంగ నిర్మాణచాతురికి, కల్పనావైశిష్ట్యానికి, వాక్చాతుర్యానికి సహజస్వాభావిక, పాత్రోచితతర్క యుక్తులకూ పైచెప్పిన గ్రంథభాగాలు పండితలోకంలో ఎన్నికగన్నవి. వాటిని తెనిగించి ఆంధ్రులకందజేయడంలో మూర్తిగారు ప్రశంసనీయమైన ప్రయత్నంచేసి సాధించారు.

శ్రీ మూర్తిగారికవిత్వం, మృదుమధురమై తెలుగుతనం నిండిన తియ్యని కవిత్వం వీరి కవిత్వంలో వెదకినా సంస్కృతపదబాహుళ్యం గాని సమాసభూయిష్ఠతగాని కనబడదు. తేటతెనుగు పదాలతో ఎలాంటిగంభీరభావాన్నైనా వీరు సునాయాసంగా తీర్చిదిద్దిఅందించే నేర్పుగలవారు. మాత్రాచ్ఛందస్సులలో అనుప్రాసవైభవంతో నామ

మాత్రమైన క్లిష్టతలేని పదాలు పొదిగి అందించి వీరి కవిత్వాన్ని అనువాదాన్ని సూరదాసుకు మిక్కిలి సన్నిహితంగా నిలిపి అందించారు. హిందీభాషేతరులైన మనతెనుగుపాఠకులకు సూరదాసు కవితా వైభవమును వైశిష్ట్యంగాని తెలుసుకొనేందుకు వీరిఅనువాదం చాల సహాయకారిగా ఉండగలదంటే అతిశయోక్తికాదు.

మూర్తిగారి పదకవితలు కొన్ని దీర్ఘమైనాయి. కాని, ఇవి మూలంలోని ఎన్నో పదాలకు సారసంగ్రహంగా వెలిశాయి. పద్య కవితలో వీరు సిద్ధహస్తులు, పోతనగారిని ఒక్కొక్కచోట స్మరింప చేస్తాను. తెనుగు జాతీయాలు నుడికారం వీరి కవితలో అడుగడుగునా కనిపిస్తాయి.

భ్రమరగీతలలో విషయం తెలుగువారికి క్రొత్త ఉద్ధవసందేశం ఉపాలంభనం తెలిసినవియే అయినా సగుణనిర్గుణవాదం యోగవైముఖ్యం తెలుగులకు క్రొత్త. ప్రస్తుతగ్రంథంలో భ్రమరగీతలు తెలుగు చేసి, వీటిని అందించి కవిగారు ప్రస్తుతి పాత్రులయ్యారు. బాలలీలలు మఱికొన్ని తెనిగించి యుండవలసింది. అలాగేరాధాకృష్ణ ప్రథమ పరిచయాదులు మరికొన్ని లోకరక్షక లీలలు, కూడ తెనిగించి ముందు ముందైనా అందిస్తారని ఆశిస్తాను.

తులసీకృతి వలెనే యీ సూరకృతికూడ తెలుగువారి ఆదరాభిమానములకు పాత్రమౌతుందని విశ్వసిస్తున్నాను,

తిరుపతి
18-6-92 మ. సంగమేశం

విద్వాన్ "సాహిత్య శిరోమణి" "విశారద"
శ్రీ శోష్మల సూర్యనారాయణమూర్తిగారు, B A.
రిటైర్డు సంస్కృతాంధ్ర పండితులు, అశ్వాపురం, ఖమ్మంజిల్లా.

# శ్రీ కృష్ణ తత్త్వం

కరారవిందేన పదారవిందం ముఖారవిందే వినివేశయంతం
వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం మనసా స్మరామి:

ప్రళయానంతర, సగుణబ్రహ్మ, బాలముకుందుడు ముకుం దదాతీతి ముకుందః మోక్షానిచ్చేవాడు. పసివాడు, వటపత్రశాయి మనసార ఆ రూపాన్ని భక్తకవి సంస్మరిస్తున్నాడు.

క్వచిద్దివ్యం శౌర్యం క్వచిదపి రణే కాపురుషతా
క్వచి న్మృత్స్నాశిత్వం క్వచిదపి చ వైకుంఠవిభవః
క్వచి ద్గీతాజ్ఞానం క్వచిదపి పరస్త్రీవిరహణం
చరిత్రం తే నూనం శరణద విమోహాయ కుధియామ్.

ఈ కృష్ణస్తుతిలో కవి భగవంతుని బహుముఖమహిమ చెప్తూ ఆయనచరిత్ర కుబుద్ధులకు మోహం కలిగిస్తుం దంటూ శరణు జొచ్చాడు. సుబుద్ధులకందులో పరస్పర వైరుధ్యం కనిపించదన్న మాట కృష్ణతత్త్వం దురవగాహం వేదాంతవిచారం శాస్త్రచర్చ, యమనియమాది కర్మకౌశలం ఇల్లా ఎన్నో కావాలి. జ్ఞానోదయ మవటానికి; దాన్ని యీ వటపత్రశాయి యిస్తాడని భక్తుడు నమ్ము తున్నాడు. ఇది భక్తిమార్గం.

శ్రీ లీలాశుకులవారు పిలుస్తున్నారు, ఆయనమాట వినండి!
"వరమిమముపదేశ మాద్రియధ్వం నిగమవనేషు నితాంతచారఖిన్నాః"
విచినుత భవనేషు వల్లవీనా, ముపనిషదర్థ ములూఖలే నిబద్ధం.

వేదారణ్యాలలో, ఎడతెఱిపిలేకుండ, తిరిగితిరిగి, విసిగి విచారిస్తున్నారా! ఇటురండి, ఏంకావాలి? వేదాంతార్థమా! గోపికల యిళ్లల్లో వెతకండి! దొరుకుతుంది; దాన్ని ఱోలికి కట్టేశారు. వెళ్లి పట్టుకోండి అంటున్నాడు; అదే, ఆయనపిలుపు. ఆ ఉపదేశాన్నాదరించి తరించండి!

ఈ పరిశీలన సగుణోపాసన ప్రాముఖ్యాన్ని కనుపింపజేస్తోంది గోపికలు సగుణోపాసన జేశారు. వారు కోరింది మోక్షమే వారి భక్తి ప్రేమభక్తి. నవవిధభక్తులనీ మించింది ఆత్మీయతాభరితం ఆనంద సుందరం వారిది హరివిరహం భరించలేని, పారవశ్యం, వారి శృంగారభావనలోనే తత్త్వజ్ఞానం, అంతర్నిహితమైఉంది. అది వారి మాటల్లో వినండి.

"నఖలు దేవకీనందనో భవాన్; అఖిలదేహినా మంతరాత్మదృక్"
అంటున్నారు. ఆ కృష్ణున్ని, వెదుకుతూ, భూమి నడుగుతున్నారు.
కింతే కృతంక్షితి! తపోబత కేశవాంఘ్రిస్పర్శోత్సవోత్పులికితాంగరుహైర్విభాసి। అప్యంఘ్రిసంభవ ఉరుక్రమ విక్రమాద్వా।
అహో వరాహవపుషః పరిరంభణేన! (వ్యాసభాగవతం)

కిటియై కౌగిటఁ జేర్చెను.
వటుఁడై వర్ధిల్లి కొలిచె వడి, కృష్ణుండై
యిటుఁ బదచిహ్నము లిడెఁ గ్రిం
దటి, జామున, నేమినోచి తమ్మ! ధరిత్రీ! (పోతన)

ఇదంతా వారికి తెలుసు. అమాయికల్లా కనిపిస్తూ గడుసుదనం పోతున్నారు, వారిమార్గం అనన్యసాధ్యమై సగుణోపాసనలోకూడ, పరాకాష్ఠనందుకొంది. అందుకే వారికేంచెప్పినా నచ్చదు, తమమాటే తమది. రాజు శుకయోగీంద్రుడితో నంటాడు.

కృష్ణంవిదుః పరంకాంతం నతు బ్రహ్మతయా. మునే!
గుణప్రవాహోపరమ స్తాసాం గుణధియాం కథం?

అని వారు కృష్ణున్ని పరమకాంతునిగా గ్రహించారు, కాని బ్రహ్మభావంతో, కాదు. గుణబుద్ధులైనవారికి గుణప్రవాహోపరమం ఎట్లాకలుగుతుంది? అని.

తన వేణుగానంవిని, అన్నీ విడిచివచ్చిన, గోపికలతో, కృష్ణుడు

మాతరః, పితరః, పుత్రా, భ్రాతరః పతయశ్చవః
విచిన్వంతి, హ్యపశ్యంతో, మాకృధ్వం బంధుసాధ్వసమ్.

—వ్యాసమహర్షి

"మీరేతెంచిన జాడగానక వగన్ మీ తల్లులుం దండ్రులున్" అనిఅడిగాడు-వారి సమాధానము-

పతులన్ బిడ్డల, బంధులన్....పతిపుత్రాదిక నామమూర్తి వగు చున్ భాసిల్లు నీయందు, తత్పతిపుత్రాదిక వాంఛలంజలిపి సంభావించుట న్యాయమే?" ముముక్షాసక్తులం గాచు ప్రోలికగావందగు గావవే! విభువమేలే! కాంతలన్ భ్రాంతలన్" (పోతన)

"దేవోయథాఽఽదిపురుషో భజతే ముముక్షూన్"

(వ్యాసభాగవతం)

ముముక్షువులను, ఆదిపురుషుడైన దేవుడే, వచ్చి పొందుతాడట! ఇద్దేరహస్యం. ఇది తెలిసి గోపికలు, తన్మయులై ప్రేమ తపస్సు, చేశారు.

# ఆంధ్ర సూరదాస కవితా వైభవం

ఇదంతా తెలిసిన, సూరదాసు గోపికల సగుణభక్తిని, నిర్గుణ భక్తి ( ఇదీభక్తే, భక్తిజ్ఞానం కలిస్తేనే మోక్షం సిద్ధిస్తుంది. ) కంటె మిన్నగా, ప్రస్తుతించి బహువిధాల, పదేపదే చెప్పిందే చెప్పిన, గోపికలద్వారా తన పరమాత్మ పరాయణత్వం వెల్లడించాడు. అదొక సాగరమైంది, పరమ భాగవతోత్తముడైన, సూరదాసు, భాగవత సారాన్ని, సాగరంగా చూపించాడు, అది అగాధం. అయినా దాన్ని మా పుణ్యాత్ముడైన, మిత్రుడు శ్రీ మైలవరపు సూర్యనారాయణ మూర్తి, తరిచాడు తరించాడు, మణులు ఏరితెచ్చి అచ్చమైన తెలుగులో మన కందించాడు. వ్రజ భాషలోనున్న వజ్రాలు, రత్నాలు సాన బట్టి తెచ్చి, మన కిచ్చాడు, కనుకనే హిందీసాహిత్యజగత్తులో సూర్యుడై ప్రకాశించిన సూరదాసుయొక్క ప్రభ మనమీదకు ప్రసరిస్తోంది, ఆ వెలుగులో విశేషాలు, పరిశీలిద్దాం. ఆనందిద్దాం. మధురా నగరంలో పుత్రజననం వ్రేపల్లెలో పుత్రజన్మోత్సవం డోలికోత్సవం మొదలైన వేడుకలు వ్రజరాణియైన యశోద "శుకసనకేశ్వరాదులకు చొప్పడరాని సుఖానుభూతితో' నందగోపబాలుణ్ణి ముద్దుపెట్టుకుంటోంది ఉయ్యాలలో, పండుకొన్న స్వామి "కేలడాకాలి బొట్టనవ్రేలు, బట్టి మోవు దామరనిడుకొని మురియుచుండె అడుగు దామరతేనెపై నాస నేమొ" అనే ఉత్ప్రేక్ష కవికి కలిగించాడు. ఈ వటపత్రశాయి రూపాన్నే పలురకాల ఏకాగ్రతతో ఉత్ప్రేక్షించే కవి సగుణోపాసన, అభినందన పాత్రంగా ఉంది. యశోదకు విశ్వరూపసందర్శనమైంది. మట్టితిన్నాడన్న మాటుదాకా రాకుండానే, సూరదాసు అది యశోదా నందులకు చూపించాడు. ఇక్కడ కవి అమందానందభరితుడై ఎన్ని విధాల తన ఆనందాన్ని ఊపిరాడనివ్వకుండా వర్ణిస్తున్నాడో పరికించండి. సూరదాసశ్యామసుందరుణ్ణి చూడండి. అమ్మ మేల్కొల్పు వినండి. అది సాహిత్యపిపాసువుల్ని మేల్కొల్పుచున్న తెలుగుతల్లి

యొక్క మధురహృదయనాదం, ఎవరిఅదృష్టం వారిది. కాకపోతే ఒక విప్రునికి బాలకృష్ణుని భగవద్రూపంలో సాక్షాత్కారమేమిటి? ఇదంతా సూరదాస భావుకతానుభానుభూతి, తురగవల్గన, హరిగతి రగడలలో, తెలుగుపలుకుల నొలకబోసిన మన సూరకవి, వ్రజభాషా సూరకవి హృదయాన్ని విప్పిచెప్పిన తీరు హాయిగా పాడుకొని ఆనందించండి. భక్తిభావం స్వయంసమృద్ధమౌతుంది హృదయాలలో కృష్ణసందేశం అందించటానికి వచ్చిన ఉద్ధవుణ్ణి మాటలాడనిచ్చారా! గోపికలు! ఊదరగొట్టి నిరుత్తరుణ్ణిచేసి పంపారు. అదే యీ గ్రంథమంతా ఇంతచెప్పినా సూరదాసుకి తృప్తికలుగలేదేమో అనిపిస్తోంది. ఎంత ఉక్తివైచిత్ర్యం! ఎంతటి లోకజ్ఞత దానికెంతటి తెలుగు రూపకల్పన! ఇవన్నీ పాఠకులు స్వయంగా ఆస్వాదించి ఆనందించవలసిందే ఇందుకి గ్రంథములో ప్రతి పుట ఉదాహరణమే. ఇంత మహాసాగరం త్రవ్వి సూరదాసు తలకెత్తినంతమాత్రాన దానితో తలమున్కలైన మైలవరపు సూరకవి తాను తన మార్గంలో స్వతంత్రుడా అనిపించేటంత ధారాశుద్ధితో తెలుగుభాషాసాగర తితీర్షువులకు తెప్పగా నేర్పడి మనోహరవిహారం చేయిస్తున్నాడు. విహరించండి, ఆనందించండి!

163వ ద్విపద చదవండి (152వ పేజీ)ఆ గోపికల తాపత్రయం అలకించండి. భాగవతసారం సంగ్రహించుకోండి.

158వ పేజీలో...."ఎడనుడి నొడళ్లబొరలేక యేకనిష్ఠ ప్రేమ నియమాల ఆకుపువారే తపింత్రు" అనే మాటలు గమనించి మనోవాక్కాయకర్మల్లో సంశుద్ధి సాధించే ప్రయత్నం చెయ్యండి. 161వ పుటలో (220) "విధియను....గాల్పెజా" అన్న రూపకాలంకారపు సొగసులు రసజ్ఞుల నాకర్షిస్తున్నాయి చూడండి.

ఇంతకీ మావిభు 'మాకొనంగవే' అనే గోపికలగోల - మరొక వేదాంతోపన్యాసము వాళ్ళకు పట్టదు. అసలు వాళ్లు ఉద్ధవుణ్ణి ఏమైనా చెప్పనిస్తేనా అహా ! ఏమి నూరదాన భక్తిపారవశ్యం! సగుణోపాసనా తన్మయత్వం! 164 పేజీలో ముత్యాలసరాలు చెప్పుతున్నాయి, గోపికల యెడల నంటిన మధురస్మృతులు.

"వ్రజకిశోరుడు వ్రేపల్లెవచ్చు ప్రొద్దు" కెదురు చూడటమే వారిధ్యేయం. "వంధ్యబిడ్డ కుట్టెటీఁగినట్టొ మాకు నరయని బ్రహ్మ తత్త్వానుభవము" అంటూంటే ఇంకేం చెపుతాడుపాపం ఉద్ధవుడు. నహివంధ్యావిజానాతి గుర్వీం ప్రసవవేదనాం' అని ఆయనకు తెలిసిందేకదా ! శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తి తాను తరించి మనల తరింపజేస్తున్నాడని నా కనిపిస్తోంది.

అయితే ఒక్కమాట ! గ్రాంథికమైన తెలుఁగు నుడికారపు సొంపులు చక్కగా పదవిభాగం చేసుకోగలిగితే తెలుస్తాయి. ఆ మార్గం నానాటికీ ఆధునిక పాఠకలోకంలో మృగ్యమవుతోందన్నదే యీ మాటఅనటానికి కారణం -

"నమో గోపికానందనాయ నందగోపకిశోరాయ"

— జోశ్యుల సూర్యనారాయణమూర్తి

H. W. P. Colony
ASWAPURAM

"డాక్టర్" ఎస్. సంజీవదేవ్, డి.లిట్.
ప్రముఖ సాహితీవేత్తలు, చిత్రకళానిష్ణాతులు
తుమ్మపూడి - గుంటూరు జిల్లా.

# దృష్టి కందని సృష్టి

### నేత్రదృష్టి - బుద్ధిదృష్టి - బోధిదృష్టి

నేత్రదృష్టి చూస్తుంది రూపజగత్తును, బుద్ధిదృష్టి చూస్తుంది ఆలోచనా జగత్తును, బోధి (Intuition) దృష్టి చూస్తుంది అనుభూతిజగత్తును, మొదటిది ఇంద్రియ గ్రాహ్యం, రెండవది అంశిక ఇంద్రియగ్రాహ్యం ఇక మూడవది అతీంద్రియ గ్రాహ్యం.

సూరదాసుకు లేదు నేత్రదృష్టి - ఆయన అంధుడు ఉన్నది కొంత బుద్ధిదృష్టి; ఇక పూర్తిగా ఉన్నది బోధదృష్టి.

రూపజగత్తుకు చెందుతారు శిల్పులు, చిత్రకారులు, నర్తకులు మొదలైనవారు-ఆలోచనా జగత్తుకు చెందుతారు వైజ్ఞానికులు, తార్కికులు విశ్లేషకులు ఇత్యాదులు. ఇక అనుభూతికి చెందుతారు కవులు, గాయకులు, మర్మసాధకులు (mystics) మొదలైనవారు. సాధారణంగా ఎక్కువ మర్మసాధకులు కవులుగాను,గాయకులుగానుఉంటూంటూరు. వీరినే భక్తకవులని కూడ అంటారు. ప్రసిద్ధులైన వాగ్గేయకారులైన త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు, కబీర్ మొదలైన వారంతా ఈకోవకు చెందిన వారే.

అటువంటివాడే అంధుడైన భక్తకవి సూరదాసు. ఆయనకు బాహ్యదృష్టి లోపించినందువల్ల బాధలేదు. దాని స్థానంలో ఆంతరిక

దృష్టి వికసించింది. బాహ్యదృష్టి చూడలేని ఎంతో అద్భుతమైన ఆనదం మయు అంతర్జగత్తును చూడడం ఆయనకు సాధ్యమయింది, ఆయనది చూపుకాదు - లోచూపు!

అటువంటి ఆనందసాధనకు మాధ్యమ మయింది తన కృష్ణభక్తి ఆ కృష్ణభక్తికి మాధ్యమం అయింది ఆనాటి వ్రజభాష.

ఆయాన రచించిన వ్రజభాషలోని "సూరసాగర్"కు తెలుగు సేతయే శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తి గారు రచించిన యీ "సూరసాగరము".

ఒక భాషలోని వచన రచన నుంచి మరో భాష వచనరచనలోకి అనువాదం అంతగా కష్టంకాదు. అదేవిధంగా ఒక భాషలోని పద్య రచన నుంచి రెండవభాషలోని వచనరచనగా అనువదించడం అంతగా కఠినంకాదు. కాని ఒక భాషలోని పద్యరచననుంచి మరోభాషలోని పద్యరచనగా అనువదించడం కష్టం. ఆ కష్టమైన కార్యాన్నే మన సూర్యనారాయణమూర్తిగారు ఎంతోచాకచక్యంతో రసమయంగా నెర వేర్చారు. ఇటువంటి అనువాద కార్యంలో రెండు విధాలైన ప్రధాన ప్రతిభలను ప్రదర్శించాలి. మాతృకలోని మౌలికభావపరంపరను, అనువాదంలోని సుందరపద ప్రయోగాన్ని - సూరదాసు గొప్ప భక్త కవి. ఆయనభక్తికి ఇతివృత్తం శ్రీకృష్ణుడైనప్పటికీ, ఆయన శ్రీకృష్ణుని ఒకపరిధిలో బంధించక సర్వాంతర్యామిగా విస్తరింపజేశాడు. సూర దాసుది పరిమితమైన గౌణభక్తికాదు. గౌణభక్తియొక్క ససీమమైన మంచుతెరల్లో దాగియున్న అసీమమైన పరాభక్తియది!

కనుకనే సూర్యనారాయణమూర్తిగారి తెలుగు అనువాదంలో ఉద్ధవునిచేత సూరదాసు అనిపిస్తాడు.

అలకింపుడు సతులిదే పరమాత్మతత్త్వము నుడువుదున్ గో
పాలదేవుడు నన్నిటుల్ నీపాలి కంపింపన్.
బ్రహ్మమయమౌజుండి! యెల్లప్రపంచ మొక్కించుకయు లే దా
బ్రహ్మకన్యము వస్తువఖిలవ్యాపకుం డతడే॥
తానె స్త్రీపుంరూపుడౌ దలిదండ్రియుం దోఁబుట్టు దానౌ
తానె వానప్రస్థుడున్ యతి తానె జ్ఞానియునౌ
తానె రాజును రాణియగు విభుదాసదాస్యంబులును దానగు॥
దానె నేలయు నింగి పూవున్ దానె దేటియునౌ
తానె గోవుం బాలకుడునై తానె మేపై మేపుకొను దను
దావ యీ పరమాత్మతత్త్వము దలఁచి భ్రమవిడుఁడీ
ధని దరిద్రాంతరములే దద్వైతతత్త్వమునన్ నిరంజను
గన జరామరణభ్రమంబులు గదియ వవ్వారిన్॥"

పైన ఉదహరించిన ముత్యాలసరాలు ఎంత గొప్పగా ఉన్నాయో! శ్రీకృష్ణుని అద్వైతతత్త్వంలో చూపిన సూరదాసు వ్రజభాషమాతృక ముమ్మారుధన్యం. అదేవిధంగా మూర్తిగారి దాని తెలుగుసేతధన్యం!

"తానె గోవుంబాలకుడునై తానెమేపై మేపుకొను దను।
దాన యీ పరమాత్మతత్త్వముఁదలఁచిస్త్రీభ్రమ విడుడీ॥"

[...] అనే పంక్తులు వాటి కవేసాటి. మూర్తిగారి కొన్ని తెలుగుమాటలు సారళ్యంలోను, భావగాంభీర్యంలోను అద్భుతంగా ఉంటాయి. అవి మాటలుకావు. చిరంతన సత్యసాధనకు వెలుగుబాటలు. అమరానందానికి కట్టనికోటలు. సూర్యనారాయణమూర్తిగారు కనులున్న తెలుగు సూరదాసు. సూరదాసుగురించి యింకెవరైనా ఏమైనా వ్రాశారేమో తెలియదు. నాకు తెలిసినంతవరకు ఈ అనువాదమే ప్రధానమైనదని అనిపిస్తుంది.

కొందఱి రచనల్లో మాటలగారడీ ఉంటుంది. కాని మాటలు అభివ్యక్తపరచే భావం పేలవంగా ఉంటుంది. మరికొందరి రచనల్లో భావగాంభీర్యముంటుంది కాని పదాలు వైచిత్రిహీనంగా ఉంటాయి. ఈ రెంటిసమ్మేళననూ గలిగిఉన్నదే అందమైనకృతి ఆదర్శకృతి. ఈ అనువాదకృతి అటువంటిదే —

నృత్యతాం గాయతాంచైవ నానావాద్యం ప్రకుర్వతే ।
యథా సంతుష్యతేదేవో న ధ్యానాద్యై రుచిశ్రుతం ॥

ధ్యానాలు పూజలు పునస్కారాలుకంటె నృత్యగానాలు వివిధ వాద్యాలు మొదలైనవే దేవతలకు ఎక్కువ సంతోషకరాలట.

అందుకే ఎక్కువగా భక్తులంతా కళాకారులుగా ఉంటారు. ప్రత్యేకించి కవులుగా గాయకులుగా దేవతలదాకా పోనవసరం లేదు. మనుషులవిషయంలో ఇది మనకు నిర్ద్వంద్వముగా ప్రత్యక్షమవుతుంది మాటలను మామూలుగా పలికేకంటె లయాత్మకంగాను గతిశీలంగాను పలికితే, వాటికి తోడు వాద్యసహకారంతో లేక సహకార వాద్యాలతో పలికితే ఎంతో ప్రభావశీలంగా ఉంటాయి.

అందుకే మన భక్తులంతా కావ్యకర్తలుగా తమ పరాతత్త్వ సాధన సాగించారు. అటువంటి ఉన్నతస్థాయి భక్తులలో సూరదాసు ఒక ప్రముఖుడు.

శిల్పకళ, చిత్రకళ, నర్తనకళ, సాహిత్యంలేని శుద్ధసంగీత కళ, (రాగాలాపన, జంత్రసంగీతం మొదలైనవి) భాషాభేదాలకు సంబంధించని విశ్వజనీనకళలు వాటిని ఆనందించటానికి ఒక దేశపు కళను మరోదేశపుకళలోని కనువదించవలసిన అవసరంలేదు.

సాహిత్యం మిగతాకళల మాధ్యమాలవలెగాక భాషను మాధ్యమంగా కలిగియున్నది.

అందుకే ఒక భాషలోని సాహిత్యాన్ని ఆనందించాలంటే మఱో భాష వారికి అనువాదం అవసరం అవుతుంది. అజంతా చిత్రాలను చూచి ఏదేశపువారైన ఆనందించగలరు కాని, కాళిదాస 'మేఘ సందేశమును" సంస్కృతం తెలియనివారెవరూ ఆనందించలేరు అనువాదంలోదప్ప.

అందుకే సూరదాసు భక్తిమాధురిని కవితాసురభిని ఆనందించాలంటే ఆయన వ్రజభాషామాతృకల అనువాదాలు అవసరం అవుతాయి.

అయితే అన్ని అనువాదాలు, అందటి అనువాదాలు మాతృకకు న్యాయం చేయిజాలవు. అనువాదాలు చేయబడవలసింది సమర్థుల కలాలతోనే. ఈ తెలుగు అనువాదం శ్రద్ధగా చదువుతే అనిపిస్తుంది. దీన్ని సమర్థుడే అనువదించారని.

మన తెలుగు మహనీయుడైన "శ్రీ తల్లావజ్ఝల నారాయణతీర్థులు" "శ్రీకృష్ణలీలాతరంగిణిని" సంస్కృతభాషలో రచించి అమరజీవి అయినారు. అందులో విషయవిదగ్ధతకంటె రచనాశిల్పం, అందులోను నృత్యసంగీతం ప్రధానం అందువల్ల దాన్ని ఆ విధంగా ఉంచవలసిందే కాని మరో భాషలోనికి అనువదించడం అసాధ్యం. నారాయణతీర్థులు జన్మించిన గ్రామం గుంటూరుజిల్లాలోని కాజ "ఈ పంక్తుల రచయిత గ్రామానికి సమీపమే అది.

"సూరసాగరము" అనువాదగ్రంథమైనా దాని మాతృకలో ఉన్న విషయవిదగ్ధతనుబట్టి, అనువాదకర్తయొక్క అసమర్థతా రాహిత్యాన్నిబట్టి అదొక ఉజ్వలరచనారత్నంగా భాసిస్తుంది.

సంస్కృతంలో రచింపబడిన కృష్ణభక్తిగేయకవితలో జయదేవ విరచిత "గీతగోవిందా"నిది ప్రధానస్థానం. ఇందులో భావసంపదకంటే

రచనాశిల్పానిదే ఎక్కువ ఆపేక్ష్యత ఇందులో ప్రధాన దశ నృత్య సంగీతాలకే చెందుతుంది. శ్రీకృష్ణలీలాతరంగిణివలె వీటిలో భావావేశానికంటె శబ్దావేశమే అధికం.

సూరదాసు రవనలోమాత్రం రచనాశిల్పానికి హానికలుగని రీతిలో భావసంపద రూపొందింది. సూరసాగర రచనంతా భాగవతం లోని దశమస్కంధంమీద, ఆధారపడి రచింపబడిందే. అయితే అది భాగవతంలోని, సంస్కృత మాతృకకు వ్రజ భాషానువాదం కాదది సూరదాసుని స్వతంత్ర కావ్యము. ఆ స్వతంత్రకావ్యానికి, తెలుగు అనువాదమే మన "సూరసాగరము"

సూరదాసు కృతినిగురించి అనువక్త విలక్షణంగా అంటారు
"సూరపద సమాశ్రయసిద్ధి జూరకొనగ,
సూరసాగర మీది యీడేరుపొంటె
లౌకికకాలోకనాత్త విలోకనముల
సులపవలె నంతరాలోకమార్గమునను ॥"
"కర మెఱుంగక సూరసాగరము తలము।
తలములకలైతి సౌరత్నముల బడయ
కడవఁగొని సాగరము సీద గడగినట్టు
చీమ, కాశీప్రయాణంబు చేసినటులు"

"లౌకికాలోకనాత్త విలోకనముల సులపవలె నంతరాలోక మార్గము నను" అనేమాటలు ఎంతవిలువగా ఉన్నాయో! ఈ రచనయొక్క పరమార్థాన్ని అంటే, బహిర్దృష్టిని అంతర్దృష్టిలోకి మార్చడం ఎంత ఇంపైన భావగర్భితమైనపదాల్లో వ్యక్తంచేయబడిందో! మూర్తిగారు మహత్తర భావుకులు మాత్రమేకాక నిపుణపదశిల్పికూడ !

అందుకే వారికవిత సవితలయి సరితలయి ప్రకాశిస్తూ ప్రవహిస్తూంది.

సూరదాసులాంటి శిఖరాగ్రభక్తకవులు తమ కవితానిర్మాణములో ఎక్కువగా ఆత్మాశ్రయులైనప్పటికీ వస్త్వాశ్రయచ్ఛాయలను విసర్జించరు. తాము నివసిస్తున్న భూలోకానికికూడ విలువయిస్తారు. కనుకనే శ్రీ అరవిందుడు తమ "SAVITRI" మహాకావ్యంలో సావిత్రినిగురించి అద్భుతంగా పల్కుతారు.

She made earth her home for whom heaven was too small.

సావిత్రికి స్వర్గంఅనేది చాల యిరుకుగా తట్టినందున భూమినే నివాసం చేసుకున్నదట; ఆమె ఎంత ఎత్తైన మానవతాభావమో అది.

భూమికిమించిన లోకోత్తరసత్యాలను మనం ఎంత లక్ష్యంతో చూస్తున్నకూడ భూమిని అలక్ష్యపరచటం సమగ్రజీవనరీతికాదు. మట్టికానిదానికి విలువయిచ్చినట్లుగానే మట్టికిగూడ తగినవిలువనివ్వాలి. మట్టిమీద పుడుతున్నాం మట్టిమీద పెరుగుతున్నాం మట్టిమీద మరణిస్తున్నాం. అటువంటి విలువైన మట్టినివదలి మసలడం సక్రమజీవనధర్మంకాదు.

ఈ ధర్మమర్మాన్ని గ్రహించిన సూరదాసులాంటి ప్రాజ్ఞసాధకులు తమ కావ్యరచనల్లో ఆత్మాశ్రయులుగా మాత్రమేకాక వస్త్వాశ్రయులుగాకూడ ఉండటం మానుకోలేదు. ఏదిఏమయినా అటువంటి మహనీయుల జీవితాల్లోను,రచనల్లోను వచనాల్లోనుబోధి(Intuition) కి ప్రాధాన్యం ఇస్తూఉంటారు. సంజీవదేవ్ ఒకచోట వ్రాశాడు.

"Emotion fades
Intellect wanes
Intuition makes
Space spreads
Into infinity

Time melts
Into eternity''

ఆవేశం పేలవమవుతుంది. బుద్ధి దిగజారిపోతుంది! బోధి మేల్కొంటుంది స్థలం అనంతత్వంలోకి విస్తరిస్తుంది. కాలం కరిగి పోతుంది. శాశ్వతత్వంలో.

జీవితంలో ఎన్నో అవసరం సమగ్రంగా జీవించడానికి శక్తి, యుక్తి, అనురక్తి, విరక్తి మొదలయినవి. వీటి అన్నింటి ఆశయం కూడ మానవుడికి ముక్తి కలిగించాలనే ముక్తిఅంటే స్వేచ్ఛ దేన్నుంచి ముక్తికావాలి? ఏదైతే బాధాకరంగా ఉంటుందో దాన్నుంచి ముక్తికావాలి. జీవితంలో బాధాకరమైనదేమిటి? ఒకటేమిటి చాలాఉన్నాయి. బాధాకరమైనవి. బంధన అంటే స్వేచ్ఛ లేకపోవటం అన్నిటికంటె ఎక్కువ బాధాకారం, స్వేచ్ఛను గలిగించటం అంటే ముక్తిని గలిగించటం' అని.

అసలు అన్నింటికీ మించిన బాధ భయంఅనేది. భయానికి మించిన బాధలేదు. అభయానికి మించిన ఆనందంలేదు. సుఖంగా ఉంటున్న వ్యక్తికూడ తాను సుఖంగా ఉంటున్నందుకు సంతోషపడక ఆ సంతోషం ఎప్పుడుపోతుందో అనేభయంతో బాధపడతాడు. వర్తమాన సుఖానికి ఆనందించక భవిష్యత్‌లో రానున్న ఆ సుఖపుకొఱతకు భయపడతాడు.

ఇటువంటి బాధలనుంచి మానవులకు ముక్తిగలిగించటానికి ఆదిమమానవుడినుంచి ఆధునిక మానవునివరకు అనేక మార్గాలని అవలంబిస్తూ వస్తున్నారు. వాటిలో భక్తిఅనేదికూడ ఒక మానసమార్గంగా ఏర్పడుతూవస్తూంది. ఇటువంటి భక్తకవులు తమ బోధల ద్వారా ప్రత్యేకించి తమ కవితారచనలద్వారా సమాజానికి కొంత కల్యాణాత్మకసేవ చేస్తున్నారు.

అటువంటిపనినే మన సూరదాసు తన బ్రజభాషలోని కావ్యం "సూరసాగర్" ద్వారా చేయటం జరిగింది. అయితే అది బ్రజభాషా భాషులకొఅకే పరిమితంచేయక ప్రాజ్ఞులైన శ్రీ మైలవరపు సూర్య నారాయణమూర్తిగారు దాన్ని అద్భుతంగా తెలుగులోకి అనువదించి తెలుగులోకానికి గొప్పసేవ చేస్తున్నారు.

ఈ తెలుగుఅనువాదమైన "సూరసాగరము" తెలుగువారి ప్రాణాల ప్రమిదల్లో ఆనందదీపాలను వెలిగించి వారిని భయం నుంచి, బాధలనుంచి విముక్తపరచడంలో దోహదం చేయగలదని ఆకాంక్ష!

సంజీవదేవ్

సూరదాస పదామృతాది గ్రంథకర్త
డాక్టర్. Ch. రాములు, M.A. Ph.D.
రీడరు, హిందీశాఖ
హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం,
'హైదరాబాదు'

## ఆశంపవము

శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తిగారు పరమభాగవతులు వారి లేఖినినుండి భక్తిగ్రంథములు వెలయుట అత్యంతముదావహము. భక్తికావ్యములను తన్మయత్వముతో రచించుట, అనుభవించుట, వారి కత్యంత ప్రీతికరము వాటిని సర్వాంగసుందరముగ మధురాతి మధురముగ వెలయించి తాము తరించిరి పాఠకులను తరింపజేసిరి. అందుకు వారు ప్రశంసాపాత్రులు. ముఖ్యంగా వారు రచించిన తులసీరామాయణమును పఠించియుంటిని. మధురశైలి, భాషాపాటవము, కథాకథనగమనము, మొదలగు సుగుణములతో రామచరితమానసము తెలుగువారికి అత్యంత ఆదరపాత్రమైనది.

ప్రస్తుతకావ్యము "సూరసాగరము" అను కృష్ణచరిత మానసము భక్తాగ్రేసరుడగు సూరదాసు రచించిన వ్రజభాషాకావ్యము సూరసాగరమును సూర్యనారాయణమూర్తిగారు ఆంధ్రీకరించినారు. ఇది దశమస్కంధసంగ్రహము ఇష్టదేవతావందనము, సూరదాసకవి సంస్మరణము, కవిప్రశంస, కృత్యాదిప్రస్తావన, సూరసాగర కావ్య ప్రశస్తి, గోపీదివ్యానుభూతిప్రశంస, కృతి, షష్ఠ్యంతములు రచించి, వారు తెలుగు కవుల కావ్య సంప్రదాయమును పాటించిరి. ఇది అను

వాదమైనప్పటికి తెలుగులో స్వతంత్రకావ్యముగా రూపుదిద్దుకొనినదని ప్రకటించుట వారి ఉద్దేశ్యము.

సూరసాగరమున ప్రతిబింబించు అమృతకణము. అనువాదమున తెనుగుతేనె చేర్చబడినది. మనకు అమృతపురుచి తెలియదు. ఆస్వాదించినవారు మౌనముగానే, పరమానందమున మైమరచిరి. మరి తేనెసోకగ దానిరుచి, మధురాతిమధురము గాబోలును. అనుభవించి తరించుట తత్క్షణ కర్తవ్యము. వ్యాఖ్యానించుట, శబ్దబద్ధము గావించుట, అసాధ్యము. అట్టివాని విశేషములను విశ్లేషించుట పరమ కోమల సుమనముల కంటకములతో స్పృశించుట వంటి క్రూర కర్మము చేయబూనుటయే. హృదయమునకందనిది శబ్దమునకందుట దుర్లభము. ఆత్మ గతముమాత్రమే అయినను బాలసహజ కుతూహలముచేత సుగంధము నాఘ్రాణించి ఆనందించవలెనని ఆశ.

శ్రీకృష్ణజన్మోత్సవము, లీలావైభవము, పుత్రోత్సవము మొదలగు కథావర్ణన ప్రసంగములను తెలుగువారి కత్యంత ప్రీతిపాత్రములైన హరిగతిరగడ, ద్విరదగతిరగడ, ద్విపద, సీసము, చంపకమాల, శార్దూలము, మొదలగు ఛందస్సులలో సముచితగతిలో రీతిలో వ్రజభాషాకావ్యమును సుందరముగా ననువదించిరి. గోపికల మనోభావములను, యశోదామాత మానసోల్లాసమును శైశవక్రీడల గాంచి ఆయమ మురిసిపోయినవైనము, శ్రీకృష్ణలీలామహిమాది వర్ణనము, బాల్యక్రీడలు మొదలగు ఘట్టములలో భక్తకవి పోతన శైలిని పుణికిపుచ్చుకొన్నారు. గొల్లవారిండ్ల వెన్నముచ్చిలించిన మాయావి అమాయికముగ చెప్పిన సంజాయిషీ చూడ ముచ్చటుగానున్నది.

ముత్యాల సరాలు :-

అమ్మరో ! నే వెన్న సుంతయు ఆరగింపగలేదు, సుమ్మో !
నమ్మవే ! నానుడి నిబద్ధిగ, ననువుమీరంగన్
చిట్టిచేతుల కెట్టు లబ్బును ! చెప్పు ముట్టఁగలట్టి చట్టులు
చట్టులంగల పాలుపెరుగులు చట్టునన్ద్రావన్.
వెన్నడిం జెలికాండ్రుపెక్కురు వెక్కిరించి పరాచకాలకు
వెన్న మూతిని బులిమి పోయిరె! వెన్న దిననంచున్
వెన్న మూతిని దుడుచుకొంచును, వెన్నదొన్నెను వెనుకదాచెడు
వెన్నదొంగపనిం గనుంగొని ప్రేమ ముప్పొంగన్.

గోపికల, శ్రీకృష్ణునియెడగల అనన్య ప్రేమరహస్యమును; వారు చెప్పు చాడీలు కొండెముల వెనుకగల మధుర ప్రేమానుభూతి హస్యములు తెలియజెప్పు జాణతనమును, పరికించవచ్చును.

ద్విపద :-

"దొంగ దొంగ యటంచు దోకొనిపోయి,
ప్రాంగణంబుల దాటి యంతరంగముల
ప్రేముడిన్ నిలిపి నిర్నిమిషలై కనుచు
నామోము ముద్దాడి నను గౌగిలించి
వెన్నజేసేతఁ దిన్పించుచు నేవొ
విన్నవింతురు మ్రొక్కి వేల్పుపెద్దలకు"

పరమాత్ముని హృదయముకూడ భక్తులకు దూరమైనందున తపనకు గురియైనది; విరహ మిరుపక్షములవారికి సమానముగా బాధాకరమయినది.

ద్విరదగతిరగడ :-

రాధికను విడదీయ రా దికను నా తలపు
రాధికా ప్రేమ నారాధించు గొనివలపు

ఎందుండె నా బహిః ప్రాణమౌ నా రాధ,
యిందేరికని వినుతు నీ మా ప్రణయగాథ"

ఉద్ధవుని నిస్సార ప్రేమకు ప్రతిగ, సర్వేశ్వరుడు గోపికామణుల ప్రేమాతిశయమును కొనియాడురీతి గమనింపదగినది.

ద్విరదగతిరగడ :-

"గొల్లతలు నా ప్రేమ గొల్లకొన నుల్లమున
దల్లడిల్లుచునుంద్రు తలపులఁ దలంచి నను
విరహాకులములైన వ్రేతలయెడంద"

ఉద్ధవుని బ్రహ్మతత్త్వోపదేశమునకు గుందిన గోపికలు మాయా మర్మము తెలియనివారలైరి. ప్రశ్నలయందే సమాధానము ను బొందు పరచిన పల్లెపడుచుల గడుసరితనము తెలియవచ్చినది.

తే॥ మా మనోధవు మాధవు మధురమూర్తి
సగుణగోపాల మధురసంస్మరణ ముడిగి
ఊను నుద్ధవు చప్పిడియోగ మెవతె ?
కడుపునిండునె ! బూరెల గలను గన్న !

క॥ మాపాలివేల్పు గోకుల
గోపాలస్వామి నెడదఁ గొలువకయోగం
బీపాటిపై న దెవ్వతె
చేపట్టెడి ? నూకకూక జేకొనువీకన్

'సూరసాగర సంగ్రహము'

క॥ అర్మిలి చెలిమరి హరితో
నర్మాలాపంబులాడు నలువుంగన కీ
ధర్మాధర్మము లేర్చెడు
ధర్మోపన్యాస మెవరు దలపోయుదురో !

క॥ నిగమాగమతత్త్వముఁ గనఁ
దగుదురె! మా పల్లిగొల్లతలు గొనిచను మా
నఁగరు పగలాండ్రె! యిది విన
దగువారును దెలియువారు దనియ గలారున్॥

క॥ ప్రియవిరహిణులకు, ప్రాణ
ప్రియముఖదర్శనముదక్క, వేవెరవులనేన్!
బయిపయిరుచులు రుచించునె?
నయిచునె? మీ లోండు సలిల సంగతి దక్కన్॥ (సూ. సా.)

ఇంతేకాక ముక్తిబేరమును మొదలు చెడ్డబేరము, చౌకబేరము, ఇంటింట కాళ్లబేరము చేయుట తగదని అప్రత్యక్షము హితవు జెప్పినారు. ముక్తిలేకున్న పుట్టిమునుగదని ముక్తికన్న భక్తియే మిన్నయనీ, సరళమనీ ప్రపంచానికి చాటినారు.

శ్రీకృష్ణుడు కుబ్జనుజేకొని రాజసలీలాలోలుడై తమను మఱచాడని వాపోయినారు. సీతారాముల ప్రేమ అనన్యమైనదని కీర్తించారు. సీతాన్వేషనలో రాముడు పలు ఇక్కట్టులకు లోనైనాడని సీతనొక్కక్షణమైనను మఱువలేదని, కృష్ణుని ఉపేక్షాభావమునకు వగచారు.

శా॥ సీతావల్లభు డాలిఁగోల్పడి వనీసీమన్ గవేషించుచున్
దూతన్ దిక్కుల కంచి జాడఁ గని సింధుం గట్టి కొట్టెన్ రిపున్
సీతంగూడి వియోగభీతి విడిపించెన్ గాని తా లేఖలో
గీతాసారము వ్రాసిపంపఁ డతఁడీ కృష్ణుంబలెన్ నాతికిన్॥

సీతారాముల లోకకల్యాణభావమును, గొనియాడిన యతివలు తమ ప్రభుని లోకహితమును జగత్కల్యాణ కారణుని తమ కౌగిట

బంధింప జూచిరేకాని పరమహితమును గాంచరైరి. ఉద్ధవుని పలు విధముల తూలనాడిరి.

చ॥ జననిని జన్మభూమిని వ్రజంబును గాదని కృష్ణుఁడే ప్రయో
జన మొడగూర్పనెంచి కులజాతి వయోగుణరూపయుక్త గు
బ్జను జతగూడె జెప్పు వ్రజపల్లె నెదే నపరాధ మెంచి పో
యెనొ ? చెలిగూనెదాసి వెలయించిన బోధనలే రుచించెనో !

చివరకు గోపికామణుల ప్రేమతత్త్వము నెఱింగి ప్రేమ నారాధించి తమ అనన్యతను ప్రకటించిరి. బ్రహ్మతత్త్వమునకు తాము అనర్హులమని తెలుపుచూ తమ అశక్తతను వెల్లడించిరి.

క॥ కనువిచ్చిన గనవచ్చును,
గనవచ్చును గన్నుమూయ, గల నా హరియే
వినవచ్చు గెలవరింతల,
మనవచ్చునె ? హరినిపీడి మన మచ్చుపడన్ ॥

క॥ తలపెల్ల కృష్ణమయముగ
నలుపుచు నెడనుడినొడళ్ల సంధించి హరిం
గొలుచు దృఢచిత్తలే మల !
చలచిత్తుల కనువు యోగసాధన దీనిన్ ॥

సూరసాగరము ప్రేమసాగరము, రత్నాకరము, అందెంత లోతుకు మునిగిన అన్ని రత్నములు లభించును. సూరదాసు ప్రేమ తత్త్వమును ఆకళించుకొని గోపికామణుల హృదయములను ప్రకటించిన సూర్యనారాయణమూర్తిగారు ధన్యులు. వారి అనువాదసరళి ప్రశంసనీయము. సూరదాసప్రభువు వారి కాయురారోగ్యముల ప్రసాదించుగాక ! ఇంకను వారెన్నో కృతులతో భారతమాత నలంకరింప గలరని శుభాకాంక్షలతో శుభాభినందనల నందజేస్తున్నాను,

సి హెచ్. రాములు

"సాహిత్యరత్న"
**శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారు, M.A.** (త్రితయ)
(రిటైర్డు-ప్రాధ్యాపకులు, అలీఘర్ విశ్వవిద్యాలయము.)
గుంటూరు-6

# సమాలోకనము

హిందీభక్తి సాహిత్యపరంపరలోని "అష్టఛాప్" మహాకవులు పుష్టి మార్గమునకు చెందినవారు. ఈ పుష్టిమార్గమును ప్రవర్తింపజేసిన వాడు వల్లభాచార్యులు. ఆయన తెలుగుగడ్డకు జెందినవాడు. బహుశః సువిఖ్యాతమైన ఆచార్య పరంపరకు జెంది, తెలుగులకుచెందిన ఆచార్య పురుషు డీత డొక్కడేనేమో! 'అష్టఛాప్' కు చెందిన భక్తకవులలో సూరదాసు వల్లభాచార్యుల శిష్యకోటిలో ప్రథమస్థానము వహించును "సూర్ సూర్ తులసీ శశీ" అను ఆభాణకము గలదు. హిందీసాహిత్య సుప్రసిద్ధ విమర్శకులైన 'ఆచార్య. 'రామచంద్రశుక్ల" మతమున నిదీ సరిగాదు. ఎవరో అనుప్రాస మోహమున నట్లు చెప్పిరే గాని వాస్తవమునకు తులసీదాసు హిందీ సాహిత్యగగనమున సూర్యునివంటి వాడని, సూరదాసు చంద్రుని బోలినవాడని వారి తలంపు. సూర్యుని తేజస్సు ప్రకాశవంతమై యున్నప్పుడు దుర్నిరీక్ష్యము కూడ నగును. చంద్రుడు కురియు వెన్నెలజల్లు అట్టివికావు. ఎల్లరకు సుఖశాంతులతో బాటు చల్లతన మిచ్చి ఉల్లముల పల్లవింప జేయును. సూరదాసునికి పుష్టిమార్గానుయాయులను తరింపజేయు "నావ" యను ప్రఖ్యాతి కలదు.

పుష్టి మార్గము భక్తిమార్గములందు విశిష్టమైనది. వల్లభాచార్యులకు పూర్వమే 'విష్ణుస్వామి' యను నాచార్యపురుషుడు జన్మించి శుద్ధాద్వైతమును ప్రవర్తింప జేసెనని యందురు. విష్ణుస్వామి నామధేయు లొకరికంటె ఎక్కువగానుండుటలో పుష్టిమార్గ ప్రవర్తకులెవరో నిర్ణయించి చెప్పుట కష్టము. ఏది యెట్లయినను దార్శనికమగు శుద్ధాద్వైతమునకు ప్రచారప్రాశస్త్యములు తెచ్చిన ఘనత, దానిని భక్తిమార్గవిశేషముగా ప్రతిష్ఠించిన కీర్తి వల్లభాచార్యునికే దక్కెను. ఈతని తండ్రి లక్ష్మణ భట్టు, తల్లి ఎల్లమాంబ. వీరు గోదావరిజిల్లా కాకరపర్తికి చెందినవారై యుందురు. కాశీవాసము చేయుచున్న దినములలో యవనుల ఉపద్రవము మూలమున తిరిగి స్వదేశమునకు వచ్చివేయు నపుడు మార్గమధ్యమున 'చంపారన్' అను అరణ్యప్రాంతమున వల్లభాచార్యులు జన్మించె నందురు. ఉపద్రవము శాంతించిన సంగతి తెలిసి తిరిగి కాశీకి వెళ్ళునపుడు పుత్రుడు సురక్షితుడుగా నుండుట గాంచి తలిదండ్రు లమందానందభరితులై తోకొని మరల కాశీచేరిరని జనశ్రుతి

వల్లభుని శిక్షాదీక్షలక్కడే జరిగియుండును. పదేళ్ళ ప్రాయమునకె అతడు వేదవేదాంగము లన్నిటినీ అవగాహన చేసికొన్నట్లు లోక విశ్వాసము.

పుష్టిమార్గీయులకు ప్రస్థానత్రయమేగాక మఱియొక గ్రంథము శ్రీమద్భాగవతము కూడ శిరసా వహింపవలసిన గ్రంథము. అందువలన ప్రస్థాన చతుష్టయమును వారు ప్రమాణముగా స్వీకరింతురు. శ్రీమద్భాగవతము నందలి ద్వితీయస్కంధ దశమాధ్యాయ చతుర్థ శ్లోకాంశముగ వెలసిన 'పోషణం తదనుగ్రహః' నుండి పోషణం అను శబ్ద మూతగాగొని వల్లభాచార్యులు తన సాధమునకు పుష్టిమార్గ మని పేరిడెను.

"పుష్టిమార్గోఽనుగ్రహైక సాధ్యః" అణుభాష్యము

'కృష్ణానుగ్రహరూపా హి పుష్టిః" తత్త్వదీపనిబంధము మొదలగు నిర్వచనములచే పుష్టి యనగా శ్రీకృష్ణపరబ్రహ్మానుగ్రహమనియు అది యీ మార్గము ననుసరించు వారి కేకైక శరణ్యమనియు దేలును.

"అనుగ్రహేణైవ సిద్ధిః' అని హరిరాయలు పేర్కొనెను. పుష్టిమార్గము నందలి భక్తి, ప్రధానముగా మాధుర్యభావముతో గూడియున్నను మఱి మూడు విధములు గూడ ఇందు మన్నింపబడియున్నవి. 1 వాత్సల్యభావము, 2 సఖాభావము 3 దాస్యభావము మాధుర్యభక్తికి గోపిక లుజ్జ్వల ప్రతీకలు. నారదభక్తి సూత్రములు కూడ దీనిని స్పష్టపరచును.

'త దర్పితాఖిలాచారతా తద్విస్మరణే పరమవ్యాకులతా' అని నిర్వచించి ''యథా వ్రజాంగనానాం'' అని ఉదాహరించును.

రాధా భావము భక్తిమార్గమున తరువాతికాలమున వికసించెను. శ్రీమద్భాగవతము నందు రాధాశబ్దము కానరాదు. కాని ఒకానొక గోపికకు శ్రీకృష్ణునియందు విశేష ప్రేమ గలదనియు, శ్రీ కృష్ణుడు దాని యందల్లే యనురక్తుడనియు, ఆరాధనా విశేషముచేగాని అట్టిది లభ్యముకాదనియు కలదు. రాధ ఆరాధన శబ్దములకు సంబంధము కలదు. 'రాధ్' అను ధాతువునకు ప్రసన్నపఱచుకొనుట, సేవయొనర్చుట అను అర్థములు కలవు. రాధ అనగా సేవకుఆత్మార్పణకుప్రతీక అన్నమాట. బ్రహ్మవైవర్త పురాణమునందు, 'గోపాలతాపనీ' ఉపనిషత్తునందు రాధ కృష్ణుని ప్రేయసిగా వర్ణింపబడెను. జయదేవుని గీత గోవిందమందు రాధాకృష్ణ శృంగారము మధురమ్మధురముగా లలితలలితముగా సుధాతుషారమును వర్షించునట్లు వర్ణింపబడెను. రాధాభావము వికసించి ప్రత్యేక భక్తిమార్గముగా అనంతర కాలమున వికసించెను. 'రాధ' హ్లాదినీ శక్తిగా నుపాసింపబడెను. అస్తు!

సూరదాసు గానముచేసి పుష్కలముగా అనుభవించిన మాధుర్య వాత్సల్యాది భక్తి విశేషములను హిందీ భాషీయులే కాక భారత దేశమునందలి వివిధప్రాంతములవారును మగ్నాత్మగ్నులుగా నిండు హృదయాల జుబ్బవచూఱగా జూఱకొందురు. శ్రీకృష్ణ భక్తిభావ మందలి విరహ మాధుర్యమునకు వల్లభాచార్యుని వంటి యాచార్యనిపుణు ద్వారా నీ విధముగా ఇంగలార్చెను.

"యచ్చ దుఃఖం యశోదాయా నందాదీనాంచ గోకులే"
గోపికానాంచ యద్దుఃఖం తద్దుఃఖం స్యాన్మమ క్వచిత్;

అట్టి విరహమాధుర్యమును సూరదాసు గాఢదికమైన భక్తహృదయముతో సూరసాగరము నందలి దశమస్కంధమున నతిరమణీయముగ నాన్యతోదర్శనీయమగు పదశైలిలో గానము చేసెను.

సూరదాసుని ఈ యమరకృతిని సుప్రసిద్ధకవులు మైలవరపు సూర్యనారాయణ మూర్తిగారు సంక్షిప్తముగా భావానువాదముచేసి, తెలుగుల కందించి మహదానందముచేకూర్చిరి. ఇందు వీరు దశమ స్కంధమందలి భ్రమరగీతలను ప్రధానముగా గైకొనిరి వీరి రచనను అనువాద మనుటకంటె అనుసృష్టి అనుట లెస్స. ప్రతి పద్యము ర తుందిలమై భావుకుల నానందపఱచు చున్నది. వీరి రచన అనుసృష్టి యగుటచేతను, సంక్షిప్తమగుట చేతను, తులనాత్మకముగా గాక, స్వతంత్రముగనే పరిశీలింపదగును. సూరదాసుని రచన వీరికి ప్రేరక మగు నేపథ్యసామగ్రియని చెప్ప నొప్పును. సూరదాసుని రచనలు మఱికొందరనువదించిరని వింటిని. అవి నేను చూచియుండలేదు. నావినికి ననుసరించి అవి యీపాటి విస్తృతములు కావు. సాపేక్షిక మగు విస్తృతిని సంతరించుకొన్న వీరి రచనము పరిశీలించి ఆస్వాదింతము.

వీరింతకు ముందే గోస్వామి తులసీదాస రచితమగు మహా కావ్యము రామచరితమానసమునకు తెలుగున కమ్మని కావ్యానువాద మొనర్చి సహృదయ హృదయాహ్లాద మొనర్చిరి. ఇది వీరి రెండవ అనువాద గ్రంథము. ఈ అనువాదమును అనువాదమనిపించుకొనక మౌలికరచనా గౌరవమందికొన్నది. ఇందు కావ్య సౌందర్యమే కాక వివిధచ్ఛందో విధానములపై మూర్తిగారికి గల అధికారము మూర్తి గట్టి మన కండ్ల యెదుట సాక్షాత్కరించును.

తెలుగు పలుకుబడులలోనేమి, తెలుగు నుడికారపు సొంపు పెంపులనేమి, వీరి తెలుగువాణి నిగారింపులు చదువరుల కింపు నింపును, ఉభయభాషలందును వీరికిగల నైపుణ్యము పుణ్యఫలజన్యము గాని యన్యము కాదు. వీరికావ్యమున ప్రయోగించిన 'రగడలు" సహృదయోద్వేజకములగు పెనురగడలు (జగడములు) కాక హృద యాహ్లాదకములును సువాసనా భరితములు నగుచు పొగడుల్లందు పొగడుపూ వలపులు.

మూర్తిగారి రచనలో భ్రమరగీతలు ప్రధానమైనవి. ఆచార్య 'రామచంద్రశుక్ల"గారు 'భ్రమరగీతసార్' అనునొక సంకలన గ్రంథ మును కొన్ని దశాబ్దముల క్రింద ప్రచురించిరి, మూర్తిగారి కది ప్రధానమైన ఆధారగ్రంధముగా గానవచ్చును. ఏది ఎట్లున్నను అను వాదమని చెప్పితేనే గాని యనువాదమని తెలియని మౌలిక ప్రతిభా భాసితమైన ఉత్తమకావ్య గ్రంథమిది. అనువాదములకు మనకు నన్నయభట్టారకుని నుండి నేటి వరకు వచ్చుచున్న సంప్రదాయ మిట్టిదే.

పేర్చి కూర్చి తీర్చి వేలార్చునిట్టి రచనలందు మూలమునకు కొంతవృద్ధి కొంతనష్టి కలుగక మానవు. "సూరసాగర్" మూలము

సుమారు అయిదువేల పదముల గ్రంథము. మూర్తిగారి రచనము సుమారు ఆరువేల పద్యపంక్తులు గలది. అనగా మూలమునకు దాదాపు నాల్గవ భాగము. అయినను గుణవత్తయందు మూలమున కేమాత్రము తీసిపోని భావసౌందర్యముతో, కథనవిన్యాసముతో జాలువాటి పాఠకుల హృదయముల రసపులకితము చేయుచున్నది, మూర్తిగారి మధుర గంభీరమగు రచన పొత్తమున నేవుటలోని పంక్తిని నోట నొత్తినను మాధుర్యము చిప్పిలి. పఠితల భావ సౌందర్యమున ముంచెత్తును.

వీరి రచనయగు సంక్షిప్తసూరసాగరమున ఛందస్సుల వైవిధ్యము రచనా విన్యాసమునపదేపదే కానవచ్చు ఉభయాలంకారశోభలు, భావ సౌందర్యము శబ్దార్థములపై వీరికిగల ప్రావీణ్యము, రసహృదయుల సూక్ష్మేక్షికల మిఱుమిట్లు గొలుప యుగపద్భావమున వీని నన్నింటి నాస్వాదించు మార్గమేది యని వారు చకితస్వాంతు లగుదురు.

సంప్రదాయ బద్ధమైన యిన్ని ఛందోగతులను ఇంత సక్షమముగానిర్వహించిన వారు వేరెవరైన అద్యతన కాలమున గలరా! యని సందియము పొడమును. వీరి రచనయందు మార్గకవితా మార్గమునకు చెందిన సీసము, తేటగీతి, ఉత్పలమాల, చంపకమాల, కందము మొదలైన ఛందములు గలవు, తోడ్తో దేశిఛందమునకు చెందిన ద్విపదను వివిధములైన 'రగడ' ఛందములను సాధికారముగ రచించిచూపెను. ఇటీవలి వారిలో కవిసమ్రాట్ విశ్వనాధ సత్యనారాయణగారు వివిధములైన అంతగా వాడుకలోలేని ఛందముల రామాయణ కల్పవృక్షమున వాడిరి. అంతేకాక మధ్యాక్కరల విరివిగా వేరుగా దేవతాస్తుతులందు వాడిరి. అందువారు తమవైన కొన్ని విశేషములగూడ జూపిరి. వారివలెనే వారిమార్గమున కాకపోయినను సహృదయ[illegible]ములు, జ్ఞానపీఠపురస్కృతులైన డా॥ నారాయణరెడ్డిగారు ఉర్దూ సాహిత్య

రీతుల ననుసరించి తెలుగున నూతనచ్ఛందోమార్గముల వెలయించిరి. అంతేకాక కొన్నింటిని స్వయముగకూడ ప్రయోగించిరి. డా॥ దాశరథిగారు కూడ ఉర్దూ ప్రభావితులై నూత్నచ్ఛందో విన్యాసముల నెఱపిరి; వీరందరి వలెనే మూర్తిగారు సంప్రదాయబద్ధమైన ప్రాచీన ఛందములనే కాక నూత్న కవితా ఛందమైన ముత్యాలసరమును చక్కగా వాడిరి. ముత్యాలసరము తెలుగునకు గురజాడ వారి భిక్షగా భావింపబడుచున్నది. ఇంతేకాక కన్నడభాషయందుభా-జ్ఞానపీఠముచే బహూకృతులు, కన్నడమున అధునాతన కవిపుంగవులునైన కువెంపు (కె. వి. పుట్టప్ప)గారు తమ సాహిత్యమున ఆవిష్కరించి ప్రయోగించిన 'కువెంపు' అనుఛందము సరసముగా సఫలముగా వీరు తెలుగున ప్రయోగించిరి. మూర్తిగారి యీ వివిధ ప్రయోగముల వలన మనకు తెలియవచ్చునదేమన, వీరిది కేవలము సంప్రదాయ దృష్టియే కాక నాణ్యముగల నావీన్యమును గూడ స్వీకరించు నుదారరసహృదయము గూడనని మనము నిష్కర్షింప వచ్చును.

ఉత్తమశ్రేణికి జెందిన కవియందు సలక్షణములగు మూడు లక్షణములుగోచరింపవలెను. 1 భాషపైఅధికారము, 2 సమర్థమగు భావాభివ్యక్తి, 3 ఛందః ప్రయోగ నైపుణ్యము. ఈ మూడు పుష్కలముగా గలవాడే సమర్థుడైన కవిగా రాణించును. ఇట్టి లక్షణములు మూర్తిగారి రచనయం దడుగడుగునా మనకు గోచరించును. భాషపై వీరికి గల అధికారమునకు ఇందలి అన్నిపద్యములు చక్కని ఉదాహరణలే. తెనుగు నుడికారపు సొంపు లింపు నింపు తావులెన్నో !

విసిగి వేసార, వేసారి వినుచ కయ్య!
జోగపుంబాటు, నడుగుల సాగిపడుదు
మల్లి! మాస్వామి హరినొల్ల కన్యవాంఛ
వీలచువా రమ్మకాన్పుకు బరువుచేటు.

అమ్మకాన్పుకు బరువుచేటు తల్లుల కడుపుచేటు అనుదానికి చక్కని ప్రతిధ్వని.

ధర దున్ను దున్న పీణా
స్వరమధురిమ, మూగ మాట పారస్యము, ద
ధుర మరవింద మరందము,
నరసికు డమరాగమహిమ మరసియు గనునే!

అరసికులైన వారిని వదలుడు. రసికులైన పాఠకులెల్లరు ఈ కావ్యమందలి మాధుర్యము నకు తలమున్కలు గావలసినవారే.

మూర్తిగారు తామే గోపీభావము వహించి యింత చక్కని రచన చేసినా రనిపించును. ఉద్ధవు డెంత బోధించినను వాని నిరాకార నిర్గుణతత్త్వము, గోపికల చెవితమ్మునైన చేరలేదు. వా రుద్ధవునకు సలహానిచ్చిరి.

"నీ నిరాకార నిర్గుణ నీరసాత్మ
మధుర మురళీధరాకృతిన్ మలచిచూప
భక్తిం గృష్ణపరబ్రహ్మభావ మూని
పేర్మి శిరసావహించి సేవింపఁబోమె"

వారు స్పష్టముగా ఉద్ధవునకు చెప్పిరి.

"మమ్ము నిరాకార యోగబంధమున విడుట
దారపుంబోగు మూనిసిం దమ్మితూండ్ల
మదకరింగట్టి నట్టుచూ మఱలదాని
మధురం గానిచనీ యొందించు మాధవునికె."

ఇందే పద్యమును జదివినప్పు గోపీహృదయ మందలి భావసౌం దర్యమునకు మూర్తిగారి అభివ్యక్తికౌశలమున్నట్లు, ప్రాప్తిపుష్టిక్త్వమంతరంగ మానంద తరంగితమై మాధుర్యభావ సంభావితమై పొంగులు వాఱును.

కిం బహునా! పుస్తకమును చేపట్టి చదువుడు. ప్రతిపద్య మొక రసగుళిక మది నెమ్మది పఠించి ఆస్వాదింపుడు. మూర్తిగారికి యమోఘ రచనకై నా **హృదయపూర్వకాభివందనములు.**

వల్లభాచార్యులు తన యావద్దేశపరిభ్రమణ సమయాలలో మూడు నాలుగు సారులు తిరుపతి వేంచేసి తిరుమలపై వెలసి యున్న వరాహస్వామి ఆలయ ప్రాంగణమున గద్దెపెట్టి పుష్టిమార్గోపదేశమును నాటి భక్తులకు ప్రసాదించెనని తెలియుచున్నది. నేటికిని పుష్టిమార్గీయులు. తిరుమలకు యాత్రార్థము వచ్చినపుడు ముందుగా వరాహస్వామి దేవాలయమున కేగి అచట వల్లభాచార్య సంస్మరణ గావించి, పూజాదిక మొనరింతురని తెలియుచున్నది. ఈ విధముగా వల్లభాచార్యకృపాసంజాత మహాభక్త కవియైన సూరదాసుని కృతి తిరిగి ఆంధ్రభాషలో తిరుమల తిరుపతి దేవస్థానంవారి యౌదార్యమున వెలువడనుండుట చారితార్థ్యమును వహించుచున్నది, అంతయు శ్రీనివాసకృపా విశేషము.

సుధీచరణ శ్రీరేణువు
**అయాచితుల హనుమచ్ఛాస్త్రి**

"విద్యాప్రవీణ - భాషాప్రవీణ"

శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యంగారు, కోరుకొండ.

రిటైర్డు లెక్చరర్

సుందర సుబోధినీ వ్యాఖ్యాతలు

## బంధుజనానందనము

మును నంద యశోదా నం
దను లీలలు సూరసుకవి తన వ్రజభాషన్
వినిపింపగ, నేడవి యిటు
మనసూరసుకవి వచించె మన ప్రజభాషన్

తాను కోరియె తన భక్త తతిని గూడి
ప్రేమ మయుడగు హరి వారి కామితముల
దీర్చి తనుపుట తెలిపిన దివ్య భవ్య
కావ్య మియ్యది బుధజన సేవ్యమగును.

చదువగ పాడగ వినగా
మది నుప్పొంగింప జేయు మధురిమతోడన్
పొదలిన 'సూరసుధాంబుధి'
ఇది, యశ మన తెనుగుబాస నెంతయు వెలయున్

సూర్య చంద్రుల బోలిన సూర తులసి
దాస విఖ్యాత సత్కృతి ద్వయ మొసగిన
శ్యామ రాముల పావనా ఖ్యాన సుధను
పంచె మన సూర కవిచంద్రు డెంచి మనకు.

భారతదేశపు వాఙ్మయ
సారములగు రామకృష్ణ సచ్చరితమ్ముల్
భారత వినుతాంధ్రి కలం
కారమ్మయి తనరు సూరకవి అర్పితమై.

మైలవరపు సుబ్రహ్మణ్యము

# కృతజ్ఞతా నివేదనము

శ్రీనివాసుని అనుగ్రహముతోను, సాధుసజ్జన సుహృజ్జనుల ఆశీస్సులతోను, సూరసాగరమున, శ్రీకృష్ణ చంద్రోదయావిర్భావ లీలావిలాస గుణ చరితాదులతో నలరు నీ దశమస్కంధ సంగ్రహ" గ్రంథమును సహృదయలోకమున కందింపగల్గుచున్నందుల కానందించుచున్నాను.

భక్త సూరదాసు శ్రీ వల్లభాచార్య గురుప్రేరణముతో మంత్ర దీక్షాసిద్ధిని వడసి నందనందన సందర్శనానందానుభూతితో భక్తిపర వశుడై, శ్యామసుందరునిపై వేనవేలుగా పాటలు పాడుకొనెను. అవి సహజాశుధారగా నావిర్భవించినవే కాని రచనావ్యాసంగముతో సంతరించుకొని వ్రాసినవి కావు. శ్రీ వల్లభాచార్యుల పుష్టి మత సంప్రదాయభక్తులు, వారి శిష్యపారంపర్యము, వారిఅనుయాయులు ఎందఱో సూరపదముల నానాటినుండియు సేకరించి గ్రంథస్థము చేయుచుండిరి. సూరకవి అంధుడౌటచే వెనుదిరిగి చూచుకొన లేనందున ఆయన పదములలో పెక్కు పునరుక్తులు కూడ చోటు చేసుకొన్నవి. అనంతకాలగర్భమున నవికి, చివికిన సూరపదములకొక నిర్దిష్ట పరిమితి లేనందున అడుగడుగునకు బహుముఖములై వచ్చి చోటు చేసికొను ప్రక్షిప్త రచనల తోడనూ, వివిధ దృష్టికూటపద రచనలతోడనూ ఈ సూరసాహితీ పారావార మపారమైనది, అట్టి అపార సూరపారావారమును "కాశీనాగరీ ప్రచార సభ" వారు సమగ్ర పరిశోధన గావించి, పరిష్కృత పాఠముతో రెండు సంపుటములుగా ప్రచురించిరి పరిమిత సంఖ్యామానమున లేనందువ సూర సాగరము సపాదలక్షగ్రంథముగా పేర్కొనబడినను పండిత పరిశోధ

నలో ప్రక్షిప్తరహితముగా ఎనిమిదివేల పదములు మాత్రము ఆయన రచనగా గుర్తింపబడి ఖ్యాతి లభించుచున్నవట.

శ్రీ కాశీ విశ్వవిద్యాలయ హిందీశాఖాధ్యక్షులు "ఆచార్య" 'శ్రీ రామచంద్ర శుక్లపండితులు" సూరసాగరాంతర్గతమౌ భ్రమరగీతా సారము నొక పదసంగ్రహముగా సరళ హిందీ తాత్పర్యముతో ప్రచురించిరి. "గోరఖ్‌పూరు గీతాప్రెస్సు"వారు "శ్రీకృష్ణమాధురి" అను పేరుతో సూరపదసంగ్రహ మొకటి హిందీసరళ తాత్పర్యముతో ప్రచురించిరి. పై రెండు గ్రంథముల ఆధారము తీసుకొని నేనీ అనువాద రచన గావించితిని, ఆయా గ్రంథకర్తలకు ప్రచురణకర్తలకు సౌజన్యముతో నా కృతజ్ఞతాభివందనము లర్పించుకొనుచున్నాను. సఖ్యవాత్సల్యప్రేమ, మధురవాహినీ పూర్ణమైన సూరసాగర మహా కావ్యమును తెనుగులో పదకవితా సంగ్రహములుగా నందించిన మహనీయులు నా ఎఱిగినంతలో ముప్వురు కలరు. ఒకరు శ్రీ దుర్గానందు గారు, "సూరదాసుపదాలు" అందింపగా 1965 సం॥లో ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ హైదరాబాదువారు ప్రచురించిరి.

2) భారతీయ జ్ఞానపీఠ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥ ఇలపావులూరి పాండురంగరావుగారు. వీరు "సూరదాసు కవితా వైభవము" రచింపగా యువసాహితీ పబ్లికేషన్స్ సికింద్రాబాదు వారు ప్రచురించిరట.

3) "హిందీ ఫార్మంగత్త" డాక్టర్ Ch. రాములుగారు MA. Ph. D. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హిందీవిభాగము వీరు సూరసాగరములోని 250 పదములకు తెనుగులో షదానువాదము చేయగా "సూరస్మారక మండల్ ఆగ్రా"వారు ప్రచురించిరి.

పైముగ్గురి గ్రంథములలో శ్రీపాండురంగరావుగారి గ్రంథము లభింపలేదు గాని మిగతా వానిని చూచితిని. ఇంకను ఎవరైనను ఇట్టి అనువాద కృషి చేసిరేమో తెలియదు.

ఈ నా అనువాదము నాలుగవది కావచ్చును. మూల గ్రంథముతో పోల్చిచూచిన నాకృషి శతాంశ మనిపించును. ఈ కృషిలో ఎంతవరకు కృతకృత్యుడనైతినన్న విషయం సూరతత్త్వజ్ఞులౌ తద్జ్ఞులే నిర్ణయించాలి. అనువాదంలో నా యవిజ్ఞతా భ్రమప్రమాద జనితములైన లోపములేకాక సూరదాసు కైతకు నా కైతలో నిశబ్దాడంబర పైత్యముతోడై వెక్కితలలు వేసియు చేర్పుకూర్పులలో న్యూనాతిరేకములు జరిగియు పాఠకుల రసాస్వాదనమున కొకొక్కచో వెగడు పుట్టించవచ్చును. అట్టిచో "వెగడెల్లనాకు విడిసాం। పగ్గపడెనేన్ సూరదాసుదని తెలియుండీ" అనియూ

"రగడలని యగడు సేయక
పొగడలుగ గడించి బుధులు పొగడిరి కానీ
పొగడితలు సూరదాసువె
వెగ డగుపడ నద్ది నాయవిజ్ఞత యనుడీ"

అన్నదే "నా సవినయ నివేదనము"

ఈ నివేదనములో నాకృతజ్ఞతతోపాటు మూలపదకర్తయైన సూరదాస మహాకవిని గూర్చికూడ రెండుమాటలు చెప్పవలసి యున్నవి.

ఆయన తనకావ్యమునం దన్నిపాత్రములలోను తల్లీనుడై తత్తద్రసానుభూతి నొందుచూ యశోదగా మాతృసహజ వాత్సల్య భక్తినీ, గో గోప గోపీ రూపాలలో సఖ్య ప్రేమ మాధురీ భక్తిని, రాధారూపంలో నవవిధభక్తిని వికసిమ్మ కొంటూ మనకు సాక్షాత్కరించును. అణువులో బ్రహ్మాండమును జూపినట్లు బాలకృష్ణుని ప్రతి కదలికలోను విశ్వరూపమును, విశ్వాత్మభావమును అడుగడుగువనూ ప్రదర్శించుచునే యుండును. "గగనం గగనాకారం సాగర స్సాగరోపమః" అనునట్లు. ఈకావ్యం సూరసాగరం కూడ అన్ని దృక్కోణ

ములతో పరికించుటకు వీలుపడని, లోతుపాతు లెఱుంగరాని అపార పారావారమైనది. అనాదిగా దీనిలో పరిశ్రమించిన సాహితీ కృషి వలులకు నీటికొలది తామరగా తత్తత్ప్రాతానుసారము రత్నములు లభించుచునే యున్నవి,

సూరసాగరము గాదిది. క్షీరసాగర మన్నారు కొందరు. క్షీర సాగరమే కాదు ప్రేమసాగరం కూడా ఇది. ప్రేమాంభోధి మథించి ప్రేమరస సుధానిధియైన శ్రీకృష్ణచంద్రుని, ప్రేమమాధురీ రూపికలౌ గోపికలన్న అప్సరసలను, గోకులమున జల్లపాల్వెరువుల నమ్ము కొంటకని విచ్చేసినట్లు శ్రీ మహాలక్ష్మిని ప్రేమమాధురీపూరిత సుధా కలశమును, కామధేను రూపమున అలమందలను, నందనవనముగా నందవనమును, రామకృష్ణులనే అశ్వినీ దేవతలను పూతనాఽజగర కాళియాహిముఖమున హాలహలమును వెలార్చిన యీ సూర సాగరము క్షీరసాగరమెటు కాకుండును ?

మాతృప్రేమ :- గోకులమున శ్రీ కృష్ణ జన్మదినోత్సవ విశే షముల వర్ణించును సూరదాసు, కన్నబిడ్డలకు కడుపార పాలిచ్చి ప్రతి మాతృమూర్తియు పొందే ఆనందానుభూతిలో, యశోదతోపాటు తానుగూడ పాలుపంచుకొనగోరి "నీపాలబుగ్గ పసినినుగునకు నే

దాదినై పాలు ద్రాగింతు ననుమతింపు యశోద!

అని సూరదాసవరుఁడాశ్రయం బర్థించె" అని మాతృప్రేమానందంలో తాదాత్మ్యము పొంది యశోదమ్మ వెంటపడినాడు.

"విప్రునకు కృష్ణసాక్షాత్కార" మన్న ఘట్టమున సూరదాసే విప్రరూపమున భగవద్భక్తుఁడై మనకు గన్పించును. విశ్వవిశ్వంభర మూర్తిని కల్పాంత ప్రళయవేళలో శేషాంశతో వటపత్రశాయీ భావ మున వర్ణించిచూపిన ఈ తత్త్వదర్శి మహాకావ్యవిశేషములన్నిటిని

ఈ చిన్ని వ్యాసమున నుటంకించి చూపుట, సహస్రకిరణుని ప్రతిఫలించు నీటిలో చూపుట, సూర్యచంద్ర నక్షత్రాదులతో గూడిన అనంతాకాశమును చేతిఅద్దములో జూపుట, విత్తులో మహావృక్షభావము నొదిగించి చూపుటవంటిదే అగును.

సఖ్యవాత్సల్య, విప్రలంభ శృంగార ప్రేమభక్తి రసవాహిని పూరమీ సూరసాగరము. ఇందు రాధికా ప్రేమ మున్నతస్థాయిలో వర్ణింపబడినది. సూరదాసు ఉద్ధవుని యోగోపదేశమంథానవ్యాజమున గోపికలచే ప్రేమాంభోధి జిలికించి కృష్ణప్రేమ సుధానవనీతమును వెలయించెను.

భ్రమరగీతలు :- శ్రీకృష్ణవిరహోన్మత్తలైన గోపికలు, ప్రియ సందేశమును తెచ్చిన ఉద్ధవుని సన్నిధిలో విరహకాతరలై, అళిపికా ద్యన్యాపదేశముగా కృష్ణునాడిపోసుకొనిన విప్రలంభ శృంగారాది వర్ణనాత్మకమైన ఉపాలంభముక్తక కావ్యమే. ఈ భ్రమరగీతలలో గోపిక లుద్ధవునితో 'మా ప్రేమయె నిక్కమౌనెడ లభించెడు నందసుతుం డవశ్యమున్' అని ప్రేమవ్రతాధిక్యమును తమ ఆత్మవిశ్వాసముతో చాటి చెప్పుదురు.

గోపిక లుద్ధవు నొకప్పుడు కృష్ణప్రతినిధిగా, నర్మసఖునిగా సచివునిగా సమ్మానింతురు. కృష్ణుని తోడితెమ్మనీ, లేదా తమ్మేతోడ్కొని పొమ్మనీ అనునయ వినయములతో బ్రతిమాలుదురు. కృష్ణసఖులుగ తమ మధురానుభూతుల ముచ్చటింతురు. ఆయన నిర్గుణోపాసనను తమవాద ప్రాగల్భ్యముతో ఉప్పున నూదివైచి నిరుత్తరుని జేయుదురు. ఆయన దయనీయస్థితికి జాలి పడుదురు, కృష్ణసాంగత్యము నెడ బాపిన అక్రూరోద్ధవులను కృష్ణమృగమును, దక్కించుకపోయిన వేట కాండ్రుగా, తోడుదొంగలుగా, అభిశంసింతురు. శ్రీకృష్ణుని అకృత

జ్ఞతకు మారుపేరుగా, అన్యాపదేశమున ఉపాలంభ మొనర్తురు. ఉద్ధవుని సామదాన భేద దండోపాయములతో సాధింప జూతురు. కృష్ణానురాగరస రంజితలైన గోపికల పరాభక్తికి ప్రభావితుడై భక్తి పరవశుడై ఓడ్పడి ఉద్ధవుడు ధన్యజీవనలని వారి నభినందించును.

ఇందు కృష్ణసాంగత్య సుఖానుభూతితో పరవశించిన గోపికల మధురసంలాపము లున్నవి, విరహోత్కంఠితల విలాపములున్నవి. కృష్ణునియెడ తా మొనర్చిన అపచారములదలచికొని వగచిన యనుతాపములున్నవి. విరహకాతరలై అగతికలై మొఱలిడిన ఆర్తాలాపము లున్నవి, మధురామార్గములలో కుశల వార్తలతోను ప్రియసందేశములతోను, తెరువరుల నడ్డగించి వేధించిన ఉన్మత్తాలాపము లున్నవి. పలవంత వెఱ్ఱులెత్తి కన్నయ్యరాక కెదురుచూస్తో కాకిసకినాల నడిగి కాకులను నిలనీనియు, కోకిలల కూపెట్టనియుపీ ప్రలాపములున్నవి, వివిధదశలలో గోపికల సంలాప విలాపానుతాపములతో, ఆర్తోన్మత్త ప్రలాపములతో నిండిన యీ కావ్యఖండమును కృష్ణప్రేమైక జీవుల జీవన సర్వస్వ మనవచ్చును.

శ్యామసుందరుని సాక్షాత్కరించుకొన్న దివ్యానందర సానుభూతితో భక్తి పారవశ్యముతో స్వాంతస్సుఖమునకు పాడుకొన్న ఈ సూరసాగరకావ్యము కేవలలౌకిక శబ్దార్థజ్ఞానపరిచితితో, శబ్దాడంబర లాలసతో సంగ్రహరూపంలో తెలుగుసేతకు బూనినఖాపూనిక 'మందః కవియశః ప్రార్థీ' అన్నమదితో సహృదయులు మన్నింతురుగాక! తులసీ మానసకావ్యతత్త్వంతోపాటు' సూరమానపతత్త్వమైన కృష్ణ లీలామృతమునుకూడ ఆంధ్రసోదరుల కందించు ముత్సాహమే నన్నీ సాహసకార్యమునకు పురికొలిపినదని తలంతురుగాక!

దివ్యాలకృపతో సాయొనర్చిన సూరతులసీ కావ్యారాధన ప్రీతియులు తిరుపతి దేవస్థానం వారి సౌజన్యముతో నేటికి పూరిగా

వెలుగు జూడగలిగినది. ఈ నా గ్రంథమును ప్రచురణార్హముగ నిర్ణయించి ముద్రణార్థ మార్థిక సహాయ మందించిన T.T.D. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ M.V.S. ప్రసాద్ I.A.S గారికి, T.T.D. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి M.A.Ph.D గారికి, "సప్తగిరి" సంపాదకులు శ్రీ K. సుబ్బారావు M.A గారికిని, నా కృతజ్ఞతాభివందనమ్ము లర్పించుచున్నాను.

ఈ నా అనువాదకృతి నభినందించి శుభాకాంక్షల నందించిన హితైషులు సహృదయులునైన గురుపీఠాధ్యక్షులు, రసహృదయులలో సూరసాగర తలస్పర్శచేసి సాహిత్య రత్నాన్వేషణ గావించిన పారంగతులెందరో కలరు. వారందఱకు నా వందనములు.

"శుభాశంసనాలు-కవితాప్రశంస" లందించిన పెద్దలు ఆర్షధర్మ ప్రచారకులు విద్వాన్ శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు (హైదరాబాదు) గారికి నా మనస్సుమాంజలులు.

ఆదరముతో 'అభినందన' మంపిన భారతీయ జ్ఞానపీఠపురస్కార గ్రహీతలు తెలుగు విశ్వవిద్యాలయోపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారులైన 'పద్మభూషణ్' డా॥ సి. నారాయణరెడ్డి MA. Ph D. D. Litt గారికి నా నమస్కృతములు.

అభిమానముతో 'ఆకాంక్ష' నంపిన భారతీయ జ్ఞానపీఠ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥ ఇలపావులూరి పాండురంగరావు (న్యూఢిల్లీ) గారికి నా అభివందనములు.

ఈ కృతిపై సహృదయ సమీక్ష నందించిన డా॥ మట్నూరి సంగమేశం M.A.Ph.D. (రిటైర్డు ప్రొఫెసరు హిందీశాఖ, శ్రీ వేంకటే [illegible] గారికి నా కైమోడ్పులు.

5) సూరసాగరాన్ని " దృష్టికందని సృష్టి "గా అభివర్ణించిన ప్రముఖ సాహితీ వేత్తలు, చిత్రకళానిష్ణాతులునైన డా॥ ఎస్. సంజీవ దేవ్ D.Litt గారికి నా నమస్కారములు.''శ్రీకృష్ణతత్త్వం " సమీక్షా పూర్వకంగా వ్రాసిపంపిన మిత్రులు 'విద్వాన్,సాహిత్యశిరోమణి,హిందీ విశారద'శ్రీ కొర్వ్యల సూర్యనారాయణమూర్తి (రిటైర్డ్ లెక్చరర్ అశ్వ పురం)గారికి నాఅభివందనములు. అదరముతో 'ఆశంస' వ్రాసిపంపిన డా॥Ch. రాములు M.A. Ph.D (రీడర్ హిందీశాఖ కేంద్రీయ విశ్వ విద్యాలయం-హైదరాబాద్)గారికి నావందనములు. మాకృతిని మదీర్ఘ 'సమాలోకనము" చేసి పంపిన శ్రీగీతాజ్ఞానేశ్వరీయాది, ఉద్గంథకర్తలు 'సాహిత్యరత్న' శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రి M.A.(త్రితయ) (రిటైర్డు హిందీ ప్రాధ్యాపకులు - అలీఘర్ విశ్వవిద్యాలయం)గారికి నా ప్రణామములు. 'బంధుజనానందరచన'తో పరమానందముగావిం చిన ప్రియసోదరుడు 'సుందరసుబోధినీ" వ్యాఖ్యాత 'సాహిత్యవిద్యా ప్రవీణ, భాషా ప్రవీణ' శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యం (రిటైర్డు లెక్చ రర్ కోరుకొండ) గారికి నా నమస్సులు.

సూరసాగరంతలస్పర్శ చేసి, రత్నాన్వేషణ గావించిన సాహిత్య రత్న విభూషణులును సాహిత్య శిరోమణులు, సాహిత్య విశారదులు, భాషాపారంగతులు సూరతత్త్వజ్ఞులౌ అభిజ్ఞులెందరో పాఠకశ్రేష్ఠు లను సూరసాగరంలో నౌకావిహారం చేయిస్తూ వింతలు, విశేషాలు, సాగరం పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలియజేస్తున్నారు. వీరంతా సూర సాగరంలో తలమున్కలుగా మునకలెత్తి గొంతుబంటిగా సూరసుందర పదామృతము తాము సేవించి, లోకానికందించినవారే - వారందఱకు

నా వ ం ద న ము లు.

అంగీరస - శరత్పూర్ణిమ
కృష్ణంపాలెం

విధేయుడు
అనువాదకర్త మై. సూర్యనారాయణమూర్తి

# సూరసాగరము

## దశమస్కంధ సంగ్రహము

### సూరదాసకృత భాగవతము

### ఇష్టదేవతావందనాదికము

క॥ శ్రీ గిరిజా వాక్సతులకు
నాగశయన, నాంగభూష, నలినభవులకున్,
జాఁగిల్లి మ్రొక్కి, పలుకుదు
బాగవతము సూరదాసవరఫణితంబున్.

తే॥ పరకపూజకె, నిండారుఫలము లొసఁగు
నల్పసంతోషి, వటువేషి, ఆశుతోషి,
అడ్డుపడుగడ్డు లడ్డంకు, లడఁచి మాకు
నభిముఖుండగు సుముఖుఁడై యిభముఖుండు.

ఉ॥ శ్రీశుకయోగివర్యుఁడు, పరీక్షిదిలాపతికిన్ వచించెఁ బా
రాశరివాణి, భాగవతరమ్యపురాణ, మనుగ్రహించె మో
క్షాశయసిద్ధి పోతనమహాకవి దానిఁ దెనుంగువారికిన్,
శ్రీశుకసాగరంబనఁ బ్రసిద్ధిఁగనెన్, వ్రజభాష నయ్యదే
దేశికునాజ్ఞ సూరకవి తీరిచె సూరపదామృతాబ్ధిగన్.

క॥ శ్రీవల్లభగురు ప్రేరణ
శ్రీవల్లభమంత్రసిద్ధిఁ జేకొని శ్రీరా
ధావల్లభసంకీర్తన
గావించెను సూరదాసకవివరుఁ డంతన్.

క॥ కవికిన్ గవికావ్యంబున
కవినాభావానుబంధ మరపియొ కవివుం
గవు శ్రీవల్లభగురుఁడే
చవులూరన్ బిలిచె సూరసాగర మనుచున్.

## సూరదాసకవి సంస్మరణము

క॥ కన్నులఁ గట్టిన యట్టులు
కన్నని గట్టెదుట నిలిపి కైతంబుర పై
వెన్నుని కైతలఁ బాడుచుఁ
దన్ను మఱచు భక్తసూరదాసుఁదలంతున్.

## కృత్యాది-ప్రస్తావన-ఆకాంక్ష

చ॥ స్థిరముగ సూరదాసతులసీకవివర్యు లుదీచ్యవాఙ్మయాం
బరమున సూర్యచంద్రులని మన్ననఁగాంచిరి సూరసాగరా
మరకృతి, రామరాడ్చరితమానసభవ్యకృతుల్ రచించి, ఆ
యిరువురకబ్బముల్ పరిచయింపఁగ జేసితి నోపినంతకున్.

మ॥ తులసీమానసతత్త్వ మెల్ల యఖిలాంధ్రుల్ హృత్తలం బత్తుకో
తెలుఁగున్నాటు వెలుంగుఁజూపి తిఁకహిందీసాహితిన్ సూర్యచం
ద్రులుగా వెల్గుచు,,సూరసూర,,యనుచున్ ,,తుల్సీససీ,,యంచుఁ బే
ర్నిలువం బెట్టిన సూరదాసకృతినందింతెప్పు? శేషాద్రిపా!

క॥ తులసీమానసకన్యక
సలలితముగ వెలసె సూరసాగరకన్యన్
వెలయింతు వెప్ప? నీ కి
ష్టలెకద! యాక్షీరసూరసాగరకన్యల్.

తే॥ మానసావిష్కృతింజేసి శ్రీనివాస!
తులసిపూజకు నిస్తులఫలము లిడితి,
సూరకవితాసుమాసార, సౌరభ,మిది
తెలుఁగులకు, ఘ్రాణతృప్తి, నందింపు మింక.

## భక్తశిరోమణి-సూరదాసమహాకవి

తే॥ అంధుఁడయ్యు భవాంధువు నతకరించి
కన్ను నిన్ లోనిచూడ్కి నాకట్టుకొనియె
అంధజనతా ప్రదీపసమాఖ్య నలరి
సూరదాసుఁడు ప్రాజ్ఞచక్షుష్కుఁడతఁడు.

ఆ॥ మధురభక్తి భావమయముగ సూరదా
సల్లుకొన్న కైతలెల్ల భక్తి
పుష్టిఁగూర్చ నద్దిపుష్టిమార్గం బయ్యె
మనె నతండు పుష్టిమార్గకవిగ.

తే॥ సూరపదసమాశ్రయసిద్ధిఁ జూరకొనఁగ
సూరసాగర మీది యీడేరుపోలెడు
లౌకికాలోకనాత్త విలోకనముల
మలపవలె నంతరాలోకమార్గమునను.

తే॥ కర మెఱుంగక సూరసాగరము తలము
తలములక లైతి సౌరరత్నములఁ బడయు
కడవఁగొని సాగరము నీఁదఁగడఁగి నట్లు
చీమ కాశీప్రయాణంబుఁ జేసినటులు,

క॥ వ్రజజీవన సర్వస్వము
వ్రజనందన చరిత మిద్ది వ్రజభాష నఘ
వ్రజ మణపు సుకృతనిధిగా
సృజించె సూరకవి అది వచింతుఁ దెనుఁగునన్.

తే॥ భువి గతానుగతిన్ భవాంధువునఁ గూలు
బద్ధవిషయాంధజీవుల నుద్ధరింప
నంధజనతాకరాలంబ మౌనటు భవ
తారకంబుగ నందించె సూరదాసు
భాగవతకృతి భవసింధువారధిగను.

తే॥ సూరదా సంధకవి తద్వచోవివిశిష్ట
పుష్టిపథకవిత కలరి పూనితి నిటు
తత్పదానుసరణము నాంధ్రాక్షరోక్తి
జగతి 'నంధానుసరణ' మన్ వెగడునుడుగు
స్వీయ రూఢ్యర్థ ముడిగి విశేషవృత్తి
వింగడము గాగ నాకైతవెలుగు లీను
అంధకవితావలంబ తానగుటఁ జేసి.

శ్రీ

# సూరసాగర కావ్య ప్రశస్తి

ఉ॥ కామతమోమదాంధ్యములఁ గన్నులుగానని గ్రుడ్డివారలన్,
శ్యామకథాసుధాంజన విచక్షణచక్షులఁజేసి, సద్వివే
కామలబోధసారమున నాంతరతాత్త్వికదృష్టిఁగూర్చి, మా
యామదిరాత్తజీవుల వెలార్చి కనుల్ దెఱపించి, దివ్యవం
శీమహిమోన్నతిన్ నిరవశేషవిశేషము దెల్పి గోపికా
ప్రేమము సర్వతోముఖవివేచనతోడ మథించి, మాధురీ
ప్రేమవిశిష్టతం దెలిపె, త్రేతలె త్రేతల కుద్దిగా యశో
దామహిళామతల్లిక సుతప్రియతా మమతల్ గణించె ప్ర
జ్ఞామయదృష్టి సూరకవి సంతనచేసిన సూరవారిధిన్.

తే॥ నాగరీభోగ కుబ్జానురాగ లోల
డోలికలఁ దేలె నంచు, బిట్టుగ భ్రమించి
కృష్ణమృగమును బొంచి డక్కించుకొనఁగ
వ్రజసతుల్ పన్ను రసభక్తివాగుర యిది
సౌరకవితాసుమాసార సాగరంబు


తే॥ సగరకుల ఖాతమునుగాని సాగరంబు
సగరకులబంధ మెఱుఁగని సాగరంబు
సగరసంబంధ మెఱుఁగని సాగరంబు
సౌరకవితాసుధాపూర్ణసాగర మిది.

తే॥ సూరవరదపదాశ్రిత సారసూక్తి
సాగర,మి దుద్ధవస్వామి రాగభక్తి
పాఠముల్ నేర్పు నాచార్యపీఠ, మగుణ
సగుణసిద్ధాంత సార చర్చావితర్ది:

శిశుమన స్తత్వశాస్త్ర విశిష్టలక్ష్య
మాదిమాదర్శ మమలసఖ్యానురాగ
మాతృవాత్సల్య దివ్యాను భూతులకును
నవవిధామల భక్తికి నవవిధాన
ముక్తమప్రేమ కిది నికషోపలమ్ము
పుష్టిమార్గకవిత కాద్యసృష్టి యిద్ది
అజ్ఞతాంధ్యనిరోధ సిద్ధాంజనంబు
సౌరసాగర దివ్యరసాంగనంబు.

## గోపీ దివ్యానుభూతి ప్రశంస

ఉ॥ వీక్షణమందు వచ్చుఁగమలేక్షణుఁ డంచుఁ బ్రతీక్షణప్రతీ
క్షేక్షణలై రమింతు రోడలెల్లను గన్నులుజేసి వ్రేతల
య్యక్షరమూర్తి బ్రాముక సమైక్యమునందు బ్రపన్నకోటి కీ
మోక్షము పూరుషార్థములు మున్నగుకోర్కులు వేయునేటికిన్॥





## కృతి సమర్పణము షష్ఠ్యంతములు

క॥ శ్రీపతికిని గోపతికిఁ గృ
పాపావిత భక్తలోకపాపాయతికిన్,
బాపాంధతమోహర్పతి
కాపన్నావితకు, వేంకటాచలపతికిన్.

క॥ కుంకుమ, చందన, లేపిత
పంకేజోరస్థితాంఘ్రి పంకేజునకున్
పంకేజాస్యాబ్జరవికి,
పంకేజజజనక నాభిపంకేజునకున్.

క॥ అంకెకు మీఱెడు నందపుఁ
బొంకమ్మున నశ్వినీసుపుత్రులకున్ మీ
నాంక, మధుజయంతుల, కే
ణాంకున, కట్టియకలంకునకు వెంకనకున్.

తే॥ ఏడుకొండలసామి కిరేడుజగము
లం దెనయు దొర లేఁడటం చంతరంగ
పతిగ మతి నెంచి యీ సూరభాగవతము
నంకిత మొనర్తు శ్రీవేంకటాధిపతికి.

క॥ కన్న నికత, తిరుపతి వెం
కన్న కి దంకితము, గొల్లయతివలు వలపుం
గన్నీర్వాకలు బాటిం,
చ న్నిందుక అదియ నూరసాగర మయ్యెన్.

ఆ॥ వెన్నపాలతోడ, వ్రేపల్లెయిల్లాండ్ర
యుల్లములను, గూడఁగొల్లకొన్న
వెన్నకన్నగాని, కన్ననిగ్గాద; వెం
కన్నకాన్క యింత కన్నగలదె !



# సూరసాగరము

## దశమస్కంధ సంగ్రహము

అను

## సూరభాగవతము పూర్వార్థము

### శ్రీ కృష్ణ జన్మోత్సవ లీలా వైభవము

హరిగతి రగడ :-

శ్రీశకథాకథ నోత్సుకమతియగు
  శ్రీశుకయోగి శుఁడు వినిపించెను,
శ్రీశకృపాపరి రక్షితుఁడైన పరీక్షిత్
  క్షితిపతి వినువిందుగ విన
విను!మవధానమున పరీక్షిన్నరవిభు!
  విబుధమనోరంజన షుభం
జనషుగు, కృష్ణనిరంజన జనరం
  జన శైశవలీలాచరితం బని
రమణీయంబౌ యమునానదితీ
  రమునన్ మధురాఖ్యపురం బమరున్.
అమరారివరాంశజుఁడౌ కంసుం
  డమరారిన యప్పురవరమేలెన్:
ఆదిపురుషు, శ్రీ కృష్ణబ్రహ్మము,
  ననుఁగునిసుఁగుగా గనఁగల్గిన భా

గో్యదయదేవకిఁ బిన్నయనుత నతఁ
డుత్సుకమున వసుదేవనృపతి కిడి
పెండిలియొనరిచి పెక్కు లుడుగరల
వెండి బసిండుల గిండుల మెత్తలఁ
దిండుల వలువలఁ జీరెల సారెలఁ
దెండని బండుల నింపుచు హత్తుల
కత్తెళు లరదం బుల బలు మొదవుల
గాన్కలుగానిడి కంసనృపాలుఁడు,
పొత్తున వారిని పీడుకొలుపఁ జనఁ
బొడమెను మింటను బైలిపలు కొకఁడు
ఈ నీ చెల్లెలి కడుపునఁ గను జో
దే నెట్టన దీయుర! నీ ప్రాణము
నా నుడి వినఁగనె కంసనృపాలుం
డరదము డిగ్గున డిగ్గి కృపాణము
తీసివరసవావుల వాసి మఱచి
తిగిచి చెలియలి సిగనుబట్టి పెనచి
యీసును బ్రాణాశయు మతి ముచ్చిల
నేసవ శంకింపక కసి నసిఁగొని
చంపఁగ నుంకింపగ వసుదేవుఁడు
చంపకగంధికి నడ్డుపడి యనెను
చంపకగంధిని చెలియలిఁ జంపక
సంపాదింపవొ తెంపరిబిరుదును
బెంపడరఁగఁ జేసేతులఁ బెంచిన
విషవృక్షము నేన్ ద్రెంచుట తగ దన
నింపడరఁగఁ జే సేతను గూర్చిన

యీదాంపత్యముఁ దెగఁద్రెంచెదవే!
కంటిమె! నీవంటి మగంటిమి గల
గండుమగలు గ్రాల్గంటులఁ జంపఁగఁ
గంటు విడుము కలకంఠిపయిని నీ
కంటురితనమే లని యర్థింపఁగ
కంసనృపాంసనుఁ డనె వసుదేవునిఁ
గని మిన్నుడి నా మతి వెతపాలగు
ధ్వంసకరంబగు విషఫల మీనెడు
వల్లిని బూయక త్రెంచుట మేలగు
వగవకు మీమె నడంచి మఱొండొక
వధువును దెచ్చి వివాహ మొనర్చెద
తెగటార్చెద నీ విషవల్లిక నను
తెగుదారికి బృందారకులు మునులు
పలికి రిటులు తలపోయకు భూవర!
బహుమాన్యులు నీ కీనవదంపతు
లలఁతులు గారిఁక వీరి కభయమిడి
సార్థకపఱుపుము కన్యాదానము;
శ్రీవిలసిల నీ నవదంపతులకు
జీవనదానము నిడు బహుమానము
నీ విడు వధువును నీవ వధించుచు
నిష్ఫల మొనరుతె కన్యాదానము
చేసేతను గూర్చిన దాంపత్యముఁ
జేయుము సత్యము మాను మకృత్యము
ఈ సతికాన్పునఁ బుట్టు నపత్యము
నీవే కొను కలదేని యగత్యము

అని మునివర్యులు ననిమిషవర్యులు
ననివార్యంబుగ ననురోధింపగ
ననుకంపామతి నత డామిధునము
ననిపెను దనిపి య థేచ్ఛఁ జరింపఁగ
అటుపయిఁ గొంతకు దేవకి చూలా
లయి తొలికాన్పున సుతుఁ బ్రసవించు డు
చటుకున నప్పసికందునుగొని నుదిఁ
దప్పక యప్పన మిడె వసుదేవుఁడు
పరికించి శిశువు నొప్పరికించి కృ
పాలుం డయి కంస నృపాలుండును
వెఱఁ గసిగందక కసుగందువుతో
వెఱ పేలని శిశుఁ గొంపో వ్మనుడును
అరిమిలి నొకపరి నారద మునివరుఁ
డరుదెంచి నృశంసుఁడు కంసున కనె
నరిఁ బరికింపక నొప్పరికించెద
వరిగొని యఱవర సేయక నరవర !
నీ చెలియలి తొలిచూలు బుడతఁడే
ని న్నరిగొనుజో డెటు కారా దని
ఖేచరముని సంకోచము బెంపఁగఁ
గెడపఁగడఁగె సిసువుల నాఁడాదిని
ఈగతి దేవకి పసికందుల నతఁ
డేనాఁ డేమఱ కెరఁగొనుచుండిన
నాగతి బిడ్డలు గడ్డలపాలయి
యూరని చిచ్చు రగుల్పఁగఁ గడుపున
ఉసురుల తీపిని సిసువులఁ బలిఁగొని

యుసు రనిపించెను గడు పుడికించెను
కొసరక బాలజిఘాంసువు కంసుఁడు
కొసముట్టించెను నా వంగసమును
పాపలఁ బాపి చిరాయువు గాఁగల
పాపికి బసిపాపల యుసురెంతటి?
దాపోవునె! తా నొడిపాపలతో
నందవలదొ!నా యుసురుల గూడను
ఆగతి దేవకి నా కేగతి యని
యగతికగతికుఁడు హరియే గతి యని
యూగాడుచు సుతశోక మహాంబుధి
నొడ్డును జేర్పగ వేఁడె దయాంబుధి
ఆ దేవకి యటు లా దేవకిరీ
టాంచిత మణిరుచి రంజితచరణుని
ఆదిపురుషు హరి నెంచి కొలుచునెడ
నచలాదేవియు గోరూపముఁగొని
దేవతలకు గులదేవతలగు విధి
దేవ మహాదేవులఁ గనఁ జని తొలి
దేవళ్లం బడు తనదేవుళ్లను
దేవుళ్లందటి ముందఱ మొఱలిడె
నానాటికి హెచ్చు నిశాటభరము
నాటుకొలుపు నారాటము మాన్పఁగ
నానాటు నొకండును జాలక
యరిగిరి హరిఁ గిటి కొని ప్రార్థింపఁగ
పాలకడలిఁ బన్నుండు కృపాలుని
పాలికరిగి సురపాళి కయిమొగిచి

పాలింపవె! శ్రుతిపాలన! అశ్రిత
పాళి నిలింపుల మొఱ లాలించుచు
నుడికి నెడకు బ్రానుడికడలకు నిను
నుడువఁ గడవఁగా రాదన నీపాడఁ
బొడిమాటల నే మగ్గింతుమె విభు!
పొడసూపవె! త్రిభువనములు ప్రోపడ
అని వినుతించెడు ననిమిషవర్యుల
కభయోక్తి వినంబడె నొకఁ డంబుధి
మనుజాకృతి నిలఁ బొడమి పుడమివెత
మాన్పుదు దన్పుదు నసురులఁ ద్రుంపుదు
సురనరనాగులు యక్షులుఁ బశుప
క్షులు మీరెల్లరు గోకులమందున
నరులై పుట్టుడు నాతోఁ బరమా
నందమునందు తలంపుకొలందిని
దేవతలకు నటు లానతు లిడి హరి
దేవవిమోహిని మాయ ననుప నవి
దేవకి సప్తమ గర్భగతార్భకుఁ
దీరిచి రోహిణీగర్భముఁ జేరిచె
నందసతీ గర్భమున యశోదా
నందనగాఁ దా నొదిగి యెదిగె నట
లం దాశ్రీహరి దివ్యాంశం బది
యా దేవకిమెయి నొదిగిన దాదట
శ్రీహరి గర్భగతుండయి దివ్య
శ్రీవిభవ వికాసముల వెలాఱుప
నా హరిణాక్షి ముఖము శరదిందు స

# దశమస్కంధ సంగ్రహము

మాభంబయి విప దంధము లాఱిపె
దేవకి తన మో మద్దంబునఁ గని
తేజఃపుంజము కంసవిభంజన
మౌ విభుతేజము గర్భగతం బయి
యమరు టరసి మది మురిసెను దనిసెను
అరసి యలౌకిక మౌ నాతేజము
నసురాంశజుఁ డౌ కంసనృపాంసనుఁ
డటిమురిఁ దన్నరిగొను నరి యీ మా
అవని నవతరింపంగలఁ డనుకొనె
ఆలిమగల వారిని జెఱనిడెఁ జూ
లాలని లాలన మొనరుప కాయుమ
చూలునఁ దన కాయుశ్శ్యాలంబగు
చూ లోకఁ డుదయించెడు నను రూఢిని
కంసుని బ్రతికెడు ప్రొద్దులు నిండఁగ
గరితకు గానుపు పొద్దులు నిండెను
కంసజిఘాంసూదయకాలంబును
గదిసె నృశంసుని కాలము గదిసిన
కానుపుతటి గని కాన్పించిరి త
ద్గర్భగతాదిమ పురుషుని వేడఁగ
నా నర కిన్నర యక్షామర గరు
డాళి మునిహృదబ్జాళిని బాడఁగ
దేవకి వారలఁ గృపదైవారెడు
తెలిచూపులఁ గనెఁ బ్రేముడినింపుచుఁ
దేవవిభుఁడు పొడ తెంచెడు చిన్నెగ
దేవాగమనము మది గమనించుచు

కానుపుబొద్దటు డాసినచిన్నెలు
గాన్పింపఁగ నా దేవకి యీనలి
కూననయిన నే కోనకొ చేరిచి
కూనలమారికి జేపడకుండను
ప్రాణము దక్కించెడు పుణ్యాత్ములు
ప్రాణసఖులులే రౌకరు కృపాత్ములు
త్రాణలు దప్పె నెవారికిఁ జెప్పుదుఁ
ద్రాత లెవారిఁక దనకని నొగులుచు
డాయఁబిలిచె వసుదేవనృపు నపుడు
డాయఁగ రోహిణి యష్టమిప్రొద్దున
నా యనఘాత్మమహోదర మందున
నఖిలభువనవిభుఁ డభవుఁడు పొడమెను
అభవుఁ డఖిలభువన ప్రభవుండయి
యవని నవతరించెను సిసురూపునఁ
ద్రిభువనశుభదుఁడుఁ భృగుపదరేఖా
శ్రీవత్సాంచిత విలసద్వక్షుడు
శిరమున మకుటము బంగరుపటమును
జేతులఁ జిందము నరవిందము గద
యరినిశ్చక్ర సుదర్శనచక్రము
నలర సుదర్శన మొనఁగె సుదర్శని
అతిలోక మహాద్భుత తేజంబగు
నయ్యపురూపపు శిశురూపముఁ గని
మతిఁ గనివిని యెఱుగని కత యిదియని
మాతృపితలు మహితాద్భుత మందిగి
క్రతుశతసుకృతమొ యేవ్రతఫలమో

కలిసి ఫలింపఁగఁ గడుపు ఫలింపఁగ
శతమఖ పంచముఖాదుల కందని
శాశ్వతు నజు నచ్యుతు విశ్వాత్ముని
గ్రతుఫలదుని గని విని యెఱుఁగని విభు
గంటిమనుచు మిన్నంటి నుతిం త్రా
గతిఁ దొడఁబడ నుడియాడక ప్రాన్పడి
కనులు మిఱుమిటుల్ గొలుపఁ గనుంగొని
పూర్వపురుషుఁ డా పురుషోత్తముఁ డ
పూర్వశిశుండై పుణ్యాత్ముల కనె
పూర్వజననకథ వినుఁడిదె మీరలు
మును నావంటి కుమారునిఁ గోరిన
మెచ్చితి నపు డౌనని వరమిచ్చితి
మేకొని యిపు డీడేర్పగ వచ్చితి
నిచ్చ భవాంబుజ భవ సనకాదుల
నిష్ఠల కందని నిగమాగముఁడను;
చేసితి మీ కోరికి సఫలము, వి
చ్చేసితి నిటు నడ్డాలబుడుతగను
వాసిగ నాశ్రిత వత్సల బిరుదము
వాసి నిలుపుకొన బాసఁదలఁపుఁగొని
అకుల పడకుఁడు నన్నాత్మజుగా
నాఁచికొనిన పుణ్యాత్ములు మీ రని
గోకులమున నను దోడ్కొని పొం డిక
గోప గృహంబున కని వసుదేవుని
ప్రేరేచుచు నిజ మాయను రేచుచు
రెక్కొని ప్రాకృత డింభాకృతి యయి
కేరుచు నేడ్వఁదొడంగె వెడంగయి

కేశవుఁ డావసుదేవ నరపతియు
చంటి బుడత నడ్డాలఁ బొదువుకొని
చనెఁ గనుమినుఁ బొడగాననీ యిరులను
మింటుమొగి శేవెంటను నుఱుమును
మెఱుమను వెంబడి సింగము లుఱుమును
మింటను మిన్నును మన్నేకముగా
మెఱిసెను బిడుగులు రాలెను గుత్తుక
బంటికొలందిని దాఁటుచు యమునయు
వఱదలు వాఱెను దలమున్కలుగా
అక్కన బిడ్డను గొని యా యనఘుం
డక్కఱవేల్పుల కెల్లను మ్రొక్కుచు
బిక్కక యమునా జలములఁ జొరఁబడి
పిక్కల బంటికి బెందొడ బంటికి
మొలబంటికిఁ గుత్తుకబంటికిఁ జని
ముంజేతులఁ బై కెత్తఁగ బిడ్డని
నలఘుశిశుం డతఁ డంఘ్రితలంబున
నంటిన గాఢ జలం బడుగంటెను
బుడు గడుగంటిన జల మడుగంటఁగ
బొడుగునఁ దెరువిడె మడమలబంటిగ
వడులు సుడులు విడి యమునానది వెయి
పడగల గొడుగును బట్టె ఫణీంద్రుఁడు
అటు వసుదేవుం డేఱుఁ గడచి చని
యా గోకులమున నందుని సౌధము
దటుకునఁ జొచ్చి యశోదకడన్ విడి
తనయునిఁ దత్సుతఁ గొంచు నిశీథిని
మగుడ మధుర కేతెంచి యశోదా

మాయాసుత దేవకి యొడినుంచెను
మగువ కొమరితం గనిన యుదంతము
మధురాపురి నంతయు వ్యాపించెను
కంసుడు నమ్మక దేవకి కొమరితఁ
గనె ననుసుద్ది నిబద్ధియ కాదని
ధ్వంస మొనర్పఁగ వెడలి జిఘాంసను
బసి కూనను రాలం బడమోఁదెను
తలఁ దన్నుచు మిన్నంటుచును యశోదా
మాయాసుత యది కంసున కనె
వలఁబడు మీల్దము వలఁగొను మిత్తిని
వలెఁగన విటునిన్ వలగొను మిత్తిని
గాలమె తమకుం గాల మనుకొనక
గాలమునం దాడెడు మీలంబలె
గాలముపైబడఁ గానవు నీ మతి
కాలము డాయఁ బొకాలెనొ కాలెనొ
చిందాడెడు గోకులమున నీ తలఁ
జిందాడెడు కాలమె సిసురూపున
పెందలఁ జిందులఁ ద్రొక్కెడు కాలము
పెందలకడఁ గల దని వెత రేపిన
తొనఁకుచు దేవకిమ్రోల ధరాపతి
తుం డయి వేడుకొనియె మధురాపతి
పనిఁగొని యొడిపా పల నెడబాపిన
పాపిని నను మన్నింపు కృపామతి
మనఁగల కూనల మఱఁగించితి నని
మనమున మఱకువ మానుము చెలియల
మనఁగలవారని మఱఁపెడువారును

మణిగెడువారిని మనుపఁగలారును
మహినిగలారలె యదిగా కెవ్వరు
మనిఁగెడువారును మనుపగలారును
రహిని బురాకృత కర్మఫలము విధి
వ్రాఁతఫలముఁ దప్పింతు రెవారని
వారనిదయ దయివార నవారల
వారనివెతలఁ బ్రియోక్తులఁ దేరిచి
వారిని వీడ్కొని వైరినివారణ
పరమోపాయజ్ఞుల సభఁగూరిచి
కంటకుఁడగు నరి నెన్నరిగొంటకు
గంటి యెదుట జనియించె నటంచని
కంటు నిదుర తింటకు వంటకమును
గఱ వయ్యెను నాకేవెర వంచును
అరయఁ గడఁగె నరి మారణసాధన
మతిముఱి గంసనృపాఁసనుఁ డమ్మెయి

— o —

## వ్రేపల్లెలో పుత్రజన్మోత్సవ వర్ణనము

హరిగతి రగడ :-

అరుసము విరిసెను గోకులమున నం
దాంగన బిడ్డని గనిన దటంచును
తెలతెలవారి మెలంకువ రాఁగనె
తిలకించి సిసున్ మెయి బులకెత్తఁగ
నలరి యశోదాపతి పుత్రోత్సవ మమరిచె
గోరిక తీరిక లెత్తఁగ
భవనములకుఁ జందనము లలందిరి

బంగరు బిందెలఁ గొప్పుల నిలిపిరి
వివిధవిధుల ముంగిళ్లు లంగడులను
వేడుక మెయి సింగారము సలిపిరి
విరులఁ గురిసి దుందుభి మ్రోయించిరి
వేల్పులు భక్తిశ్రద్ధల తోడను
మొరసెను సన్నాయి శుభవాద్యంబులు
మురిప మరలె వ్రేపల్లియ వాడల
నందన జననానందోత్సాహో
న్మాదంబునఁ జిందాడెను నందుఁడు
మందఁ గలుగు పలు మందగమనలు
మందిగ నంద గృహంబున కరిగిరి
వెలిమి వెలిచి వేల్పులఁ దనిపిరి
విప్రుల బూజా సత్కృతిఁ దనిపిరి
మేలిమి బంగరు పళ్లెరములతో
మెలఁతలు మంగళహారతు లిచ్చిరి
ఆడిరి పాడిరి గోపకులిటు కొని
యాడెను మధురాధిపమదమథనుఁడు
ప్రోడ పెరిగె నీవాడ నటుంచని
ప్రోలిసిరులు సౌరభమును సూరుఁడు

(3 - 4 సూరసాగరము 628 - 631)

ద్విరదగతి రగడ :-

వసుదేవ! పసమించు పసివానిఁ దిలకించు
దెస లెల్ల వెలిఁగించు దివ్యదీప్తుల నించు
కనులవిం దొనరించుఁ గనుపండు వనిపించు
గననౌడల్ పులికించుఁ గడు ముద్దులొలికించు
కనుపించి శతకోటి శీలాకృతిని మించు

ఘనుఁడయ్యె సుందరాకారుడై మురిపించు
చాలింపు మీశంక శంఖ చక్రగదాఁబు
జాలంకృతస్కంధు నతిలోక మహిమంబు
కన్నులంగని వీనిఁ గంసజిఘాంసనుం
డని నమ్మలేని నీ యసురవిధ్వంసనున్
గోకులంబున నంద గోపమందిరమందు
తోకొంచు విడు మంద దుఃదుకుమాను మెడంద
అనుడు నాపసి బిడ్డ నడ్డాల నిడుకొంచు
ననఘుఁడా వసుదేవుఁ డరుగుతలఁ బొనరించె
తలఁపుగడియనె యూడె దలుపుగడె తనయంత
సలుప కంకిలియూడె సంకెళ్ళు దమయంత
చెఱసాల గుమ్మాలఁ జేరి కూరుకు సోఁక
గుఱువెట్టెఁ గావలి గుమియుఁ గుక్కలమూఁక
మెఱిసె మబ్బులు మింటు మిన్ను మన్నేకముగ
గురిసెను ముసలధార గుంభవర్షము బొదిగి
వ్రేపల్లెదారిబడి వెడలెఁ దలనిడి బుడత
బొఁపదొర గొడు గొచుఁ బరివి రా నావిడుత
కా లందఁగాఁబోక గడలబంటిగ బాఌ
కాళింది వఱదలోఁ గడిమిమైఁ జొరబాఱి
కుత్తుబంటిగ నేగఁ గుఱ్ఱ హూంకృతిఁబెట్టె
నొత్తిల్లి వాఁగు తెన్నొఁసగె దొర దరిఁబట్టె
కా లందఁగాసాచి కాళింది నందుకొన
కీలాల మడుగంటె గేశవస్పర్శమున
అలీల నది దాఁటి యతఁ డాయశోదయొద్ది
బాలుఁ బవళింపించి బాలఁగొంపోయె వడి
వేల్పు లరుసమ్ము నిగ్గియ్య నిర్ఝరాన్నలుం గురియ్య

సల్ప రాసక్రీడ జనియె హరి దయగురియ
ముజ్జగంబుల బొజ్జఁ బూను చిఱుబుజ్జాయి
నజ్జమున దాఁటించి యామెయొడిఁ బడవేయ
మున్ను మూఁడడుగులను ముజ్జగము లాకట్టి
మిన్ను ముట్టి బలీంద్రు మెట్టిన జగజెట్టి
మందపై గోపదంపతులపై దయజేసి
చిందాడఁ దలపోసి చెలులతో విచ్చేసె
బృందారకస్వామి త్రిభువనాంతర్యామి
నందు నింటను వెలసె నతజనావనకామి
ఆపాప యపురూపమౌ రూపుఁ గన్నంత
గోపమ్మ మురిపమ్ము కొలఁదిఁగన కంతంత
ఒడలు పులకెత్తె నుడులు డిగి డగ్గుత్తికను
వెడలకే తడబడఁగ బిల్చి విభు పొత్తునను
పొత్తు బిడ్డని జూపి పున్నెంబు లీడేరఁ
జొత్తెంచె మనసామిఁ జూడు మిటు మనసార
అనుడు నానందమున నానందగోపకుఁడు
తనయుఁ గని తనియఁ డింతటికి విడనోపకెడ
ఆనందసందోహుఁ డామందవాఁ డయ్యె
నానందవన మయ్యె దానందవన మయ్యె
ఆ నందమందిరం బానందమందిరం
బై నందనవనాభ మయ్యె హరికల్పమున
నీపాలబుగ్గ పసి నిసుగునకు నే దాది
నై పాలుఁద్రావింతు ననుమతింపు యశోద!
అని సూరదాసవరుఁ డాశ్రయం బర్థించె
దనిసి యామె సూరదాసుం డనుసరించె.

(6 సూరసాగరము 639)

ఉ॥ వింటివె ! వింతవార్త విను వీడుఁగఁజెల్లి రో! నందురాణిక
న్గొంటుకుఁ గాద్లు చాలవనుకోఁదగు చక్కనిచక్కనయ్యవా
కొంటుకు నాఁచికొంటుకెదఁ గోరిన చక్కని వింతబిడ్డ ము
క్కంటికి గంటికానని ప్రగల్భశిశున్ గనె నంట వింటివే !

క॥ ఇంటింటు నుత్సవములా
వెంటఁ జరుపుకొనిరి రాణి బిడ్డను గనఁ గ్రా
ల్గంటులు చని కని వత్తుము
వెంటనె లెండ ంచు నందవేశ్మంబునకున్.

క॥ పైన మయి వెడలి రాపై
నా నంద గృహంబు నిండె నాగంతులతో
నానందోన్మాదంబున
మే నెఱుఁగక గంతులిడెదు మిడి ఘుబ్బలతో.

క॥ యాతాయాత జనమ్మున
వ్రేతలతో నిల్లునిండ వ్రేపల్లి యటఁ
డాతటిఁ బుత్రోత్సాహ ప
రీతానందానుభవము రేకెత్త మదిన్.

ఉ॥ కొందఱ పీడుకొంచు మఱికొందఱ బందులఁ దోడుకొంచు వా
రందఱి సత్కరించెను యథార్థముగా వరదాన సత్కృతిన్
వందన పూజనాదులను వారిమదుల్ దనివోవఁ దన్పు చున్
నందవిభుండు పుత్రజనన ప్రమదం బెదఁ బొంగువారగన్.

(3-7-9-13 సూరసాగరము 639-640-643-647)

ద్విరదగతి రగడ :-

అబాలగోపాల్బు దవతరించెను మంద
నాబాల్యగోపాల మందఱును ముదమంద

మండిమండిగ నంద మందిరము మొగసాల
　నందడించెను శౌరి జన్మోత్సవము చాల
ఆనంద మెడ విముధ కంచుమెంచుక పొంగ
　నానంద తాండవం బాడిపాడిరి పొంగి
గొల్లవీథులఁబారు కొల్లలౌ నరుసంపు
　వెల్లువలు నందవిభు వేశ్మవధుల నింపు
రతనాల నతికింత్రు రత్నగర్భను బోదవ
　వతుల మణితోరణము లమరింత్రు సొంపొదవ
చల్లపా ల్నేతులను జల్లుదురు కలయుంపు
　లుల్లాసముల నెంత నోపు నెవఁ డా సొంపు !
కొల్లవో యిది రల్ల గోకులపు సిరు లెల్ల
　వెల్ల రర్థులు గోర్కు లీడేరి విలసిల్ల
కట్టువలువ లొసంగి కట్టఁబెట్టుదు రొకని
　కట్టి కైసేతు రొడ లాభూషలిడి యొకని
అలరుదండల నొకని యలుక సింగారింత్రు
　మలయ చందన మలఁది మైపూఁత గావింత్రు
తొడరి యొక్కనితల దూర్వాంకురాక్షతల
　నిడుదు రొక్కని కిత్తు రెంచి ముక్తాక్షతల
యమున యొద్దున మేయు నాలఁ దోలుకవచ్చి
　తమిమీఱఁ బ్రాహ్మణులకు దానమిడుదురు మెచ్చి
దానంబులిడి సతత దానంబు ధారలన
　వానఁబెట్టిరి నేఁడ సవ్యవర్షాభ్ర మన
కదియఁగ యశోదమ్మ కడుపు పొల్కడలి న
　వ్వొదవు హరినీలమణి యుదయమై వెడలినన్
మొనసి హృదయాభరణమును జేసికొని మురిస
　రెన యెవ్వ రా గొల్లయిల్లాండ్ర కే వరుస!

ఆ మందభాగ్యురవు లమ్మి నెలకొంటి కని
శ్రీమహాదేవి విచ్చేసె నింటింటికిని
శోభాధిదేవతయు చొత్తెంచు తత్పురము
సౌభాగ్య గరిమంబు వర్ణింప నా తరము?
సూరదాస శ్యామసుందరుని బాటకొను
భూరిభాగ్యులఁ బేదబుద్ధి యెటుల పేర్కొను?
(8 సూరసాగరము 842)

హరిగతి రగడ :-

కలువ కనుగవలఁ గపురపుఁ గాటుక
కస్తూరి తిలకము ఫాలఫలకముల
గలగలమను గళహారము గళములఁ
గమ్మలఁ దాటంకమ్ములఁ దమ్మిల
ముంజేతుల బంగరు కంకణముల
ముత్తెపు సరముల మొత్తము లక్కల
మంజుల సుమమంజరులను గొప్పుల
మైదీగల మనుగోకల దైకల
శృంగారమ్ముల సింగారించుక
శృంగారవతుల్ శిశువగఁ జని రటు
భృంగారమ్ముల మంగళహారతు
లిడుకొని నెడ సందడిగొను చున్నటు
వేడుకఁ జని కనిపెత్తుము రండని
పిలుచుకొనుచు నొండొరు నింటింటను
గూడువిడిన గోవృందము వడువున
గూడుబడిరి చన గోకులవీధిని
తరుణారుణ సుందర కిరణమ్ములఁ
దమి విచ్చెడు నెత్తమ్మి విధంబవె

ఏరియ యశోదా బాలార్కరుచి,
　　విరిసె వ్రజపతుల తలఁపు తీరవిరులు
తమతమ మగ లరుదేరక మున్నే
　　తమకము మీఱఁగ వాగిలు జొరఁబడి
గుమిగొనిరా నందాంగన లోనికి
　　గూర్మిఁబిలువ నా పురిటిల్లు సొరఁబడి
అయ్యపురూపపు శిశురూపముఁ గని
　　యడుగులఁ బట్టుచు నుడువులు దొడబడ
దియ్యము మీఱఁగఁ దొయ్యలు లాశిషు
　　దీర్ఘాయువు గమ్మని దీవనలిడి
ఈడేరెను మా యిష్టార్థంబుల
　　వెన్నో భవంబుల పున్నెపుబంటలు
నేఁడీనాటను నినుఁ గనుగొంటను
　　నెఱి నందాంగన నోముల పంటను
నీవు వసించిన నెలఁత యుదరమును
　　నీయుదయించిన తిథివారంబులు
రేవగ లగ్గడియలు లగ్నంబులు
　　శ్రీవర ! ధన్యము లతిమాన్యంబులు
బాము వెతలఁ బోద్రోమి యశోధా
　　భామామణి నీ కులదీపకుఁ గని
యామెఁ గులము నిను బాధు కొలిపి యిటు
　　మోఘ చిరశుభ స్తంభముగాఁగను
అని హరినెంచుచు గోపవధూతతి
　　యవని సురుల రప్పించి యమునకడ
వని మేసెడు నాలను దోలించుక
　　వచ్చి సవత్సక గోదానము లొసె

పాల్పడి మహదానందంబున వెన
  బాలునొకండొకఁ డుబ్బుచు మురియఁగ
పాల్పెరువుల ముంతలఁ దల నిడి గో
  పాలురు పాలిలఁ జిందక యుండఁగ
చిందాడుచు బహుభంగుల వారలు
  చిత్రవినోద క్రీడల గడుపుచు
నందాంగణమునఁ బాల్పెరువులతో
  నలువుగఁ బలు జల్లాటల నాడుచు
ప్రొద్దులుబుచ్చి యథేచ్ఛఁ జరించిరి
  బుద్ధి గణింపక పెద్దల సుద్దుల
గ్రద్దన నందయ పెద్దయ యొద్దకు
గంతులిడుచు జని రతఁ డెద మోదిల
  నా కులదేవుం డిటు గోకులమున
శాకుల దేవుఁడు నందాత్మజుఁడయి
  చేకొనె జన్మము శ్రితజన వాంఛలు
సేకుఱ నని సూరుం డుబ్బ మురియ
  మున్నే నాటనొ నోచిన నోములు
పున్నెము లన్నియు బొనరి ఫలింపఁగ
  గన్నయ్యను దమ కన్న కుమారుగఁ
గన్నారుఁ జిరశుభస్తంభముగా
  అని పురవాసులు మది ముచ్చటపడి
యరిగిరి నందౌకమునకు శీఘ్రఁ గని
  పెనుగాన్కలుగాఁ బాలు పెరుంగుల
వెన్నల నింపిన కడవలఁ గైకొని
  నందుఁ డపుడు హితాది మిత్రాళి

ణం బొనరించి పుత్రకకరుండయి
  నాందీముఖకర్మలఁ బిత్రుగణం
తర్పణ మొనరించి పున్నరకము విడ
  జాతకర్మ సంస్కారము నెఱపె ద్వి
జాతులు శిశు జన్మర్క్ష గ్రహ
  జాతము తారావారస్థితిఁ గని
శాస్త్రవిహితగతి నెఱపింపఁగ రహి
  లలిత సులక్షణ లక్షితమగు గో
లక్షను ద్విజులకు నిడి దక్షిణలిడి
  యలరిచె భట మాగధ ముఖవందుల
నఖిల హితార్థము లీడేరఁగ నిడి
  కృతమతి వర్థిజనంబు బహూకృతు
లెనసి సిసున్ దీవించి చిరాయుగఁ
  గృతియని నందోన్నతిఁ గీర్తించిరి
కేరుచుఁ గేకులు కుందూకము లటు
  వన్నెల చీరల నెన్ను కొనిన పలు
వన్నెలలో నిప్పించె వధూతతి
  కెన్ను కొనుదు శివ రే వది లేదన కిచ్చె
నతం డానాఁడు బహూకృతి

(14. సూరసాగరము, 648)

ద్విరదగతి రగడ :-

మందపల్లియదెల్ల మ్రొగ్రొగ్గి మ్రోఁగగా
  నందమయ వాద్యస్వనముల నొక్కుమ్మడిన్
పొంగె నందాంగనయుఁ బుత్రోత్సవ మహ త్త
  రంగము లినుండ కంతరంగమునఁ బొంగెత్త
ఆనందమగ్నమ్మొనా వంతపాద జన

మా నందగోపవిభు వాలింగనమ్ము గొన
నలిని గోపీచందనమునఁ దిలకము లుంచి
నలువు గుత్తెపురైక నలువొప్ప దగిడుంచి
చెంగావి రంగారు చీరలం దొడుగుకొని
శృంగారవతులెల్ల సింగార మలముకొని
ఆ నందనిలయమున కావైెద షలరేఁ జని
యానందకందుఁడో నా నందు కందుఁ గని
మంగళంబులఁబాడి మంగళారతు లిడిరి
శిష్టరక్షణ దుష్టశిక్షణారంభుఁ డయి
యిష్టజన తుష్టికయి యిటుగోపడింభుఁడయి
భూరిపరమానందమును గోపకుల కిడఁగ
సూరదాసాశ్రయుఁడు క్షోణిస్థలికి దిగఁగ
వందలైవచ్చి దీవనలిచ్చి రెద మెచ్చి
వందిమాగధ భిక్షువార మాశిషు మెచ్చి
నందగోపుఁడు నాఁడొనర్చు సత్కారముల
నందుకొని రెలిమి మిన్నదతెఁ గైవారముల
కాళింది యుప్పొంగి గట్టు లొరయుచుఁ బొళ్ళె
వాలాయ మాలకుం బాలు కేపులువారె
నవజీవసోత్సుకమ్మునను క్రమోత్సు నవలెత్తె
యువులు మొగ్గలు దొడిగి పూపొదలు శేకెత్తె
సురలు పుష్పకమెక్కి మురళిధిఁ గ్రిక్కిరిసి
విరిసోనలం గురిసి వేడ్క నెనసిరి మురిసి.

(16. సూరసాగరము 636)

ద్విరదగతి రగడ :—

నందవాడను నందమందిరం బానాఁడు
వందనోత్సవ మహానందమున నోలాడు
ఆ మందలోఁ బుట్టె మాధవుఁడు మా పున్నె

మేమందుమని గోపబృంద ముబ్బెను మున్నె
సమ్మార్జన మొనర్చెఁ జని యష్టసిద్ధులు
గుమ్మాల నిలిచి యొనగూర్చె సంసిద్ధులు
వివిధపల్లవ చిత్ర విన్యాస మగుపట్టు
నవనిధుల్ ద్వారబంధముల ముగ్గులు పెట్టి
ఆ మందఁగల మందయాన లందువఁ జొచ్చి
శ్రీమహాదేవి విశ్వసి మాలలఁ గ్రుచ్చి
బూలతోరణములను బోలుపారగాఁ గట్టి
మాలినిగఁ బొదకట్టి మహిమంబు నాకట్టి
బంగారు పళ్ళెములఁ బట్టి చంద్రాస్య లటు
మంగళారతులు దే మందవీధుల నొకటు
అరవిందములపై సుధాకరు లుపస్థించి
యరుదెంచి రనిపించె నసుదారుఁ లయనించి
ఆనందవాహినుల టాయంగనలు పొంగి
యానందనిలయాట్టి నైక్యమందిరి పొంగి
నందుఁ డానందకందళితమౌ హృదయార
విందమ్మునన్ విప్రబృందమ్ము లలరార
రత్నగిరి సప్తకము రవణ బంగరుపూల
నూత్నాంబరము లిన్ముఁలు వేల్ మొదవులను
ఈవిగిడ్డుల యీవి నీవి గాదనిపించు
కోవఁ బుట్టిన వానిఁ గొసరక సమర్పించు
అర్థిజనమిఁక నొకని నర్థింపకుండ సక
లార్థంబులిడు నభీష్టార్థంబు లింపెసఁగ
అభీరసుతులు నాఁ డాజి విజయోన్మత్తు
లౌ భటులవలె దిరిగి రద్దులే కెద్దురెత్తి
భవనాగ్రముల వెలుఁగు పసిఁడి కుండల నిగలు

దవ్వులందగులు సభద్ర తమసముల నెవ్వగల
స్రేఁతలపు రేవెలుఁగు వ్రేతలకు మదివెలుఁగు
నా తలపులో మెలుగు నందాగణము వెలుగు
చీకాకు చీకటుల జీకొట్టు వేవెలుఁగు
లోకాల కవ్వలి వెలుఁగు మందలో వెలుఁగు
పారమెఱుఁగక శ్రుతులపొరుఁదనగా నెనఁగు
దీటి మట్టాకుపయిఁ దేరిపండెడు నినుఁగు
గోపమ్మ పసినిమఁగు కోటిదీప్తుల నెనఁగు
పాపములఁ గసిమసగి పాపి తన ప్రాపొనఁగు
సూపులానందసుధ జూఱకొనఁ గొల్లగా
సూరదాసాశ్రయుఁడు జొత్తెంచె గొల్లగా.

(20. సూరసాగరము 66)

## జోలికోత్సవము

శా॥ పట్టిన్ మేల్ రతనాలతొట్టిఁ బవళింపంబెట్టి గోపమ్మ జో
కొట్టున్ జోలలు బాడు నూచు నిను మాకుట్టిం డిదే పిల్చు జో
కొట్టన్ రావె పరుంకఁబెట్టి వెనఁ గూర్కుం బుచ్చవే నిద్ర! మా
పట్టిం జేరగవచ్చియుంచు నిటు లాహ్వానించుఁ దా నిద్దురన్.

మ. సకురాంద్రన్ సదిసేయకుండుఁడని తన్సన్నవ్ నివారించు నం
దకుమారుండిదె కన్నుమూసెననీ నిద్రాదేవి మాబిడ్డ చెం
తకు రావా కనుదోయిమూసి సుఖనిద్రం దూర జోకొట్టవా
యొకమాఱంచును జోలపాడుచును దా నుయ్యాల నూచున్ శిశున్.

చ. ఒకపరి జోలబాడును మఱొక్కపరిం గనుమూసె నింక న
ర్భకుఁడని మౌనమూను మధురస్వర మాపినయంతఁ బాప్డున్
మొకమటు లెత్తిచూడఁ దమి ముద్దుగొనున్ వ్రజభామిని యట్టులా
తుక పన కేశ్వరాదులకుఁ దొప్పడరాని సుఖాస్సుఖస్థితోన్.

(22 సూరసాగరము 668)

శా॥ పట్టుంబట్టి భవాబ్జ సంభవముఖుల్ బర్హిర్ముఖుల్ యోగులున్
బట్టన్‌రాని మహాప్రభావు నభవున్ భాగ్యంబు లీడేరఁ జే
పట్టెం బట్టిగ నందభామ"యని యర్బంబంది చూడన్ సురల్
పట్టిందొట్టెఁ బరుండఁ బెట్టి నతి జోలంబాడు జోకొట్టుచున్.

(24 సూరసాగరము 665)

ద్విరదగతి రగడ :-

ఊగుచుర నా తండ్రి! ఉయ్యాల నూఁగుమర
తూఁగుమర రతనాల తొట్టిలోఁదూఁగుమర
లక్షనడుగ మఱొండు లక్షముద్ర లోనంగ
దీక్షఁదొట్టి నమర్చి తెచ్చెరా వడ్రంగి
రతనాల నతికించిరచి యించి తెచ్చెరా
రతనాలకెత్తెత్తు ప్రతియనన్ వచ్చురా.
అచ్చుపడఁ బనితనం బచ్చెరువు గొల్పగను
బచ్చరా తోరణాల్ పచ్చరా జిలుకలను
రవల దాపునుఁ బట్టుత్రాళ్ళ ప్రేలం గట్టి
వివిధ శృంగారముల బేర్చి కట్టెను దొట్టి
తూఁగాడు మాబాబు తూగుటుయ్యాల యొడి
నూగాడు కేరింత నుప్పొంగి తండ్రియొడి
లాలిఁబెట్టి పరుండ లాలించి జోకొట్టి
జోలఁబాడుదు రూపి సుదతు లిదె యూకొట్టు
మురువు ముచ్చటఁగొలిపి ముద్దు లొలికించురా
మురిసి నీ మో మెవరు ముద్దాడకుంద్రురా!
అని పట్టి రవల యుయ్యాలఁ బవళింపఁగా
ననిచి గోపికయూపు నొడలు పులకింపఁగా

## గోపికలు తపశ్చర్యము దపస్సు భాగ్యమునకు యశోద నభివందించుట

(25 సూరసాగరము 678)

ద్విరదగతి రగడ :-

గోపాంగనాభరణు గోపాలు నెత్తుకొన
  గోపాంగన యొకర్తు గోపాంగనామణిని
కోరివేఁడి యశోద కోరికల పెనుపరటు
  శ్రీరమారమణి నోచిన నోములకుఁ బంటు
ఆ వంటిపాప నక్కంటుఁగాఁ దీసికొను
  వాచామగోచరుని బట్టి తలపోసికొను
ఇందీవరశ్యాముఁ డిం దీవరస నంద
  మందిరము మెట్టు సుఖమందితంబై మంద
ఒనగూడి భద్రంబు లొదవె సర్వార్థంబు
  లనుచు నీ పరమార్థ మరసి తత్త్వార్థంబు
పసలీను పసికూన పాలబుగ్గల మిసలు
  మిసలీను చిఱునోసలు మెయిచాయ మిసమిసలు
కెందామరల కెంపుఁ గ్రిందువఱచెడు మోవి
  చందంబు గనుముక్కు సౌరు చూపుల ఠీవి
తరుణారుణాంబుజాత ద్యుతులఁ బురణించు
  నరుణ చరణద్యుతుల నపురూప మనిపించు
అపురూపు సిసురూప మయుత చంద్రార్కాభ
  నపహసించు హసించు నాడనౌనె మహాభ
విగలీను కౌస్తుభ మణిద్యుతుల దిగదుడువ
  దగును శతకోటి కందర్ప తేజము వడువు
మురియ గనుచుచ్చటను ముజ్జగమ్ములవారి
  నరిదిగొల్పు మనోహరాకారుఁ డాశౌరి

తొలిచదువు లాకట్టి తుదమొదలు గనుపట్టు
వలనుగానట్టి యవ్వలి మెట్టునాకెట్టి
శ్రుతిపిండితార్థంబు శుకనారదాదులగు
సుతపోవరిష్ఠులకు జూపట్టు పెనువెలుఁగు
గోపికా ప్రాణధన కూటంబు తానయ్యె
పాపసుల కేడ్గడలు తావలము దానయ్యె
సూరదాసుడు నమ్ము సుకృతి సంతానమ్ము
సూఱకొంటికదమ్మ సుతునిగ యశోదమ్మ!
అని బిడ్డ నడ్డాల నడుముకొని యీ తరుస
వినుతించె గోపమ్మ బిడ్డ కలరూ పరసి.

(27-28-29 సూరసాగరము 674-681-682)

ఉ॥ తొట్టిఁ బరుండఁ బెట్టి హరిఁదోయజనాభుని జోలపాడి జో
కొట్టి యశోదలోఁ దలఁపు గూరఁగఁ బూతనగండ వార్త యా
పెట్టున బ్రొక్కువెట్టు నిలువేల్పును మా కులసామి వాడు వే
పట్టున మాకులాంకురముఁ బ్రాపిడి బ్రోపిడి కావు మోవిభూ!

ఉ పట్టెద నీపదంబు గనుపట్టఁగ రాదఁట నీమహత్త్వమె
ప్పట్టున వింటినే భువనపావన! నాకనువిందుఁ గూర్ప మా
పట్టి నిరంతరానాభ్యుదయ వైభవ మంది ప్రవర్ధమానుఁడౌ
నట్టు బిరానఁ బెంపవె! దయన్ శిశుగండములెల్ల బాపుచున్.

ఉ॥ దట్టపు బాలగండముల దట్టుక యన్నెల బాలులీల మా
చిట్టివరాలతండ్రి యొకచేతును బాటు నెఱుంగకుండఁగా
నట్టిసుఖాన పెద్దయగు నట్లెదిగింపు బిరాన చెట్టఁ బోఁ
బెట్టుచు మందలో నడుగు వెట్టఁగనీయకు చెట్టలెవ్వరే
చెట్టదలంచి వచ్చినను జెచ్చెరఁ జీల్పుము పూతనం బలెన్.

క॥ మాయలు ముట్టడివేసెదు
మాయల మారులను దఱిమి మందఁజొఱంగా
నీయకుమా! యిలవేలుప!
నీ యడుగులఁ గొల్తునంచు నెలఁతుక వేఁడెన్!

## బాల ముకుందమూర్తి వటపత్రశాయి రూప వర్ణనము

తే॥ హరి శిశుక్రీడ నొకపు డూయలఁ బండి
కేల దాకాలి బొట్టనవ్రేలు బట్టి
మోము దామర నిడుకొని మురియుచుండె
నడుగు దామరతేనెపై నాసనేమొ!

సీ॥ ఇందిరాదేవి హృన్మందిరంబున నిల్పి
విడనోపని పదారవిందరసము
అమల చిత్తేందిందిరములఁ జొన్పి భవాదు
లందుకొన్న పదారవిందరసము
జోగు లెడల నిల్పి జోకొట్టి యాఁకట్టి
విడనొల్లని పదారవిందరసము
వేల్పు లువ్విళ్ళూరి వేడ్కపడి పడయ
వీల్పడని పదారవిందరసము

తే॥ డెంత మధుర మెంతటి రుచిమంత మెంత
దుర్లభమని హరి నిజాంఘ్రి తోయజ రస
మనుభవింపనేమొ పదారవింద
మందుకొనిక్రోలె సుముఖారవిందుఁడనను.

తే॥ లోకముల మంటఁగొలిపి యాలోకనమున
మన్ను మిన్నును మున్నెటిపుడు మొనర్చి

గుజ్జు బొజ్జను నిడుకొని ముజ్జగముల
నిలువ జొకొట్టి తా నంగనాచి వోలె.

తే॥ కాలుపైఁ గాలునిడి లయకాలవేళ
నొంటి పెనుమఱ్ఱియాకున నొదిగిపండి
కేల నందుక డాకాలిబ్రేలు గుడుచు
నాటి బాల ముకుందు చందంబు నరసి.

క॥ వటుపత్రశాయి యగు న
ప్పట్టి బాలముకుందమూర్తి భంగిమఁగనిలో
నటువటుపాత్రై రమరులు
దిట వేది యుగాంతవేళ దెప్పరిలె ననన్.

సీ॥ కమల సంభవుఁడు కింక ర్తవ్యతామూఢ
చిత్తుఁడయ్యె హరుండు దత్తరపడె
బిత్తరవోయెను వేల్పుమొత్తమ్మెల్ల
నుత్తలపాటొందె యోగిగణము
ఉప్పొంగె మున్నీరు నూగాడెఁ గుధరముల్
దిక్కరుల్ తొట్రిల్లె స్థిరయు వడఁకె
బుసకొట్టె వేమొగంబుల శేషభూధరుం
డాదికూర్మంబు వెన్నవిసి యలసె

తే॥ ప్రళయకాలాభ్ర మభ్రమ్ము గ్రమ్మి యురిమె
రాలెఁ బిడుగులు చుక్కలు నేలఁగూలె
క్షణములోఁ బుట్టి పెరిగె నక్షయవటంబు
నాటి వటపత్ర శయన విన్యాస మరసి.

తే॥ నాఁ డకాల కల్పాంత తాండవ మదట్లు
త్రిభువనమ్ముల సాగియు త్రేఁతలమ్ము

సోకదయ్యెను భువన సంక్షోభ మయ్యు
దరసి కరుణించి హరి యప్పు డడుగు పీడెఁ
గుదురుకొనె విశ్వశాంతి నల్గడలయందు

## యశోద కృష్ణుని శైశవ క్రీడలకు మురిసి ముచ్చటపడుట

(88 సూరసాగరము 687)

ద్విరదగతి రగడ :-

అలనాడు వ్రేపల్లె నడుగడుగు నలముకొని
నెలమి ముజ్జగము లెపు డెఱుఁగఁబోవయ్యె మును
చెలిమి నవనిధు లష్ట సిద్ధులును గుమ్మతుల
నిలిచి కేల్గవ మొగిచి నెఱపెఁ గైంకర్యముల
పరమేష్ఠిముఖ దేవ పరమహాంసలకేని
పరమదుర్లభుఁ డైన పరమాత్ముఁ డొడ లూని
అమ్మహాభాగ్య గోపమ్మ యొడిలో వెలసె
సమ్మాన్య యని శ్రుతుల్ సాక్ష్యమిచ్చెను గలిసి
సూరదాన శ్యామ సుందరునిగఁ గందు వని
సూఱకొనె నాయమ్మ సుకృత మేమందు మని.

(89, సూరసాగరము 688)

ద్విరదగతి రగడ :-

నా చిన్ని కృష్ణయ్య! నను గన్న కన్నయ్య
యీ చిన్నె లేఁ జూడ నేమి నోచితి నయ్య!
ఏనాటి తొలినోము లీవాఁడు పండెనో
ఏనాటి పున్నెంబు లీడేరి నిండెనో
చిన్నారి నగుమోము చిలుక పలుకులు బాలికి
నన్నెప్పు డలరించు నరిమిలివి ముద్దొలికి
చిన్ని మోమున ముద్దుచిలుక వినువిందుగా
నన్నమ్మయంచు నేనాఁడు పిల్వఁగ విందు

నను నమ్మయని పిల్వ ననదేనె చిందునో
వినువిందుగా నెపుడు వినిపించుకొందునో
అన్న బలరామన్న ననుబొప్ప నేనాఁడు
కన్నయ్యఁ గూడి నా కనుల ముంగిటు నాడు
ఆడు నేనాఁడు దోగాడు నడయాడునో
వేడుకలు దీరఁ గనువిందు లొదగూడునో
క్రన్నసం బెరిగి నా కన్నఁ డేనాఁడు నా
కన్నకల నిక్కలుగ గావించి యాడునో
అటులకు మరఁగి కడు పాఁకొన్న కన్నెలుఁగ
కాటతమి మొరఁగి య ల్లంటుకుండఁగ దిరుగ
గన్నకడు పాఁకొన్న కన్నెతిఁగి మనసార
నెన్నండు పిల్చి పాలిత్తునో నెనరార
అని తలఁచి బ్రహ్మము భాగ్యలభ్య దర్శనుని
దనయునిగ మది యశోదాదేవి తలఁచుకొని
వెన్నుఁ డెన్నఁడు పెరిగి పెద్దయై కనుపండు
వు న్నెఅపు నెపుడంచు ముచ్చటుం బడుచుండు.

(40 సూరసాగరము 69)

ఉ॥ ముద్దులు మూటగట్టఁగల ముర్వులు గొల్పెడు తేనెలొల్కు లే
సుద్దుల బిడ్డఁడమ్మ యనుచున్ నను ధైటచెలంగు ఇట్టి యే
పొద్దును గాళ్ళ కడ్డమయి పోరిడి గారమువట్టు నెన్నఁ డే
పొద్దున నయ్యయన్న పిలుపున్ వినువిందుగ విందునో కదా!

సీ॥ ముద్దులొల్కెడు చిల్కసుద్దులన్ మా ముద్దు
బిడ్డఁడెన్నఁడు మురిపించు నన్ను
పాలపండ్లు మిసలఁ బాపఁడు కిలకిలా
నగుచుఁ గేరింత లేనాటి కాదు

మోకాళ్ళఁ బ్రాకి నన్ మురిపించు నేనాఁడు
విద్దె మెన్నఁడు నలిపి ముద్దుగొలుపు
చేసేత మెతుకులు సేకొని చిన్నారి
మోమున నిడుకొని మురియు నెప్పు

తే॥ డనుచు నువ్విళ్ళుగొనుచు గోపమ్మ లోని
కేగ నెడ నొక్క సుడిగాలి రేఁగి యందు
భూనభంబులు మార్మ్రోగి బొబ్బరిల్లు
నట్టి ధ్వనిపుట్టి భయపెట్టె నాలపట్టు.

## తృణావర్తుని అగడము

(41 సూరసాగరము 699)

విజయమంగళ రగడ :-

కాలనేమి యంశమునను గాలరూపుఁ డనఁ బొడమిన
కంసశిశువుజిఘాంసు వంపఁ గసిమసంగఁ బసినిసుఁగులఁ
గూళ రక్కసిఁ డొకండు గోకులమ్ముఁ జొరఁబడి నలు
కోనల సుడిగాలి మిసమ గుతిలపెట్టె సిసులఁ బసుల
కన్నుకన్ను గానకుండఁ గనుల దుమ్ముగ్రమ్మ వాడు
కలఁచి ఎచటివారి నచటఁ గదలకుండఁ గాసిపఱచి
వెన్ను నెత్తుకొని యశోద వ్రేగుఁజూప నేల డింపి
వేఱొక పని కరుగునంత వెంబడిఁ బఱతెంచి యఱచి
పాప నెగురఁగొట్టుక చనె పాప మనక గగనమునకుఁ
బాపపు సుడిగాలి మిసను బాపి కంసభటుఁడు పొంచి
గోపదేవి దద్దరిల్లి కూళగాలియూపు కన్న
కూన నేమి చేసెనో యని కొందలపడి పరుగుడెంచి
ముంగిటి కరుదెంచి చూచి ముద్దుపాప జాడఁ గనక
పుత్రమోహ వివశ యగుచు మురిపెమారఁ బేరుకొనుచు

ముంగిటఁ బవళించు సీసును మోసగించి సుడిఁ గొనిచనె
మోసపు సుడిగాలి కన్ను మొరఁగి యేమి సేతు ననుచు
నందరాజ! పరిపిరావె! నందనుఁ గొనిపోయె గాలి
సాలిముచ్చ సోకమునకు సాకు దారి యే దిఁక మన
నెరదుఁ జొత్తు నేది తెరువు రూ పసినిసు నెరదు బాసి
యేల వచ్చె మాయగాలి, యెగసి బిడ్డ నెత్తుక చన
అనుచు బుత్రమోహ వివశ యవుచుఁ దల్లి తల్లడిల్లు
నంత బాలకృష్ణుఁ డసుర కాపిరాని ప్రేఁగు దోచి
కనుల నిప్పులురలఁ గ్రక్కి గళమునొక్కి నెల్లగ్రక్కి
గరినశిలను శిరము వ్రయ్యఁగొ భువిఁ బడఁగఁ ద్రోచి
కొండవంటి రక్కసిని గుండెపైనె గూరుచుండె
కొండొకింత యలయకుండఁ గుండలింద్రశాయి డిగిన
గుండె కద్దుకొనిరి నందగోపకుండు సతియును సుది
గుండపు గరువలి పిశాచి గుండె నొడుకొను శిశువును
గండుగాలి గండ మేది గడ్డఁగడచె బిడ్డఁ డంచు
గౌఁగిలిగొని ముద్దులాడి కొన్కలిడిరి వ్రేత లలమి
దండి రక్కసిని జెండి తనిపి మనిపి గోకులమును
దక్కె మనకుఁ బ్రాణధనము దైవకృపకు నతురొచు నెలమి
మందవాడ పున్నెమునను మనకుఁ దక్కె మాధవుఁ డిటు
మహిఁబడి మిను గూలినట్లు, మనసిజ సుకుమారతనుఁడు
సుందర శిశుమూర్తి కేమిసోకు సోఁకెనో యటుంచు
సుదతులు దిగదుడుపు లిడిరి శుభముఁ బాడి హారతులిడి
పేద కబ్బు పెన్నిదివలె వ్రేఁతల కపురూపమైన
బిడ్డ నొరటి డించి యిరిదు, వెలితిపనుల కెట్టు పోతి
గాదిలిసుతు గాచుకొంటకరిడె యింటిపని ఘనంబె!
గడ్డు గడచెఁగాక బిడ్డ కాఁగల గతిఁ గానవైతి

అని యశోద మంద లించి యల్ల మందవాడ మంద
యాన లంద తీఁడ్లకరిగి, ధరుదుభిసుదు నెన్ను కొనుచు
ననుఁగునిసుఁగు వాటినుండి యరగడి నొదిఁఖాయకుండ
నా యశోద రేయుబవలు నరసె వేయికన్నులఁ గనుచు
బుడతఁ డుడుపథమున కెగసి పొడవడంచి గాలిసోఁకుఁ
బుడమిఁగూల్చి మనెను, దొంటిపున్నె మాదుకొనినకతన
కడుపుచిచ్చు గూరకుండఁ గనులు చల్లవడఁగ మగుడఁ
గన్నకాన్పుఁ గన్నులారఁ గంటి, దొంటినోముకతన
అనుచు సూరిధానవరదు, నల్ల గొల్లచెబుల యెడల
నలమికొనుచు మఱపురాని యరుదుబిరుదు ననుచునిసుఁగు
అనుఁగుమీఱ నొక్కసారి యక్కుఁగొను మఱొక్కసారి
యంకమందు నిడి యొకట నుయాలఁబెట్టి పెంచియెసఁగు
అనయ మే సుఖాశఁజేసి యిఁటికేశు లతులయోగ
యమనియమ తపోవ్రతముల నలసికాని కానరారో
యనుఁగుబిడ్డగాఁ గడించి యా శుభాస్పదున్ యశోద
యందె నమరదుర్లభంబులౌ సుఖంబు లిచ్చమీఱ.

—0—

## యశోద శిశుముఖమున విశ్వసందర్శనముచేయుట

(41, 42, 43 సూరసాగరము 699 to 701)

ద్విరదగతి రగడ :-

అమ్మయిని గేరింతలాడు న్నా కృష్ణమ్మ
నమ్మ పఱువిడివచ్చి యాత్రమ్ము లోఁ గన్న
ముమ్మరపు మక్కువను ముద్దుఁగొను నక్కుఁగొను
నమ్మ నోచిననోము లన్ని నెఱవేఱుపను
కట్టు సుడిగాలిరాకాసి గండమునుండి

యెట్టు బ్రతికితో తండ్రి యిలు నిల్పఁగానుండి
ఏనాటి తొలిపున్నె మీనాటి కాదుకొని
యీనీచు నణఁచెనో యీగండ మడ్డుకొని
మున్ను పూతన పన్ను మోసమే పన్నుకొని
బన్నవడె నసుర మన ప్రాక్పుణ్య మాదుకొన
అనుచు నాత్రముతోడ నారటుంపడు నమ్మఁ
గని పొలపలు నిగలు గాన నగెఁ గృష్ణమ్మ
కిలకిలా నగుచుండ గెమ్మోవి నిగనిగలు
గులుకెఁ గెందమ్మిరేకుల మెఱయు మెఱపువలె
కేరింతలాడుచుం గిలకిలా నగువ్రజ కి
శోరుఁ గనువిందుగాఁ జూడుమని యొడయనిఁ
పిలుపువెట్టగ మందపెద్ద నందయి వచ్చి
తిలకించి త ద్దివ్యదీధితుల మతిమెచ్చి
ఆమెయిన్ గేరింతలాడుచును హరి సూప
మోము దామరఁ దెఱచి ముజ్జగము లోఁ తేప
చిన్నారి మోమునం జెన్నారు లోకములఁ
విన్నాణమున కమ్మ వింతవడి యీ కనుల
కలఁ గాంచుచుంటినో, కలగాక నిక్కలయొ
కలరూపొ భ్రాంతియో కందు మొగమ్మున వెలయు
బ్రహ్మసృష్టి యదెల్ల బమ్మెరం గొల్పనని
బ్రహ్మమయు నెప్పటిగఁ భావగా వేడుకొన
ముద్దుమురిపెము లొలుకు మురిపెంపు బిడ్డఁడయి
సొద్దెపఱచెను హరి యశోదమ్మ నింపుమెయి
బిడ్డమోమున బొడ్డువిరిచూలి గ్రుడ్డుగమి
విడ్డూరముగ జూచె వేడబమొ నిక్కువమొ
భూతమే సోకెనో పొదవెనో సోఁకుడే

యే తాంత్రికకృతంబొ యీలీల్ల పోకడకు
హేతు వేమని బిడ్డ నింటింటికిం ద్రిప్పి
బీతువాఱుఁగ భూతివెట్టించె నెనరొప్ప
అలమంద పెద్ద ముత్తైదువుల కెరగించి
తల్లి నఖయుహస్తమ్ములఁ దడుము దీవింపించె,
కట్టెఁ బులిగోరుషతకంబుఁ బాపని కతుక
గట్టించె దాయెత్తు ఘనమాంత్రికుల వెతకి
జగదవనదక్షు హస్తమ్మున రక్షనుగట్టి
దిగదుడిచె నప్పురాల్, దృగ్దోష మెడపట్టు,
అంగరక్షను సలుపు నాయమ్మ సృష్టి స
ర్వాంగ రక్షకుఁడైన యా జగత్స్రష్టకును
సూరివరులకె సూరసుందరుని లీల లెఱి
సూఱకొనరానివో, యశోద గనఁజాలె నవి॥

## శ్రీకృష్ణ లీలామహిమాభివర్ణనము

(65 సూరసాగరము 748, 745)

శ. తప్పటడుగు లిడ నేరిచి
యప్పసి కన్నప్ప గడప యద్దువడఁగా
గొప్పన జోకాలిపడం
జొప్పడి బలరాముఁ డతని జోద్యపడు నిటుల్.

సీ॥ మీనై కడలిఁజొచ్చి మినుకుముచ్చును ద్రచ్చి
నలువకు శ్రుతులిచ్చు వాటిబల్లము
సురలబ్ధి ద్రచ్చ ధరించు కపోవు గిరిని ధా
బెటి రూపున మోచు వాటి బలము

పంటువలెఁ దిఁ గోఁ జపంటఁ బూబంతిగా
మీఁటు వరాహమౌ నాటిబలము
గోరుకత్తుల వైరిఁ జీరిచి నృహరివై
నతభక్తుఁ గాంచిన నాటిబలము

తే. గుజ్జువై ముజ్జగము లరిగొన్న బలము
నవనిపుల నోంచి యవని బ్రహ్మార్పణం బొ
నర్చనీ తొంటిబల మెం దణఁగెనయ్య!
కడపదాఁటఁగ బోకారపడెద విభులు.

తే. చాల్పుతల రక్కసిని బ్రచ్చి శరణు జొచ్చు
లాఁతిఁ బ్రోచిననాటి బలమ్ముఁ బుడమి
పాటు లాలించి బ్రేఁగు డింపం దలంచు
నాటిబల మేది? గడపనే దాఁటలేవ?

(68 సూరసాగరము 746)

సీ. బొడ్డు దామర బ్రహ్మఁ బుట్టించు వాఁడిద్దె
బొడ్డుఁ గోపిక గొల్లపోలఁతు లెలమి
ముజ్జగమ్ముల జొల్లఁ బూను బొజ్జాయని
జేటుసెజ్జఁ బరుండఁజేసి తోరట
మురిసి ముచ్చటగూరు ముక్కంటి తోఁగంటి
కానని మోము ముద్దాడె నమ్మ
అల రోమకూపి బ్రహ్మాండ పంక్తులు ప్రేలు
విశ్వరూపుఁ బరుండఁబెట్టె దొట్టె
సిరిగరుడుల యూఁపు మఱపించు నవనతను
య్యాలలూఁచు చెలి నమ్మ జోలపాట.

తే. నసురులం జీరి చెండాడు నిసుబుజంబు
లూని విద్దెంబు నేయుంతు రువిదలెల్ల

యోగనిష్ఠల కందని యోగిదుర్ల
భుండు పసికందువై మందపాలమునఁ దిరుగ.

(69. సూరసాగరము 747 - 748)

తురగవల్గన రగడ :-

పుడమియెల్ల నడుగుమేర పూడ్చకుండ భోదవెదిగిన
బుడుత నమ్మ పట్టి నడుపు బుడమి నడుగులిడి నడవను
కాలకోటి భీకరుం డఖండతేజుఁడైన బాలుఁ
గేలబెత్తమూవితల్లి కినిసి బీతుఁగొల్పుజాలు
పేరు బేరుకొన్న మాత్రఁ బేరుకొన్న భ్రమము లణఁచు
భూరి మహిమునకు దిగదుడుపు లిడు జ్ఞాపుసోఁకె ననుచు
తొలిపలుకుల కొనలె మొదలుడుద లెఱుగని మొదలివేల్పు
చిలువతాల్పు తలపువేల్పుఁ జిలుకపలుకు లాడ నేర్పు

ద్విరదగతి రగడ :-

ఆనంద ముప్పొంగ నానంద నిల్లాలు
ఆనందకందు డా యప్పురూపపు బాలు
నాడించుఁ గేరింత లాడఁగా నొడిఁబూని
పాడు బాటల రాగ భావయుక్తముగాను
సుకపుసంభ్రమము తలముఁ జూఱగొన మదిఁ గోరి
యొక మా అనునయించు నొడిఁబూని యొకసారి
చప్పటల్ చఱచి కేల్, సాఋంబు నందించుఁ
దప్పించి చిఱుగడప దాఁటు నభినందించు
విద్దెముల్ నేర్పించు వ్రేల్పూఁత నడిపించు
ముద్దుపాపని బట్టి ముందడుగు వేయుతఁ
లాలిఁబెట్టి పరుండ లాలించు నొకసారి
జోలపాటలు పాడి జోకొట్టు నొకసారి
బ్రహ్మర్షి దేవర్షి వరుల కబ్బనివాఁడు
బ్రహ్మాదులనె బ్రమ్మెరం బుచ్చఁగల్గువాఁడు

ఆ యనంత మహిముండా యశోదమ్మ కడు
 నేయంపు బిడ్డడై నెఱపఁ గనుపండువటు
అచ్చెలువుఁ గని రా విలుచ్చరులు నచ్చరలు
 అచ్చెరువువడి విమానారూఢులై తరలి
సూరదాస శ్యామసుందరుని జూపులను
 జూఱగొనఁగోరి రథచోదనం బాపుకొని
కాలగతి మతిమఱచి కదలఁడయ్యెను ప్రొద్దు
 వేలు పల ప్రేతలపు వినువీధి నాప్రొద్దు,

(71. సూరసాగరము 749)

తే. చిఱుగడప దాఁటు బోకారు చిన్నికృష్ణు
 మాత కరపల్లవమ్ము పెన్నూఁత మొసఁగి
 యెలమి దాఁటింప భక్తవత్సలుఁ డతండు
 శైశవ వినోద లీలల జననిఁ దనిపె

సీ. ముప్పోకవాకను బుట్టించి జగములఁ
 బావన మొనరించు పాదతలము
 అడిగిన పుడమిలో నడుగు లొచ్చ నిపించి
 బలి నడుగున మట్టు పాదతలము,
 సృష్ట్యంతశరులనేఁ జిక్కులఁ జొక్కించి
 బమ్మెరఁ బోఁబుచ్చు పాదతలము
 వేవే వెలుంగుల వేరే వెలుంగుల
 ప్రభలీను నఖమణి భాసురంబు

తే. కాంక్షమై సూరదాసు కైంకర్యమందు
 పాదతల మది పుడమిపై నూఁదనేర్చి
 అమ్మ కేలూని చిన్నికృష్ణమ్మ నడిచెఁ
 గాలి చిఱుమువ్వ గజ్జెలు ఘల్లనంగ.

## ఒక గోపకాంత తన దివ్యానుభూతిని వర్ణించుట

(74 సూరసాగరము 7౬౮)

ద్విరదగతి రగడ ::

నందనందనుఁ డెలమి నంద్వాంగణము నేలిమి
చిందులాడెడు చెలువు చిత్తంబులో నలమి
తాను భ్రాంతాత్మయై తాదాత్మ్యముగొనిన
మానితోదంత మొక మానవతి వాకొనెను
కనులారఁ దిలకింపఁగా నొడల్ బులకింప
మనసుఁ బులకింపఁ బ్రేమమ్ము మైమఱపింప
కన్ను నిం గ్రన్ననం గన్నుల దువారంపు
తెన్ను నర దెచ్చి హృత్పీఠి నింపు రహింప
వెలవిచ్చి కూర్చుండ నెలకొల్పి కనుఱెప్ప
తలుపులను మూసి బంధమున నిడఁ గృష్ణప్ప
కప్పు మైచాయ ననుఁ గప్పుకొని నల్లొనల
కప్పు శార కార్కొన్న కరణిఁ దోఁచెను గనుల
నల్లవాఁ డల్లుకొన్నను తెల్లబడె నుల్ల
మల్ల జగముల నెల్ల నల్లుకొన్నను నల్ల
అట్టె యీనల్లవే ల్పల్లుకొని నలుతట్టు
లెట్టు వెలిగించె నా యెడఁద చీకటికొట్టు
సూరవిభుఁ బ్రాకృత శిశుస్వరూపుగఁ గంటి
మేరుగిరి గురువింద మీరగాఁ గనుఁగొంటి
నీటిబొట్టొండు మున్నీట లీనంబయిన
పాటిగా నాయాత్మ పరమాత్మ భాతమున
లీలమై గుణరూప లీలావిభేదముల
లోనగు నవెల్ల గోల్పోయి యద్వైతముల
మొలక నిముడునొ విత్తు మొలకెత్తునో విత్తు

మొలక విత్తులపుట్టుమొదటెఱుంగని యట్టు
కృష్ణపరమాత్మునం దే లీనమైతినో
కృష్ణుఁడే నాయాత్మ నెనసి లీనంబయెనో
ప్రత్యేకతం గోలుపడి యైక్యమై కాంతుఁ
బ్రత్యేకవస్తువునఁ బరమాత్ము శ్రీకాంతు.
కనవచ్చె గనువిచ్చి కన్నుఁగడ లన్నిఁటు
ఘన ఘనాఘననిభాకారుండె యేవెంట
స్థలజల నభస్థలులు శ్యామసుందరునిగతిఁ
బొలిచి చూపట్టుఁ గోల్పోతి లౌకికనియతి
పురజనుల గురుజనుల ముంగిటన్ గులసతులు
నెరపు లోకాచార నియతధర్మము వెడలి
స్త్రీజనసహజంబు లజ్జాగుణం బుడిగి పర
మాణువును హరిమయం బని కాంచుచున్నతటి
నన్నేదొ గ్రహమంటి నలఁచె ననుకొని త్రిప్పు
చున్నార లింటింటి కుపశాంతుల నొనర్ప
నా యత్త హరిచింతనాయత్త నన్నుగని
తాయెత్తుఁ గట్టించె దయ్యమెదొ సోఁకెనని.
మంత్రతం త్రౌషధుల మందుమ్రాకులు వెట్టి
యంత్రముల్ గట్టించి యఱుత రక్షనుగట్టి
జేజేలకున్ మ్రొక్కు చెల్లించి జపహోమ
పూజలన్ గ్రహశాంతిఁ బొనరించి కడుఁ బ్రేమ
అత్తరము బడుచుండి రత్తమామలు నాకుఁ
చిత్తభ్రమమొ యుంచుఁ జిత్తగతిఁ గనలేక
ఏమందు నమ్మ! నా కేమందు హితమందు
శ్రీమందిరుం డుండఁ జిత్తమందిరమందు
తద్రూప రసగుణ సుధాస్వాదనము ముందు

చిద్రుపలు బోలు సంస్కృతిరసము లనుకొందు
మాకందె నెడఁద సుషమాకందుఁడౌ కందు
వాకొందునే లౌకి కావ్యరసముల కెందు?
ప్రాపించి హరిరూప రససుధం జవిగొన్నఁ
బ్రాపంచిక రసానుభవము నొకఁ డీకొన్నె?

సీ॥ అందాలయింటు డాల్‌చిందెడి మణిదీప
దీప్తినాఁ జిలుపండ్లు దీప్తివెలయ
పెడదకన్నులఁ దమ్మివిరులంచు మూఁగిన
యళిరేఖ నా నొప్ప నంజనంబు
తొవఁదన్ను నిండువందురునట్లు చిన్నారి
మో మెసఁగ నిముడని మురువుగొలుప
చెవులు చిలుకపలుకు చవుల కువ్విళ్ళూర
గనుల నానందాశ్రుకణము లుబుక

తే. నందువాకిట నడయాడి చిందులాడు
నందనందనుఁ గన్గొన్న నాటినుండి
పత్తి విడినట్లు విడె భవబంధము లని
పల్కె స్వీయానుభవ మొక వ్రజపురంధ్రి.

(76 సూరసాగరము 756)

మధురగతి రగడ :-

ము న్నొనరుచు మనపున్నెము గలిమిని
చిన్నిబుడుతఁడై చెన్నారెను మన
మందపాలమునన్ మాధవుఁ డీగతి
నందయశోదా నందనుఁడై క్షితి
చెలువడ ముత్తెపుఁజిప్పను ఛత్రజము

మొలచినగతి మార్మూల వ్రజపురము
నెలపున నిటు హరినీల మణిద్యుతి
యొలుక నొదవె ముద్దొలుకఁగ నీగతి
పల్లెజనంబుల ప్రాణధనం బయి
యొల్లని పగతుర కొడిబల్లెం బయి
మందపాలంబున మన కని సతు లా
నందాంగనఁ గొనియాడిరి నుతులన్.
గోపమ్మరో! నీ కొమరుం డమరుం
డై పెరుగున్ వెన నన్న హలధరున్
గలసి మనోహర కామ్యక్రీడల
నలరించుత మ మ్మనయము వేడ్కలఁ
గలకాలము చుక్కలు నెలప్రొద్దును
గలకాలము మనుఁగావుత మంచును
వెన్ను నటుల్ దీవించి చిరాయుగఁ
గన్నఁ డెపుడు మోకాళ్ళను బ్రాకఁగ
గనుపండువుగాఁ గనుగొనువారమె
యని కన్ననిపై ఆశాపూరము
నిలిపి దులుపుచును నెమ్మెయి రజమును
దొలిచి సిసువు దృగ్దోషము లుడుగను
డిగదుడుచుచు నీ డింభకు సోఁకెడు
తెగులునొగులు మా దృక్కుల సోఁకెడు,
కర మరుదుగ శిశుగండము లీడుక
నిరపాయంబుగ నిసుఁ గెదిగెడు నిఁక
అని యిలవేల్పుల కంజలిఁ గూర్చుచుఁ
జనిరి వ్రజసతుల్ శౌరిం దలఁచుచు.

....o....

## శ్రీకృష్ణుని బాల్య క్రీడాభివర్ణనము

(69 సూరసాగరము 774)

ముత్యాల సరము

వెన్నుఁ డొకపరి వెన్నఁదించును
వెన్న మోమునఁ బులుముకొంచును
జిన్ని చేతుల వెన్న ముద్దల చెన్ను చెన్నారన్
కలకలా నగి గంతులిడుచును గడవలన్ దుముకాడు చోకయెడ
గలక దేరిన నీటఁ దటుకునఁ గాంచెఁ దననీడన్
నిండుకుండను నీడఁగని కసినెక్కవన్ బెఱవాఁ డెవండో
కుండ డాకొని యుండెనని లోఁగొంకు వాటిల్లన్
బిరబిరా పరువెత్తి నందుని బిల్చి బాబా! కంటివయ్యా!
వెఱవకుండఁగఁ గుండ డాకొని పిల్లవాఁ డెవఁడో
వెన్న ముచ్చయివచ్చి పొట్టంబెట్టుకొని నా వెన్న యంతయు
ఛిన్న భిన్నము చేసె నాతని చెయ్యుఁ గను మన్నన్,
జిలిపికృష్ణుని తేనెలొలికెడు చిలకపలుకులఁ జిత్త మలరన్
జెలిమి నెత్తుక నందగోపుఁడు చెంగుతో మొగమున్
తుడిచి యక్కున కద్దుకొని ముద్దులను గురియుచు నెత్తుకొని చని
దుడుకుపాపఁడు చూపు కడవను దొంగి కనుఁగొన్నన్
చంక నున్న బెడంగుసిసు వాజాడ నీసునఁ జూడనోపక
చంకఁజాటి గిరిక్కునం జని జననితో ననియెన్,
నందబా బొక తెక్కలీనిని నందనుండని యింటఁ జేరిచి
సందింటుంగొని ముద్దులాడుచు సరకుసేయఁడు నన్
అమ్మ! నే నీ బిడ్డనే కన్నయ్య కన్నడసేసె నను కృ
ష్ణమ్మ లీలావిభవ మారసి యా యశోదమయున్
జెలిమి బిడ్డను జంకనెత్తుక చెంతఁగల యా పూర్ణఘటమున
వలలు రేగఁగఁ జేత నూపుచు నల్లలాడింపన్

కలఁక నీటను నీడఁగానక, కలఁకతేరిన మొగముపై నగు
మొలక లీనఁగఁ గులుకు కృష్ణుని ముదిత ముద్దాడెన్
సూరదాసవిభుండు చూపెడు చోద్యలీలా తత్త్వవిభవము,
సూఱకొనఁదగు సూరివరులకె సొరిదిఁ జూపట్టున్.

(69. సూరసాగరము 747 - 748)

ద్విపద :

చిన్నికృష్ణుని జంకఁజేర్చి యశోద
వెన్నెల నిల్చి జాబిల్లిఁ జూపించు
ననుఁగన్నతండ్రి! మిన్నక యేడ్తు వేల
కనులు చల్లవడంగఁ గనుము జాబిల్లి
అని మఱపింపఁ గన్నయ్య చందురునిఁ
గనుచుఁ బైకురుకుచుఁ గరములన్ జాచి
కంటఁగన్గొంటకే కనుపండు వోచుఁ
గంటఁ బడ్డంతనే కడుపు నిండించె
తింట కెట్లుండునో తీయనో పులుపో
తింట కమ్మను పీని దెచ్చి యిమ్మందు
అని కన్నఁ డా యమ్మ నడిగె జాబిలిని
గొనితెచ్చి యీవె! యా కొంటినే మిగుల
దిందుఁ జందురు క్షుత్తుఁ దీరుచుకొందు
నందింపుమీ విందు నంది మిన్నంద
అని చందమామఁ దెమ్మని పోరువెట్టు
ననుఁగు బిడ్డని గని యా యశోదమ్మ
బేలనై బాబు జాబిల్లిఁ జూపించి
యేల యేడ్పించితి నెట్టు లూరార్తు
ననుచుఁ బిట్టలవంక నట్టిట్టు చూపి

మనసిజ మోహాను మఱపింపఁజూచు
బిడ్డ! బిందురుఁ గ్రుక్కఁబెట్టుకో నెంతు
విడ్డూర మిది కనివిని యెఱుంగుదుమె
మింటి జాబిలిఁ గాంచి మిన్నంటు వచ్చుఁ
దింటకుం గొంటకుం దినుబండ మౌనె
కనులపండు వౌనర్చు గనుపండు వౌచు
దినుబండ మౌనురా! తిందు వే నందు
ఉప్పరంబున నుండి యుడుగ కా వేల్పు
ముప్పొద్దులన్ వెన్నముద్ద లందించు
అట్టి చల్లని వేల్పు నారగింతేని
యెట్టు లబ్బుర! వెన్న యింక నీ కన్న
వేమాఱు విసిగింతు వెన్న మీగడల
కీమాఱు వెలదుండి యేఁ దెచ్చియిడుదు
అంద ఱాడుకొనెదు నాటుబొమ్మనె?
చందమామను బట్టి చవిఁగొందు నందు
బండ్లకొలఁదిగ నుండెఁ బాల్పెర్వు వెన్న
పండ్లు మిఠాయీలు బాయసాన్నములు
ఆరగింపర! మనపైనవే నీకు
పోరువెట్టినఁ జిక్కపోదు బిక్కటిలి
అని బిడ్డ మఱపింప నటునిటు ద్రిప్పి
వినిపింప నెపపెట్టి వేయి సుద్దులను
దిక్కదీఱక పట్టు దేరుకోక వెత
వెక్కసింపఁగ వెక్కివెక్కి యేడ్చుచును
మారాములిడి పోరుమానక యున్న
నారసి వెఱ వొందు నా యశోదమ్మ
నీరు నిండిన కుండ నిసుఁగుమ్రోల నిడి

రార! చందమామఁ బట్టురార! నీయంత
    ఆకసంబునఁ బిట్టునంపి తెప్పించి
నీకోస ముంతు వెన్నెలకందు నిందు
    నింగినుండియు దెచ్చి నిల్పితి నీదు
ముంగిటం జేఁబూని మురిసె దీ వంచు
    నీ పోరు నెపమునన్ నెల నీటిబాన
లోపలఁ బడి నీకు లొంగిపోయెనుర!
    అని బాలు నూరార్చ నామె జాబిలిని
గనుఁగొంచుఁ జేసన్నఁ గదియఁ బిల్చు నిటు
    చందమామా! రావ! జాబిల్లి రావ!
విందారగింప నిన్ బిల్చు మా కందు
    జాబిల్లి నినుఁగూడి నయ్యాట లాడ
మా బుల్లిపాపఁడు మారాము వెట్టె
    వెన్న పాల్పెరువుల విందుగావించు
నిన్ను జేతులఁబట్టి నేల దింపందు
    పండులున్! జెనుపిండి వంటు లెన్నో తిను
బండమ్ము లారగింపందు నీ కిడక
    కనుపండు వౌనరించి కదియు మా బిడ్డ
తినుబండములు తాను తిని తినిపించు
    నింగి నుండియు దిగ్గి నీ రూపుఁ జూపు
ముంగింటుంగల నీటిముంతలో నొదిగి
    అని చేత జలపాత్ర మందుఁ జూపింపఁ
దనిసి మురిసి సూరదానవిభుండు
    నీటఁ జందురుఁ బట్టు నెమకుఁ జేవెట్టి
చీటికి మాటికిఁ జేఁ జిక్కకున్న
    మారా మొనర్చు నమ్మరో! చందుఁ దెచ్చి

పేరిమి నాచేతఁ బెట్టఁ బోవేవి
ధూళిదొర్లుదుఁ జుంచు దువ్వించుకోను
బాలు ద్రావను నిదుపాలికే రాను
నందనుం డని పేర్కొనంబడన్ నీకు
నందనుం డౌదు మా నందబాలునకె
అని గునిసెడు బిడ్డ కనియె నాయమ్మ
చినమాట చెవిలోనఁ జెప్పెదన్ నీకు
చేర రారా! తండ్రి! చెవిఁజేర్చి వినర
యీ రహస్యం బన్న కేను జెప్పనుర!
మంచి పెండ్లికుమార్తె మనసైన దాని
మించుబోణి నొకర్తు మించువేడుకను
పెండ్లికూతు నొకర్తుఁబె ల్లందగత్తె
బెండ్లాడఁగా దెచ్చి పెట్టెదన్ నీకు
పెండ్లి గావలసినఁ బేచిపెట్టకని
పిననవ్వు మొలకెత్తఁ బెండ్లియూ సెత్తఁ
దనిసి మురిసి సూరదాసవిభుఁ డనె
నీతోడు వినుమమ్మ! నీ బిడ్డ నౌదు
నా తల్లి వౌదివు నా కోర్కెఁ దీర్పు
తోతెమ్ము పెండ్లికూఁతును దెత్తు నంటి
వే తె మ్మిపుడ నేను బెండ్లాడవలయు
కాదేని యీ నీటఁ గల చందు రిడి
మింటి జాబిల్లినే మినుదూసి తెమ్మ!
నీటిలో జాబిల్లి నిలువ కట్టిట్టు
లాటాడుఁ జేఁబడ కూగాడుచుండు
ఏటి కివెత నింగికెగసి పట్టెదను
బైటి జాబిలిఁ బట్టవలదన్న మాన

ఈచందునే తెచ్చి యిడలేక పోతి
నీ చనవుతెర వింక నే నెఱుంగనిదె
నీ మఱపింపుల నే నేమటిల్ల
నీ ముద్దుసేఁతల నెపమునన్ మురియు
దవ్వులఁ గలయట్టి దర్పమ్ము డింద
రివ్వునఁ జేపట్టి రేవెల్గుఁ దెత్తు
అని పట్టు పట్టిన యనుఁగుపట్టి కనె
జనని యశోదమ్మ చనునె యీపట్టు
పట్టి తే నీ పట్టుపట్టిన చందుఁ
బట్టి తెచ్చితినయ్య ! బానలోఁబెట్టి
యిం దందుకొనుమయ్య ! ఇదుగో జాబిల్లి
అందుకొందువొ చేత నాటాడుకొందొ
నేఁడు నీచేఁజిక్కె నెలతోడఁగూడి
యాడుకొ మ్మిమ్మాత్ర కాత్రపా టేల !
నీ కన్నుగవ నెంచి నెత్తమ్మికవగ
నీ కుండలంబుల నిగ లినప్రభగ
నీ మోముఁ గననోడి నిందుజాబిల్లి
మోముఁ జాటొనరించి ముచ్చుమచ్చునను
దాఁటి చేఁబడక పాతాళంబు సొచ్చె
నీట నీ చెయివెట్టి నెమకు నంతటనె
మోముఁ జూపగనీకు మోమోడి యోడి
శ్యామసుందర నిన్ను శరణన్న చందు
ననువునఁ బ్రోవురా ! నా నోముపంట !
కనికరపుందంట కని కడగంట
అని బతిమాలు నా యమ్మ లాలనము
విన కంతకంతకున్ బేచి వెట్టుచునె

ముద్దుకృష్ణుఁడు కనుల్ మూసె న ప్డక్కు
కద్దుక పవళించె నా యశోదమ్మ॥

(145 సూరసాగరము 841)

వృషభగతి రగడ :-

అంచనడకల మాని, ముం దెవఁ డర్గుగుదెంచునో
వాఁడె రా జగు

## మే లు కొ లు పు

ముత్యాల సరములు :-

మేలుకొను సుకుమార సుందర మేలుకొను మానందమందిర!
మేలుకొను గోకులపురందర మేలుకొను కృష్ణా!
నందనందన లెమ్ము సనకసనందనాది కృ తాభినందన!
ఇందిరాహృద యారవిందేందిందిరా లెమ్మా!
కూసెఁ గొక్కురుకో యటంచని కోళ్ళు గాకులు గావుకావనెఁ
గూసెఁ గోకిల కుహూకుహూధ్వనిఁగూసె బహుపక్షుల్!
భాగవతు లదె వేఁగుబోకఁ బ్రభాతసేవా కీర్తనంబులఁ
జాఁగి మ్రొక్కుచు సూరదాసశ్యాము నెంత్రు నినున్.
వేఁగుబోకల వాఁక మున్కలు వెట్టి సంజ జపంబు లొనరిచి
త్యాగయోగ సమాధులన్ ద్విజు లార్చుకొని రఘముల్.
ఘల్లుఘల్లున మ్రోయఁగాఁ గర కంకణంబు ల వొక్కసారిగ
గొల్లభామలు దధి మథిం తరిగొ విను మింటింటన్.
చిన్నికృష్ణా గొల్లతల్లీ నీ చిన్నెవన్నెలఁ బాడుచుండిరి
వెన్న దీయుచుఁ దలఁపుదీపులు వెంబడింప నినున్
కాఱుచీఁకటి రేయిఁ గ్రమ్మిన కలల నింకను గాంచుచుంటి
జాఱి బేజారయ్యె నవి దిగ్గజాలఁ బ్రొద్దొదిచెన్.
తెల్లవాఱెను జుక్కలాఱెను వెల్లవాఱెను జందమామయు

వెల్లవాఱెను వన్నెలాఱఁగ విన్ననై కలువల్
ప్రొద్దుపొడిచెను రేయిగడచెను బుండరీకము లెల్ల విడిచెను
ప్రొద్దుప్రొద్దునఁబాలు పితికెదు ప్రొద్దు గడచెనురా!
మోముదోమర చర్ధిగుడువుర మోముదామరఁ జూపరా నీ
మోముగోమును గన్గొనన్ వ్రజమోహనాంగు లివే
పూలమాలల గ్రుచ్చి నీ మెడఁ బూన్పఁ దెచ్చిరిరా బాలగో
పాల నిన్నుం బిలుచుకొనిపో వచ్చి రాటలకై
వెన్న మీఁగడ పాలుపెరువులు వెన్నరొట్టెలు బెట్టెదను నీ
కన్నిటను మనసైన వన్నియు నారగింపుమురా!
పాఁడిఁబితికెదువేళలం దిటు పాడికాదుర పండుకొన నీ
తోడి నెచ్చెలులెల్ల నిదురం దొరఁగి వచ్చిరిరా!
విందుగాఁ గనుగొందమని గోవింద నీదు ముఖారవిందము
మందిమందిగ వచ్చి నెచ్చెలిమందమగిడెనురా!
మందిమందిగవచ్చి గోపకుమారబృంద మనుక్షణంబును
సందడించియుఁ గ్రమ్మఱిరె నీ చంద మరయఁగనే
మొగుడుదమ్ములఁ గాంచి తుమ్మెదమూఁక మూగియు
మగిడినటు నీ
మొగుడుగన్నవ గాంచి నెచ్చెలిమొత్తముల్ మగిడెన్.
కన్నతండ్రీ! నాదుపలుకులు కల్లలనుకొని నమ్మవేని
కన్నుదమ్ములు విచ్చి నీవే కనుము నీయంతన్
లేఁగటా లెదురేగి నడలుచు లేఁగదిక్కు మొగంబు లౌచును
జాఁగుపొఁదుగుల బాలుచేఁపు లెసంగ గోష్ఠములన్
పసులకాపులు వచ్చిపిల్చినఁ బసిఁడివన్నెల పట్టుదుప్పటి
ముసుఁగుదన్నక లేవ వేపు డీబుద్ధి యులవడెరా
ఆలమందలఁ దోలుకొని నెయ్యురఁ గొనిపని కేఁగబోయెదు
వేళదాఁటెర బాబు లెమ్మని పిల్చె నందుండున్.

జారిచెంబున నీరుదెచ్చితి సద్ది పెరువన్నంబుఁ దెచ్చితి
ముద్దుపాపఁడ చద్దిగుడువర ముద్దులాడెద నే
వీనులారఁగ విందు నొకపరి వేణు వూఁదుర కన్నతండ్రీ
వీనుదోయికి విందొనర్చుచు విం|్రదు నీ విందున్.
అనుచు నందయశోద యాదట నల్ల పిల్లన|్రగోవి యూ సటు
వినిచి లేపిన లేచె హరి వడి వేణు విమ్మనుచున్.

ద్విపద :-

గోవింద గోవింద గోకులానంద
నే విందు గావింతు నిదుర లేవయ్యా
పాలు వెన్నయుఁ బెరుపు బాయసాన్నములు
క్రోలు నీ మనసైన కొలది భక్ష్యములు
మిక్కిలి చక్కెరల్ మెదపి వండితిని
పెక్కు మిఠాయీలు పిండివంటలును
ఆరగింపగ రార అభీరసుతులు
ద్వారమందున నిల్తురి దర్శింప నిన్ను
విందోయి విం దోయి వేణుగానంబు
విందోయి కొకపరి విందు గావింపు
అని చిన్నికృష్ణమ్మ నా యశోదమ్మ
నెనరార లాలించి నిదుర మేల్కొల్పు.

(125 సూరసాగరము 821)

ద్విపద :-

గడియసేపును చిన్నికన్నయ్య ప్రాపు
నెడయ నోపక రేయి యెటులో వేగించి
పెందలాడనె లేచి వేఁగుజామునకె
నందనుఁ గనవచ్చె నందపెద్దయ్య

పాల పెన్నురుగునఁ బసలీను పట్టు
సాలువు సెజ్జను శయనించువాని,
బంగారు రంగారు పట్టుదుప్పటము
చెంగుఁ దొరంగించి చెచ్చెరం గనియె.
వేలుపు లప్పాలవెల్లిఁ ద్రచ్చునెడ
బాలనురు గణఁగ జూపట్టు జాబిలికి,
ఉద్దినాఁ జీఁకటు లురలిపోఁ గాంచె
ముద్దారు కృష్ణయ్య మోముజాబిలిని
(135 to 139 సూరసాగరము 631 to 635)

ద్విపద :-

బాలకృష్ణ సుదామ బలరాము లోకటు
బాలలీలారతిన్ బాలురం గూడి
ఒప్పుగా నఱచేతు లొండొండు గలిపి
యప్పళించుకొనుచు నప్పచ్చు లాడి
చెంగుడు లాడుచుఁ జేతఁ జైవైచి
చెంగునఁ బర్వగా సీరి శౌరిఁ గని
తటిమి పరువిడి దెబ్బ దగిలించుకొందు
పరువిడలే వబ్బ పసివాఁడ వన్న
పఱవఁగాఁ బసలేని పసివాఁడఁగాను
పఱువు నేరుపులెల్లఁ బడయనేర్తు నని
ఎదురుజట్టు సుదాము నెదిరిచేఁ జఱచి
కదియ రమ్మని ముందుగాఁ గృష్ణుఁ డుఱికె
అంత సుదాముఁ డా హరిని గద్దించి
పంతానఁ బట్టుకోఁబ ట్టూడ్చు కొంచు
నాయంత నిల్చిన ననుఁ బట్టుకొంటి
నీయంత ననుఁ బట్టినేర్చితే యంచు

మారాము వెట్టు నా మాధవుం జెలులు.
బీరాలు వల్కి యీ పేచీలకోరు
తనయంత బరువిడఁ దగుదు నే ననుచు
చనుదెంచి చాల కీఱగడాలు పెంచె
అనుడు సానదుమున హరి యుడ్డు వచ్చి
తనయోటమి నొకళ్ళ తలరుద్దుఁ డుఁ
తలిలేదు వీనికిం దండ్రియున్ లేఁడు.
గెలుపు నోటముల శంకింపఁగా బోఁడు
ఓడి కయ్యాలాడు నుడుకుబో తంచు
వాఁడిపల్కుల నందబాలు నేడ్పించి
బలుఁ డింటి కంపించి వైచె నయ్యెడల
నలుముకో మది నీను నలుకయుం గలఁక
చిన్నారిమన పెంతొ చిన్నపుచ్చుకొని
విన్నవోవు మొగాన వెన్నుఁ డిలుసేరి
కన్న యశోదమ్మఁగని యామె తనదు
కన్నడకత మడ్గారా మొనర్చి
అక్కునఁగొన వంత యంతకంతకును
వెక్కసింపఁ వెక్కివెక్కి యేడ్చుచును
వెన్నుఁ డిట్లనె నమ్మ! వింటె! మా యన్న
చిన్నబుచ్చెను నన్ను జెలికాండ్రమ్రోల
నందుఁ డెట్టిన యెట్టనగదా యశోద
యెందుండి పుట్టినాఁ డీ; కత్తికుత్తి
నీ తల్లి యెవతెరా నీ తండ్రి యెవ్వడొ
యేతల్లి బిడ్డవో యిల్లుఁ జేర్చి రక్షిచు
నను నీవు గొనితెచ్చినావా వంచు తల్లి!
నను దిసంతలుగొట్టి నగుషాలు సేసి

ఉడికించి యాడించుచుండె నన్నయ్య
 యుడుకుబో తని యాటనుండి నన్ దటిమి
వడివడి నను గొట్ట బరతెంతు కాని
 యడలించి యెరుగుదే! యన్న నెన్న డని
అంతకంతకు హెచ్చు నలుక మోమునకు
వింతచె ల్వొడగూర్చ బిడ్డ లేనుడుల
 మురియుచును లోలోన బుజ్జగించుచును
మురిపించు మఱపించు బుజ్జాయి చెతను
 నా చిన్ని కృష్ణయ్య! నన్నుగన్నయ్య!
నీ చిన్న వోవు మో మేఁ జూడలేను
 చిన్ననౌ చెన్నారు చిన్నారి మోము
కన్నయ్య! యొకసారి గందుక జూపింపు
 నీలాల నిగలొల్కు నీ మేని తళుకు
నాంఠిము చ్చొకడు క న్నానఁగాలేక
 నల్లవాడఁని నిన్ను నగి గేలసేసి
ఎల్లి దపఱచి రానీఁడె యాటలకు
 నీ తోడునీడయై నిచ్చ నీ చెప్పు
చేఁతల మెలఁగి నిన్ సేవించు నన్న
 అల్లరివాఁ డన్న యల్లారుముద్దు
పిల్లడ వీవు నీ ప్రేఁతలంబునకు
 మా బిడ్డ ని న్నేరు మాటొడ్డువారు?
మాబాబు దొరబాబు మందపల్లెలకు
 మాపట్టి తలకట్టు మందపిల్లలకు
నీపల్లె నెవరురా ని న్నాడువారు
 నీవు వా బిడ్డవే నీ కమ్మ నగుదు
నావుమందలతోడునాడి పల్కెదను

వదరుబోతును మన్న బలరాముఁ డెన్న
వదరి ర ట్టొడి గట్టువాఁడురా వాఁడు
అదవదగావేల అతని వాదులకు
కదుపుల విడద్రోలి కాచుకొ మ్మావు
అడవి మందలద్రోలి యాడుకొ మ్మన్న
బుడత కన్నడు వెళ్ళ బోనమ్మ వనికి
నన్నుఁ గన్నపుడెల్ల నలుమందిలోన
నన్న న న్నుడికించి యారడివెట్టు
దేవకీవసుదేవ దివ్యదంపతుల
కావిర్భవింప ని న్నవ్వారినుండి
కొనితెచ్చుకొని పెంచుకొని పెద్దచేసి
మన నందబాబయ్య మక్కువఁజేసి
"అమ్మ అయ్య" అటంచు నా నందసతుల
నెమ్మిఁ బిల్తువెకాని నిజ మెఱుఁగ వని
యాడించు నే నందు నాడఁబో నన్ను
నాడనే పొంచి కన్నయ్యసుద్దులను
వేడుక వించుఁ దా వెనుకనే వచ్చి
కూడినకూర్మి నక్కునఁదీసి వాని
ఆ నందపెద్దయ్య హాలి నదలింప
నానందమునఁదేలె నా సూరవిభుఁడు

(160-161-162 సూరసాగరము 861-862-868)

ముత్యాల సరములు :-

సంగడీం డ్రిదె యాడుకొనఁగా జట్టుకట్టుక వచ్చి నీకయి
తొంగిచూచుచు నుండి రదుగో దోరమం దపుడే
అడుకొఁనబొ మ్మన్నుఁ గన్నం దమ్మరో! నాబంతి బిల్లల

నేడ దాఁచితి తెచ్చియీవే యేఁగవలె ననియెన్.
పెరువుకడవల మఱుపునన్ డాపితిని గనుగొను మన్నఁ గృష్ణుం
డరిగి యవి చేకొనుచు నాటల కరిగె నేస్తులతో.
ఎందుఁబోవుద మాడుకొన నని యిండ్ల నెంమున నికటంబగు
మందబైలుల వాడుకొందము మంచిగా ననముస్
అనుచు మందగ మందబైటకు నరిగి జట్టుల పరిగఁ బంచుచు
ననుజు లా శ్రీకృష్ణబలరామయ్య లొకయుజ్జిన్
జట్టుపెద్దలు గాఁగ వేఱొక జతను శ్రీదాముని సుదామని
బెట్టి యుజ్జీ లేఱుపఱచుచుఁ బెనఁగి యాడంగన్
మొగిసి తమతమ నేర్పుకొలఁదుల మొనసి య య్యారు
మొనలవారును
దిగచి యాడుచునుండ నొండొకతేప కా హరియున్
ఎదిరిజట్టు సుదామముఖ్యు లోకి త గెల్చెదు జాడఁ గన్గొని
ప్రిదులపఱచెను వాటబిలకము రేపి పలుపేచీల్.
ఎదిరిగెల్పునఁ గన్నుగుట్టఁగ నిట్టు జగడముఁ బెంచు చలమరి
యదుపతికి శ్రీదాముఁ డిట్లనె నాడుకొను నెడలన్
దొడ్డకొంచెపు బుద్ధులేలర! దొడ్డవారల బిడ్డవాదే
నద్దుమాటల నాటఁజెప్పుదె యాటకడ్డంబై
గెలువ కోడ్పడి గెలుపరులపై గినిసి జగడము రేపు గిటు నీ
గెలుపు కిమ్మన కొప్పుకొన నీకెలన బ్రతుకుదుమే!
తమతమంతటి వార లంత స్వతంత్రులు తోడుము గాక బంట్లమె
యమరఁగా శిరసావహింపఁగ నయ్యవారి నుడిన్
మందలెక్కుడు గలుగు నందయ మందపెద్దకు ముద్దుకొడుకై
నందునం గులగౌరవాధికుఁ డౌదె! మాకంటెన్
నెత్తలన్ సిపెత్తనంబిడి నిర్వహింపఁగ నేము మున్నీ
సొత్తుగుడుపులఁ గుడిచి బ్రతుకఁగఁ బోము నీ సొత్తున్.

ఎవ్వ రాడుదు రుడుకుబోతుల నిట్టివారలఁ గూడి యని వా
రవ్వలం గూర్చుండ సూరశ్యాముఁ డనుఁగులతో
ఆటతమకము హెచ్చగాఁ బోరాట నెపు డిఁకఁ బెట్టరా నా
మాట నమ్ముం డయ్యతో డని మాటఁగలుపుకొనెన్.

## విప్రునకు బాలకృష్ణుని సాక్షాత్కారము

(165 to 169 సూరసాగరము 866 to 870)

తురగవల్గన రగడ :-

కౌతుకమున నాయశోద కన్నవారి యూరినుండి
క్షేత్రలమ్ముఁ జూచిపోవ ద్విజుఁ డొకండు వచ్చెఁజుండి
చిన్నికృష్ణుఁ గన్నయూసు చెపులసోఁక నా నెలంత
పున్నెముఁ బొగడుచును నందభూప గృహముఁ జేర నంత
వచ్చిన ద్విజుఁ దోడితెచ్చి భక్తి నర్ఘ్యపాద్యము లిడి
మెచ్చునుడుల వానిరాక మెచ్చి యాయశోద పొగిడి
లోనఁ గూరుచుండఁబెట్టి లోనిగదిని సుద్దివెట్టి
దాన వంటసంబరువులఁ దమి నమర్చి చక్కఁబెట్టి
వండుకొనుఁడు స్వామి! మనసువచ్చు భోజ్యము లని పాలుఁ
గండచక్కెరయు గుడంబు గడ్డపెరువు నేయి ప్రాలు
దండిగా నమర్ప మదినిఁ దనిసి ద్విజుఁడు పలికె నమ్మ!
పండఁబారఁ బుణ్యరాశి భాగ్యరాశిఁ గంటివమ్మ!
పండువంటి బిడ్డఁ గంటి, వయసుపండ భాగ్యకలన
నొం డెవ రెన నీ కటుంచు నువిద యిడు పదార్థములను
వండి పాయస మ్మొనర్చి వడ్డన యొనరిచి కరమ్ము
నిండుబత్తిఁ గనులమూసి నెఱప హరినివేదనమ్ము
వెన్నుఁ డపుడె గదిఁ జొరబడి విస్తరిఁ గలఁబడుచుఁ గుడిచి
క్రన్నన గది నంటువఱప ఘ్మానురుండు కనులు దెఱచి

వెంటనే యశోదఁ గాంచి వింటివమ్మ! బిడ్డ పఱచి
వంటకమ్ము లంటి సిద్ధపాయసాన్న మంటువఱచి
సిద్ధమైన యన్నమునకుఁ జేటుదెచ్చె నన వెలఁదియు,
న ద్దరామరునకు మగుడ నన్ని సిద్ధపఱచి గడియు
శుద్ధిపఱచి వేఁడె ననఘ! జోతఁజేతు బిడ్డచేతఁ
గ్రుద్ధమతిని గనక వందుకొనుఁడు మగుడ ననియె మాత.
ద్విజుఁడు మగుడ వండి హరినివేదన మిడి కనులమూసె
వ్రజకిశోరుఁ డారగించి పాయసంబు నొలకఁబోసె,
పాపఁ డంటి వచ్చుచుండఁ బాపఁ డెన్నొసాళ్లు వండి
శ్రీపతికి నివేదనంబు సేయలేక పోవుచుండె
తేపతేప కీ పగిదిని ద్విజుని వేపు నా వ్రజకుల
దీపకుఁ గని కినుక నందదేవి మందలించె నిట్టులు
బాపఁడంచుఁ దమిదలిర్ప బత్తిఁబిలిచి విం దొనర్ప
వేపు దిట్టు లింతవింత వింటిమె మును సిసులొనర్ప!
నేలవేల్పు తలఁపువేల్పు నెట్టి నివేదనమ్ముఁగొలుపఁ
జీలిబుద్ధి నంటనేల చిలిపితనము నేల సలుప?
అనుచు మందలించు నమ్మకనియెఁ జిన్నికృష్ణుఁ డమ్మ!
ఘనతరానురక్తి మ్రొగ్గి కనులుమూసి కరము లొగ్గి
నన్ను విధివిధానమున మనంబునం దలంపువెట్టి
సన్నుతించి పిలిచిపెట్టు జన్నిగట్టు పిండువెట్టు
మన్ననఁ దినకుండనుందు మనసునిల్పి నన్ను వేఁడ
సన్నుతమతి కెందు నాకుఁ జన్నె భేదబుద్ధిఁజూడ
అనుచు సూరదాసవరదుఁ డాశ్రితానురక్తి నాడెఁ
గనులు దెఱచి ద్విజుఁడు లోనికనుల హరినెఱింగి వేఁడె.

హరిగతిరగడ :-

మున్నె నోముల నోమంగంటునో
పున్నెము లెయ్యవి పొనరిచి యుంటునో
ఇవి అన్నియు నేఁడీడేరిన విటు
నిన్నరయంగను నోములపంటను
నిన్నినడ మొనరించితి నేరమి
నేరిమి సైరింపుమి నానేరమి
కన్నయ్యను నినుఁ గన్న కుమారుగఁ
బడసిన ధన్యులు కడుమాన్యుల్ సుమి
భూతలమున వ్రేఁతలమే ధన్యము
పూతలు భాగ్యోపేతలు వ్రేఁతలు
వ్రేతలమున నీ నడయాడిన వని
బృందావన; మెంతునె నీచేఁతలు
నందనిలయ మానందనిలయ మా
నందమయుఁడు నట్టింట నటింపఁగ
నందకధరుఁడు నటించెడు నందన
నంబే నందనవనము దలంపఁగ
దీనజనావన! భక్తప్రేమా
దీనత భువనావనలోలుఁడవై
మానుష తను వూనితి భూభారము
మాన్ప నకారణ కారుణికుఁడవై
దారుణ దుఃఖ విదారణమును భవ
కారణమును శుభకారణ మనుచును
చేరుఁగనిన నీపేరెఁదఁ బేర్కొనఁ
బేరుఁగనిన యఘ విసరము నణఁచును
స్వామివి నీ వఖిలాంతర్యామివి

భక్తప్రేమివి సూరస్వామివి
బాము వెతలc బడకుండcగ నోమవె
బాముల బందెలు వాపెడు స్వామివి
పతితావని! నిన్నెట్టి జపతపో
వ్రతసుకృతంబులc బడిసితొ యీగతి
పతితుcడ నిపుడు నీనాథుcడనై శ్రీ
పతి నీపదసంగతిc బడి బ్రతికితి,
కల దొక్కొక్కని కొకదిక్కల నా
కల దిక్కెల్లను నీవే స్వామీ!
తెలిపెడి దేమిcక వేవెలిపలుకుల
దెలియవె! నన్నఖిలాంతర్యామీ!
పారముc జేర్పవె నను భవ పారా
వారమునుండి కృపాపర యంచును
బాడుcదు హరిసందర్శన కౌతుక
పారమ్యంబునc బొరలెc దొరలుచును.

(191 సూరసాగరము ౧౦౮)

ద్విపద :

గొల్లయిల్లా లొకర్తె గ్రుమ్మరి వచ్చి
యిల్లుసేరcగc గృష్ణుc డింటిలోc జొచ్చి
కలవెన్న మీగడల్ గడుపారc గుడిచి
నిలుచుండె నోదిగి యా నీరజేక్షణయు
ఉట్టిcగన్గొని వెన్న యూడ్చిన యుట్టి
వట్టెలారసి నేను జన్నదిప్పుడెcగ
ఇంతలో నేముచ్చు యిలుసొచ్చెనంచు
గ్రంతగ్రంతలc జూచి గది డాగుకొన్న

వెన్న కన్న పుదొంగ వెన్నంటిపట్టఁ
దన్నుఁ బేర్కొని సూరదాసవిభుండు
(217 సూరసాగరము 951)

మఱ్ఱాల సరాలు :-

పాడిరా ! పొరుగింటి వెన్న కుఁబాఁడిపెర్వుల కాససేయఁగఁ
బాడిగా నవలక్ష గోవుల పాఁడి నీకుండన్.
వేకువన్ మనయింట నిచ్చలు వేయి కవ్వాలాడుచుండఁగ
నూకవన్ బెనుమబ్బు లొక్కట నుఱిమె నిపించున్.
చల్ల సేయుచుఁ జల్లలమ్ముచుఁజల్లగా మనుచుండి రెందఱు
గొల్ల లిందున నందగోపుని గొడ్లకొట్టమునన్.
పేరుపరువున మీఱు నందుని బిడ్డ వంచనిపించుకొంచు బి
కారివై పొరుగిండ్లఁదూఱి పొకార్తున్నా ! పరువున్
అరగింపను బోరగింపను నగలంబగు పాలుపెరు వే
దారిఁజూచిన సూరదాసాధార ! నీకుండెన్.

ద్విపద :-

కొదలేక నవలక్ష గోవులం బిదుకు
పదివేల కవ్వాల పాఁడి నీకుండ॥
బాడిరా పొరుగింటి పాల్పెరువులంటు
వేడుకసేయఁగా వెన్నముచ్చిలఁగ
క్రమ్మెడిన్ మనపాల కవ్వాల మ్రోఁత
లుమ్మడిన్ బెనుమబ్బు లుఱిమె నన్నట్లు
వ్రేపల్లె మనపాలు బెపువులమ్ముచును
రేపాడి మనయూల క్రేపులం గాసి
మందలఁ బిదుకుచు మజ్జిగల్ సేసి
యెంధల్లు ఇట్లుకున్నుం దీన్నదుల్లింట్ల [illegible]
బదుగురన్ బ్రదికించు పసమించు నందు

కుదుటఁ బుట్టియు లేకిగుణముఁ జూపెదవు
పెరుగు వెన్నలదోఁచి పెంపారుకులము
పరువు వన్నెల వన్నివన్నె మాపుదువు
నీ యింట నేమూల నిలువయౌఁ బాఁడి
నీయింతఁ గఁడవఁగ నిగిడగాను.

(216 సూరసాగరము 952)

ముత్యాల సరాలు :-

ఇరుగు పొరుగుల పాలు పెరుగుల కిండ్లఁదూరెదవేలరా ! యని
బిరబిరా చేబెత్తముంగొని బిడ్డ నదలింపన్
అమ్మయిన్ వెఱఁగందినటు కృష్ణయ్య యమ్మకు జెరికి, అమ్మిష
సమ్మతిన్, నిజభక్తి వైభవ సరణిఁ జూపించెన్.
అమ్మరో! నేవెన్న సుంతయు నారగింపఁగలేదు సుమ్మా !
నమ్మవే! నానుడి నిబద్ధిగ ననువు మీఱంగన్.
చిట్టిచేతుల కెట్టులబ్బును జెప్పు ముట్టఁగలట్టి వట్టులు
చట్టులంగల పాలుపెరుగులు చట్టునం గ్రోలన్
వెన్నడిం జెలికాండ్రు పెక్కురు వెక్కిరించి పట్టోచకాలకు
వెన్నమూతినిఁ బులిమిపోయిరె ! వెన్నఁదిన నంచున్.
వెన్నమూతిని దుడుచుకొంచును వెన్నదొన్నెను వెనుక దాఁచెడు
వెన్నదొంగ పనిం గనుంగొని ప్రేమమ్రుచ్చుపొంగగన్
చిర్నగవు మొలకెత్త మోమున చేతిబెత్తముఁ బాఱవైచుచు
పిన్నపాపని నందురాణి కవించి ముద్దాడెన్.
భవవిరించి సుదుర్లభంబగు బాలలీలావిభవ మేరీతిన్
బ్రబవిమలంబగు భక్తికికిన్ హరి ప్రతిఫలం బిడియెన్.

(219 సూరసాగరము 958)

[illegible] :-

బాడిగూరిన యొక్క పాడుపుంతఁబడి
నేఁడింటి కేతెంచు నెత్తటియందు
లేఁగ నాఁడీనిన లేగటూ వొందు
వేగ లేఁగను గూడి వెంబడింపఁగను
గుమ్మలు సేఁపులు గూరు నాయావు
గుమ్మసాలను దీసి క్రోలు లాలసను
చన్నుఁ గుడ్చెదు తేఁగఁ జరిషి దొన్నెఁగొని,
గుమ్మపాల్ దీయనేఁ గూర్చుచుండంగ
అమ్మెయునే హెచ్చి యాగెచ్చుభోతు
కుమ్ములాడు పసువు కొమ్ములస నన్నుఁ
కుమ్మికుమ్మి తఱుముకొని వచ్చుచుండ
"నమ్మబాబో" యంచు నడలి కుయ్యిడుచ
జూడ దిక్కెదిలేని చోటు నద్దాని
వాడికొమ్ములఁబడి బ్రతికి వచ్చితినో
మున్నిపు నోచిన పున్నెంపునోమె
నన్నోమె నమ్మరో! నందయ్యతోడు.

(269 సూరసాదరము 1016)

ద్విపద :-

తల్లికిట్లను నందతనయుఁ డోజనని!
గొల్లగుబ్బెతల తేతేన నసొగన్న
దొంగో దొంగయటంచు డోకొనిపోయి
ప్రాంగణాంబుల దాంటి యంతరంగముల
ప్రేముడిన్ నిలిపి నిర్ణిమిషలై కనుచు
నాహ్మోము ముద్దాడి నన్నుఁగౌఁగిలించి
వెన్నఁ జేసేతఁ దిన్పించుచు నేవా

విన్నవింతురు మ్రొక్కి వేల్పు పెద్దలకు
కనుపడ్డచోట్ల నేకతమునన్ బిల్చి
నను గిలిగింతల నలిపివై చెదరె!
పిలిచినఁ బోకున్న బిరబిరా వచ్చి
బలిమి నన్నెత్తుక వగలఁ గుల్కెదరు
అమ్మ! నేవీధుల నాడఁబోనన్న
నమ్మెయిన్ సూరదాసాభివంద్యుఁ గని
ముద్దుపాపం డేడ! ముద్దరాండ్రేడ!
సుద్దులివేడంచుఁ జోద్దె మందుచును
ఆనందమున దేలి యానందురాణి
యానందకందుఁ గన్నయ్య ముద్దాడి

(270 సూరసాగరము 1017)

ద్విపద :-

నాకన్న తండ్రి! కృష్ణయ్య! నీ వెందుఁ
బోకయ్య! చెలికాండ్రఁ బ్రోవుఁ జేసికొని
ఈ ముంగిటనె యాడు మేమాడుకొందొ
నామాట జవదాఁటి నడువ కేనాఁడు
యేడకుఁగ జనక నీ యింట నీవుండ
నాడిపోసెద రూరి యాఁడువారేడ
నిను దొంగ వన్నట్టి నెలఁతల సడికి
జనులలో దలయెత్తఁ జనుదు నే నెట్లు?
రవ్వర ట్టొడిఁగట్టు జాగ లవ్వార
లివ్విధి నన్ని ని యెగ్గాడి రనియె
కింక రప్పింతువేన్ గింకరుంబలెను
సంకెళ్ళలోఁ బెట్టి సాధింతు నిన్ను
పట్టి కొట్టి ధూదల్చి బంధింతు నీదు

కట్టుడుల్గని గోపకన్యకల్ నవ్వ
దొంగయం చుడికించి తొయ్యలుల్ నిన్ను
భంగపఱచెదు భంగిఁ బాపుకొ మ్మెటులో !

(311 సూరసాగరము 1128)

ముత్యాల సరాలు :-

కన్నతల్లీ ! పసులఁ గాయఁగఁ గాలుగాయులు గాచెఁ గదుప్పల
నన్నితోలుక మందతోనే వగ గలే నమ్మా !
తేరమాటల నన్ను మురియుఁదేర్చి గోపకుమారు లందఱు
నూరిమందల నన్ని నాచే నుఱక గాపింత్రే
అన్నతోడని పలికి నిటులే నన్నమాటతెఱంగు బలరా
మన్న నడిగి నిజంబుఁ గన్గొను మన్న నాయమయున్
ఊటి కుఱ్ఱల దూటిపోసెడు నోరి గోపకుమారులారా !
ఊరకే సుతు నూసుబోక వనోర్వి కంపింపన్
తీఱుగాఁ గూర్చుండి యందఱుఁ దేరమందల నెల్లఁగాయఁగ
నోర ! మాపసికుఱ్ఱ నుడికింత్రంటు ! యివి తగవే !

(313-314 సూరసాగరము 1112-1127)

ముత్యాల సరాలు :-

నందరాజసుతా! యశోదానంద వర్ధనుఁడైన నీకిటు
మందఁగాయఁగ నేలరా! పలుమంది చందమునన్.
పలుకు బలుకునఁదేనె చక్కెర పలుకులొలికెడు చిలుకపలుకుల
పలుకు మై పులకించురా! నీ పలుకు లాలింపన్.
కంటకాటవిఁ గాళ్ళు గాయలు గాయఁ గదువులఁ గాయనేలా
యింటిపట్టున నాదుకొను నీయిచ్చ వచ్చినటుల్
ఎల్లవేళల గొల్లతల్ మన యిల్లు ముట్టడిసై చ్చినాతోఁ

బెల్లుగా నీ యల్లరుల్ వినుపింప రాకుండన్
ఇరుగు పొరుగులఁ దిరుగకే మనయిల్లుఁ దొరఁగక యాడుకొనరా
మరగి నేనుఁగను మొఱఁగ కాటల మరగి కనుమఱుఁగై
బంట్ల కొలఁదిగ నుండెరా! తినుబండముల్ బులకండముల్ బలు
పండ్లు షడ్రస భక్ష్యముల్ పలు వంటకము లింటన్
వెన్న మీఁగడపాలుఁ బెరువులు వెన్న రొట్టెల వెన్నె చట్టుల
నన్ని యున్నవి మనసు వచ్చిన వారగింపుమురా!
దధి మథించుచు నవ్యనవనీతంబుఁ దెచ్చితి నీకు హితమని
దధియు నీ కొంగ్రొత్త వెన్నను దనిసి తిను మన్నన్
పెరుఁగు వెన్నయు నాకు హితమగు విధముగా నా కెవియుఁ గావని
పెఱుగుతమి నవి యందుకొని తిని వెన్నుఁ డుప్పొంగెన్

## శ్రీకృష్ణుని దివ్యలీలా మహిమానుభావ వర్ణనము

(1 సూరసాగరము 621)

వృషభగతి రగడ :-

ముక్కు మూసి సమాధిఁజొక్కిన మూఁడుకన్నుల జెజ కేమెయిఁ
జిక్కరాని పరాత్పరుం డిటు చిక్కె నందున కాలకాపయి
తల్లిదండ్రుల యాలుబిడ్డల తగుల మెఱుఁగక ముదిమిచావుల
యలపెఱుంగక మాయలొంగక యంటుఁగాచెను మంద యావులఁ
గాలుసేతులు ముక్కుజెవులుం గనులుమునుగ దశేంద్రియంబులఁ
బోలురూపము లేనివే ల్పయి ప్రోచి వెలయించెను జగమ్ముల
ఱెప్పపాటున ముజ్జగమ్ముల సృష్టి రక్షా లయమునన్ వడిఁ
ద్రిప్పుజాలు త్రిభంగియై విహరించె వనిఁ బొదరిండ్ల వెంబడి
కాలకాలుఁడు లోకభీకర కాలరూపుం డయ్యు శ్రితజన
లోలుఁడై గోపమ్మ చేతుల లొంగి రోటుం గట్టువడియెను
శాశ్వతుం డజుఁ డాద్యుడై వ్రజసాధ్వి యొడినిసుఁ గొచుఁ గేరెను

విశ్వ విశ్వంభరుఁడు నై పా ల్పెరుగు వెన్నల కింక్లఁ దూఱెను
త్రేలఁ ద్రిభువన సృష్టి రక్షా విలయచక్రము నూఁదు జోదును
బాలలీలాలోలుఁడై త్రేపల్లెఁ బిల్లనగ్రోవి నూఁదును
అందఁ డా శుకనారదాదుల కల్ల సనక సనందనాదుల,
కందరాఁడు సమాధినిష్ఠుల కందెఁ గండై నందు మొగదల
అంతకాంతకు నిష్ఠకున్ వేదాంతవీధుల కంతుఁజిక్క క
నంతమహిముఁ డనంబరంగు ననంతుం డింతులఁ జొక్కెఁ దక్కక
అల్ల సిరి కడకంటి చూపున కానఁజేసి యెవాని పద సం
ఫుల్లపద్మము లొత్తు నెపు డా ప్రోడ పొదరుల రాధఁ గదిసెను
పంచభూత సమంచితముగఁ బ్రపంచమును నిర్మించి మాయమ
బంచి వంచనసేయు భువనప్రభువుఁడై పశువాలుఁ డాయెను
ఘటఘటాంత ర్వ్యాసి భవసంకటపు ద్రొక్కటఁ బడఁడు నొక్కట
కటకటంబడెఁ గడుపునం బసికాపు నింట జనింప నక్కట !
డెంద మొడలు న్మఁడులు గనని కడింది వే ల్పరవిందజాదుల
కందరాని ప్రమోదకందం బందుఁ బసికండై యశోదకు
తొల్లి గుణరూపంబు లొల్లని దుర్లభబ్రహ్మంబు వేడుక
గొల్లభామలఁ జెట్టవట్టుక కులికి సయ్యాటాడెఁ గూడిక
అల్ల బ్రహ్మేంద్రాదు లందని యా పరానందామృతం బది
గొల్లవీధుల వెల్లివిరిసెను గొల్లగొన వల్లవులు నెమ్మది
ధన్యు లా హరితోడ నాడు సుదామముఖ్యులు ధన్యజన మూ
ర్ధన్యు లాహరిఁ గన్నపితలున్ ధన్యతము లా ఘోషజనముల్
శౌరి లీలాచిత్ర మహిమము సారమెఱుగఁగఁ శౌరికే తగు
సూరదా సొ ధింత లెంతని చూఱకోఁదగు తేఱకోఁదగు

(835 సూరసాగరము 1599)

వృషభగతి రగడ :-

ముదుక గొఱికిన పండ్ల యెంగిలి
మురిసిమెక్కిన వేల్పు పదములు
ముదుక గ్రద్దను ముక్తి కంపిన
మోక్షదాయకు మేటిపదములు
పలువకొలువునఁ గట్టువలువను,
బలిమినొలువఁగఁ జెలువ పిలువఁగ
విలువకొలువని వలువ లిడి కృప
వెలువరించిన వేల్పు పదములు
కుంతికోడలి కూరఁజవిఁగొని
కోపిదూర్వాసు శిష్యతతితో
గొంతుబంటిగఁ గడుపునింపిన
గురుకృపాస్పదు మేటిపదములు
బక్కబాపని ముక్కయటుకుల
పాతమూటను విప్పి గుప్పెడు
బొక్కి మురియుచు పెక్కుసిరు లిడి
పొందు నెఱపిన ప్రోడపదములు:
బండిరక్కసు మేను బిండలి
పండుగాఁ బడఁదన్ను పదములు
దండిమడుఁగునఁ గాళెపడగలఁ
దాండవించిన దండి పదములు
దారి రాపడియున్న యా జడ
దారి చెలియ నహల్య నిజపద
పారిజాతరజంబునన్ సడిఁబాపు
శాపవిదారి పదములు

మూఁడులోకల వేల్పువాఁకకు
పుట్టినిల్లైనట్టి పదములు
ప్రౌఢయై సిరులీను సిరియెడఁ
బూని విడువని శ్రీపదంబులు
ముజ్జగమ్ముల నోము పదములు;
భూతపతి మతిమెచ్చు పదములు
సజ్జనాశ్రిత భక్తకోటికి
శాంతిసౌఖ్యము లిచ్చు పదములు
సూరిలోక హితప్రదంబులు
సూరదాస వరప్రదమ్ములు
సూరసుందరు పదము లీమై
సూరదాసుఁడు సూఱకొను నిఁక.

హరిగతి రగడ :-

నిలువునఁ దాటకఁ గీ టడఁగించితి
నీచపిశాచులఁ బీచ మణంచితి
నిలిచి సవము నెఱపించితి వడ్డక
నెలతాలుపు విలువిఱిచి మహీజను
నెలఁతల తలమానికమును గెలిచితి
నియతిని బదునాల్గేండ్లు వనంబున
నిలిచి నెఱపితివి పితృశాసనమును
నీవే దశరథరాముఁడ వగుచును
మాయించితి ఖరదూషణముఖులను
మాయిమెకమున్మ్ మాయమొనర్చితి
మాయామానుష విగ్రహుఁడవునై
మాయావుల మాయకు లోనైతివి
మాయాకృతి జానకిఁ గోల్పోయితి

మాయలమాయల మార్కొని మడపితి
మాయామేయా! మాయెడఁ జేర్పక
మాయింపుము నీ మాయన్ మాయన్.

ద్విపద :-

నందయశో దానందవివర్ధన!
కందుకలీలా గతగోవర్ధన
బృందావని విహరించిన పదములు
బృందారకనుత! యే వందింతున్.

హరిగతి రగడ :-

సరసిజలోచన సంభవమోచన!
శరణాగత నతసన్నుత చరణా!
చరణాగతులగు శరణాగతులకు
శరణం బీవే! యశరణ శరణా!
పూతన చనుఁగవఁ బూసినవిసపుం
బూఁతను బీల్చి పూతనొనర్చితి
భూతలమునఁ బడఁగూలిచి యది యొక
భూతం బని యా వ్రేఁతలు భీతిల.
కారుణికుఁడవై పసువుల యుచ్చుఁ బో
కారఁ బొకార్చితి కార్చిచ్చును గని
నోరుంజీటితి కొక్కెర రక్కసి
నుఱుమాడితి కసిఁ బెంజెర రక్కసి
రాలుగురియఁ గా రాల్పడ గోప
గ్రామ మఖిల గోగోప గ్రామము
వ్రేలకయుండఁగ నాప ద్వేళను
వ్రేల నిలిపితివి భూరి గ్రావము
కేశిని గేశాకేశిఁ బెనంగితి

ఖేటనిశాటులఁ గీటడఁచిగించితి
శ్రీశ! యశోదా శ్రేయఃఫల! నా
కేశ సుతా! రాసక్రీడా రత
గొల్లకొమరితలు నోచిననోముల
గొల్లగొనిన పలునోముల పంటవు
పల్లెను బాఁపనపడఁతుల విందుల
వసపడు దంటవు జన్నపుఁబంటవు
వరుణునిచెఱ నందుని విడిపించితి
వరకరుణా వరుణాకర! సన్మతి
ఖరుఁ జాణూరు నరిష్టుని ముష్టికుఁ
గరలాఘవమునఁ బెక్కురఁ గడపితి
కరుణా వరుణాకర పదమౌ శ్రీ
కర! నీ చరణం బశరణ శరణము
శరణాగత నర భవభయ హరణము
సతతోత్సన్న దమి ప్రావరణము

చౌపద :-

అశరణశరణం బఘసంహరణము
ప్రశమిత నతజన బహు సంసరణము
నిశితధ్యాన సునిష్ఠాభరణము
విశదీకృత సద్విద్యావరణము.

ఇది సూరసాగర సంగ్రహ
భాగవత దశమస్కంధము
శ్రీకృష్ణ జన్మోత్సవ లీలావైభవాదికము

# సూరసాగరము

## దశమస్కంధ సంగ్రహము

అను

## సూరభాగవతము పూర్వార్థము

### ఉద్ధవ సందేశము - భ్రమరగీతాసారము

శా॥ శ్రీకృష్ణుం డొకనాఁడు దా మధురలోఁ జిత్తంబు వ్రేపల్లెపైఁ
బ్రాఁకన్ బిన్నటునాఁడె తన్ వలచి యారాధించు సఖ్యాళిఁ బ్రే
మైకారాధిక రాధికం దలచిఁ త న్నెంతే తలంపూని లో
జీకాకుంబడకుండ వార్త ననుపన్ జింతించె నవ్వారికిన్.

తే॥ తన్ను మఱపింప సతుల హృత్తలమునుండి
వేఁతల మెవానినేన్ బంపు వెన్ను తలఁపు
నంటి వచ్చెనో నా నపు డరుగుదెంచె
నిష్టసఖుఁ డుద్ధవుండు నయ్యెడకుఁ బేర్మి.

ఆత్మసమ రూపవేష భూషాంచిత సఖు
నక్కుఁ గూరిచి తలపోసె నాహరి యిటు
లుఱ కితఁడు ప్రేమతత్వమహోన్నతి మతి
సైఁపఁ డల జ్ఞానయోగంబు చాలమెచ్చి.

ఈతని నేదే నెపమున
ప్రేతలకడ కంపెవలయుఁ బ్రేమమహత్వ
బా తరుణులచేఁ గను నితఁ,
డీతని తత్వంబుఁ దెలియు నింతుల కనుచున్.

(శ్రీకృష్ణసందేశము - (4-5-6)

ద్విరదగతి రగడ :-

ఉద్ధవా! యీసుపో కుఁడె నా కిందుండ
బద్ధమైమనసు, వ్రజ వాసులన్ విడకుండ
మందబాలురఁగూడి మందిగా వని నాల
మందలను మేపి, సమ్మదమందు, నాలీల
కన్న గాంధ్రనుబోలి. కడవగ న్నము వేసి,
వెన్న పాలు మ్రుచ్చిల్లి, వేడ్కఁజుత్తెడువాసి,
ఆటలను మరగు నా యాకొన్న కన్నెంచి,
పూటపూటకుఁ బిల్చి బువ్వ నను దినిపించు
ఆ యశోదమ్మనె య్యమ్మ, వని మందలం
గాయఁ జనునాటి, పం గాతము లెడందలో
న్మ రపురాకుండె, నా మందబాలుర తీరు,
మురిసి నను మురిపించు,మోహనాంగులసౌరు
గోపమ్మదినిపించు, గోరుముద్దల పసలు,
గోపికల గుసగుసలు, క్రొత్తతది మిసమిసలు,
ఇం దేవి సెప్పుమా! యీపాళమున నన్న!
మందలో వ్రాలఁగా మనసాయె, నా కన్న
అనఘు డుద్ధవుఁ డంత హరిని ప్రేమోన్మాది
యనుకొనుచు జ్ఞాన దురహంకార మెద నూది
అమల నిర్గుణయోగ యమనియమ సంపత్తు

## నిత్యానపాయి రాధాకృష్ణయుగళి



రాధికను విడదీయరా దికను, నాతలపు
రాధికాప్రేమ నారాధించు గొని వలపు

లమరు నధికమ్ములై యలఁతి బత్తిప్రపత్తి
అని హరిప్రేమ లౌల్యముగ జెఱునగవునను
జినచూపునను జూడ శ్రీకృష్ణుఁ డనుకొనెను
అనుకొనిన యట్లు జ్ఞానాభిమానము హత్తె,
ననఘాత్ముఁడౌ నితని కాత్మలో మొలకెత్తి,
అని మాటుమఱుఁగిడుచు, నఖిలాత్ముఁడు, వచించు
బెనుతమిని దత్ప్రేమ వృత్తాంతముఁ దలంచు
ప్రేఁతలపుఁ దలఁపెప్పుడు, విడకున్నదోయి! నన
రాతిరింబవలు, నిద్రా విహారాదులను,
మందకుం బఱువెత్తు, మనసు, నిల్కడ కోడు
నందాంగణమున, నానంద తాండవ మాడు
నందయ్యయు యశోద, నా బహిః ప్రాణములు
మందయానలు గల్గు మంద నా ప్రాణములు
చెరలాడు ననఘ! నా చిత్త మెడబాయ దొక
పరమాంతరంగికము వదనమది వినవె యిఁక
నమ్ము మన్నులమిన్న నా బహిః ప్రాణమ్ము,
సుమ్ము నాసొమ్ముగాఁ జూచు సర్వస్వమ్ము
నాకన్నులకు, మిన్న నగరు కన్నెల మిన్న,
నాకన్న కలశంటు, నాకోర్కె లిడుదంటు,
రాధికను విడఁదీయ రాదిఁకను నాతలఁపు
రాధికాప్రేమ నారాధించుఁ గొనివలపు
ఎందుండె నాబహిః ప్రాణమౌ నారాధ !
ఇం దేరికని వినుతు నీ మా ప్రణయగాధ,!
ఆపూంపుబోదరిండ్లు, నాపూవుబోండ్లు మన,
సాపోవఁ గూడి, సల్లాపమాడెదు నధన
తలపోసిపోసి పరి తాపమందెద, నిందు

లలన లారాసలీలల కబ్బువారెందు ?
విధివ్రాత వితథమై వితగాదుగా యంచు,
వ్యథఁగూరు హరిలోల్క మరసి, దరహాసమున
కంసారి కా ప్రేమ కాతర్యము విదుల్పు
సాంసారిక ప్రేమ సారహీనతఁ దెల్పు
ఉద్ధవుం డిటు లేటి కుద్ధురంబుగ ప్రేమ
బద్ధుఁడయ్యెదవయ్య ! ప్రాపంచిక ప్రేమ
బ్రహ్మతత్వం బొకఁడ పరమసత్య మసత్తు
బ్రహ్మేతరంబైన ప్రాపంచికపుసొత్తు
సంసారమె యసత్తు సారహీన మటన్న
సాంసారిక ప్రేమ శాశ్వతమెటౌ నన్న !
మిథ్యాప్రపంచమ్ము మిడిమేల మెడబాసి,
సాధ్య మొనరించుకొనఁ జను, బ్రహ్మజిజ్ఞాస
అని బ్రహ్మతత్త్వ బో ధాతురుండగు నుద్ధ
వుని బోధవిని వృష్టి పుంగవు డతిశ్రద్ధ,
పెద్దసేసెడు బ్రహ్మవేత్త వీ వుద్ధవా !
సద్దుచేయుట కీవు సామాన్యబుద్ధివా !
గొల్లతలు నా ప్రేమ గొల్లకొను నుల్లమున
దల్లడిల్లుచునుండ్రు తలఁపులఁ దలంచి నను
విరహాకులములైన వ్రేతలయెడంద, నను
మఱపింపు నీ యోగ మహి మోపదేశమున,
శాశ్వ తానశ్వర జ్ఞానపథ మలవఱిచి,
నశ్వర ప్రేమబం ధమునుండి విడవఱిచి,
ఉద్ధరింపుము వారి నుద్ధవా ! యేవడువు
బుద్ధిఁగఱపెద నీకుఁ బూర్ణ తత్త్వజ్ఞుఁడవు
గోకులాంగనల మది కుం దణచి ర మ్మనిన
మైకొనియె హరి యోగ పూర్ణ మని యతఁ డలరే.

సీ॥ మంద పెద్ద యయిన మానంద పెద్దయన్
ముందు సందర్శించి మ్రొక్కుమయ్య।
మా సేమ మెఱిఁగించి మారాధ కన్నవా
రల యింటి కేగి భద్రంబు నడుగు
కూర్మి సుదామముఖ్యుల సంగడీండ్రను
నామాఱుగా గూడి సేమ మరయు.
అలనంద ముద్దరాం డ్రలర నా కుశలంబు
దెలిపి తచ్చింతలఁ దీర్పుమయ్య।

తే॥ మంద నందాలరాసి మామంతిరి యొకఁ
డండె నెలపాత్రియమునఁ బట్టుకండువాను
గట్టి పింఛంబుఁజుట్టి చేపట్టి మురళి
నలుత వనమాలఁబూని నట్టాడుచుండు॥

తే॥ అట్టి మామంత్రి దర్శించి, సావధాన
మతిని నామాఱు నతుల సన్నుతి యొనర్చి
అందఁజేయుము, నా అభినందనమును
మధుర వార్తాప్రసక్తి నెమ్మనము దనియ

ఉ॥ ఏమన దమ్ములిర్వుర మిదే చనుదెంచుచునుంటి మంచు,మా
కై మది నాత్రి మందవలదంచును మందకునేగి మా యశో
దామహిళామతల్లికకు దాదిగఁ దన్ను నుకొన్న దాదిగా,
మా మనసెంతొ నొచ్చెనని మా నుడిగా వినిపింపు ముద్ధవా।

సీ॥ పేరిమిఁ బాలిచ్చి పెంచి పెద్దయొనర్చు
మేలెన్నఁ దేమఱఁజాల మనుము
తన్ను మాదాదిగాఁ జిన్నపుచ్చుకొనంగ
మా యెడ వేవ్రియ్యలాయె ననుము

తన్ను విడిన దాది, "కన్నయ్య" యని నన్ను
పేరుకొనినవారె లేరె యనుము
మధురఁ గుడువఁ గట్టు మహితసంపద లున్న
మది మందచెల్మినే మఱగె నను,

తే॥ పొదుఁగుపాలు లేవు పొద్దుటన్ జద్దిలే
దల్ల మంద విడిన దాది మాకు
మధుర నెన్ని యున్న, మహిత మృష్టాన్నముల్
మనసునందు మిమ్ము మఱవలేము.

ఉ॥ పెంచితి పెద్దసేసితివి, వృష్ణికులీనుల మంచు నేఁడు మ
మ్మెంచి, యొకళ్ళసంతు మనకేలని మెల్లనసాగనంపి నో
ప్పించితి మామదుల్ కుడువఁబెట్టిన సొమ్ముల నొప్పగించి,యే
కొంచెము లేక చేదులఁపుకొన్నటు మమ్ముఁ దలంపవైతిఁకన్

ఉ॥ పిన్నటనాఁడుగాఁ బసులవెంబడి కోసులదూర మేగుచో
వెన్నడి వచ్చి తీ పులుకు వెట్టుచు, నట్టిడివీవు మమ్ములం
గన్నడసేసి వేర్పఱతు కట్టడ । దేవకిగన్న కొన్పుగా
నన్నిఁక నందురాణియొడి నర్మిలికిన్, విధి దప్పౌనర్చెగా ।

ఉ॥ ఈపురి రాజకార్యముల నేపని మాకు సుఖంబు లెన్నొ ము
న్నే పడిగాపులై కొలిచె నేనియు నుద్ధవ । నాతలంపుతో
నోపికలోడు గోపికల కూఱటఁ గొల్పఁగదయ్య । మాకు మే
మై పదినాళ్ళలోన నరుదారఁగ నం దరుఢెంతుమం చెటో॥

తే॥ కొటికదాటించి, మగుడ నీ కొడుకుఁ బుద్ధిఁ
దలఁపఁబోవైతి ! కటికిడెందమ్ము తోడ
యక్కటిక దక్కి నందయ్య ! అక్కటకట
ఒరుల కుడువల సొమ్ముఁ దా మొప్పగించి

తే॥ యొప్పరిక మూని నట్లిందు నొప్పగించి
యని మగుడఁ బల్కు నాప్రాణధనములైన
యల్ల పుల్లావు వెల్లావు లవ్వి నాదు
బెంగతో జిక్కకుండ మేపింపు మనుము

ఉ॥ అల్లరిపిల్ల రాధ యుడుగడ్డునకుం జనుదెంచుచుండి నా
పిల్లనగ్రోవి ముచ్చిలునొ వేఁ గనులం గను పెట్టి చూడుడా
పిల్లకు సందకుండ, నవి పెట్టెనుదాఁచు మటంచు బల్కినా
తల్లికి, నందబాలయ పదంబుల కౌదలఁవాల్చి మొక్కుమా।

8

ఉ॥ ఉద్ధవ! యొద్దుఁగానని వియోగధునిన్ మునుగాడ జ్ఞానసం
బద్ధ మొనర్చి గోపికల బుద్ధుల నన్ మఱపింప వాఙ్మన
శ్శుద్ధిని నిన్నుఁ బంపుదు నచోటికి నిర్గుణ రూపజాతిసం
బద్ధ మనశ్వరంబు నిరుపాధిక మౌ నల బ్రహ్మతత్త్వమున్॥

ఉ॥ శ్రద్ధగ వారికిన్ వినిచి జ్ఞానమె ముక్తినిదాన మంచుఁ, ద
ద్బుద్ధుల జ్ఞానయోగపరమున్ పొనరింపుము శ్వాసవాయు సం
వృద్ధవియోగ దావశిఖి వేగు వ్రజాంగన దేహతూళ్ల మం
దుద్ధుర బాష్పవృష్టి మననోపెదు నింతకుఁ జేతనంబుతోన్॥

క॥ ఇంతకు స్మృతిదప్పక వల
వంతలఁ గొనయూర్పు లూని బ్రతికెడు వ్రజసీ
మంతినుల చింత లణఁపుము,
సంతసపడ వినిచి నాదు సందేశంబున్॥

క॥ ఉచితజ్ఞుఁడ వీవేమని
వచింతున సహాయమైన వారి యవస్థన్

సుచరిత! యూఅడఁబెట్టక
పచరింతెత్రిటు డిటవుతోడఁ బలుకఁగ దగ్నా।

క॥ బృందావని గోగోపక
బృందావని యగుచు నొక్క వేలుపు బ్రోచున్,
డెందాన బీతుఁజెందకు,
మందతుఁ జనువేళ, విపినమార్గంబులలోన్

క॥ ఇవె మందవాడజాడల
వివరించితి వేత్రితలన్ వివేకవతులుగా
సవరించి యెట్లువత్తువొ!
వివేకనిధి!యంచు శౌరి వీడ్కొనె నఖునిన్

ఉ॥ చేకొని జ్ఞానయోగమును శ్రీహరియే శిరసావహించి నన్
గోకుల మంపుచుండె నిటు గొల్లపడంతుల జ్ఞానయోగవి
ద్యాకుశలాత్మలన్ సలుప నంచుఁ గనుల్ దలకెక్క నుద్ధవుం
డేకట జ్ఞానగర్వము వహించుచునుండె హరిప్రశంసచేన్॥

క॥ తన్నంటు! గోపాలుండటు!
యన్నులమిన్నలకు యోగ మలవఱచి మదిన్
దన్ను మఱపించి యెఱుకవ
తెన్నుఁ గఱపఁబంపునంటు, దృఢమతి ననుచున్

క॥ తన్నొకయుపదేశకునిగ
నున్నతి యొనరించి పంపె యువతులకడ కే
నన్నెము పున్నెము నెఱుఁగక
మన్నన శిరసావహింతు మాధవునాజ్ఞన్॥

## కుబ్జా సందేశము

క॥ యాదవపతి యానతిఁ దమి
నౌదలనిడి యుద్ధవుండ కేతెంచెడుచో
నాడటు గుబ్జ యనె యశో
దాదుల కే నూది పల్కినటు లను మనుచున్

తే॥ వెన్న ముద్దల యెరఁజూపి పిన్నవాని
జేసి కృష్ణుని మదవతుల్ జెంగున ముడి
పైచి మరపుకొనిరి తమవంక కిపుడు
పిన్నవాఁ డల్లపెద్దయై యన్ని దెలిసి
చిన్నవోపుచు మీ చేయుచేఁతలకును
మంద నడుగిడఁ దలఁపడు మగుడ నతఁడు
తలచి మీచెయ్యు లొకసారి దలఁచుకొనుఁడు
పరితపించిన ఫలమేమి పదనుదప్పె॥

ఉ॥ కట్టుడు లెన్ని వెట్టినది కన్నని నించుక వెన్నకోసమై
కట్టి యశోద ఱోటఁ బెనుగంబమునన్ దయమాలి మీరు నా
కట్టెడి కెంతొ సాయపడి కట్టెడుతాళ్ళెదురిచ్చి రంచు నే
పట్టున నాలపట్టు నెడపట్టు తలంపిడె మాధవుం డిఁకన్॥

తే॥ కన్న దిపుడింక మీచెలికాఁడు కాఁడు
కన్నవాటును గారుచూ కన్ననికిని
గోపదంపతు లీజాడ గుఱుతెఱింగి
కన్నవారల గుఱుతించి కన్ను దెఱచి
మధుర కేతెంచినాఁ, డన మాధవుఁడును.

క॥ ఒకయెడఁ బ్రేమాస్పదయౌ
సకురా లా కుబ్జచూపు సఖ్యగరిమ,వే

ఒొకయెడ, ప్రేతలచెలిమిని,
నొక( డొ(గా దన(గనేర కూరకయుండెన్॥

## ఉద్ధవు(డు గోకులమున కరుదెంచుట

ఉ॥అ వ్వగలాంగ్రడు కృష్ణవిరహవ్యథ నీర్విడు మాలచందమై
దవ్వులనుండి యొక్క యరదం బరుదెంచుచునుంట గాంచి, వా(
డెవ్వ(డొ గోకులంబుదెసకే మధురాపురినుండి వచ్చులా
గవ్విధి( దోచె; సారథికి నీపురిజూపి వచించు నేదియో

ఉ॥ కంటిమి వీనినిన్ నలుయుగంబులనా( డనునట్టిగుర్తు వా
కొంటకురాదు గాని తలకూడెను బోలికి వేషభూష ల
న్నింటను శౌరినంటుకొనె నెత్తలవెల్గు కిరీట మట్టిదే
యొంటినిగార మట్టిదియు యుజ్జ్వల కుండలదీప్తు లట్టివే!

ద్విరదగతి రగడ :-

అల్లదే! నల్లనా( డరుదెంచు నెవ(డొ మన
నల్లనయ్యను బోలు నలువారు రూపమున
పొడకట్టు నడికట్టు పుట్టంబు నట్టిదే
యొడలితొడవులు నట్టి వొడుపెల్ల నట్టిదే
అరదమున గూర్చుండు హరువట్టి పట్టిదే
యఱుత( బూనిన మాల యానవా లట్టిదే
అచ్చుకట్టిన దిట్టు లతనిరూ పననేల
అచ్చముగ నాహరియె యరుదెంచె నీవేళ
అని గోకులప్రజలు శ్యామదర్శనకాంక్ష(
గనులు గాయలుగాయ( గాచుకొని రాకాంక్ష
తనులు పులకింప గా త్రములు డగ్గుత్తికను
బెన(గ, నమితోత్సాహ పీచు లెద నత్తుకొన
ఎందున్న చెలు లంద యింటిపను లెల్ల విడి

మందలై పఱతెంచి మందవీధిని నెగడి
నందడించి రథంబు సన్నిధికి నేతెంచ
నందు నిందీవర సమాభు నుద్ధవుఁ గాంచి
తెల్లవోవుచు గొల్లతెఱవ లిట్లనుకొంద్రు
చెల్లి! నగరాంగనల స్నేహవాగురలందు
అల్లుకొని సతము కుబ్జాబ్జాక్షి మరగు నా
వల్లభుం డీగొల్లపల్లె కిటు తిరుగునా!
అని సూరదాసవర దాగమము శంకించి
వనరిరి నిరాశలై వనిత లుద్ధవుఁగాంచి.
మందదొర నందయ్య మందిరము మొగసాల
యం దాగు నారథం బరసి చెలు లీలీల
అనుకొనిరి కొంద ఱాయనఘుఁ డక్రూరుఁడే
చనుదెంచెనో మగుడ నందియంబయ్యె నెడ,
మున్నె మన సర్వస్వమును బ్రాణధనముఁగొని
చన్నవాఁ డేటికే చనుదెంచె మగుడ నని
మనయుం దను గ్రహింపఁగనె వేంచేసె నా
యనఘుఁ డనిపించె నని యతివయొ ర్తెన్నఁగనే
హరిసఖుం డుద్ధవుం డాలోన వారికిని
దరిసింపనయ్యె నెడ ధైర్యముం దెచ్చుకొని
మననందనందనుని మాన్య సఖుఁ డితఁడంచు
వినుతించి రతని నా వ్రేఁత లభినందించి
పండె నుద్ధవ! మాభవములు నినుఁగన్నంతఁ
బండి కల నిక్కలగఁ, బాయు నెపుడు కలంత!
నినుగూర్చి విన్నయది నిండునిజ మనిపించె
నినుఁ గన్నయదిమొదలు నిజము రుజువైమించి

నిందుకనికరమునన్ నిందు మెత్తని మది గ
లండ వమెలుండ వకలంకుఁడ వనంగఁ దగు
మంచిమానిసి వంచు మంచిమాటల నెంచి
మంచినీటను మీాల మచ్చునం దులకించి
నెగడి రుద్ధవుని సాన్నిధ్యము నధిగమించి
మగువలు హరిసమాగమన కాంక్షలమించి

సీ॥ గోపియొక్కతె మున్ను గోపాలుఁ డేగిన
దెసనుండి మురళి నాదించినట్టు
వినవచ్చెనఁ బ్రియుం డు వేంచేసినో యని
పఱవ నాయమ వెంటఁబడి పడంతు
లుద్ధవుం డేతేర శ్రద్ధతో నందున
న్నిధికిఁ దెచ్చి యెడంద నిండి పొరలు
హర్షవీచుల మోలలాడి రా నందుఁడున్
హరిసఖు నంత నత్యంతభక్తి

తే॥ నాస నార్ఘ్య పా ద్యాచమ నాదివిధులఁ
గొలిచి మెయిఁ జందన మలంది తిలకము నిడి
యంఘ్రు లర్చించి దూర్వాంకు రాక్షతలను
వలఁగొని శుభాంబుపూర్ణ కుంభములతోడ॥

క॥ హరి యాదవపతి యంపిన
యరిమిలిచెలిమరికి నర్హమౌ మర్యాదల్
మరియాద దప్ప కన్నియు,
జరిపించెను నందవిభుఁడు సమ్మతి నటుపై॥

క॥ హరి యాదర మేదురముగ
మరియాదలొనర్చి పంపె మక్కువచెలి వేఁ

గర మరుదగు నుపదేశము
వెఱవే! పెడచెవినిఁబెట్టు వినరం డనుచున్.

తే॥ నందువాకిట గుమిగూడి సందడించి,
హరిశుభోదంత సంశ్రవ ణామురక్తి,
నుద్ధవుని చుట్టు గూర్చుండి యుత్సుకముసఁ
గుశలవార్తల నడిగి రా గోపసతులు॥

సీ॥ దేవకీవసుదేవ దివ్యదంపతులకు
భావుకంబె! సుకంబె! ప్రార్థివునకు,
వెన్ను నేనాఁడొ, మా వ్రేపల్లె నెడఁబాపి
కొనిచన్న యక్రూరుఁడును కుశలుఁడె?
హరికృపాపాత్రయై వరరూపసౌష్ఠవం
బందిన కుబ్జ యానందయుతయె?
భద్రంబె! శ్రీబలభద్రమూర్తికిఁ దక్కు
చెలులుఁ జుట్టాలకు, సేమ మవునె?

తే॥ శుభయుతుండౌనె! మా శ్యామసుందరుండు?
భద్రయుతుఁడౌనె! మా బలభద్రయుతుఁడు
మోదయుతుఁడౌనె! మా మనోమోహనుండు!
స్వస్తియుతుఁడౌనె! సూరదాసస్తుతుండు.

మ॥ అని కృష్ణప్రియ లంతకంతఁ బ్రియవార్తా కర్ణనోత్కంఠ నె
మ్మనముల్ దొందరవెట్ట నుద్ధవుని వేమా ఱడ్గుచున్ దత్పదా
బ్జ నతోత్తంసలునై యొడల్ మఱచి కృష్ణప్రేమ సాకారమై
చనినట్లుల్ పొడకట్టి చిత్రగతిఁ జేష్టల్ దక్కి కన్పట్టినన్॥

క॥ అల్ల హరిప్రేమ మెదల
నల్లుకొనిన, గొల్లచెలుల, కబ్బినభాగ్యం,
బుల్లమున మెచ్చుచున్ యదు
వల్లభసఖుఁ డుద్ధవుండు, భావించు నెదన్॥

క॥ ఎల్లగతులు దానని, యొకఁ
డొల్లక, తనునమ్ముకొన్న యువిదలకడకున్
జెల్లునె! జోగులవిద్దెలు
వల్లింపింపంగ నన్నుఁ బంపఁగ హరికిన్.

తే॥ నెమ్మిఁ ద న్నెడుగడయని నమ్ముకొనుచు,
గొల్లపల్లెను దనకూర్మిఁ గొల్లకొన్న
గొల్లకన్నెల వలపులా గొల్లకున్నఁ,
జెల్లునొకొ! యుల్ల వల్లవీవల్లభునకు.

తే॥ ప్రేమమూర్తుల, వేతల ప్రేముడి ముడిఁ
ద్రెంచి తెగఁద్రెంచుకొన నుపదేశమొసఁగి
జోగపుంబెర్వు గఱపు నీజోగిపనికి
నేల ననుఁ బంపె నయ్యయో! బేలఁజేసి॥

క॥ తనుమఱచి తన్నుమఱపిం
పను ప్రేతల కెఱుకఁ బూన్పఁ బాడియె? హరికిన్
దనలేఖఁ జదువఁ బ్రేముడి
కనునీ రద్దుకొనెఁ బ్రేమకాతరల కనన్॥

మ॥ అని లోలోఁదలబోసి యాసతుల ప్రేమౌత్సుక్యముంగాంచి ధీ
రనుసంధించిన సఖ్యభావమునె లక్షాంశంబె! నాజ్ఞాన మం

చని సిగ్గిల్లి యెడంద(గ్రందుకొను జ్ఞానాహంకృతుల్ డింద(గ
న్గొనలన్గూరు ముదశ్రులొత్తుకొనుచున్ గొండాడె నాధన్యలన్

ఉ॥ ఆవిధి( బ్రేమమూర్తుల వ్రజాంగనలం గని సఖ్యభావసం
భావను(డౌచు నుద్ధవు(డు పైపయి నూనుల( గొంతసె పెదో
పోవడి(బుచ్చి తన్ను హరి బోధమొనర్చ(గబంచు తత్త్వ మం
దా విరిబోండ్ల కెల్లను వెలార్చ(గడంగెను దేశికుంబలెన్॥

ఉ॥ కామినులార ! మోహమమకారములం ద్యజియించి భూరి మా
యామయి సంస్కృతివ్యథ బయల్పడి పాయు(డి ప్రేమబంధముల్
నేమముతోడ యోగసరణింజను సాధన మభ్యసించి జ్ఞా,
నామలవృత్తి శాశ్వతు ననంతు ననశ్వరు నీశు( గాంచు(డీ॥

ఉ॥ జ్ఞాననిధుల్ ఋషుల్ మునులుసైతము నా పరమాత్మతత్త్వ సం
ధానమొనర్చి యాత్మల( దుదల్ మొదలున్ గనుపట్ట రన్న చో
గాన(గలారె. బ్రహ్మమును గామినులీరలు ప్రేమలోలులై
మానిమమత్వ మూను(డుసమత్వము గన్గొను(డాత్మతత్త్వమున్॥

అని శ్రుత్యంతము బ్రహ్మతత్త్వము నుపన్యాసం బొనర్చన్ వ్రజాం
గన ల య్యాదవు(డాడు నిర్గుణ నిరాకారార్చనం బొల్లకే
ముదు బీయూషరసాభిషిక్తమగు లేమొల్కన్ విషజ్వాలపా
ల్పొవరింపంబడినట్లు బిట్టవిసి జూవుల్ నేలకున్ డించుచున్.

వనజాక్షాప్తున కిట్టులాడి రెదురై వాదింప మేమెంత నీ
కనఘా, యూహ కెఱుంగరాక మది డాయన్రాక సాజంబుగా(
దను జ్యోతిర్మయు(డై సదా భ్రుకుటిమధ్యస్థాయియై పొల్చు న
న్న నిరాకార పరాత్మతత్త్వ మెఱు(గన్శక్యంబె మాబోంట్లకున్॥

బ్రమయ కారయ లోఁ గంటఁబడున్నఁటు వెలి
గంటికానవి వెలుఁగంటు కన్ను బొమ్మల
నడుమ నాతనినెలవంటు, నాశరవాతుఁ
డంటు, జ్యోతిర్మయుండంటు, యంటుఁడంటు.

తే॥ అలమి వెలిగంటు లోఁగంటు నచ్చుకట్టి
యాత్మ నెలకొన్న మురళీధరాకృతి విడి
నందనందన ప్రేమసంధాన ముడిగి
గోడపైబొమ్మ లెవ్వాఁడు గొల్చు చెపుమ !

క॥ సగుణోపాసనఁ దగిలిన
వగు మాచిత్తములు నిర్గుణారాధన మన్
దగులమునఁ దగులుకొన వే
పగిదిని, నీ వెంతబాధపడి బోధింపన్.

తే॥ అబలలము యోగసాధన మరయఁగలమె !
కంటఁగనుపట్టు నోముఁ లపంటు నంద
నందన ప్రేమతత్త్వసంధాన ముడిగి
కంటఁగన వీనువిన, నొడలంటరాక,

తే॥ నుడులకంటక, ప్రాణుడికడలకంటు,
రూపురూపింపరాని నిరూపనిర్గు
ణాత్మక బ్రహ్మతత్త్వ మే మరయ మిట్టి
నేలవిడిచినసాము మాకేల సామి !

ఆ॥ కనులకింపొనర్చు కనుపంటు హరివీడి
యెడకు నుడికి నొడలి కెఱుకరాని
కొఱకరాని యట్టి కొయ్యదేవయ్యలఁ
దలఁపుమందు వేల! వలపుమాలి.

ఆ॥ కనులనిండురూపు గలవానిఁ గనుపండు
వౌనరుఁపగలవానిఁ గనఁగలాని
గనక కల్డొ లేఁడొ ! యనుశంకఁ గలఁ గాంచ
వలయువాని నేల దల్పవలయు ?

క॥ లోఁగన్నిర్గుణమతమున
లోఁగొందువె ! మమ్ము నీపలుకులకు నీవే
లోఁగన్నెఱుఁగవు వెలిగను
లోఁగన్నున్ సొట్టవడెనొ లొట్టయువడెనో !

ఉ॥ పుట్టడుఁ గిట్టఁ డెట్టి తలపోతకు నందడు రూ పొకండు చూ
పట్టదు తల్లిదండ్రులగపట్ట ర వానికిఁ బ్రాణుడుల్లు సే
పట్టెడు యత్నమాత్రములఁ బట్టువడంజనఁ డా యనిశ్చితుం
బట్టఁగరాని బ్రహ్మము నుపాసన జేసిన నేమి లాభమొ !

సీ॥ కరపదమ్ములులేవు పరమాత్మ కందు వె
క్కరణి ఱోటంగట్టఁగలిగె నంబ ?
రూపురేకయులేక రూపించునందు వే
రూవున గోపమ్మ ప్రోచిపెంచె ?
ముఖరసనాహీనుఁ డఖిలాత్ముఁ డందు వే
వగఁ జిల్కపల్కులఁ బల్కనేర్చె
నింద్రియరహితుఁ డ య్యీశ్వరుం డం డెటు
చినవాటు వెన్నముచ్చిల్లి కుడిచె.

తే॥ నెట్టుక నవచ్చు లోఁగన్ను లొట్టఁబడిన
వాని కిగుట్టుమట్టు లేమైనఁగాని
కన్ను మూసిన విచ్చినఁ గానవచ్చు
వ్రజకిశోరంబు పరమదైవంబు మాకు.

తే॥ బాలకృష్ణుని సగుణరూపంబు మాకు
పరమసముపాస్య మొండొక పలుకులేల
కనులు విడు మూయునెడల సాక్షాత్కరించి
యెల్లవేళలఁ గన్నులఁ జల్లపఱచు
నల్ల ప్రత్యక్షదైవమై నల్లనయ్య
మురళి నూదుచు మువ్వంపు మూర్తితోడ.

క॥ నిన్నొక తగవడిగా నిడి
యన్నము పున్నము నెఱుంగ కడిగెద మన్నా!
మిన్నయొ ప్రేమము? నేమము
మిన్నయొ? రెండింట నేది మేలొఁ జెపుమా!

క॥ ఇత్తడి పుత్తడు లెవొ స్థిర
చిత్తుఁడవై రెంటినేర్చి చెపు మెద్దానన్
నెత్తలఁ ద్రెంచియు బ్రియులకు
నిత్తురొ శంకింప కట్టిదే మే లననొ॥

తే॥ ఏడఁ దిరిగిన మదికి గట్రూడనంగ
జను సగుణరూప కాశ్రయంబును ద్యజించి
తము నిరాశ్రయ మవునె చిత్తములు చూడ
రూపుజాడలులేని నిర్గుణుని నమ్మ.

ఉ॥ అద్దిర! మమ్ముబోంట్ల జవరాండ్రకు నిర్గుణపాఠముల్ దలన్
రుద్దఁగజూతు విట్టి యపురూపపు జప్పిడివిద్దె నేర్పఁగాఁ
బెద్దగ ముద్దరాండ్రె కనుపించిరె యుద్ధవ! నీదుబుద్ధి కీ
సుద్దులు మాకెవారికిని జొక్కవు వచ్చినదారిఁ బట్టుమా.

ఉ॥ పద్దుగ మాకు బుద్ధిఁగఱుపం జనుదెంచిన పెద్దమానిసుల్
సుద్దియు బుద్ధిమాలి రిటు జోటుల కంటెను దామె ముందు పై
సుద్దులు పెక్కులాడుచును జోగపువిద్దెను బల్కి మా తలన్
రుద్దఁగఁ జూతు రద్దిర! నిరూపకతత్త్వము నూటిపోయుచున్,

ఉ॥ తిన్నగఁబల్కు మాపలుకుతెన్నె యెఱుంగవు లోనికన్ను బై
కన్నులు లొద్దవోవ నెటు కన్గొననేర్తువు సారసూక్తి మా
కన్నను బుద్ధిమాలి మము గాననివారల నుద్ధరింప నే
తెన్నున వచ్చితయ్య! మముఁ దేర్పఁగ దీర్పఁగ బ్రహ్మవిద్యలన్.

ఉ॥ ప్రేమమె ప్రేమమూలమగు విశ్వమి దెల్లను బ్రేమబద్ధమౌ,
ప్రేమమె మోక్షసాధకము ప్రేమమె జీవనముక్తిహేతువున్
బ్రేమమె జన్మసార్థ మొనరించును బ్రేమమె తారకంబు, మా
ప్రేమమె నిక్కమౌనెడ లభించెడు నందసుతుం డవశ్యమున్.

గోపికాగీతము 18-19

ఉ॥ వ్యాపకుఁడంచు బ్రహ్మమయుఁడంచు శ్రుతుల్ వచియించుఁగాక మే
మేపగిదిన్ భజింతు మెదఁ గృష్ణుని గోపకిశోరభావమే
శేపకడన్ సఖుల్ గొలువ గ్రేపులమేప వనోర్వికేగి ము
న్మాపటువేళ వచ్చు హరిమంజులమూర్తిని గాంచియే చుమీ!
పాపవిదూర!యేము మనువారము, చల్లగ నెల్లవారమున్.

మ॥ పరిపూర్ణుం డవినాశి విష్ణుఁడు పరబ్రహ్మంబు త్రయ్యర్థమున్
దరిఁగన్గొని మహాప్రభావుఁ డని యిందాకన్ వివాదింతు వె
వ్వరినింగూర్చి? గ్రహింపలేక మగుడంబ్రశ్నింతు మా కంసభూ
వరుఁ జక్కాడిన వాసుదేవుఁ డెవరో వాకొందువే యుద్ధవా।

సీ॥ అక్రూరువెంబడి నరదాన మధురకు
బయనంబు గట్టిన బలియుఁ డెవఁడు

చాకి దారింగొట్టి కోకల నాకట్టి,
తెలిమడువులఁ గట్టి దిట్ట యెవఁడు?
కంససభాస్థలిఁ గల మేటివిలు ద్రుంచి,
వెస పేన్నుఁ బీన్నుగావించె నెవఁడు ?
చాణూరు ముష్టికుఁ సదమదం బొనరించి,
కంసు నుగ్గాడిన గండఁ డెవఁడు?

ఆ॥ అనఘు నుగ్రసేను, నా దేవకీవసు
దేవులఁ, జెఱవాపు ధీరుఁడెవఁడు ?
మధురనెలవు మరగ మందమఱచె నెవం ?
డాతఁ డీవు పొగడు నాతఁడగునె ? ॥

16

ద్విరదగతి రగడ :-

ఎందుండి యేతెంతు వే తుమ్మెదా ! యిందు
నందనందనుఁ డంపి నాఁడేమొ యనుకొందు
అల్ల కృష్ణునివోలె నగపడుచునుం టీవు
నల్లనై పచ్చనౌ నడికట్టుబడి తీవి
మున్నె, మాపర్వస్వమును వెంటఁగొని చనెను
వెన్నుఁ డింకేది తే, వ్రేపల్లె కంచె నిను ?
మాకున్న మన సొకఁడు, మధురఁదోడ్కొనిపోయి,
చీకుఁజింతయులేక చెలఁగుచుండెను హాయి,
కలరు వగలాండ్రు పెక్కండ్రు, మధురానగరి,
వలచి వలపించుకొను, వలతులే యొక్కొకరు;
నిను మెచ్చుకొను మేటి నెఱజాణ, లుం డ్రందు
జను మటుకు, నిటుకు రా జాణతన మే మందు!
పల్లెపడచులకునై పరివి రానేల ! యెడఁ

బల్లవింపఁగఁజేయు పల్లవాధరుల విడి
నల్లవారల యెల్ల నైజములు గనవచ్చె
నల్లవారెందున్న నైజంబు లోకమచ్చె
కనవచ్చు నీమెచ్చుఁ గని మెచ్చు నాగరాం
గనల నేస్తము వీడి కదలిరా బాగురా!

**19-20**

తే॥ భ్రమర! నీవిటు రేపాడి పాడిపాడి,
నోట లాపాడు దెవ్వనిపాట సెపుమ!
మాతులుని జంపి, పేరుప్రఖ్యాతిఁ గన్న
మేటిమగవాని కీరితిపాట యేమొ!

క॥ నీ కల్లబొల్లి పాటలు,
మాకెల్ల నెఱుంగరావు, మఱియొకమా టే
మూకొన వాకొనవే! నీ
వే కదుపులనుండి వత్తు, వెంతు వెవానిన్.

క॥ అఱుత వనమాల కేలను
మురళియు, మాయూరపింఛముకుటము తలపై
వరలఁ, గనువిందుగాఁ బురిఁ
గిరలుచుఁ దిరుగాడునొక్కొ! కృష్ణుం డెపుడేన్!

ద్విరదగతి రగడ :-

గోకులావాసలము, గోపాలదాసులము,
మాకులము, గోకులము మన్నించు వ్రజకులము,
ఆ యశోదా సుతో పాసనా లోలలము,
తీయమున హరిసజాతీయలము, సకియలము,
గోబృంద సహచారి గోవర్ధనోద్ధారి,
మా బాలకృష్ణుఁడే మా మానసవిహారి

కృష్ణప్రేమవాసినుల మే మెల్లవారలము
కృష్ణునే యెడ్డడగ నెడ నమ్మువారలము.
నందుఁడే మారాజు, నందపత్నియ రాణి,
విందౌను విహరింప బృందావనక్షోణి,
మా యమునవాకయే మాకురత్నాకరము.
మా యాలపట్టె, సంపదకెల్ల సాకరము,
అష్టసిద్ధులు లెంకఁలై కొల్చునో యన్న!
ఇష్టదైవము ప్రాణహితుఁడు హరి మా కెన్న

21

ఆబాలగోపాల మండలము మా మంద
నా బాలగోపాల కారాధికల మీఁద
మందులేన్ వినరు మా మంద నీబోధనము
మందుకేన్ గొనరు నేమము యోగసాధనము
నీవుగలపెడు, యోగ నిష్ఠ లూనెడువారు,
కైవల్యకాము లా కాశీపురిఁ గలారు,
కొందు రీకొందు రా కొందు రీ యోగంబు
అంద చని బోధింపు మనఘ! నీ యోగంబు
నందనందనుఁ డెడఁద నగరుమక్కువ జేసి
మందప ట్టెడబాసి, మ మ్మనాథలఁజేసి,
తను మఱచి యోగసాధనము నవలంబింపఁ
బనిచె, నే యపరాధ ఫలమో యనుభవింప
తానెంత మఱచినను ధత్పదధ్యానమ్ము
మానఁ బో వనయమ్ము, మామనమ్ములు నమ్ము
కసిపట్టి రాహు వటు గళపట్టు పట్టినను
విసివి స్రాజపుజలువ విడని నెల్లమచ్చునను
ప్రేమసముపాసినులఁ కృష్ణవిరహిణు లీరు

శ్యామసుందరు మఱవఁజాలుదా రేతీరు ?
ధనరాశి, మా ప్రాణధనరాశి, హరిఁబాసి
పెనుముత్తి నాసింప వేలలమె ? యెవ్వాసి ?

కం॥ గ్రంథగత జ్ఞానము నను
సంధించుచు గనులుమూసి సంయమధరుఁడై
బంధము విడి బ్రహ్మము నను
సంధించి తరించుఁగాక సాధకుఁ డెవఁడేన్.

**22**

తే॥ అట్టి యోగసమాధి నిష్ఠాత్ముకంటె
కృష్ణుఁ బ్రాణప్రియునిగూడి రేవగళ్లు
జట్టుముట్టుక జతవట్టి చెట్టఁబట్టి
కంటఁగాంచుచు నొడలంటి కఱవుదీర

సీ. ప్రియముఖాలోక సుఖసుధాబ్ధిని సతంబు
మునిఁగితేలుచుఁ బ్రొద్దులుబుచ్చు ప్రేమ
సిద్ధలౌ ప్రేయసులె, ధన్యజీవన లిల
సూరసుందరుఁ జూపులఁ జూఱగొన్న
నీరసం బనిపించు, సంసార మెల్ల

క. ప్రాణమ్ము లొంటనుండఁగ
ప్రాణప్రియుమఱచి,యోగభరమెటు కొననౌ
బ్రాణములతోడ నబ్బని
ప్రాణాంతక యోగమూని పడయున దేమౌ?

తే. శ్యామసుందరు ప్రేమరసామృతంబు
జవిమరగువారి కీ యోగసాధనములు
రుచిగొలుప వింత పెరువుపాల్ గ్రోలు నోటి
కల్ల పులుచల్ల గడువెగడై నపగిది.

తే. అరయుఁ డమ్మరో! దొడ్డబేహారి యొకఁడు
నిర్గుణజ్ఞాన యోగ సన్నియమభరముఁ
దెచ్చి మనమందలో దింపి తిష్ఠవేసి
తలకు బరువెక్కె నా ప్రాఁతనిలువసరకు

తే. మనలఁ బెనువెట్టిగొల్లల మని తలంచి
రుద్ధఁజూచెను మన తలఁ ద్రోసి యతఁడు
గుంజుఁగొని గింజ రూకఁగై కొనుచు నూక
మాఱకం బిచ్చుమచ్చున మన హరిపద
తోయజ ప్రేమ ముచ్చిలి, మాయదారి
గద్దు జడదారిమత మంటఁగట్టఁజూచె

తే. మాధవ ప్రేమమాధురి మరగు మనము
నీరస జ్ఞానయోగంబు నేర్వగలమె ?
మాధవప్రేమ మాధురి మాఱటునిడి
నీ నిరాకార నిర్గుణ నీరస మత
మేరు గైకొంద్రు జోగపుబేరగాఁడ!
చాలుఁ నీ జోగపుంజోలిఁ జంకఁబెట్టి
తడయ కేగుము వచ్చినదారిఁబట్టి.

గ॥ నచ్చి మది నీదు బోధపు
టుచ్చునఁ బడువా రెవార లుద్ధవ! చనుమా
వచ్చినదారెని, హరిఁ దో
డ్తెచ్చిన నిచ్చెదము బహుమతిన్ మనసారన్.

24

క॥ మాపల్లెను నీయోగ
వ్యాపారపుగీలు సనదు బైరాగిమతం
బేపగిదినిఁ గృష్ణప్రే
మోపాసిను లీయకొందు రుపదేశములన్.

తే॥ కృష్ణ పాదానురాగ రక్తిమఁ దదన్య
యోగసాధనబోధ మింపొదవ దెదల
జోగపుంబేరి ! నీ మాయిజోగి బేర
మొకఁడు గొనఁ డెద నీకొనఁడూకొనండు.

క॥ నిష్కామ యోగభర మా
విష్కార మొనర్తు తెచ్చి వ్రేతల కీవే
నిష్కాముఁడవై మగుడుము
నిష్కృతి నీ యోగభరము నెత్తలఁ గొనుచున్.

తే॥ మా తలల నంటుగట్టు నీ వ్రేఁతలమున
గంప దింపితి జ్ఞానయోగంపు సరకు
బేరమిది యింపొనర్ప దో బేరగాఁడ !
అలఁతి కూరాకునకు ముత్తెములను మార్చు
పగిదిఁ గారుప్పునీళ్లకై పాల విడిన
తెన్ను నను, ద్రాక్షవిడి, వేముఁదిన్న యటులు
నిర్గుణ జ్ఞానయోగము నీరసంపు
సర కెవరుగొండ్రుఁ ప్రేమమాధురిని విడిచి

క॥ పరమార్థ సార్థవాహుం
డపుడెంచి సుకారియెడ్లయటు మోచుచుఁ దా
బరమ పురాణభరంబును
బురి దింపెను యోగవిద్యఁబూన్పఁగమనకున్

తే॥ ఇరుకటారులు నొకయొర నిఱుకటమయి
యిముడని విధాన హరిప్రేమ యిరవుకొనిన
మా మనంబుల యోగసమాధులకును
జోటు లేదయ్య! చిన్నికృష్ణునకుదక్క

సీ॥ మా ముద్దురాంబ్రడనెమ్మదుల నీ యోగంబు
ముద్దుల ముద్దర లద్దుకొనవు
దనియాలు వ ల్గొక్కతావునఁ, బండవు
వలపు యోగపుఁదలం పలర దొకట
దంతితో నరుఁ డిక్షుదండముల్ నమలునే!
మునులతో సతి యోగముద్రఁగొనునె ।
అట్టొ రొట్టియొ పిట్టొ యారగింపక వట్టి
గాలిఁ గ్రోలిన వేనికడుపు నిండు?

ఆ॥ కనులకఅవుదీర్చి కనుపండు వొనరించు
కట్టివేల్పుచెలిమిఁ గాలఁదన్ని
నిలచుజాడలేని నీ నిరాకార యో
గమ్ముఁ; బూన వేని కడుపునిండు.

క॥ మాతో వితండవాదముఁ
జేతు, వి టీ పాపమేమి? శ్రీకృష్ణసఖ
క్రీతములౌ మా తలఁపుల
నీ తాత్త్వికబోధ లతుకనేర్చునె! అనఘా!

26

కువెంపు :—
కనులఁగనకుండ వినుకలిని వినకుండ, జగ
మున కవల వెలుఁగుఁ గనుఁగొంచూ, యోగని
ష్ఠను "జ్యోతిజ్యోతి" యను కొంచూ, గూర్చుంద్రు
ఘనయోగనిష్ఠులై మును లట్టియోగంబు
మొనపి మా సఖునిపై ననురక్తి, మఱపింతు.
కువెంపు :—
మంచితన మెదొ నీ సమంచితపు యోగమున,
యెంచి తెలుపుదె తేఁటి ఱేఁడా! నందబా

లాంచిత ప్రేమ మది యేడా! ప్రేమ నిర
సించి వనులవసించి మించు నిష్ఠల నుపా
సించి తాపసులను ష్ఠించు యోగ మదియేడ!

తే॥ మధుర మురళీనినాదము, మదుఁలగరఁచ
ప్రేమసమ్మోద రసధునుల్, వెల్లివిరియ
గేళిఁ బెనఁగొని చెట్టపట్టాలు పట్టి
కేలుదీ వెలఁ బ్రియుమెడఁ గీలుగొలిపి

తే॥ ఇలువడియు లోకమర్యాదకోలఁడఁ గనక
రేల బృందావనిని రాసలీల లాడి,
ప్రేమరసకంధి నోలాడు ప్రేయసులకు
యోగ తిక్తౌషధముఁ గ్రోల నొసఁగఁదగునె!

27

చ॥ అగముఁ డపారుఁడైన పరమాత్మునిఁ బట్టగ యోగదండమున్
మెగపుగళాసమున్ జడలు మేన విభూదియుఁబూసి జోగపుం
దగులము నెవ్వ రూనుదురు ధ్యానసమాధి నెడంద నిల్కడన్
వగవఁగనేల, మ్రోలఁ గనుపట్టుహరిన్ విడి బ్రహ్మ నారయన్?

క॥ హరిఁ బ్రత్యక్షనిధానము
మరగిన మా మదుల మలఁచి మఱపింతతనిన్
హరినీలమణిని గా దని
పరతత్త్వవిభూతి నెవఁడు బడయఁదలంచున్?

28

ఉ॥ మందరధారి యబ్బినను మంచిద మంచిద యబ్బఁడేని మా
కందును మేలికీర్తు లుభయమ్మునఁ గొంచెపుజాతి గొల్లలా
మందపడంతు లేడ బసుమందలఁగాచు కులం బదిందిరా
సుందరుఁడేడ! యచ్చెలులసొత్తయి తత్సహపంక్తిఁ బొత్తు బెం

పొందగఁ గూరుచుండు నిగమోక్తులకున్ మునియోగనిష్ఠకే
నందని వేల్పు నందసుతుఁడై నెలవందెను మంద నంచు బే
రందిన కీర్తిఁ గాంతు మెటులైనను ముక్తి యెవాని దాసియో
నుందు పచింపవే! యుడుగుమట్టిద మాటికి యోగమేటికిన్?

తే॥ విసిగి వేసారవేసారి వినుచ కయ్య!
జోగపుంబాట నడుగుల సాగిపడుదు.
మల్ల మాస్వామి హరి నొల్ల కన్యవాంఛ
వలచువా రమ్మకాన్పుకు బరువుచేటు.

## 29

కువెంపు :-

కన్నుఁగవఁగని జన్మసాఫల్య మందె నా
చిన్నారి కన్నయ్యరూపూ యోగంవుఁ
దెన్ను నలవఱచి యారూపూ మాతలఁపు
తెన్నునుండి మఱల్చి వెన్ను మఱపింప మా
కెన్నో యుపదేశముల మిన్నంటఁ గఱపెదవు

కువెంపు :—

మాయోగ మాలించి మాధవుని మఱువుఁ డని
వేయేల సెప్పంగఁజాలూ_శ్రీలోలుఁ
డే యెఱుఁగు మా తలఁపుజాలూ_సర్వాత్ము
డా యనఘ గుణరత్నతోయనిధి కృష్ణనిధి
వాయు మణిఁగొని దుమ్ము పోయుదువె మానోటు.

కువెంపు :—

నట్టడవి నెండవానలకోర్చి మును లూను
నట్టి యోగసునిష్ఠ లేడా! స్వామి! మా.

యట్టి కోమలు లూనుటేడా! వజ్ర మి
టైట్టె చూర్ణంబవునె బిట్టువిసి నుసియవునె,
వట్టిచేతులతోడఁ బట్టి పగులంగొట్టి

కువెంపు :—

నీతత్త్వమున సనదు మాతృష్ణ కృష్ణసం
ప్రీతి సుధఁగా కెన్ని యేళ్ళూ-సెలయేళ్ళు
శీతలస్వాదువులు నీళ్ళూ-నిండార
స్రోతసులఁ బాటినను స్వాతిఁ జినికినచినుకె
చాతకము దగఁ దీర్చురీతి దగదీయుఁబ్రీతి.

క॥ మత్తమధువ్రత! నీ యీ
జిత్తులు గనవచ్చె సత్తు చిత్తని యేవో
మెత్తని మాటలతో మా
చిత్తము మఱపింతు కృష్ణచింతన ముడుగన్॥

వాతెఱ తేనెసోనల నవారిగ నానఁగనిచ్చి యెన్నియో
రాతిరు లూనుపోఁ గడపి రాసవిహార వినోదలీలలన్
వ్రేఁతలు పిన్నటన్ వలవఁబెట్టిన నందులచిన్నవాఁ డిటుల్
వ్రేఁతలపుం దలంపువిడి వ్రేఁతల నింతగఁ జుల్కసేయునే!

క॥ చెవిటికి గీతాలాపము
లవిధిని వినిపించినటు వృందాయాసము మా
యవిరలపుఁ బ్రేమతత్త్వము
వివరింపఁగ నీకు నో వివేకనిధానా!

క॥ ధర దున్నుదున్న వీణా
స్వర మధురిమ, మూగ మాట సౌరస్యము, ద
ర్దుర మరవింద మరందము,
నరసికుఁ డనురాగమహిమ మరసియు గనునే

తే॥ నందసూనుఁడు మధుర కేనాఁడు నసెనొ
కాని మా కెండ్లుబూం డ్లయ్యెఁ గాచుకొనఁగ
సరససల్లాప సుఖవిలాసములఁ బ్రియుని
నెనయు ప్రొద్దింక నటుదెంచు ననుచుఁదోఁచు

31

క॥ అరవింద మరందముపసఁ
బొరుగునగల కప్ప బ్రతుకుపొద్దుల నెపుడే
నరసి కనఁగలదె నీరస!
యరసిక ! నీ కేల మా ప్రియాలాపమ్ముల్.

ఉ॥ సాగరసంగమంబునకు సాగు తరంగిణి, దారి నడ్డువా
నాగమ శైలసంతతుల యడ్డు గణింపదు; తమ్మితేనెకై
మూఁగు మధువ్రతమ్ము దళముల్ దను మూసెడుఁ బద్మకోశమం
దేగతి నా నిరాశఁగొన, దెక్కటిపో టొక లెక్క సేయకే.

ఉ॥ వీఁగక పోరునం దుముకు వీరుఁడు; ప్రేమపిపాసు లట్టులే
యూగరు వీఁగరుం బ్రియసమాగమ సాధన మెంతయడ్డినన్
లోఁగరు లోనిరాశపడి లోకువగారు, హృదీశుఁ డబ్బఁడేన్
సేగిఁదలంప రాతఁడు ససేమిరయన్నఁదలంప నోటమిన్.

32

తే॥ ఇంటఁ గూర్చుండి పంతాలుఁ గొంటుగాదు
సయిఁచి యెఱుఁగుదె! యెన్నఁడేన్ బ్రియవియోగ
మలసి వలవంత సొలసి యుగ్గలపు వలపు
నిలుపుకొనుఁ గాని నిక్కపు వలపుకత్తె

తే॥ పెఱతలఁపు లూననొల్లదు ప్రియవియోగ
దుస్సహవ్యథ కడలదు తొణఁకఁబోదు
కాపురపువాఁక మాకు మోకాలిబంటి
దేటి కిది యోగనౌకతో దాఁటవలయు !

క॥ సింగం బాఁకటఁ గ్రుంగియుఁ
జెంగలిఁ దీననట్టు ప్రేయసియు వలవంతన్
బెంగటిలి క్రుంగియున్ బ్రియు
సంగతివిడి తలఁప దొండు, చన వుడ గ దెదన్.

క॥ మురళీగాన సుధన్ జవి
మరఁగిన వించెయికి జేఁదుమం దగు నీ యా
వరతత్వముఁ బట్టింపకు
తెరువరి! మా కల్ల కృష్ణదేవుఁడె దిక్కౌ

33

ఉ॥ పాడినపాటె పాడుదువు పల్కులు, యోగము యోగ మంచు రా
పాడుచు యోగ మంటఁగొలుపన్ వ్రజకాంతల కేమిపాడి రే
పాడి హరిం గనుంగొనక ప్రాణము లూన రనంగ నట్టి పూఁ
బోడుల యిచ్చ నెట్టిముడు బూర్ణుఁ డనంతము నిండుబ్రహ్మమై॥

క॥ మరగి మనమ్ముల నమరి భ్ర
మరకీటన్యాయమునను మా మానసముల్
మరలిచికొనెఁ దన్మయముగ,
మురళీమోహన కిశోరమూర్తి తనంతన్.

కం॥ మా యెడలం గ్రిమికీట
న్యాయమునన్ మార్చి తన్మయమ్ములు గాఁగా
మా యస్తిత్వముఁ బాపఁగ
నీ యోగం బెచట నిముడ నేప్పను జెపుమా!

34

కువెంపు :—

చిన్నికృష్ణయ్యతోఁ జిననాటి నెయ్యమ్ము
నెన్నఁడేమఱతుమే మెందూ అతని కత

తెన్నియుని వర్ణింపఁ గందూ-అవి తలఁచు
  కొన్న మది మైమఱపుఁ గొందు మాతని తీరు
తెన్ను లా నగుమోముచెన్ను మఱతుమె మేము.

కువెంపు :—

పసమించ వినుపించు వంశగానము విన్న
  వసిఁడి నిగపట్టు పుట్టంబూ-గట్టు నా
పసులకాపరి సోయిగంబూ గన్గొన్న
  విసమట్టు నీ యోగవిసరమ్ము గన్పట్టు
విసిగింప కన్న ! అచ్చెసపఱచి గమ్ము

కువెంపు :—

ఎడనెడన్ గను మూయు నెడల విచ్చెదునెడల
  బొడకట్టు వల గొల్లవాఁడూ-నూ మంద
కడలిఁ బొడమిన చిన్నవాఁడూ మా స్వామి
  అడుగుఁదమ్ములతోడు వెడఁగుమాటలు గా వి
వెడ లంటి యొండొకని కెడమీఁడు నిండుకొని

హరిగతి :—

  గోకులవిభుఁ డెడఁ గుదురై నిలువఁగ
  నాకులపా టిటు లందుదు మేవగ
  చీకుంజింతయు ఁజింతాకంతయు
  సోఁకదు సోక ద నూయు రవ్వంతయు,

35

కం॥ చెవినిడి యాలించెదు వా
  రెవరో ! నీ యెదురువాద, మీ కుటిలోక్తిన్
  దవులుకొని యోగనిష్ఠల,
  నవలంబింపంగ నబల లర్హా లె ! చెపుమా ?

సీ. లొట్టముక్కుకు నత్తుఁబెట్టు తలంపును
 సొట్టచెవికిఁ బోఁగుజుట్టు మనసు
బట్టతలకును బాపటఁదీయు ముచ్చట,
 పులుముమేన జవాదిఁ బూయు తలఁపు,
గాజుకంటికిఁ గాటుకంబెట్టు పూనిక,
 చెవిటితో మంతనాల్ సేయు కోర్కి
కాదొకో మా గొల్లగరితల కి బ్రహ్మ
 తత్త్వముం గఱపు వృథాశ్రమంబు,
తే. నీవు తెచ్చిన యోగసందేశ మిద్ది
 ప్రాణసఖుఁ డంపెఁ గాన సంభావ్య మయ్యె
 విషభరిత నారికేళంబు విధమునఁ దలఁ
 దాల్పఁదగినదె కాని లోఁ దలఁపఁదగదు.

36

కువెంపు :—

మంచిపనిఁ జేసె నా మధురలోఁ గుబ్జ గా
 వించు నల వింత చెద్దయంబూ అది యాల
కించినం దనిసి చిత్తంబూ-చల్లగ సు
 ఖించు నది చందన మొకించుక యలంది మెయి,
గాంచనాంబరుని దక్కించుకొనెఁ బొంచుకొని

కువెంపు :—

మున్ను దానొకమాఱు ముచ్చిలిన రూపవల
 సన్నామగుణము లెన్నండూ మగుడ నీఁ
డన్నట్టి మాయి కన్నండూ అకుబ్జ
 పన్ను పన్నికలోన దన్నుఁదాఁ గొలుపడి
తె న్నెఱుఁగకే చిక్కుకొన్నాడు బేలుపడి.

క॥ వగలాం(డ మనసుఁ దోచెడు
వగలాని మనస్సుదోచి పగఁ దీర్చకొనెన్
వగలాం(డందఱ మాఱట
వగలాం(డెవ రీడు। గూనెవగలాఁడి కిలన్.

**37**

ద్విరదగతి రగడ :-

చెలికాడు మాపైనఁ జిత్తగించెను గినుక
నెలచూపుఁ జూచు మ మ్మితఁ డతని చెలిగనుక
హరి యెట్టి సర్వాంత రాత్ముఁడో పరికించి
కర ఁటింపఁ డరుదెంచు గడువుఁగడు బొడుగించి
వలవంత పాల్సేసి వల్లవీకాంతలను
గులుగుచుండెను నగరు గుబ్బెతల చెంగటను
కట్టి! మా వెత లెట్టు కను పెట్టఁగలవాఁడు
పచ్చిమామిడి పులుపుపసఁ జిలుముపస విఱుగు
మచ్చునను హరి మాయిమచ్చికను మది విఱుగు.

**38**

ఉ॥ గారవమారు మీ మధుర కాటుకకొ ట్టనిపించుఁ దత్పుర
ద్వారమునుండి ము న్నిటుకు వచ్చి హరిం గొనిచన్న అల్ల న
(కూరుఁడు నల్ల నల్ల ననఘుండగు నుద్ధవుఁ డో మధు(వతా।
మీరును నల్ల, నల్లనగు మీహరియున్ మసిబానఁ బుట్టెనో!

క॥ మసిబానఁ దీసి యా హరి
యసితచ్ఛవి స్వచ్ఛపఱప నా కాళింద్యం
భసులఁ బసమీఱఁ గడిగిరొ!
యసితం బౌ కత మదేమి? యమునాజలముల్.

క॥ మీ రండునుండి వచ్చిన
వారందఱు నల్లవారె, వల్లవులము మా
తో రాస లీలలాడుచు
సౌరుఁగొలుపు శౌరి నలుపు జమునయు నలుపౌ.

**39**

ఉ॥ యోగముగాక మా కనుప నొండొకయూ సెది లేకపోయెనో
చాగురె! నాగరీప్రియుని సన్నిధి నీ మముబోఁటిబోంట్లకున్
జోగపువిద్దెలన్ గఱపుచున్ దమస్వార్థముఁ జక్కనొత్తుకో
నీ గడుసుందనంబు హరి నేరిమియుం గనవచ్చె నుద్ధవా।

ఉ॥ అంతటి జ్ఞానియైన తనయంతనె రేలను రాసలీల మా
యింతులతోడ నాడుపని యేటికి వచ్చెనో! యెడకేగె నా
డింతటి జ్ఞాన మెల్ల నిపు డింతటిదాఁ కెటులైనఁగాని మా
స్వాంతములెల్ల శ్యామమయమై యెడమీయవు యోగదీక్షకున్.

క॥ మాపాలి వేల్పు గోకుల
గోపాలస్వామి యెదలఁ గుదురై నిలువన్
లోపల ఖేదామోదము
లేపట్టున నిముడు నొకటు నిందిందిరమా!

క॥ ఏ మేమైనను కృష్ణ
స్వామి ప్రేమప్రవృత్త భావనలమె కా
కేమెయి యోగారూఢల
మై మనఁబో మిద్ది నిశ్చయమ్మును మయ్యా!

క॥ నిను నెఱుఁగుదు నిన్నంపిన
ఘను నెఱుఁగుదు, స్వార్థసిద్ధి ఘటియించుకొనన్
మొనకాం డ్రీరని యెఱుఁగుదు
వన రెఱుఁగము మదులఁ గృష్ణభావనకలిమిన్.

40

ఉ॥ నల్లనిసామి నెయ్యముఁ బెనంగొని, జోగపుదారిఁ ద్రొక్కఁగా
నొల్లవు మా తలంపు లిఁక యోగమదెల్ల సుఖాల కెల్లనన్
జెల్లనఁ బ్రేమయోగినులు చేకొననొల్లరు, ప్రేమతత్వ మి
ట్లుల్లము లల్లుకో నిరుపయోగము యోగముఁ బూన్ప మా కిటుల్.

తే॥ వల్లవకిశోర వాల్లభ్య మల్లుకొన్న
గొల్లజవరాండ్ర యుల్లముల్ కొసరి కనునె
నీరసాకార నిర్గుణ నిగమదురవ
గాహ్య మౌ బ్రహ్మతత్వంబు గాఢమహిమ.

తే॥ ఇనుము పరుసవేది నెనఁయుచు ద్వాదశా
దిత్యదీప్తిఁ బసిఁడితేజు మీాటి
వెలఁగెనేని ప్రియుని మెలిఁగొన్న మాయట్లు
ప్రణయరస సుఖానుభవముఁ గనునె.

41

ద్విరదగతి రగడ :-

హరివిరహ ఖిన్నత్వ తప్త రాసలీలలకు
మరుగు మా కీయోగ మత మేల! గోలలకు
వలవంతవేఁగు మము బలవంత మొనరించి
యలవటు యోగము న నర్తత నుపేక్షించి
నీయూరివారంత నీయంత వెఱ్ఱులే!
నీయోగపుంబిచ్చి వెత్తిఁగొను తఱ్ఱులే
మీా బూదిజోలెలను మెలఁతలక్షు మెడఁగట్టి
మా బోంట్ల కస్తురుల్ మైనల్లులుగులు వెట్టి
చేకొన్నఁడు మాసొమ్ము సింగార మంతయును
మా శింతు వంతమ్ముఁ దమిండలువు జోలెలును

అని యిట్లు హరిపై దృఢానురాగ వ్రతము
గొని గోపసుదతు లీ కొనమి నిర్గుణమతము
అనఘుఁ డుద్ధవుఁడు దన్నని పె హరి ప్రేమఘన
తను గనుంగొన నంచు తలపోసె నుల్లమున.

42

హరిరూప రసముగ్ధమై మాదు కనుదోయి,
హరిదర్శనోత్కంఠ నలమి యాకొనె నోయి!
వరయోగ సందేశభర మూన్చ నిప్పు డతు
హరి కెదురుతె న్నరయు నపుడేని విసువ దితు
వెడఁగు భోగపుబాట వినుకంతె హరి వచ్చు
గడువున్నను గడె లెంచి కాచికొంటయె మెచ్చు
త్రోలి వని కావులను దోనెలో బాల్పితికి
క్రోలు గోపాలసఖుఁ గూర్చుమా! మా కతికి.

43

ఉ॥ యోగము మాకు భోగము నశోధకుఁ గుబ్జకుఁ బంచినాఁడవా!
బాగురె! ఎంతబాగుర! హాసా దనిపించితి, మోసపోతి మీ
వేగతి యంచు నేర్గదగ నెంచిన యేమును బుత్రుఁ డంచు నిన్
పీఁగని కూరిమిం బెనిచి పెద్దయొనర్చిన మందపెద్దలున్.

శా॥ గారామార హరిన్ శుభం బడిగి పల్కంబోవె! కృష్ణయ్యనీ!
పేరే నల్లన, రూపునల్లన, సుహృద్బృందంబునున్ నల్లనా
వా రా నల్లన మంచిదైన, నిను రేపల్లెన్ ఫిరాయించి బా
లారత్నమ్మును దెచ్చు నీ జనకుఁడేలా యేలుదాఁటించుచున్.

## 44

ముత్యాల సరాలు :—

వట్టిపోయిన యెడఁదవాఁకల బల్మినడుపెదు యోగనౌకను
బట్టి త్రోసిన నిసుక నెట్టిది పట్టువిడి కదలున్
రూపురేకలు లేని అయ్యపురూపు రూప మెడందయెటుకకు
జేపడం జనరాని యగుణు నచింత్యుఁ గను మంచున్
వింతబోధలు సేతు వింతలు భిత్తిలేనిదె చిత్తరుల్ సుదృ
ఢాంతరంగము లేని చతురత యప్పు లే కలలున్
కంటిమే! యెప్పుడైన వింటిమెఁ! కనని విననియు వింగడపుమత
మంటఁగట్టఁగ తెచ్చె దీ విటు లగుణమత మంచున్.
మధుర మురళీధర సమాకృతి మాధురిమ మా మదులఁ దూకొని
వ్యధలఁ గూరిచె రోమరోమము నందు నెక్కొనుచున్
శ్యామసుందర సుఖద మూర్త్యభ్రాంతచింతన మంతరంగము
శ్యామమయ మొనరింపఁగా బలియౌదు మాతనిపై.

## 45

చ॥ కరికిని జూపుదంతము లోకండును నక్కఱ కొండునై నటుల్,
వారికి జగమ్ము చూపునకు నైన ప్రియాంగన లేము కుబ్జయో
యరుదుగ రాగభోగముల కక్కఱవచ్చిన దామె వేఱు మా
యురుతెగలందు రాగ మొకయిమ్మున భోగముఁ బంచు నొండెడన్.

శా॥ గోపీనాథుఁ డటంచుఁ బేర్వడసి మా గోపాంగనా ప్రాంగణం
బేపాటన్ దరిద్రొక్కబోవు కలలో నేవాఁడొ కన్నట్టు మా
రూపుల్ రేకలు విస్మరించి మదిఁ గూర్మిల్ నింపు దా కుబ్జపై
గోపీనాథుని పేరు వెట్టుకొని సిగ్గుంగూర్తువే మా కిటుల్॥

క. గోపీనాథుఁడవే నీకు
గాపుర మొనరింపు మంద కాపయి లేదేన్
మా పేరె త్తక కుబ్జా
ప్రాపకుఁ డనిపించుకొనుచు వసపడు మందే ॥

**46**

ఉ॥ ప్రేముడిఁ గూడియాడి మురిపింపఁగ ముచ్చటమూఁడునాఁడు లా
చామనచాయలాఁడు మనచామల నందఱ మచ్చుజల్లి న
ట్లామురళీస్వనం బెదల నత్తఁగ హత్తుకపోతి మిప్పు డా
స్వామి కెదం దలంపునకు వత్తుమె! యక్కఱదీరు వేళలన్ ॥
తే॥ స్వార్థసిద్ధికి నిచ్చకా లాడి వాఁడు
నాఁడు మురిపించి మఱపించు నేఁడు మనల
మతిని మఱలింతుమన ప్రాలు నతనిపయినె
పెనుగడలి నోడకంబానఁ బిట్టయట్టు ॥
క॥ చిత్తము హరినొత్తయి
మాపెత్తనము గణింప కేము విడవఱచిన నా
జిత్తులమారి త్రిభంగినె
హత్తుక విడివడదుఁ తన్మయుంటవుఁ గానీ ॥
క॥ ఏ దుర్ముహూర్తమందున
నే దుర్దినమందు మందనెడసెనో! కానీ
మాదేవుం డక్రూరుని
తోఁ దరలిననాఁడె ప్రియునితో పొత్తుడినెన్

**47**

తే॥ శ్యామలాంఛన లాంఛిత మైనలేఖ,
దలనుగట్టుక యిటింటఁ గలయఁద్రిప్పి,
నవ్య నవనీత చోరాభినవ మత మిటు
నెక్కొలుపఁ జూపు, నినుజూడ నెక్కొనుఁ గని.

చ॥ చనవునఁ గుబ్జ పెత్తనము సాగుటనా? మురిపెం బిదంత మా
యనుగుఁలరాసి శౌరి, కనయ మ్మతఁడే తమ కెందు సొంత పా
త్తసుకొను పొత్తులానిపయి, న త్తను గంధ మలందు గూనిదే
పనిగొని పెత్తనంబు సలుపన్ సతు లోర్తురె! యింతబన్నమున్॥

48

చ॥ అదుగో! యశోదబిడ్డఁ డతఁ డప్పుడె పొద్దుటలేచి మెల్లగా
నడుగులు వైచుకొంచును బయల్వెడలెన్ దమి బాలుపెర్వ దోఁ
పుడులకు నిల్లునిల్లు దిరువుం జెలికాండ్రకుఁ గొల్లపెట్టుచున్
గుడిచెడు బాలుబెస్వ లదుగో! మమ్ముఁగాంచి శిరంబు వంచెడున్.

శా॥ ఇంటింటం జెలిగాండ్రతోఁ బెరువుఁబా లేవెంట ముచ్చిల్లి కొ
న్నింటిం గుత్తుకబంటి త్రావి ఱని తిన్పించున్ దేసున్ మెము గ
న్గొంటన్ మోమటు చిన్నపుచ్చుకొని సిగ్గుంజెందు నీ వెంట మా
వెంటం బట్టిన కొంగుబంగరు హరిన్ వేర్పుత్తువే! యుద్ధవా!

క॥ మా జీవన సంజీవన
మై జోగులయెడల నిలుచు నా జోగులతోఁ
డే జోడు నేడుగడగా
నీ జోగం బభ్యసింప నేటికి మాకున్॥

49

క॥ దుర్గాపవర్గ సుఖమును
నిర్గుణయోగమున మాకు నెఱపఁగఁ జూ తా
దుర్గమపథ మేటికి? మది
స్వర్గము నఱచేతఁజూపు స్వామి వసింపన్.

తే॥ మా మనోధవు మాధవు మధురమూర్తి
సగుణ గోపాల మధురసంస్మరణ మడిగి
యూను నుద్ధవ చప్పిడియోగ మేవలె?
కడుపునిండునె! బూరెలఁ గలనుగన్న।

క॥ మాపాలివేల్పు గోకుల
గోపాలస్వామి నెడఁదఁ గొలువక యోగం
బీపాటిపై నదెవ్వతె
చేపట్టెడి నూకకూకఁ జేకొనుపిఁకస్॥

క. అర్మితి చెలిమఱి హరితో
నర్మాలాపంబు లాడు నలువుం గన కీ
ధర్మాధర్మము లేర్చెడు
ధర్మోపన్యాస మెవరు దలపోయుదురో!

50

క. వినిపించి మాకు హరికథ
లనుపుము యోగమ్ము నాగరాంగనలకు, నీ
వినిచెడు నిర్గుణవాదము
విని, చెడువా రెవరు లేరు వ్రేఁదలమందున్

క, నిగమాగమతత్త్వముఁ గన
దగుదురె! మాపల్లిగొల్లతలు గొనిచను మా
నగవు వగలాడె యిది వినఁ
దగువారును దెలియువారు, దనియఁగలారున్

చ. పరమసఖుండవేని వరబర్హవతంసికి మాపయిం గృపా
పరమతియున్ సమాదరణభావము గల్గినవాడవేని మా
హరివిర హాకులంబయిన యక్షియుగంబున కొక్కమా టెదన్
మరగిన మా మనోహరు మనఃప్రియమూర్తిని దెచ్చి చూపుమా!

క. ప్రియవిరహిణులకు ప్రాణ
ప్రియముఖ దర్శనము తక్క వేవెరవుల నేన్
పయిపయిరుచులు రుచించునె
నయిఁచునె మీ లొండు సలిలసంగతిఁ దక్కన్॥

51

సీ. మాధవాలోకన మాధురిం గన్న కం
    దోయికి వర్ణింప వాయిలేమి,
నుడియాడ నేర్చిన గడుసునోటికి శౌరి
    సుందరాకృతిఁ జూచు చూపులేమి
విధి యసంగతసృష్టివిధిని దత్పరిమితేం
    ద్రియశక్తిఁ గడచనుతెరువు లేక
గ్రుడ్లఁగ్రుక్కుకొనుచుఁ గూర్మి గన్నీరు గ
    న్నొల్కలఁకుల నింపుదు మలసిసొలసి
తే. మాధవ సురూపరస మాధురీధురీణ
మౌచుఁ దదనంత సౌందర్య మది వెలార్ప
నోరుఁవాయియులేని కన్దోయి యెంత
గాసిలునో! కంటె జిమిలిముక్కాలిపురువ!

52

క. కనువిచ్చిన గనవచ్చును
గనవచ్చును గన్నుమూయ గల నా హరియే
వినవచ్చుఁ గలవరింతల
మనవచ్చునె? హరినిపీడి మన మచ్చుపడన్.

క. తలఁపెల్ల గృష్ణమయముగ
సలుపుచు నెడ నుడి నొడళ్ళ సంధించి హరిన్
గొలుచు ధృఢచిత్త లే
మలచలచిత్తల కనువు యోగసాధన దీనిన్

చ॥ కనవినరాని వింగడపుఁ గట్టిడి యోగమయామయంబుఁ బ
ల్లెను గొనితెచ్చితాఁ గటుఫలింబకె వింటకె చేఁదుపుట్టె నీ
వినుచు మతంబు ప్రేతలపు ప్రేఁతలకే తలమీఁటునట్టి దా
మునిజన ధారణార్హము ముముక్షుమతం బబలల్ భరింతురే!

**53**

క॥ ప్రాణప్రియ చింతనువిడి
రాణమెయిన్ బూదిరాసి ప్రాలనిచూడ్కిం
బ్రాణాయామముఁ బూనెడు
నేణాజినమఁ జెవర్తు ధృఢచిత్తముతో.

తే॥ యోగముగ్రను గొని మౌనమూను మంట
మంటపై నుప్పుఁ జిల్కిన ఠూది రయ్యో
దావళపుబూనఁ దిరుగలిఁదాల్చినట్టు
కదుపుగొల్లల వన్యయోగమునఁ బుత్రై ?

**54**

సీ॥ మా ప్రాణపతిలేని యీ ప్రేమరహితమౌ
చప్పిడియోగంబు చొప్పడ డెద
నిష్ఠురమ్మగు యోగనిష్ఠ లాలాపించి
పడఁతుల కీ వేమి ప్రాముకొనెదు
నందనందనుఁ గాంచు నయనారవిందముల్
మూయుమం దేమందు నీ యవిద్య
సూరసుందర మనశ్చోరు నెందున డాఁచి

తవినాశి నిర్గుణు ననయ మెంతు.

తే॥ తోడు నీడయు జోడు మా కేడుగడలు
నైన మాకృష్ణసఖు విన్ను మాలకింపఁ
జెవుల కింపుగ మా స్వామిసేమము విని
హాయి బ్రతుకుదు మయ్య ప్రేయసుల మెల్ల

**55**

ముత్యాల సరాలు :—

రాసి రాపిడివెట్టె దేటికిఁ బ్రాలుమాలు పరాయియోగము
నేసుఖంబును లేదు మా కీ విడిన హితబోధన్

సన్నగిల్లెను నీదుబోధల సారగౌరవ మంతయున్ నీ
సన్నుత జ్ఞానాభిమానము సరకుఁగొన రొకరున్
గొల్లయింటను దాను బెరిగిన కులవిచారమె లేకపోయెనొ
సల్లదేవున కల్ల మధురానగర వాసమునన్
పెద్దమానిసి యయ్యెనేమొ ! పెద్దమానిసులందుఁ జేరిన
బుద్ధి సుద్దియుఁ గని యశోదాపుత్రుఁ డీనాటన్
తేరమాటల బుచ్చకే మముఁ దేర్పు హరి మురిపెంపు సుద్దుఁ
గారువెగటై తోఁచె నీ హితకారి మతమేలా !
ఏటఁ గొట్టుకపోవు నాతని నెదిరి కే వి మ్మనునటుల్ హరి
కూటమికినై కొట్టుకొను మముఁ గ్రుక్కదే! దీక్షన్.

## 56

ఉ॥ చేసెదు చేఁత లొండు మఱి చెప్పెడుమాట మఱొండు దా యశో
దాసుత పాదపంకజ సుధాసరసిన్ మునుఁగాడుచున్ బరో
పాసనఁ జూపి మానగుణభావన నుద్ధవుఁ డార్చు నాతఁ డే
రాసివిరాగి ! మింటు నుయిద్రవ్వ తలంపిడుఁ దానమాడఁగన్.

క॥ అరయఁగవచ్చె వివేకపు
వరుస యిటు పరోపదేశ పాండితితోనే
వరిపోఁచ బలిమి కలిమిని
వరిపంటుతరంబు గానవచ్చెడు వరుసన్ ॥

తే॥ మాధవపదాబ్జ మధుపాయమాన మధుర
లాలసాయత్తచిత్తుఁ డేలా విరాగి
యౌ నతం డెట్టు విషయేచ్ఛ జ్ఞాన మొదవు
మేడిపండున రస మొడగూడు టేడ !

**57**

క॥ కంటఁబడిన శ్యామాంకము
నంటిన జా బక్కుఁగొన్న సాంజనబాష్పం
బంటుకొని శ్యామసుందరు
నంటిస మదివోలె నదియు శ్యామంబయ్యెన్

ఉ॥ పిల్లన గ్రోవిపాట వినిపించిన యంతనె మచ్చ జల్లి న
ట్లల్లన నల్లసామి తలఁపంటఁగ నంటుకపోతి మాతనిన్
బిల్లలు బాప లి ల్లనక, వెన్నెలరేలను రాసలీలకై
యల్లనఁ జల్లగాలు లెగయన్ సెగయూ డ్పెదొ గాన మయ్యెడన్.

క॥ ఆవగ రేవగ లాతని
సావాసముముం దెవాని సరుకుంగొన మో
ధీవర ! యానాటిముదం
బేవిధి వర్ణింతు మెప్పు దీక్షింతొ సఖున్ ॥

**58**

క॥ ఇన్నాళ్లు మురళి గ్రోలఁగ
కొన్నాళులు సవతి చూరఁగొనె నధరసుధన్
వెన్నుఁ డిటునున్నఁ బురినెల
కొన్న నుగా కేము బ్రాముకొను సుక మొకఁడే

సీ॥ బూది మైఁబూసికో బోధింతు యోగంబు
నంగరాగ మొకళ్ల మలఁదినామె !
జడదారులటు తలన్ జడగట్టుకొం డందు
ముచ్చటుముడులఁ బూల్ ముడిచినామె !
వెడనారచీరలం దొడుగుకొం డనియందు
చీనాంబర మొకళ్ల మూనినామె !
దండంబు మౌంజీకమండలుల్ గొనుఁ డందు
నగల సింగారించి నెగడినామె !

తే॥ అనఘ ! ప్రోషితభర్తృక లట్లు శేము
నేవగలులేక రేపగ లిష్టసఖుని
పేరె పేర్కొని వల్లించువార మతని
మధుర మురళీధరాకృతి మదులనిలిపి.

తే॥ ఎందుఁగన నందె యెల్లరి యెడలనిండి
మంద నేవేళ మాధవ మధురమూర్తి
సతత చైతన్యరూపుఁడై చాలియుండ
నిట్టియోగము నెత్తిన తట్టుఁగట్టి

తే॥ ఇల్లిలుంద్రిప్పి యమ్మిన నెవరుగొంద్రు
యోగసంగ్రాహకు లిచోట నొకడులేరు
మధుర కేగు ముముక్షు లా మదికిఁ గలరు
యోగదీక్షకు నర్హు లయ్యారివారు !

59

ఉ॥ ఒందుదలంప కేమనిన యూసులఁ గాఁఖుల నాఁడుచుం ద్రొడల్
పండినవా రొకప్పుడు, క్రమమ్మున లో ననుతాప మానుచుం
ద్రుండనిచో వివేక మెగయున్, మరియాదయు, బేరుపర్వు ధీ
మండన! నిన్నెదిర్చి యిటు మాటకుమాట నెదుర్ప జంకగున్॥

ఉ॥ కృష్ణుని పేరుసెప్పుకొని కీరుతు లందుచుఁ రేవగల్ మదిన్
కృష్ణపదారవిందములఁ గీల్కొనఁజేయుచుఁ దించుఁ ద్రావుచున్
గృష్ణునె పేరుకొం చతనికీర్తితలంపుల మున్గితేలుచున్
గృష్ణునికంటె యోగమతమే సతమంటుకు నో గెటాఁడెనో !

60

సీ॥ ప్రియునిసందేశంబు విననీక వీనులఁ
గననీక కన్నీటఁ గప్పికనుల
నన్యకథాలాప మాలపించుచు బల్కి,
నోటిని హరికథల్ నుడువనీక

యెంతొ నిష్ఠురమాడి యెన్నొ బుద్ధులుసెప్పి
హరిచింత మఱపింత మన మనస్సు
కడలినెగయు పిట్ట కడ కోడకంబమే
చేరునట్లు హరినె చేరుకొనుచు.

తే॥ ప్రియునిసన్నిధి మాపాలి పెన్నిధి కడ
నుండి ప్రొద్దులు బుచ్చు సౌఖ్యోన్నతికిని
కోటిస్వర్గముల్ కల్పించుకొను సుఖమును
సాటిరా దనినమ్మి నిశ్చయ మొనర్చె.

క॥ వలవంత వేఁగి వేఁగియు
బలవంతము నిలుపుకొనఁగఁ బఱియలుగా కి
లలనల హృదయము లింతకు
నిలిచెను బ్రియదర్శనేచ్ఛ నెక్కొనుకతనన్.

**61**

క॥ నీ గుట్టుమట్టు రట్టుగ
వాగింతు విదేల మత్తమధుకర ! మాచే
పూఁగ లతాంతపరాగము
లో గిల్కొని చొక్కి మఱతు లోకములెల్లన్ ॥

తే॥ అలసచపులాని తందనం లాడియాడి
యొడలెఱుంగని మైకాన నూఁగులాడి
పూవుఁబూవును దను బిల్వఁబోయివటులె
ముద్దుటెంగిల్లఁ గలఁ తెల్ల పూల మూఁగి ॥

క॥ పూవుంబూవునఁ బొరలెడు
పూవుందేనియల త్రావుబోతా! యేమున్
నీ వంటివార మటువే !
తా వలఁచినయెడలఁ దిరిగి తారాడంగన్ !

తే॥ అల్లనల్లన దేటిరాయంద్రనెల్ల
క్షణము జొక్కించి కించిత్సుఖంబు(జూపు
విరుల మనుకొంటె! హృదయ మెల్లరకునీయ
సుందరశ్యాము నరవిందసుందరాక్షు.

తే॥ నందనందను(గాని మా డెంద మొరుని
వల(చిచొరనీదు, మాదు సర్వస్వ మతని
పా, లొనర్చితి మొరుల కర్పణమొనర్ప
నప్పు(గొనవలె లేదు మా దనిన దెదియు॥

62

తే॥ సగుణసాధన సుపథ మిట్లగుణకంటు
కముల వెదజల్లి విపథమ్ముగా నొనర్తు
వేటి కుద్ధవ! ఈ రాచబాట(గప్పు(
జెప్పి పంప(గలేదుగా చెలియ కుబ్జ!

క॥ పాలేవొ చల్లయేదో
పోలుచుకొనలేని మా కపూర్వపు యోగం
బీలీల( బ్రియు(డె పంచెనొ!
బేలల వంచింప( గుబ్జ ప్రేచెనొ! చెపుమా!

క॥ అన్నె ముపున్నె ము నెఱు(గని
యన్నులమిన్నలకు యోగ మలవఱచినటుల్
కన్నాడవొ విన్నా(డవొ
మున్నెన్న(డు స్మృతిపురాణముల మున్నుడులన్॥

క॥ నా( డక్రూరుడు గొనిచని
నా( డల మా మూలధనము నందాత్మజునిన్,
నే( డుద్ధవు( డేతెంచిన
వా(డాతనివంటు తల(పువడ్డియు( గొనిపోన్॥

63

క॥ కొఱగాని యూసు లెన్నియొ
ఓ అప్పుడు వేఱాని సకుఁడు కఱివేలుపు సే
కుఱుతెరు వెఱఁగింపవు మా,
కెఱఁగింపుము ప్రేమతత్త్వ మెఱఁగితివేనిన్.

క॥ కట్టడి వెట్టినఁ దము సే
పట్టిన పట్టుడిగి యొందుపట్టునఁ జన కా
కట్టుకొని ప్రాణవిభు నే
చుట్టుకొనున్ ముక్కు సెవులఁ జూపులు రసనల్

64

ద్విపదగతి రగడ :-

ఈ వాఁడు నిర్గుణం డే దేశవాసియో
ఆవాసమేదో యతని యచ్చెదేవాసియో!
తల్లిదండ్రు లెవ్వారో దయిత యెవ్వతో! వాని
చెలులుఁ జుట్టము లెవరో! సేవింత్రెవరువాని
వన్నె చిన్నియ లేవో వాని వేష మదేదొ
మన్నించి యతఁ డిచ్చు మనసుపడు రసమేదొ!
మా తోడ నవుగాదు మాయ లేని యెడంద
మాతోడుగా నిజము మాటాడుము మిళింద!
పొడుపుమాటల బేలపుత్తువేనియు మమ్ము
గుడుతు వీ వక్రోక్తిఁ గుందించినఫలమ్ము
అని గొల్లముద్దరాం డ్రళులమిషనిడి యనుదు
వినుచు నిస్తబ్ధుఁడై విన్నవడె నుద్ధవుఁడు.

65

ఎడ నందనందనుం డిమిడియుండఁగ నిండి
యెడమౌనె యొండొకని కిముడుకొన లోనుండి

నిదురజాగారముల నిముషమేన్ లేవగలు
గుదురుకొని విడ పెదల గొల్లకుఱ్ఱని వగలు
ఆ కోమలశ్యామ లాకార మీ యెడల
నాకట్టి యుట్టట్టు లరుగనీ దేయెడల
లోకలాభములెన్నో లోఁబడఁ బ్రలోభించి
వే కతల నుద్ధవుఁడు వినిపించినను మించి
హరిప్రేమ రసపూర్ణమౌ తనూఘటమునను
బరమబ్రహ్మ జ్ఞాన వార్ధి యెట్లిముడుకొను !
శ్యామసుందరు మంద హాస సుందరవదను
కామితాకృతిఁ గాంచఁ గాచుకొనెఁ గను లదను

**66**

కువెంపు :—

మందజను లందఱును మాధవవ్రతధరు లె
డంద నొండొకనిఁ దేఁ బోరూ మా నంద
నందనుఁడు గా కొండ్లెవారూ మా తలఁపు
లందు డిగిరేని మా డెందములు వ్యభిచార
ముం దగిలినట్లెసుమి ! మందవిడుము మిళింద !

కువెంపు :—

రసికావతంసుండు రాసలీలలఁదేర్చె
రసమయుమ్మెవర్చె నానాఁడూ మా మనసు
లెసఁగు నా సౌఖ్య మే నాఁడూ మఱతుమే
దెస లెల్ల దానయె వసమించు సూరవిభు
రసమయాకృతి నెనసి వస మయ్యె దముగాక !

తే భువనమోహన మనోహరమూర్తి నలమి
తమ్ముఁడా మోడి లినమౌ తలఁపుకంటె
నఖిలపురుషార్థముల ముఖ్యమైన ముక్తి
నొల్ల రెవ్వారు మా మంద గొల్లవారు.

**67**

తే॥ ప్రాంచమానిసి కెంతయు మంచి తోఁచు
చెడ్డమనసుల జగమంత చెడుగఁ దోఁచు
ననినయుటు లీవు బ్రహ్మవిద్యలను గఱప
హరి నిజంబుగ గురు నంపె నని తలఁచితె!

చ॥ బిసరుహనేత్రుఁడంచు చెలి పీఁడని యెంచిలి వెంతబేల వా
రసిక శిరోవతంస మగు రాసవిహారి ముకుందుఁడేడ నీ
రసమత మంపుటేడ ? ననురక్తల కాతఁడ పంచెనంచు వి
శ్వసన మొనర్పఁగాదు హరిసంగడికానిగ వీని నుగ్మలీ !

**68-69**

ద్విరదగతి :-

నిష్ఠురమ్మగు యోగనిష్ఠ బలవంతము న
నుష్ఠింప నుడివి యెడ నొప్పింతు పంతమున
జంకుగొంకును లేక జవరాండ్ర నీవంక
నంకిలినిబెట్టి యే మలందుకొను దీ వింక
సిగ్గనక యోటమియు సెప్పుకొని గెల్పుగా
నగ్గలపుఁ బేర్వాసి నడఁపుకొం దల్పుగా
చాయకునుజాయ కటిచాయలానికి నౌదు
నీయట్టి దూతయే నెఱవాదియౌ జోదు
అగ్గించి తమ ప్రగ్గ లాడిపోయుచు నెవిరి
నెగ్గించుటే ప్రకృతియేమొ దూతకు వదరి
ప్రకృతిధర్మము ద్రోవ రాని త్రోవయెవారి
కొకరు శునిపుచ్ఛమ్ము నొఱవఁ దీర్పఁగలారె?
అదిభక్ష్య మి దభక్ష్య మని కాకికి వివేక
మొదవించి సాజగుణ ముడిగిం త్రెవరు పేఁక

కడుపుఁగా ల్చిండని యకార్యమైనను గాటు
నిడకుండ ఫణిప్రకృతి నెవఁ డాపఁగలఁడోటు
నల్లకంబళి నుతికి వలుపు దెలుపొనరించు
బల్లిదుం డెవఁ డెవని ప్రకృతి నెవఁడు త్యజించు

70

శా॥ లోకం క్షేమనుకొన్న ఖింకము దురాలోకంబు యోగీశ్వరా
నీకధ్యేయము వాఙ్మనఃపరమునౌ నీ నిర్గుణబ్రహ్మమె
వ్వీఁకన్ గేకిశిఖండ మండనలస త్పీతాంబ రోపేతమౌ
మా కృష్ణాకృతిఁ బోడఁ జూపినను నమ్మా నింతు మే ముద్ధవా!

తే॥ ఒంటికంటఁడు వినరాఁడు గంటఁబడఁడు
రూపులన్నిట రూపించు రూపులేదు
అనుచు భూతంబునట్టి బ్రహ్మస్వరూప
మెంచి జడిపింతు ప్రియతమాకృతిని మఱువ
విసముఁ ద్రావింప శమ్మృతమ్ము మెసవునోట.

తే॥ నీ నిరాకార నిర్గుణ నీరసాత్మ
మధుర మురళీధరాకృతిన్ మలిచి చూప
భక్తిఁ గృష్ణపరబ్రహ్మభావ మూని
పేర్మి శిరసావహించి సేవింపఁబోమె!

71

క॥ ఎంతటి నెఱసఖివో నెర
సంతయు మాపైనఁ ద్రోతువఁయ! నీ నుడివి
న్నంతఁ గనిన్నంతఁ జింతా
క్రాంతములై ద్రాగుఁ గన్నులు గ్రంతలపాలై

తే॥ శ్యామ్ముఁ గనఁగూడి దోఁబూచులాడ్చుఁ గన్నులు
మందఁజొచ్చిని ద్వాద్ధి నీమాటవరుస
విన్న యదిగో లె చామనచాయ యన్న
బెదరి దాఁకొను మమునమ్మి కుదురుపడవు

క॥ యోగంబు పేరు సెప్పిన
దాగును మాకనులు యోగధారణ మేలా
సాగును మా కో హరిసఖ !
యీగతి సతులెవిరి రన్న యెగ్గేకాని.

72

ద్విరదగతి :-

వెన్న విన్నాణెమ్ము వీత మున్న దున్నట్లు
కన్నకను లాడునే కన్న యది కన్నట్టు
నిద్దంపుజెక్కిళ్ల నిగఁ గుండలపు వెలుఁగు
ప్రొద్దురా పద్దానఁ బొడకట్టినటు వెలుఁగు
అల్ల నీలకాశమంటు గిరికోననుండి
వెల్లివిరిసెను గంగ పృథివి కను నట్లుండి
తత బర్హిపింఛావతంస త్రిభంగిమా
కృతిని ముత్యాహార మెసఁగును త్రిభంగిమున్
నీలాంబరాలోల నీరదంబున మెఱపుఁ
బోలు చామన మేన పొన్నదోవతి యొఱపు
ఖంజనముకనునలుపు కంజదళముల నెఱపు
మంజుమృగి కన్నొఱపు, ముచ్చెముల కను మెఱపు
నునుమెఱపుగల జగన్మోహనుని కనుదోయి
గని జన్మఫల మందుగతిని మురియుదుమోయి !
పునుగుఁకస్తురిపూఁతఁ బొలుచు తత్పృత్యంగ
ఘనశోభ చీకునా ల్కకు నౌనె నుడువంగ ?
భువనమోహనమూర్తి పొలుపుఁజూచిన చూపు
ప్రవచింపఁగా మూఁగవడి నుడువ దా రూపు ॥

73

సీ॥ కోటికందర్ప దర్పాటోప మడఁచురా
పిందుకోటికి దీటు సుందరాస్య

మబ్జకోటికిదీటు నక్షులు, వాల్చూపు
కోటి తూపులతేజు దీటుమీఱు,
కోటిప్రొద్దులతేజుదీటు కిరీటమ్ము
కోటివిందులవంకదీటు భ్రుకుటిఁ
గలుగు నక్కునమణిగలుగు జిలుఁగుపైఁడి
వలువదాల్పు సుఖమ్ము నెలపువాఁడు,

తే॥ ప్రేమరసబంధురుండు కృపామృతరస
సింధు వాశ్రితబంధు మా చెలిమికాని
నలమి మధురాధరామృతం బానినాము
రాసలీలా విలాసాల నూసుపోవ.

ఆ. మంద మందహాససుందర వదనార
విందు హరిని గనులవిందుగఁ గనుఁ
గొనుచు మంటిమి మను గోవింద రసికశే
ఖరుఁడుగాక త్రాత యొరుఁడుగలఁడె !

తే॥ నిర్గుణ జ్ఞానయోగులు నెఱపు నెడకు
నీ నిరాకార యోగసందేశ మంపు
మా కనులు మాధవధ్యాన మగ్నములయి
మగుడనేరవు మ మ్మిటుల్ దెగడనేల ?

74

ముత్యాల సరాలు :—

దొడ్డమత మిడవచ్చె నొండొక దొడ్డదొరె మన దొడ్డిపట్టున
నడ్డమాడక యతని నుడివిని యందుకొనుఁ డనమున్,
దేహ గే హాంబర విభూషాదిక విమోహముఁ ద్రెంచుకొని ని
ర్మోహులై తల జడలుగొని నిర్గుణునిఁ గను మంచున్
వెల్లివిరిసిన వలపువాఁకల వెల్లువల నరికట్టి యాల్మగ

లొల్లమిం గను జోగిమత మిటు లూన్చి మనమ్మీఁదన్.
అల్లుకొని శరపంజరము, నవ యౌవనులఁ బగబట్టి యేఁచును
వల్లపీవల్లవు లొకుమ్మడి బ్రహ్మవేత్తలుగాన్.
బోఁటులను వంచించి యీతఁడు పొందులాభ మదే మనంజన
దేటికెదిరి హితాహితమ్ముల నెంత్రు దుష్ప్రకృతుల్.
కాటువేసిన నోట నమృతము కార దని ఫణి గఱవ మానునె
యోటతలఁపునె తనకుఁ బనివడ కున్న నోరుఁ జెఱుపన్.

**75**

తే॥ మచ్చికకు నూకఁజల్లి పెన్నుచ్చు బన్ని
యీల నూఁదియు నేరఁజూపి బేలుపుచ్చి
బోయఁడురిఁబన్నఁ జిక్కిన పులుఁగులట్లు
నెమలిపించపు దడిగట్టి నెనరుమీఱు.

తే॥ వంకచూపులఁ గని క్రోవిపాట పాడి
మరులయుఁగులను బన్నిన మాయకాని
మాధ వాఖేటకుని నమ్మి మరులఁజొక్కి
కుతుక నసిఘాత గొనితెచ్చుకొంటి మఱవ!

తే॥ చూపుతూపులఁ బఱపి యుచ్చునకు రాల్చి
విలవిలంగొట్టుకొను పుమ్ము విడిచి మధుర
కేగి వనమాలి మగుడ యూసెత్తఁడయ్యె
మఱల నా కల్పశిఖిప్రాపు మా కొదవునె!

**76**

హరివిరహ జ్వరజ్వరితమయ్యె నొడల్ మున్ప్రేళ్ల వేఁడిమిన్
సురసురమాడు జాబు పుగచూరుచు గన్నులువిచ్చి చూచినన్
జరజరరాలు నశ్రువులజల్లునఁ జెమ్మగిలెన్ ప్రియుం డిటీ
వరుసను గత్తికట్టి వ్రజభామలపై విరహాసి నూఱఁగన్.

క॥ మదన శరాఘాతములై
యదవదపాలే్స యు ప్రియుని హస్తాక్షరముల్
జదువ రొకరు మందము ద
త్పదము లహర్ని శము దలంచి బ్రతుకుటకాని

77

సీ॥ చనుదేరవో మంచిశకునమ్ముం గని స్వామి!
ముక్తిబేరమ్ము నింత మొదలుపెట్ట
చొకబేర మొనర్చి చేకొని యింటికిఁ
గాళ్లబేరము లాడఁ గాకులరుగ!
దిరుగుదేమిటికి నీ సరకుఁగైకొని నిన్ను
సరకుపెట్టరు మందమతుల నొకరు
మాధవున్ మఱపిన మాసారిధిషవల్లి
యా కుబ్జకే పరమార్థ మొసఁగు

తే॥ మిన్ను మాఱాము లా ముక్తి కెత్తనేల
ముక్తిలేకున్న మా పుట్టిమునుఁగఁబోదు
నగధ రాజాను బాహుదండంబు లబుత
దండగాఁదాల్చి తలఁపొండె యుండెఁగాని.

78

శా॥ చేతోవాక్తనుశుద్ధి నన్యమతముల్ సేకొక నిర్ద్వంద్వలై
పాతివ్రత్యము నిర్వహించుచును, గోపాలప్రభుం గొల్చి యా
వ్రేతల్ ప్రేమితపస్సమాధిని బ్రియున్వీక్షింతు, మాతాపితృ
ప్రీతుల్ గానరు వేదచోదిత పరావిద్యల్ గనంబోరు సూ

సీ॥ తతకుండలద్యుతుల్ స్మితముఖద్యుతుల్ లొక్క
యెడనుండి యెండరేయెండ లీన
అరుణేందురుచి మించు హరిముఖచ్ఛవిఁ గన్న
రాతిరింబవ లేకమై తనర్చ

ప్రియుని భృకుటి మాకుఁ ద్రికుటిస్థలంబుగాఁ
దివిరి తద్దృష్టినె దృష్టి నిలిపి
నిరత మెడల మ్రోఁగు మురళీమధుర నాద
మది యనాహత నాదమై తనర్ప

తే॥ మది జపించుచు గోపాల మదనమంత్ర
మనిమిషస్థితిఁ బ్రియుని ప్రత్యంగరూప
మాధురిం జొక్కి ప్రేమసమాధి నుందు
మమలనిష్ఠ సంకోచాసనమును మెట్టి.

సీ॥ ప్రియవియోగంబన్న గ్రీష్మాగ్ని గిరికొను
గురుజనలజ్జాగ్ని నరకుగొనక
పొరుగుల యగ్గింపుఁబొగలఁ గ్రుక్కలు మ్రింగి
కాపురంపుఁబనులఁ గాల్దన్ని
కులశీల మర్యాద విలువడుల్ గోల్పుచ్చి
లోకపుసడికిఁ జీకాకుగొనక
అగ్గింపునెగ్గింపు నలమరతలఁపు నా
నూపిరుల్ బిగియంగ నుగ్గపట్టి

తే॥ ప్రియతమ ధ్యానపర మొనరించి మదుల
నితరతలంపుల కెడ మీఁక ప్రేమయోగ
సాధన మొనర్తు మా రూపమాధురిఁ గనఁ
జూపుఁ గృష్ణపరంజ్యోతిఁ జొనిపి సతము,

తే॥ పలుకుపలుకున నమృతమ్ము లొలుకు ప్రియుని
మధురవాణి బ్రహ్మానంద మగ్న హృదుల
జేసి మా కొడగూర్ప నిశ్రేయసమ్ము
గురుని మన్నించి విండ్రె నిర్గుణమతమ్ము॥

## 79

మ॥ మదిఁ గుదురంగనీక ఘనమాంత్రికుఁ డెవ్వఁడొ మంతిరించి ని
న్నదవదఁజేసెఁ జూ, వదరు మంకిలివెట్టక యోపినంత కీ
వదరినదంత యూకొని సెబాసని మెచ్చిరె! యొక్కరేని యీ
వదరు టరణ్యరోదనముపాటిది గాలికిఁబోవు పొల్లగున్.

## 80

మ॥ ఘనుఁడక్రూరుఁడు నుద్ధవుండు నొకజోకన్ గానుపింతు రిర్వురున్
మనుసుల్ మెత్తగఁ దోఁచిరేని మనసుల్ మాత్రంబు వజ్రాభముల్
మనపాలౌ మణిఁబాపి మంటి గఱపింపంజూతు రాశాంకురం
బును నానాఁడుకృశింప జోడు సరిపోవుంజుమ్మి యీ జంటకున్

తే॥ ఒకబడిఁ జదువువారు గాకోటు మధుర
నుండి వచ్చినవారంద టొక్కరెమ్మ
నుండి రెల్చిన కాపుగారోటు వారు
తలవరిగి యిడ్డఁ దమ, గడ్డు తలఁపు విడరు॥

## 81

మ॥ మధుపా! యోగమొకండె మాకు హరిసంబంధంబుగా నెంచితే
వృథగాఁ బాడినపాట పాడు చెపుడున్ వేధింతువే మెల్లరున్
మధుపానం బొనరించుచున్న యదనన్ మా మాధవుం గూడి యి
వ్విధి సందేశము నీవునేమయిరొ! యవ్వేళం ప్రబోధింపఁగన్॥

తే॥ మము నిరాకార యోగబంధమున నిడుట
దారపుంబోఁచ మానిసిం దమ్మిటూండ్ల
మదకరిం గట్టినట్లుచూ! మఱల దాని
మధురఁగొనిచని యుండించు మాధవునకె

**82**

మ॥ సతతారాధ్య మొనర్చి లోనిఁ జిపి కృష్ణస్వామి యాకారము
న్మతిఁ దక్కించుకొనంగ నీ వి టుత డన్నాటున్ నిరాకారుఁడై
హితు నీపాలికి వేడ్కఁ బంచెఁ దనరూ పిమ్మంచు నిన్ రాధికా
సతి! యన్నన్మునుదాను మెచ్చి కిన నాస్వాంతమ్ము నాకిచ్చెనన్॥

మ॥ ప్రతిగానిత్తుఁ దదాకృతిం దను మహారాజైన నౌఁగాక యి
చ్చుతటిం బుచ్చుకొనంగ రాజు బడు గంచున్ భేదమేలా! తదా
కృతి నైక్యంబగు మా తలంపులను వేర్వేట్టుంజుమీ ! తెచ్చె నీ
కితపుం డీయెడ యోగశూర్పము వెతల్ గీల్కొ ననెన్ రాధయున్

తే॥ కడుపుకాపరితో మదుల్ గుదుకుకొన్న
చెరిగి జోగపుచేటుతోఁ జెదురఁగొట్ట
వచ్చి వచ్చినపని సక్కపఱచికొనుచు
నుయ్యొగొయ్యయొ! చూపు నింతుల కితండు॥

**83**

శా॥ సీతావల్లభుఁ డాలిఁగోల్పడి వనీసీమన్ గవేషించుచున్,
దూతన్ దిక్కులకంచి జాడఁగని సింధున్గట్టికొట్టెన్ రిపున్
సీతంగూడి వియోగభీతి విడిపించెంగాని తా లేఖలో
గీతాసారము వ్రాసి పంపఁ దతఁ డీ కృష్ణుంబలెన్ నాతికిన్॥

తే॥ మధుర సుఖలోలుఁడై మనమాట మఱచి
జాలిమాలిన మన వనమాలికంటె
మేలు సీతమ్మమగఁడసూ! చాలమడుఁగు
లతఁడు పడరానిపాట్లు నిల్లాలిఁదేర్చె॥

తే॥ వెన్న ముచ్చిల్లనేర్చెను, చిన్ననాడు
మెచ్చితెమనమ్మలిన్నాళ్లు ముచ్చదనము
వెన్నతోఁబెట్టువిద్దియ వెన్ను నకును
ఎవతె నమ్మును పెనునడ్డి సవతిఁదవిలి.

తే॥ ప్రేఁతలను విన్నవుచ్చు నా వెన్నముచ్చు
ముత్తుఁజొక్కినవాఁడు రేకెత్తు ఉడ
వెన్నముచ్చేడ! ప్రేముడివిలువ యేడ!
అంకె దయచేసి యోగము, నంతెచాలు!

84

సీ॥ కాలముఖమునుండి కాచి మమ్మేవాఁడు
మగుడ నందునెత్రోచె మాయకాఁడు
నిర్మోహితోఁ బ్రేమనెఱపిన మాబోంట్లు
వలవంతపాలయి వగవకుంద్రె!
రేవగ లెదరేగి రెక్కొత్తు వలవంత
సలు పిది సైఁచువారలకె తెలియు
వలపుబన్నిక వన్ని వంచించి కొనిపోయెఁ
గల్లమచ్చికఁ జూపి యుల్లములను.
తే॥ నేరనితనానఁ బసిబుద్ధి నెనరు నెఱపి
ధూర్తగోపాలుఁ డురవడి దోచుకొనఁగ
మనములున్ మానధనము లాతనికిఁ దక్కె
బెట్టితి మటుంటు వాపోయి రట్టిచెలులు॥

85

సీ॥ గోపాలుఁ డంనాఁడు మాపాల నుండిన
సుగమిచ్చునవె నేఁడు పగఁగొనినవి
కోపాలుదాపాలు గొని కత్తిగట్టెను
మాపై హరిస్వామి ప్రాపులేక
మంజుల లతికానికుంజంబు లీనాఁడు
పొడకట్టె విషవహ్నిపుంజ మట్టు
పిల్లతెమ్మెరలు జాబిల్లి గర్పూరమ్ము
గందముల్ ప్రొద్దుసెగన్ దపించె.

తే॥ విరహఘాతకుఁ దళితమ్ము వణఁకి మమ్ము
ఛిన్న భిన్నము సేయ నెక్కొన్న వాఁడు
ఎన్నఁడే తెంచు మా ముంద చిన్న వాఁడు
గ్రుడ్లు గురివిందలగు వానికొఱకుఁ జూడ.

తే॥ హరి విరహవేళ కాళింది పఱువనేల!
కలకలధ్వని విడనేల కమలపాళి!
బాలి మధుపాళి ఝుమ్మని పాడనేల!
సుస్వరము గూయనేల! తచ్ఛుకపికాళి॥

86

ఉ॥ కన్నులు ద్వారపాలురయి కాచుఁ జుమీ మెఱుఁ గూపిరుండగా
నెన్నఁడొ యేక్షణాననొ ప్రియేక్షణభాగ్యమ దబ్బకున్నె! యం
చన్నె మెఱుంగ కాశను, దదాశ నిరాశయకా నహర్నిశం
బెన్ని దినాలు గాఁచునిఁక క్షేమని సుద్ది వచింతు స్వామికిన్.

ఉ॥ తోఁచనె తోచ దొక్కపుడు తోఁచినతోఁపు తమంత మద్ధపుం
జూచినతోన మాయమవు, సూరవిభుం డొడఁగూడునట్టి య
లోచన సెప్పు మో ధవళలోచన! సర్వము నిర్వహింపు మీ
వే చతురోక్తులాడి యని కృష్ణసఖున్ బతిమాలుకొందమూ!

87

మ॥ వికచాబ్జాక్షుఁడు పూలుగోయ మన ముద్విళ్లూర చే నందకో
సకి! యారామవిహారవేళ మనలన్ స్కంధాగ్రమందూని యొం
డొకచేఁ గొమ్మలనందుకొంచుఁ బువులెన్నో నాఁడు కోయించఁపడే
సకులం దా దయ దప్పనంతదనుకన్ సాగించె గారాములన్॥

ఉ॥ వ్రాసి యొకప్పుఁ డుద్ధవకరమ్మునఁ బ్రేయసుఁ డంపె లేఖ నా
యూసుఁ దలంప రేవ్వ రిపు డొక్కరుఁడున్, మన మొక్కరే నటే
రాసవిహారిపైన ననురాగిణులౌ మనబోంట్లు పెక్కు రుం
డ్రో సఖి! యాతఁడన్న మనకొక్కఁడ కాని యొకర్తె! వానికిన్?

ఉ॥ ఊసులసందడిన్ నుడువు ముద్దవ! క్రమ్మఱఁ గాళియాహిఁ యా
వాసముసేయుచుండె మనవాఁకకు వచ్చి యిటన్న నానుడిన్
మా సఖుఁ డావిషాహిఁ బరిమార్చు తలంపుననైన వచ్చునే
మో! సకురాంద్రపై చెలువు లోల్లక రాక నిరాకరించినన్॥

## 88

సీ॥ నీరదాభశ్యామ! నీరూపుఁగనఁ గనుల్
తృషిత చాతకబర్హి రీతిఁదనరె
కాంత! నీ ముఖచంద్రుఁ గాంచ మా చూపులు
గలువలున్ వెన్నెలపులుఁగు లయ్యె
నీ యధ్గుఁదమ్మి తేనియ లాని తిరుగ మా
యక్షులు తేంట్లు రాయంచ లయ్యె

తే॥ మహితసూర్యాభ! మీ యక్కుమణని గనఁగ
గనులు పొద్దు రాపచ్చజక్కవలు నయ్యె
నలువుమీఱెడు నీ నీటినడక చెలువు
లరయ మా చూపు చౌఱచేపలయ్యె స్వామి!

క॥ నీ రూపు నడలు నుడులును,
వేరూపులఁ దలఁచితలఁచి వేగుచు, వేమా
ఱాఱటపడు మా చూపులఁ
గూరినలెత లెట్టు లడఁపుకొందుమొ చెపుమా!

తే॥ సూరసుందర ప్రత్యంగశోభ నిరుప
మానమౌ నఖాదిశిఖాంత మా నితాంత
భువనమోహన మాధురీమూర్తి కనుల
కగుపడమి మాకు జగము శూన్యముగఁ దోఁచె॥

**89**

శా॥ నిందున్ నూతులు, మేముపంపుకొను సందేశంపుపత్రాల నె
వ్వండే నందులనుండి రాఁడొకడు, నవ్వార్తాహరుల్ దారి నే
గండాలన్ దిగమాటిరో! మగిడి రాకన్ మాన్ప మాయావి కృ
ష్ణుండే వారల దారిఁద్రిప్పి భ్రమలం జొక్కించి రానీయఁడో

ఉ॥ వచ్చుచుఁబోవునట్టి కనవచ్చిన పాంథులతోడ లేఖలన్
బుచ్చితిమెన్నొ, తన్నుఁదలపోసి లిఖింపఁగ గంటికడ్డమై
వచ్చిన యశ్రులం దడియుఁబత్రము తద్విరహాగ్ని తమ్ములన్
జిచ్చున మాడ్చు గన్గవయు జింతను మూఁతవడన్ లిఖింతు మే
మచ్చున? ధ్యానయోగమున మా గతి యీగతినుండ నుద్ధవా!

క॥ అంపఁడు హరి సందేశము
నంపిన దను మగుడనంపఁ డవ్వారల నే
మంపిన లేఖలు వ్రాయఁగ
సంపూర్ణం బయ్యె నింతు శ్యామికయెల్లన్ ॥

క॥ కంటికిమంటికి నొకఁడై
కంటికిఁగడవెఁడుగ గారు గాటుకకన్నీ
రంటుకొని శ్యామసుందరు
నంటిన మదివోలె లేఖ శ్యామల మయ్యెన్॥

**90**

గీతిమాలిక :—

బ్రతుకుప్రొద్దెల్ల నెండలోఁబడి తపించి
 ప్రియవిరహ మందె తమ్మి సంప్రీతిఁ గొనుచు
స్వాతిచినుకులకయి నోరు సాపుకొనుచు
 దప్పిగొనుచునె తనియుఁ జాతకము ప్రీతి

కొట్టుమిట్టాడి యెద్దడి దట్టుకొనుచు
నీటి కొరాటుపడుచునె నెగడు మీలు
బంటుమొండెంబు తలద్రెళ్ళి మంటఁబడిన
పోరుచునెయుండు జయ యశోభూరికాంక్ష.
ప్రియతమునకౌచు బ్రతుకెల్ల వేచివేచి
ప్రాణములనైన బలిపెట్ట వగవ మిందు
ఓటమినిగూడ గెలుపుగఁ జూచునేతు
గెలుపునోటములను రెంటఁ గీర్తియుంట
చాతకము తుమ్మి మీల నేస్తములవోలె
ప్రియత మాలోకసుఖము లభింపకున్న
సుడుగ దీ ప్రేమ ప్రియుఁ డొల్లకున్నఁ గూడ.
ఇట్టి ప్రేమాంబుధి ప్రియావహేళన మను
యిసుకకట్టను నరికట్టు నెట్టు లడఁగు?

91

ఉ॥ పైకి వచించు తీ రొకఁడు భావముతీరు మఱొం డటెం డిటుల్
లేకల యోగమున్ బనుపు లేమల కా మధురానివాసి నెం
దాకను నమ్మ మాపయిని నల్లనివారల నమ్మవచ్చునే!
కాకులఁగూడి మేసి తన గాకము పెంపఁ బెరింగి పెద్దయై

ఉ॥ కాకులలోనఁ దా నొకఁడుగా మని యామని వచ్చినంతఁ గూ
కూఁతను కూఁతతోడఁ దనగుంపునఁ గూడుఁ బికంబు పూలఁ జీ
కాకొనరించి పుష్పములఁ గైకొని క్రమ్మఱఁ దొంగిచూడ దె
వ్వీఁక మిళింద; మొక్కఁడనిపించును నల్లనివారినైజముల్!

92

క॥ తోనకోనిపోయి మదులను
బూనుఁడు మీమదుల జోగపుంబూన్కి యనున్!
జానరో! మధురకుఁజని హరి
తా నెంతటి రాజకూటతంత్రము లెఱిఁగెన్!

క॥ చానలకు యోగ మంపిన
పూనికతోఁ దనవిశాలబుద్ధియుఁ దెలిసెన్;
బూని పరమతము మాన్పిన
తా నెంతటి నయపరుఁడన్ని తలఁపఁగవలెనో.

క॥ మున్నె నెఱసరిహరి పలు
వన్నెల మన వన్నెలాండ్రు వసపడ ఖూ మెల్
వన్ని వలపించె వంపస
నెన్న టికేన్ దొంటివారె హితకరు లతివా!

క॥ వ్రజసతుల మదుల దోఁచుక
గజిబిజినిడి మగ్గుడ వారిఁగనఁ డిది వన్నే!
గజిబిజిపా ల్గాకుండగ
బ్రజలు సుగంపడుకు రావపాడికి గుఱుతౌ.

93

ఉ॥ యోగము వేర్కొనం బ్రియవియోగమునగ్ని యొడల్ దహించుచున్
రేగెడు నుద్ధవోక్తులఁ బోరింబోరి, మా కిటు యోగమంపి సం
యోగము గుబ్జకేర్పఱచు యోచన, మాచెలి కేరు. సెప్పిరీ
లాగున సింగ మేస్గును దలంపక, వెంగలిమేయు, వింటిమే!

క॥ వగవఁబనిలేదు కర్మా
నుగమౌ విధివ్రాఁత, కద్ది, నోగిలింప నెవం
డగుగాని, హరికృపార్హుల
కగమము లేదొక్కఁడనుచు, ననుకొందుమయా!

94

సీ॥ రాజనీతిజ్ఞుఁ డేయోజనౌఁ గృష్ణయ్య
యేంతకేనియు గొల్లఁడేకదయ్య!
వేలలమని మమ్ము విడి కుబ్జనెఱఁజాణఁ
దగిలి సిగ్గిలియేమొ! మగుడ్డ రాఁడు!

వ్రజకిశోరుని( జెట్టు(బట్టి తోడ్కొనిరమ్మ
యే మన(బోము లె మ్మెము వాని
వేపుర(బెండ్లాడి వెయిమందికుబ్జల
వలవని మ్మతఁడు మావాఁడెసుమ్ము.

తే॥ అనుడు నో త్రను( జెలి! అంద అన్నిగతుల
నాడిపోసి కలంచకు( డతనిమనసు
ముందు చెలిమరి నిందు( గా లోపనిందు
గేలికొందముగాక ముం దేలనడుగు?

95

సీ॥ మువ్వంపు మవ్వంపు మురళీధరాకృతి
యేవంక లేని మా యెడలనిటికె
చిన్నని మది( జిక్కుకున్న త్రిభంగిమా
కృతి నేగతిని వెల్వరింతు మనఘ!
మధుర( దా నెంతటిమన్నని బిడ్డైన
మాకంటి కధికుఁడై మాఱనేర(
డా యశోదకు బిడ్డడై గొల్లఁడౌ తో(పు
వాయ దేమును సజాతీయ లగుట.

తే॥ వల్ల నందుని చిన్నవాఁ డమఱకాని
దేవకియొవర్తొ! యా వసుదేవు( డెవరొ!
కన్నవా రొండుగల రంచు( గానరాము
తలఁప మే మొండు శ్యామసుందరుని( గనక.

96

ద్విరదగతి :—

నిగమ మే బ్రహ్మమును నిఖిలాంతరాత్ము( డని
యగము( డని వాఙ్మన సాతీతరూపు( డని

## గోపీ మనో విలసిత త్రిభంగిమాకృతి



మువ్వంపు మువ్వంపు, మురళీధరాకృతి
యేవంక లేని మాయొడల నిలిచె

తుదమొదల్ గనరాని తోఁపు నంటనురాని
వెదకి కాననురాని వింతలే ల్పనుజాని
అగుణు నారాధింప నఱచేతియుసిరికలు
సుగములును,సుగతులును, సుకృతార్థకామములు
అని యుద్ధవుం డెంత యమృతంబు లొలుకుచును
గొనియాడుఁగాక నిర్గుణుఁ బెద్దసేయుచును
పొలుపడి యోగసముపాసనకుఁ బ్రాల్మాలి
కొలుపడుదుమె మేము గోపాలు వనమాలి.

97

క॥ అన్నులమిన్నల కన్నుల
కెన్నడొ యుపమించి చెప్పి రెన్నియొ యుపమల్
మున్నిటి కపు లవి చన వీ
కన్నుల కళి మృగ చకోర ఖంజనసమతల్.

సీ॥ గోపాల ముఖపద్మకోశ సంగతిఁ బాసి
మనుకనుల్ భ్రమరోపమకును దగునె?
ఉద్ధవాకృతి మృగయుఁ డరుదెంచినను భీతిఁ
బరువని వెటు మృగోపమకుఁ దగును?
వ్రజకుల చంద్రు గోల్పడియును మననేర్చు
కనులు చకోరోపమను నెనయునె?
మరున కమ్మఁదు వోయి హరివిరహ వ్యథం
దొనఁకని కనులు ఖంజనము లగునె?

తే॥ సతత ప్రేమాశ్రుసలిల సంసక్తిఁ జేసి
మీల కెనవచ్చునేమొ! మా వాలుగనులు!
గోపకుల పాప మా కనుపాప హరిని
నెడసి మననోపె మా కను లేటికనులు!

**98**

క॥ ఘోషాంగ నాక్షియుగము ని
మేషంబను మేలిము సుఁగుమీాఁటి హరిఁగనన్
ఘోషమున దిగంబరముగ
ఘోషావిడి వీధివీధిఁ గ్రుమ్మరు సతమున్

క॥ సతత ప్రియసందర్శన
మతి, ననయము ఱెప్పపాటుమఱచిన కన్నుల్
తత చిత్తైకాగ్రత యదు
పతిరూప ధ్యాననిష్ఠఁ బరఁగు సమాధిన్,

క॥ మతి సమ్మతించు నీనుడి
హితకరమనికాని,కన్ను లీకోనక ప్రియా
కృతి సందర్శన మధుర
స్మృతి విడమని పంతగించుఁ జేయున దేమా ?

**99**

చ॥ హరివిరహ జ్వరార్తిఁ బొఁడవై కడఁగ్గానని దీర్ఘరాత్రులన్
విరహిణి రాధికానతికి వేడుకసేయు విపంచి మీాటుచో
గరిత యొకర్తు "చెల్లిరో! మృగాంకునిలో మృగ మిది విన్న సం
చరణము మాని గానవివశంబయి నిల్చినచోఁబె నిల్చి చం
దుకునరదంబు ముందునకుఁ దోలదు వీణియడించుమా" యనున్

క॥ వల్లభు నెడసిన దాదిగఁ,
జిల్లులుపడినట్లు కనులఁ జినికెడు కన్నీర్
జల్లులు వెల్లువ లయ్యెను
జల్లని జాబిల్లె సెగలఁ జల్లెను మాపై.

క॥ సైఁచిననెకాని యూహకుఁ
దోఁచని వలవంతసలుపుఁదుస్సహ మి దెవం
డాఁచును మా చెలికానిని
వే చూపవయేని తెచ్చి, వృథ నీ యెత్తుల్.

## 100

క॥ వాఁడినమోమున రాకేక
పోఁడిమి సెడు వాలకమ్ము పొలుపది, మూల్గం
బోడినజూదరి, మంచున
వాఁడినపువు, దీగదెగిన పల్లవ మయ్యెన్,

క॥ సతత హరి ప్రియమధుర
స్మృతి కతనను, మేననూరు చిఱుచెమటుల నా
సతి కట్టువలువ మాసిన
నుతికింపదు మధురభావ మూనుచు దానన్.

క॥ తొడుగదు మఱొండు వలువను,
ముడియదు విరిబోవుజుట్టు, ముడిగినమోమె
న్నడుఁ జైకెత్తదు, చూపులు
పుడమినిడుం గాని యన్నెఱుంగన దార్తిన్.

తే॥ ఆ హరిప్రేమజీవిక లౌచు సతము
ప్రేమ పరిపుష్టలై మను ప్రేతల మిఁక
బ్రతుకఁబోమయ్య! హరియంపువార్తవిన్న
నేర్చు విరహానలార్చుల నోర్చుకొంచు.

## 101

మ॥ అనఘా! ఎంతటి భాగ్యవంతుఁడవొ! గోపాధీశ్వర ప్రేమసూ
త్రనిబద్ధాత్ముఁడు గావు పూవలెను నీరంబుట్టి నీరంటు నం
టని తమ్మింబలెఁ దైలపాత్రమటు లంటంబోవు స్నేహంబు స
క్తిని మే మంటుకపోతి బెల్లముపయిన్ గిల్కొన్న చీమల్ వలెన్

తే॥ సబలుఁడవుగాన, వదుగిడఁజనవు, వలపు
వాఁక, నే ప్రేమపాశపు జోకఁబోవు,
చెలిమిబెల్లపుబాకానఁ జీమలట్టు
లంటుకొనిపోతి, మబలలమౌట మేము.

## 103

చ॥ హరిసగుణార్చనన్విడి, నిరాకృతి నిర్గుణయోగ మూని లో
నరయఁగరాని బ్రహ్మపరమార్థముఁ, గన్గొనుఁ డంచుఁబల్కు, నీ
తర మరయంగ నీవు హరిదాసుఁడగావు నిజాన కేను ను
న్విరహిణు లంటకుందగము నీ నుడితో నెడ బీఁటువారమిన్.

చ॥ హాయలుగ మీలు జీవనవియుక్తినె జీవనముక్తినొందుఁ, దా
నయిఁచుఁ బిపాసఁ జాతకము, స్వాతిజలాప్తికిఁ బ్రాణమొడ్డుచున్,
బ్రియసుతుఁడైన రాముఁ దడవింజనఁ, బంక్తిరథావనీశుఁడున్
మెయివిడి ప్రేముడిన్ నెఱపె,మేముఁబ్రియాప్తినడిన్ గడింపమున్.

క॥ లోకాపవాదభీతికి
చీకాకుంగొనక, గోపశేఖరుతో మే
మీకరణి వలపునింతుమె
కాక యొడల్విడము ప్రేమఁ గలుషమొనర్పన్.

## 104

తే॥ తాముపాటింపకున్న హితమ్ము లెన్నొ
యొరులకెఱిఁగింపఁ బలువురు గురువు లుంద్రు
బ్రతికిపోదుము నీనోరు మెదలుపకుము
కొనర నీబోధ మా ప్రాణగొడ్డమయ్యె.

ఉ॥ కాటికిఁ గాళ్లుసాచుకొని కాశిని బక్కనువైచుకొంటె యీ
పాటి నికృష్టజీవనముఁ బాల్పడుకంటె వరమ్ము, వెన్నుఁ డీ
నాంటికి యోగమున్బనిచినన్, విరహాగ్ని నిబుగ్గియైన మా
బోటుల నుద్ధరించుతలపోత, స్మశానపుమేలుకొల్ప యౌ.

క॥ మా జీవనజీవనమో
మా జానగుసామిఁ దెత్తొ, మధురాపురికే
మా జోటులఁ గొంపోయెదొ,
మా జీవనహాని నఘుము మలగొనకుండన్.

క॥ తలఁ ద్రాఁతఫలము ద్రేఁ
తల తలలన్ బోడమతముఁదగిలిచి కుబ్జా
లలనను బట్టుపుదేవిగ
సలిపెను, రాయంచ కాకి జతఁబట్టినటుల్.

తే॥ ప్రియుని సాన్నిధ్య ముడిగి, నీర్విడిన మీల
తెన్నునను మేము విలవిల దన్నుకొనఁగఁ,
గంసదాసికి భాగ్యంబు గలిసిరాఁగ,
సంతరించుక, సతతవసంతశోభఁ.

తే॥ గులుకుచుండెను హరికృపాకలన నేఁడు,
చెఱకుఁగాదని జిల్లేడుకొఱకు మొఱకు
నట్టు ప్రేమనుయోద్యాన మంటునటికి,
యోగలత నాటవచ్చె, నీ యుద్ధపుఁడిటు.

107

సీ॥ తనపైఁ గనులువెట్టుకొని తలడింపన్ని
తొవల మంచున ముంచు, దుహినకరుఁడు
తడియారుగొంతుతోఁ దగఁ ద న్నెదురుచూచు
చాతకమ్ములఁ దన్పఁజనదు ఘనము,
విరులు నీరసపడ విరిదేనియలఁ గ్రోలి
వెనుజూడఁబో దళి విరసము లని,
యొకటు తుహినకరాస్యుందు, ఘనఘనాభ
నీలదేహుఁ, డలినీల కుటిల.

తే॥ కుంతలుఁడు నైన మన వ్రజకాంతుఁ డిటులు,
మనల నిర్మోహుఁడై మది మఱపుఁగొని ని
రాశఁబుచ్చు టొకబ్రాఁతె! యతనిమూర్తి
నమరు ప్రతియొక్కపోల్కి యన్వర్థ మలివ!

108

ఉ॥ పేరినకూర్మి మాధవుని, బిన్నటనాఁడుగ రాతిరిఁబవల్
వారక చుట్టుముట్టుకొని వాతెరఁ తేనియ లానువాంఛ న
క్రూరకిరాతకుంఁ డెగరగొట్టి, యనాథలఁజేసెఁ దేనెపి
ట్టాఱడి రేఁగఁగొట్టి, మధుపాళిఁ దెరల్చు కిరాతకున్‌బలెన్.

చ॥ కుడువ కపేక్షతోఁ బిసినిగొట్టుతనంబునఁ గూడబెట్టి బెం
పడరు వ్రజాంగనాసరఘ లాసలునింపు తలంప తేనెప
ట్టెడలిచి శౌరినిట్టికొనియేగెను గన్నుల దుమ్ముగొట్టిన
ట్లడలుచు మేను వెంటబడ,నారథధూళియుఁగ్రమ్మెఁగన్నులన్

తే॥ శెరలి కుడువక యెడల గ్రుక్కిళ్ళుమింగు
మా మనఃప్రియసంయోగ మధురవాంఛ
మాఱటుగ దైవ మిట్లు పంపకమునరెృ
గుబ్బపేఱటు నీ యోగకూటవిద్య.

115

తే॥ కృష్ణపరమాత్మ తత్త్వ మింతింతగాఁగ,
గణకణము మా నరాలను గలిసిపోయె
అతనిమాటయు, బాట నయ్యాటగాని,
యోగమొల్లరు మా గొల్ల తీఁగబోండ్లు.

మ॥ వలవంతంబడి వెఱ్ఱిలెత్తిన ప్రియవ్యాసక్తలే మిట్టిసూ
క్తులు తాతమ్ములయూను లత్తియెదుటం గొండాడుటే మాకు మా
లలితాంకారునిపీడి మే మితరునిన్ లక్షింపఁబోమయ్యె త
ద్విలస ద్వేణురవామృతఁబెదురఁ ముక్తిశ్రేయముల్ నిల్చునే?

120

ద్విపద :—

మఱుతువో యోగంపుమాట భద్రదంబు,
మఱిమఱి ముద్దుచ్చుకో, మఱచెదు వేమొ,

జాతిపోయినను బేజారయిపోదు,
బేరిపై యోగ మా ఘీరపల్లి నిటు
బేరంబుపెట్టి తీ బేరసారంబు,
నూర నెవ్వఁడెఱుఁగు నొం డీపుగాక!
పరిపక్వమతులకే పనికివచ్చునవి,
పరమార్థ మీ పల్లెపడచుల కేల?
అపురూపముగ మాకు హరియంపు యోగ
మిపుడు నీకే కాన్క యిత్తు మద్దాని,
హరి యంపెనన్న, మర్యాద, గేల్మోడ్చి,
దరిసింపఁదగుఁ గాని దవ్వులనుండి,
గరళమున్ నింపు ముక్కంటిపండువలె,
నరగఁబో దీ యోగ మనుభవంబునను.

122

ఆ॥ కోమలాంగు లేదఁ గ్రూరయోగము లేద!
నని యెదుర్కొన బదులాడలేవ!
భ్రమసి వచ్చితేమొ! వ్రజమౌళి యంపునే!
వెలఁదులకడ కింత బేలవాని.

ఉ॥ పంచము యోగ మాంధ్ర కని షంప నిజంబని నవ్వులాటకే,
పంచిన యూ సెఱుంగ కిటువచ్చితి వెంత యమాయకుండవా
వంచకశేఖరుండు నినుఁ బంచుతటిన్ వెడనవ్వ నవ్వతీ,
రెంచుకొనంగలేవ! యెటు లింతులపాలికి నంపుఁ ద్వాదృశున్

131

చ॥ కనవినరాని తత్త్వ మదగమ్యము రూపును రేక లేని దం
చును నగుణాత్మతత్త్వమునసూక్ష్మమనన్ సులభంబటంచు వా
కొనఁజనువయ్య! నీవు కనుగొంటివె నిర్గుణు నెన్నఁడేని నీ
యనుభవమందు, మా కనుల కాన దదంతయుఁగష్టసాధ్యమౌ

సీ॥ మా శ్యామసుందరుమాడ్కి నీ నిర్గుణ
బ్రహ్మ మెన్నఁడుఁ గానవచ్చునొక్కొ!
మువ్వంపురూపుతోఁ, మురిపెంపుఁజూపుతోఁ
జల్లగా మనసు ముచ్చిల్లునొక్కొ।
మోవిఁ బిల్లనగ్రోవి ముద్దారగాఁదాల్చి
మ్రోయించి వీను విందుసేయునొక్కొ!
నటరాజవేష మెప్పటివోలె గొని యము
నాతటి విహరించునా? తలంప

తే॥ నీ నిరాకారుఁ డాలతోఁ గానఁ జనునె?
నెటిఁబసిఁడివల్వఁ దొడుగునే! నిర్గుణుండు,
హరిమధురమూర్తి మము సుఖపరచినట్లు,
తనుపునా! నిర్గుణబ్రహ్మ మనఘ! నిన్నుఁ.

**133**

క॥ కాడికి మొదవును బూనిచి,
కోడెలఁ బాల్పితుకఁబోవు కుట్టతలఁప, పూఁ
బోఁడులకు, బోడమత మిటు
వేడబమున నిడుట, యింతవింతయుఁగలదే?

ఉ॥ రా లని నీటఁదేలి పెనుమ్రాకులు బ్రుంగిననే సుధాంశుపుల్
గ్రోలు చకోర, ముష్ణకరుఁ గోరిన జక్కవ లిందుఁ గోరినన్,
బాలముకుందు నంద మది ప్రత్యక్షువున్ మముదోచుకొన్న దా
బాలుని పాలబడ్డ వ్రజభామల మన్నెముఁ గోరనేర్తుమే !

**136**

చ॥ కుటిలత గూడుకట్టుకొనె గూనెది, దానికి మా త్రిభంగి సం
పుటిపడ, నీడుజోడు సరిపోయెఁ. బ్రియానుభవంబుఁదక్కఁ ని
చ్చటిసిరి పెన్పు నోరెములు జల్దులుఁ దక్కనుఖాలు మాకు నే
మిటి కిఁకఁ బెద్దమానిసికి మిత్రుడవై చనుదెంతు కావునన్.

ఉ॥ పాడి దొఱంగకుండ, వరబర్హావతంసము; బిల్లఁ గ్రోవి జీ
రాడు పసిండిసేల్వ మొదలౌ హరి ఘోషవిహారవేష, మీ
వాడకుఁ బంచివైచి తను బంచిన యోగకమండలాలు బూఁ
బోఁడుల కేల దోడఁగొనిపోయి యొసంగవె వాని కుద్ధవా!

138

సీ॥ దివినున్న శశిఁ గోరు, భువిఁ జకోరము గప్ప
నీటనుండియు దమ్మినీటుఁ గనదు,
ఇలను దనుపు వాన లెన్నేని గురియునీ,
స్వాతివినుకె కోరు జాతకమ్ము,
కలికుముక్కున, మానిఁ గొలుకఁజాలియుఁ దేఁటి
కెందమ్మిరేకులఁ బందెపడును
ఒడలుగాలిన దివ్వెఁబడి చచ్చు శలభంబు
హరిఁజొచ్చె మా తలం పనయ మనసు!

తే॥ అమృతఫల మోడి పటుతుంబి నములు నేడు
లోకమిది భిన్నరుచి యను వాకు వినవె!
గూనెవగలాడి మరగి గోకులము రాఁగ
సిగ్గిలుచునుండె వనమాలి చెలులఁగాంచ॥

140

తే॥ స్నేహసారస్య మెఱుఁగని నీవు మధుప!
పూలఁ గొన్నిటి నిరసించి, కాలఁదన్ని,
యన్నెములతోడ, సరసము లాడబోదు,
వట్టి విరసపు విరి దీవియలము గాము.

తే॥ నీవు నిరసించునంతటి నీరసులము
కాము, బృందావనిని హరిస్వామి నిలిపి
పేర్మిఁ బెంచిన వల్లవీ వల్లరులము.
అతనికై పూతు కాతు మే మాతఁ డెడఁద
నొల్లఁడే బూలు డుల్లుగా కొల్ల మొరుల.

ఉ॥ ప్రేమజలంబు వోసి, హరి పిన్నటనుండియుఁ, బెంప, బెద్దవై
శ్యామతమాలమున్ బెనఁగి యల్లుక శ్యామునిపొంగె, పూచు గో
పీమృదువల్లు, లివ్వి తనివింగొని శ్యామమధువ్రతమ్ము మా,
ప్రేమసుమాసవం, బనుభవించునుగా, కొరు లంటరాదుసా !

ఉ॥ శ్యామతమాల మల్లుక, తమంతన పూచి, ప్రియానుభూతికిం
గామి, కృతార్థతం గనక, గాడ్పుడి, వాడుచు బూలరాల్చు మా
ప్రేమలతా వితానమిది వీగక, యోగసమీర వీచులన్
దామరసాక్షు లోఁగొని వదల్పదు, ప్రేమపరాగ సంగతిన్॥

**142**

సీ॥ పొగప్రోగిడి యెవండు గగనసౌధము గట్టె !
దుడిమి తార లెవండు పుడమిఁదెచ్చె ?
నెగయు బంగరుపిట్ట కెవఁడు, దారముగట్టె !
కలఁగన్న సిరు లంగఁగలిగె నెవఁడు !
విరచించె చేత మంజరిమాల లెవ్వండు ?
నౌకనడపె నీరులే కెవండు !
రాజీవనయ నానురాగ వ్రతముఁబూని
ముక్కుమూసి సమాధిఁ జొక్కె నెవఁడు ?
తే॥ మాటి కెంతువు జోగపు మోటుబాట
అధిక మదియేమి ? నిర్మోహుడైన హరికి
పరమసఖుఁ డౌటనో పెంకెపట్టు విడవు
అన్న ! నిన్నా అడింబెట్టు నగడు సైఁపు.

**144**

క॥ శ్యామానురాగ రంజిత
మౌ మా మదు లొండురంగు లత్తని నుడినేన్,
నీ మదిఁ దలంపవలవదె !
స్వామీ! మమ్మలచి యేమి ప్రాముకొనెదవో !

తే॥ కనుదెఱువ మూయు, నీ హితకాంక్ష సేయు
నంతదానికి ఫలమొ నీ వింతలేసి
ఘాత లిటు లంటఁగట్టితి, మా తలలను
గత మెదొ యెఱుంగ మీ ప్రతీకారమునకు!

**145**

చ॥ విరివిరి వ్రాలి వ్రాలి, తనివింగొన కొందువిరిన్ రమించి యా
విరియును రేకులూడిచిన, వేఱొకచోఁజను నీదు పూల చు
ట్టుఱికపు బేర్మిఁ గంటిఁ బలుడంగుల పూల నొకండు నల్ల నే
కొఱవడు నీ విలాసమునఁ, గూటుమిళింద! యఱౌనె! మావగల్!

క॥ వలవంతచిచ్చు రగిలిచి,
కళపెళమని మాయెడంద గ్రాఁగఁగ నుప్పున్
జిలికింతు యోగవిషమును
బలిమిని నెక్కించి యోగపత్రమువంకన్॥

క॥ మణిగోల్పోయిన ఫణి కే
ఫణితిని, నెక్కొనును శోభ! వ్రజబాల శిఖా
మణి మందవిడిచి చనె నా
ఫణితి నెఱిఁగి కాఁగనోపు బంధర వింకే!

**146**

చ॥ వ్రజకుల చిత్తచోరుఁడు జొరఁబడి మా హృదయాంతరంబులన్
నిజదరహాస మాధురిని, నివ్వగరంచి, హరించి, మా మదిన్
గజిబిజిచేసి పోయెను, దునాతునకల్ పొనరించి బంధముల్,
వ్రజసతు లుల్కిపాటుపడువారము రాతి రదే తలంపుతోన్॥

**147**

ఉ॥ ఇచ్చకమాడనేల హరి యిమ్ముల మా కిటు మధ్యవర్తివై
వచ్చిన నీకు బంధర! నిబద్ధి వచింపుము న్యాయమేదొ ని
క్కచ్చిగఁ జేయఁగావలె, మొగంబును జూడక, మధ్యవర్తి లోఁ
గచ్చితమూని లక్ష కధికారికి నేన్ బికిరాలమారికేన్॥

ఉ॥ పాక్షికబుద్ధి వొచుఁ గనుపట్టెదు నొంత మొనర్చు కొంచు, న
బ్జాక్ష పదాబ్జరక్తిని, వ్రజాంగనలన్ వరయోగదీక్షలన్
శిక్షయొనర్ప వచ్చితె! యిసీ రసలంపట ః యెందునేర్చి తీ
శిక్షలు నీతలంపులును, జెప్పెడిమాటలు మేళవించునే ?

చ॥ ఘటుఘటువాసియైన, వ్రజకాంతునియందు, విరక్తిగూర మ
మ్మటుమటుఁబుచ్చి నీ విటు తనంతటఁ దద్రసలంపటంబు గా
వుటఁ గను పెట్టి, బ్రహ్మతల బోడియొనర్చి కలంకిఁజేసి నం
తటనయినన్ గనుల్ విడవు త్రవ్వినగోతను గూలకుండువే !

149

చ॥ హరిచర ణానురక్తమతి వౌదువు, భాగవతాగ్రగణ్య ! నీ
వరయఁగఁ బ్రేమమార్గము శ్రమావహ మన్నడి గేవలంబు వా
తెరల వెలార్చితో మనసులిన్నగఁ బల్కితొ, మాకుమాత్ర మీ
తెరు విటు లిచ్చు కాన, కుపదేశమొనర్పగ వచ్చినట్లయో॥

మ॥ హరిసాంగత్యము, బాసి నిక్కముగ సౌఖ్యంబంది రెవ్వారు? మా
వరుసన్ నీవును మందనిల్చి, మధురావాసంపు టూసెత్తకే,
విరహార్తిం జివిఁగొన్న నాఁ డెఱుఁగనోఁ బ్రేమప్రవాధిక్య, మా
విరు లన్నింటిని గ్రోలుతేఁటి, కమలప్రీతిన్ విసర్జించునే !

153

తే॥ వ్రజకిశోరుని స్మితసుధారసముఁ గ్రోల
మరగి మాటికి మారాము జరుపు మదులు
నీదు గీతావివేకమ్ము నేర్చి తత్ప
దాబ్జములా బాసి, చొరపు యోగాంధునను.

155

తే॥ మంచిపని సెప్పి హరి నిన్ను బంచెగాక
యీ పరబ్రహ్మయోగ మింటింటఁ ద్రిప్పి
నిర్గుణోపాస్తి నెల్లెడ నెరపఁ జూపఁ
దన్మహత్త్వ మదంతంత దఱుగువడదొ !

తే॥ మందలో, యోగ మలవర్చుకొందుగాక !
ప్రోల నున్నంతదనుక భోగాలఁ గడుపు
మనుచు, మా మాటుగాఁ జెప్పు మనఘుఁ హరికిఁ
యోగినుల్గఁజేసి మముఁ దాను భోగియగునె!

**158**

తే॥ హరి మగిడివచ్చునాస రవ్వంతగూడ
నీకుఁ జేసితి యోగసందేశ మొకఁడు
మోచికొనితెచ్చి భ్రమర ! నిన్ మొనసిపంపు
నట్టి వసుదేవసుతుఁ డెవ్వఁ డతనిమాట.

తే॥ పాటిసేయుము, మామదిఁ బాదుకొన్న
నీలసుందరు బృందావనీవిహారి,
నందనందను నుడిఁగాక నగరినున్న
కృష్ణుఁ డొండొకఁడేమొ ! యే మెఱుఁగ మతని,

**159**

ద్విరదగతి :—

గంతగాఁ గంబళిన్ గప్పుకొని తిరుగాడు
నింతవాఁ డెంతాయె నింతిరో మనవాఁడు !
తన నోడిందీసి ప్రేఁతలు బువ్వఁదినిపించు
పిననాటి యూసు దలపెట్టఁబోఁ డనిపించు
అడుకొన గోళిల నందించు మన మంద
వాడపెద్దల మఱచె వగవకుండ నెడంద
నిన్నమొన్నయుఁ దొడుగనేరఁ డంగీ నెపుడు
సన్నవల్వలెకాని సయిచవొండఁ టయిపుడు
వలిపెంపు వలువలకె వలచు నాగరికునకు
తొలినాటి తనయున్కి తోఁచునే తలపునకు

మధురాంగనా ప్రణయ మాధురిస్ వలచు నా
మధుమూర్తి మందక్కిక మగుడ రాఁ దలఁచునాం!

163

ద్విపద :—

వ్రేపల్లె కొకసారి వేంచేసి పోర !
గోపాల ! నీ మోముగోముఁ జూపింప
నందనందనుని నిన్ దర్శించుకోర్కిఁ
గందోయి కాయలు గాచుచుండెనుర!
పొద్దుపొద్దున లేపి బుద్దులం గలిపి
పద్దుగా మందతోఁ బంపఁ బో నింక
వెన్న లెత్తుకచన్న వెన్నంటిరాను
గన్నగాఁ డని నిన్ను గద్దింపఁబోను
నీ యాగడాలు గొండెములుగాఁ జెప్పి
మీ యశోదమ్మ నమ్మించి కొట్టింప
నిను రోట బంధించు నీతల్లి కింక
నినుబట్టి త్రాడు నందింపఁబో నెపుడు
చీర లెత్తుకపోయి చెట్టెక్కు నాటి
నీ రట్టుగుట్టు బన్నింపఁబో నెపుడు
నిను నిష్ఠురములాడి నెపబెట్టఁబోను
మనసు లీడేర్పఁగా మఱిమఱి వేఁడ
విందోయి విందోయి ! వేణుగానంబు
విందుఁ బాడు మటంచు విసిగింపలెమ్ము.
అడుగులఁ బారాణి నలఁదు మంచనను
జడఁ బూలు ముడువ వేసారింప నిన్ను
ఘనవటుచ్ఛాయ నాకాళింది దరిని
బనిచి నన్ గై సేయుఁ బంతగింపనుర !

భుజభూషణభరమ్ము బుజములన్ వైచి
 వ్రజమౌళి! కొనిపోను రాసలీలలకు;
సంకేతమున నిల్చి సకియతో నిన్ను
 బింకాన రమ్మని పిలువనంపనుర!
పెంకెతనము సేయ బింకమ్ముఁజూప
 మంకుతనముఁజూప మారా మొనర్ప
నూరదాసక్యాముఁ జూమపేరాసఁ
 గూరుదప్పిని వడగొన్న నీ కనులు
దీపింప మనచెల్మి తియ్యంబు తీరు
 చూపు లాఁపోవఁగాఁ జూపట్టురార!
వింజామరల వీతు వీతమం దుంచి
 రంజిల్లఁగనుచు నీ ప్రత్యంగశోభ
వ్రజపల్లి కొకసారి రార! గోపాల!
 నిజమైత్రి నిలుపురా! నీ మోముఁజూపి॥

**164**

ఉ॥ నందయశోద లం డ్రనఘ! నందనుఁ డందు మముఁ దలంచునే
డెందములం దొకప్పుడు, గడింపమిచేఁ బొరపాటె వచ్చె మా
యందున మున్ను ద న్నెఱుఁగనవ్వు డెదన్ వగపేల దాని కీ
నందనుకై భ్రమింపకుము నంద! యితం డిటు వాసుదేవుఁడై

క॥ నీ మందిరమునఁ బెరిగెను
 నీముం దిఁక దిరము నిలువఁ డీతని మమతన్
 బ్రాముకొన కంచు గర్గమ
 హాముని యనె గొల్లలరయమైతిమి దానిన్

**165**

చ॥ తలకొని కంసుఁ జంపి, తలిదండ్రుల బండెలు వాపి, యుగ్రసే
నులఁ బెనుగద్దెనిల్పి, సుమనోవిభులిలఁ దనర్చ భోగి గో
కులమున కాలవెంబడిని గోపకుమారుల వెంబడించి రా
వలె నని యున్నదే! మనసువచ్చునె, రాసిరు లుజ్జగించిరాన్.

**166**

ద్విరదగతి :—

శ్యామసుందరమూర్తి నందుకొన్నట్టితమి
స్వామి ! నిను గన్నంత వంతలో మఱచితిమి
ఒడలెల్ల నుప్పొంగె నుల్లాసమున నేఁడు
కడు భాగ్యవతుల మొక్కఁడునౌనె మాకీడు
అలరుతావులఁ దేంట్ల నలరించు గాలివలె
చెలికాని వార్తలను జెలులఁ దేర్చితి బలే !
చే నందరాకున్న చేనద్దమున రూప
మానందకర మౌచు నెనువుపడు నారూప
సాకల్యముగ నచ్చు శ్యామసుందరమూర్తి
గాకున్న, నీమూర్తి గడపె మా విరహార్తి

**171**

శా॥ తన్నుంబాసిన యేమె కాదు పసులున్ దైన్యంబుతో నిచ్చలున్
గన్నీరోడఁగ మేపు లుడ్గె నని యా కంసారితోఁ జెప్పవో
యన్నా! పేర్కొని పిల్వ నిన్నుఁ బసు లంభారావముల్ సేసి నీ
తెన్నే చూచు నటుంచుఁ, బాల్పితుక నేతెం తన్న పేరాసతోన్.

క॥ ప్రతిదినము బసులు నినుఁ బా
ల్పితికెడు నెడలెల్ల, వెతకివెతకి నిరాశన్
జతికిలపడు నినుఁ గనకే
వెత నీరెద్దడిని, మీలు వికలపడునటుల్.

**172**

క॥ మురళీగానము విన్ననె
పరు విలువడిఁ దలఁపకుండఁ బరువిడి తనతో
వరుడెంచు మమ్ము నేటికి
మరపుకొనెన్ యోగ మజుఁడు మాతల వ్రాయన్.

క॥ నాఁడేల యెఱుఁక సెప్పఁడు ?
వ్రీడావతి నొసట వ్రాసిపెట్టిన యోగం,
బాడింపనేల ? రాస
క్రీడలు, రుచిజూపనేల ? కెమ్మోవిచవుల్.

**173**

శా॥ మా భాగ్యంబుల వ్రాసిపెట్టు విధిఁ వ్రా, ల్మన్నించి, కర్మానుగం
బౌ భోగంబులఁ గుడ్చుచుంటి, మొకు నెగ్గాడన్ ఫలంబేమి కు
బ్జాభామామణి మోహనాంగు వరరూపం బందుఁ బ్రాపించి, త
త్సౌభాగ్యోద్ధతి యోగ మంచె నని, సంతాపింతు మే మంతియే !

**175**

సీ॥ పొట్టపెకల్చక పొటమరింపక విత్తు
మొలకెత్తి వృక్షమై ఫలములిడదు
పోరఁ జూఱకు టంపపోటులఁ దినకుండ
శూరకీర్తిని బంటు చూఱఁగొనఁడు
కోక లద్దకమున కాఁకఁ గ్రాఁగినఁగాక
అద్దకమ్మున వన్నె లద్దుకొనవు
అవమునం గాల కామఘటంబు దా
నూనఁబోదు సుధామ యోదకముల

తే॥ అట్లు లేమునుఁ బ్రియవిరహార్తి, వేగి,
మాధవ ప్రేమమయ సుధాగాధ జలధి,
మునిఁగి తేలుచు నంతంత, కనఘచరిత!
ప్రేమపారమ్య మందుదు మే మొకప్డు.

## 17

చ॥ తను వ్రజపల్లెనున్న వనదారువులం దరిఁజేరి కాల్పఁగా
జనదన నాదవాగ్ని, హరి సత్యముగా నెదనిల్చియున్నఁ గా
ల్చునె విరహాగ్ని మాయెడ లిచోటదిగా కిపు కిప్రియావహే
ళన మతఁ డెట్టుసైచు, బయలంబడి మావెత లార్పకుండఁగన్

క॥ మున్నింద్రుఁ డలిగి కురిసిన
తెన్నుఁనఁ గన్నీటివాన తేరక కురిసెన్
బన్నపడు, ప్రియవియోగా
పన్నల గిరిధారి యెపుడు వచ్చి భరించున్.

## 181

క॥ వ్రేఁతలవుఁ దలఁపురతనం
చైతనరెడు తా నెటుండఁ నలవడె మధురన్
జూతను, వ్రజ మెటులోల్లఁడొఁ
వ్రాతమె యొకజా, బ దంది వచ్చునో లేదో!

శా॥ వెన్నుం డింతకు రాఁడుగా సఖి! యెటుల్ వేగింతు మీప్రొద్దు ద
త్సాన్నిధ్యంబున కేగి, తా నెవరిసంతానంబొ! యెవ్వారి పాల్
వెన్నల్ గ్రోలెనొ, మొన్నదన్క, నెవరిన్ వేడ్కన్ రమింపించెనో
విన్నాణంబుగ నద్ది చూత మతఁ డెవ్వీఁకం బ్రపంగించునో.

## 191-192

ముత్యాల సరాలు :—

సంతత ప్రేమార్ద్రమౌ మా స్వాంతములు వజ్రాభమై నేఁ
డంతకంత కచేతనములౌ నతికఠోరములై,
చేయిదప్పక యెప్పు డవి మా చెప్పుచేఁతల నున్న మాకై
ఆయశోద కుమారు నింత ప్రయాసపెట్టుదుమే !
పయిఁటివలువ చెఱంగె యడ్డముపడ నసహింపని ప్రియుని కౌఁగిటి
కయయొ యమునాసైకతములే యడ్డుపడె నిమ్మె

నిగమదుర్గముఁ దన్నుఁ గనకే నెలఁతుకలకుం దెల్లనాఱదు
నోగులుదీరదు కంటఁబడుమను నోగులుదీఱంగన్
తల్లి తను మను రోటఁగట్టిన దండినేరము మనసునిడి వ్రే
పల్లెఁ గ్రమ్మఱ నడుగువెట్టుడు వ్రజకిశోరుఁ డిటుల్
అల్ల చిన్నటనాఁడుగా మరులెల్లుకొని తనుఁగొల్చు మనలను
నల్లవాఁ డిటు కల్లబుచ్చునె నగరుఁజేరగనే !
మందతలఁపును మఱవఁబాడియె మధురరాచటీకమున మనసిడి
మందగమనల రాచకొమెరెల మైత్రిమరగిననేన్.
మించుబోణు లచోట మనతల మించువారు లభింత్రుగాక ల
భించువారె ! యశోదనందులపెట్టు తలిదండ్రుల్.
ఎందుగల కీ గోపసుందరు, లెందుఁగల వీ యాలమందలు
మందవిడ నెందుండుఁ బాల్మన మందకాపరికిన్
సూరసుందరు దర్శనంబది సూరకొనుభాగ్యంబు మా యా
భీరసుందరు లొంద, మందకుఁ బ్రియునిఁ గొనితెమ్మా !

**192**

తే॥ వనులఁ దిరుగాడువేళ, మా కనులముందు
జూపడును, శ్యామలచ్ఛవి రూపుగట్టి,
అట్టి హరి కందుఁ బట్టముఁగట్టిపెట్ట
యమునదీవుల రేల సయ్యాటలాడు.

తే॥ పిన్ననాటి తలంపది చిన్నతనము
తోఁచెనట వాని కతనికై వేచిచూడ
నలసెఁ గన్నవ, లీవిరహామయం బ
ణంపఁ గృష్ణాశ్వినుల మంద కంపు మనఘ!

**197-198**

**ముత్యాల సరాలు :—**

వెన్నముచ్చిలి పట్టువడునెడ విన్నవడు హరి బిక్కమోమును
చిన్ననాఁ డల రోటఁగట్టిన సిగ్గువడు వడువున్

చిత్తరుంబలె హత్తుకొని మా చిత్తసీమల నొత్తిగిల వవి
చిత్తుసత్తు ప్రబోధములతోఁ జెటిపి మఱపింపన్॥
మచ్చికన్ హరి మచ్చుజల్లిన మచ్చు మదిగ్రుచ్చిల్లి విస మం
దిచ్చిపోయెను గుమిలిచావఁగ నెదిరి మార్గానకే।
మోవితేనియ వంక నా మునుముచ్చు దన పులిమీసవిసము ను
ద్రావఁబెట్టినఁ జావనీ దని బ్రతుకనీదయ్యా।
తిరముగాఁ దన ప్రేమ నమ్ముచుఁ దిరముగా దని పతిసుతాదిక
పరమబంధు ప్రేమ విడి యిలువడిఁ దొరంగితిమి॥
వచ్చిపోయెడు నుసురు లా హరి వచ్చునను నడియాస నాతఁడు
వచ్చుటే కల్లైన నిఁక మన వచ్చునే మకున్!
గుణరసాంబుధి శ్యామసుందర గుణఖనిన్ విడి బేలలై ని
ర్గుణఘటోదక మిచ్చగించెడు గోలలుం గలరే!

## 199

సీ॥ వాతెఱతేనియల్ వరపి మున్ దా మోము
వలపుమొల్కలు వసివాళ్ళువాడ
బుడుత లాడి పొకార్చు బొమ్మరిల్లాటమా
ద్రిగఁ గాలఁదన్ని మా ప్రేమసృష్టి
కుబుసమూడిచి దుల్పుకొనిచన్న ఫణియట్లు
వాడినవిరిఁబాయు భ్రమరమట్లు
వలపుకొట్టుమిది ప్రాబడెనని కొంగ్రొత్త
వలపులకై హరి ప్రాకులాడు

తే॥ నడగడెకు వన్నెమార్చు పల్వన్నెకాండ్రు
సుకపడుదు రెచటికచటె యొకటననక
యెడ నుడి నొడల్ల బొరలేక యేకనిష్ఠ
ప్రేమనిర్యుమ్ముల జరుపువ్వారే తపింత్రు.

తే॥ తన్నుముచ్చిలి గడ్డిగాదములువెట్టు
నంటుకాపు మేపుమరగి తొంటిగేస్తు
మందమేసిన మేలెల్ల మఱచినట్టి
గొడ్డువలె నేఁడు హరిప్రేమ గొడ్డువోయె.

201

క॥ రగులుచు మది రేవగలును
బొగసెడు హరివిరహవహ్నిఁ బొగచూరఁ గనుల్
బొగిలి కనునీరుఁగురిసెడు
వగలాం ద్రఖిలాత్ముఁడంచు భావిత్రె హరిన్ ?

క॥ కొఱమాలినవారిగ మ
మ్మఱసేసి యమాయికల ని టక్కఱదిరన్
దొఱగె విరహాగ్ని మరగిన
నుఱ కతఁ డఖిలాత్ముఁడనగఁ నొప్పెద్యమెట్టుల్?

212

ఉ॥ దండ మొకండు చారుభుజదండమునందిడి యాలగాఁయు మా
గుండెల నాఁచిక్కొన్న దల కోమలగోపకిశోరమూర్తి యా
తాండవలోలు వేణునినదంబుతలం పెడబాయుఁబో ద,దె
న్నం దల కాంచనాంబరు మనఃప్రియదర్శన మాత్మఁ దూకొనన్॥

తే॥ శ్యామసుందర సమ్మోహనాకృతి నెడ
నాటుకొను మాకు ము_త్తిజంజాటు మేల !
కన్నుగవ మూసి ధక్కనుకాల్కలకాగి,
యోగ మెవఁడూను ! రసరాజయోగ ముడిగి.

క॥ నిజమాడిన నిష్ఠురమౌ,
వ్రజనందను వగను, రేలువగ లదరెడు మా
వ్రజసతుల కగుణయోగము
గజిబిజిఁ గొనితెచ్చి తెంత గడుసరివయ్యా !

214

సీ॥ అక్రూరువెనువెంట నరదమెక్కి ప్రియుండు
నగరికిఁ బయనమౌనాఁడె యేము
మాయిసంసారంపు మమకార మెడలించి
పతిసుత మోహంబుఁ బాఱఁద్రోలి
కష్టాగ్ని కీలలఁ గాయముల్ వేఁచి స
మాధిఁ గన్నులమూసి మౌనమూని
వేణుగోపాలుని విన్నాణమౌ రూపు
స్వాంతపీఠములందుఁ బాదుకొలిపి.

తే॥ నేఁడు నీవాడు యోగ మానాఁడె పూని
నా మహర్నిశ లెద నందనందన స్వ
రూపసాయుజ్యము మఱవనోప కిప్పు
డితరయోగము లూన మా కేటి కయ్య!

క॥ మురళీధర మధురాకృతిఁ
గరామలకమట్టు లచ్చుగట్టించి మదిం
దిరపఱచినదే యోగము
పరయోగము లేల మాకుఁ బడఁతుల కనఘా!

క॥ పడరానిపాట్లు విధి వగ
పడరాని నిరూప తత్త్వభవ్య జ్యోతిం
బడఁతులు గనఁదగువారే!
యెడదం బొడకట్టు వ్రజకులేశ్వరుఁ దక్కన్.

215

క॥ మోవిని బిల్లంగ్రోవి, శి
ఖావలపింఛంబు తలను, గళసీమ నిగల్
వోవు పులిగోరుపతకము,
తో, విభుఁడెపు డాలవెంటఁ దోతెంచిన తొ.

తే॥ హరి గోధూళి ధూసరితాంగ, మెపుడు
గానవచ్చును గన్నులగట్టినట్లు,
అతనితోడిద లోక మన్నట్టు లేము,
సుఖవిలాసాలఁ బ్రొద్దు బోఁ జొనిపినాము !

తే॥ పొత్తుకుడుపుల వని జద్దిబువ్వఁ గుడిచి,
అరమరిక లేక సయ్యాటు లాడినాము
ఆ సుఖాస్పదుఁ డింక మా కబ్బుటేడ !
రాచఠీక మబ్బె మాటాడరాదుకూడ.

217

ద్విరదగతి :—

బూదిఁబూఁగు మతమ్ముఁ బూన్పించునే సమ్మ ?
మాదేవుఁ డేమనెనొ! మగుడఁజని వినిరమ్మ
నిన్న మొన్న విదనుక నెలఁతలఁ బెనంగొంచుఁ
జెన్నలరఁ జేసేఁత సింగార మొనరించు
గోపికాలోలునకు, గోపాలున కిదేడ
దాపురించెను బ్రహ్మతత్త్వానుభవ మాడ
గోపశేఖరుతోనఁ గోల్పోయి సువివేక
మోపుదుము సి ప్రలాపోక్తు లివి యెవ్వికఁ !
వ్రేఁతలము పుట్టితిమి విరహంబు సైఁపగను,
రాతిగుండెలు, మావి వ్రయ్యఁబో వెవ్వగను
ప్రాణావలంబమయి ప్రాణేశుఁ డెడనుండి
త్రాణనిల్పుచు నుండఁ దరలు నుసు రెందుండి?

220

వ॥ విధియను కుంభకారుఁ డిటు వ్రేఁతల నామఘటాళి సేయఁగా
మధురవిలాస చిత్రముల మల్చి విభుం డవి తా నిజాగమా
వధియను నట్టుకన్ నిలిపి, బాష్పజలంబుల నానకుండ ని
వ్విధి వ్రజపల్లె యావమున బెట్టి వియోగమయాగ్నిఁ గాల్పెఁ జూ

క॥ కట్టిడి యోగాభ్యాసపు
గట్టెల నిట్టూర్పుగాడ్పు కడుఁగి రగుల్పన్,
నిట్టలపు దలఁపె చిచ్చుగ,
నట్టె ప్రియదర్శనేచ్ఛ యను సానపయిన్.

తే॥ పొలిపి దట్టించి ప్రేమాంబుపూర్ణమైన
ఘటముల నొనర్చె నేయంటు గాననట్టి
యమలిన ఘటంబు లిటు నిల్పి యరిగెఁ బ్రియుఁడు
రాచటిక మేల నెపుడు మ మ్మాఁదికొనునొ !

225

ద్విరదగతి :—

ఏ దుర్దినమున ము న్నే దుర్ముహూర్తాన,
మా దేవుఁ డానాఁడు మందఁ గదలెనో కాని
మఱలి రాఁడాయెఁ దా మథురలోఁ దనవారి
మరగి వాఁ డేల యే మఱచుఁడు మనవారి
తొల్లి విడివడ్డ బంధులఁ గూడినాఁ డింకఁ
దల్లినుఁ డౌఁగాని, తలఁచునా మనవంక
నాటి గర్గునిమాట, నాటులే చెప్పొటు,
నేటి కీపాటిపై నిజమాయె నామాట.

229

ఉ॥ వర్తిలు సర్వచిత్త సమవర్తనుఁడై యెడగాక, తత్కృపా
మూర్తి, ప్రపన్నకోటి సతమున్ మన సన్నుడి నిక్కమేని మా
యార్తినిగాంచి యేటికి బయల్పడఁ డా హరి తద్గుణాను సం
కీర్తన మన్న యించుఁ దలగించుచు నిర్గుణశృంగ మూన్తువే !

232

చ॥ నినుఁగని, శౌరిగన్న దె గణింతుము, తాపములెల్ల వాయ, నో
యనఘ!హరిం బరాత్పరుఁడటందు, త్రయీమయుఁడందు,నందనం
దనుండయి మందలోఁ బెరిఁగి మందలఁ గాచిననాటి టోటఁగ
ట్టిన కత రాసలీలలుఁ గడిందివగల్ తెగతెంపు లాయెనే !

క॥ ఆనాటి సుఖవిలాసము
లేనాటికి మఱపురావ యిచ్చకముల మ
మ్మానాఁడు మదిఁ గరంచుచు,
బోనాడె మొగంబు చూపఁబోకే ముగుడన్.

చ॥ సనక సనందనాదులగు జ్ఞానఘనుల్ నయితమ్ము చొక్కి ని
ర్గుణ సముపాసనక్రమ మెఱుంగను ప్రాకృతబుద్ధు లర్హులే
ఘన నిశితాసిపై నడకగాదె గుణాతిగ తత్వనిష్ఠ యుం
గనల కదేవ! నీవ యది గైకొని మా విభు మా కొసంగవే!

2౩5

ఉ॥ ఎమ్మెయి నొడ్ల కష్టసుఖవృత్తు లెఱుఁగు కృపాస్వభావుఁడౌ
దిమ్మగు రాచబాటఁ ద్యజియించి కదధ్వముఁ జూపు చిందులం
గ్రుమ్మరఁజన్నె నీ కనఘ! గుమ్మడిపండును మేకనోట నొ
క్కుమ్మడిఁ గ్రుక్కినట్లలఘుయోగము నాంధ్రకు నంటఁగట్టెడే!

తే॥ కడకు మావాదమునకె నీ వొడఁబడవలె
గాని నీ నేర్పు జ్ఞానయోగంబు దీని
నే వ్రజాంగన చెవిఁబెట్టు! నీ వ్రజమున?
వెతఁబడిపి శాంతిఁజేకూర్చు విధముఁదెలుపు

243

సీ॥ దబ్బపై హరి మరుల్గొని పెట్టులెత్తఁగాఁ
దిరుగు నన్నుది గణుతింపకు మను
నెమ్మిపించె బొమిడికమ్ముతో నెపుడొ వేం
చేసి మా పనువిందుసేయు మనుము
మా మనమ్ములఁ దన్పి పమ్మేలుకొన్నము
జగము లేలినవాఁడ వగుదు మనుము
ధర యశోద సతీమతల్లికయే తల్లి
రాధికాప్రియసాటి రాధిక యను

తే॥ మిందుఁ గాలూని స్థిరబుద్ధి నెంచుకొన్న
త్రేఁతలము మించు వైకుంఠ మేతలాన
సృష్టి లేదని నీకె స్ఫురింపవచ్చు
మంద విడ నేరు సెప్పి రిందందుఁ దిరుగ.

**246**

ఉ॥ తామరతేనె మైకమునఁ దద్దయుఁ గానక ప్రొద్దుగ్రుంకుడున్
దామరబందియైన యళి తామరసాప్తుఁడు వచ్చు విచ్చు నీ
తామరరేకు తల్పు లని తల్చెడు లోనె గజంబు త్రెంచె నం
టామెయి నేముఁ బ్రేమసుధ నానుచుయోగము గాన మ్రక్కటా!

ఉ॥ ప్రేమసుధం జవింగొలిపి పిమ్మట యోగకషాయ మూన్చు నా
బూమెలకాఁడు, నీవు నొకపోలికివార లె చిన్నె వన్నె లన్
మీ మధుపాళి బాతురికి మిన్న లటందురు, కాని మాయెడన్
పీమతి యింత సూపడదు, నెక్కొను దెంతొ యమాయకుండవై

**247**

ఉ॥ తేఁటి! యి దేటిమాట, విరిదేనియ మత్తిలి యాడినావొ! యా
హాటకచేలు వీడ్కొని తదంఘ్రి సరోజ మరందపాన మి
ప్పాటున గోలుపోయి ధృతిపాటవ మోడి భ్రమించి పల్కితో
బోటుల యోగమూను డను బోదనకై హరి పంచెనం చిటుల్

ముఖ్యా సరాలు :—

కుంతమటు మా కుటిలకుంతలగుండె దూసెడు యోగమిది మృదు
లాంతరంగుని శ్రీముఖాన, వెలార దిం దీవే
సొంతకై తను గొంత గలిపితినుమ్ము లే కిటు లేల సిగ్గిలె
దింత పరు సా వెన్నతిను నోరెటు వెలార్చెనయా !
మించు మధురానగరిసిరిఁ దలమించు మా యమునమ్మ సంపద,
యించుకే నీద్దనుడుల నయించఁబో మయ్యా ! పె

నాల్గుచెఱఁగుల నేల నేలెడు నాల్గుచేతుల సామి, మీమది
వెల్గ మామది నందులోఁగిటి వెలుఁగె వెలుఁగొందున్.
చెట్టపట్టాల్ పట్టి నందుని చిట్టిపాపఁడు గొల్లబొట్టెల
జట్టుగూడి మదుల్గరంచిన జాడ మఱచెదమే !
దొడ్డమాటలు వేయిసెప్పినదొరలు, నాహరిఁగూడి యాడిన
దొడ్డిపట్టు గలట్టి సుకృతుల, దొరయఁబోరయ్యా !

**249**

చ॥ సుమముల నన్నిటుందిరిగి, సొక్క కవెల్లను నీరసంబుగాఁ
గమలపరాగరాగ మెదఁద్రగమ్మ జగమ్మును విస్మరించి, యా
కమలమునందె బందివయి క్రమ్మఱ నా కమలాయతేక్షణుం
గమలనిభాస్యు నా కమలాకాంతపదున్ హరి నీసడింతువే !

క॥ కమలప్రియుఁడవునై యళి !
కమలాంఘ్రిని, గమలనాభు, గమలాక్షు ,హరిన్
సమరసమతిఁ గైకొన, కిటు
భ్రమమునఁ బిడివాదమూనఁ బాడియొ! యెదురై.

తే॥ నందనందనుఁగాక పన్నకము లెన్నొ,
పన్ని విన్పించి వినుగింపఁజన్నె మమ్ము !
మాలలును గంధపొడిపూఁత మరగు నొడలు
బూదిపూఁతల కేకొన్నె! బోధవిన్నె !

**250**

ద్విరదగతి :—
ఏవాఁడు పనిచె మా కీవాడ కీవార్త,
నీ వెఱింగిన గోపుఁ డెవఁడొ చెపు మీవార్త
మృదువేణుగానమున, మృగములను, దరిదీసి
తుద కుసురుఁగొనుఁ, గిరాతుడు తూపు లెదనేసి
విరిదేనియల్ ద్రావి, వెనుజూడ దా తేఁటి

విరులున్న నూడినను, వెత దాని కేపాటి ?
పూతనను జనుగుడిచి, పొడవడఁచె, మిన్నుఁద్రొక్కి
దాత బలిదైత్యుఁ, బాతాళమున, మడఁద్రొక్కె,
పొంచి వాలి వధించెఁ, బొలతులని తలఁపక య
జంచెఁ దాటకఁ, జుప్పనాతి నొంచెను సకియ !,
నేటిదా ! హరి యెపుడొ నేర్చె, నీ పరిపాటి
బోఁటులను వంచించు నొకడ యి దేపాటి ?

251

ఇందీవరశ్యాముఁ, డిందిందిరము నంపె,
మంద కఖిలవ్యాప్తి మందగించెనొ తనకు
నగరాంగ నాలోకనమున మఱచెఁ గరమ్ము
నెగడు బ్రేఁతలకూర్మి నిఖిలాత్మకత్వమ్ము
కూడుకొన్నది మొదలు గూనెవగలాడి వగ
మూడుకొన్నది మనకు ముప్పు మూఁడవ దనఁగ
ఏపాపము నెఱుఁగఁ డీ పరమ సాధు తల
మోపె నీయోగమ్ము మూట మోచుకు దరల
చెప్పు సేఁతల కడ్డు సెప్ప కిద్ధవుఁ డంత
యొప్పగించెను దెచ్చి యోగపాఠ మిదంత
అన్నెంబుపున్నె మరయఁ డమాయికుఁడు, దను
పన్ను పన్నక మేని పసిగట్టఁ జాలఁడును
వలపు వాల్లభ్యంబు, వలసినన్ని సుగాలు,
కలుములవి హరిపాలు, కడగండ్లు మనపాలు.

255

చ॥ జననిని జన్మభూమిని, వ్రజంబును గాదని కృష్ణుఁ డే ప్రయో
జన మొడగూర్పనెంచి కులజాతి వయోగుణ రూపయుక్త కు
బ్జను జతగూడెఁ, జెప్పు వ్రజపల్లె నెదే నపరాధ మెంచి పో
యెనొ, చెలి గూనె దాసి వెలయించిన బోధనలే రుచించెనో !

తే॥ త్రికరణమ్ముల హరిఁగాక, యొకని గనని
సతుల మతిఁ ద్రిప్పి, పరదైవ రతికి మలుపు
పెద్దమానిసి ! నిను సరిదిద్దు టెంత !
అతిథివై వచ్చి బ్రతికిపోయితివి గాక !

తే॥ అటు గుణాతీతునేని, సర్వాత్మునేని,
మగని, గాదని సతి నొంటు మరగు మంటు,
దగునె ! నిన్నంపు టెన్న పెద్దఱిక మెంచి
కాక, నీ కాతిథేయము గాకయున్నె !

**258**

మూత్యాల సరాలు :—

ముజ్జగంబుల యెఱుకమీఱిన మొక్కలీడవు నీవు నీ మా
కజ్జలాక్షుల కర్జముల కక్కఱకు వచ్చితివా !,
పైఁడిగిన్నెలఁ దావినూనెలు పట్టితే హరిచే నొకప్పుడు
వేడుకన్ దువ్వించుకొను తల వెడజడల్ బూనన్
మున్ను ముచ్చటముడులు ముడిచిన ముగుద జుత్తుల జోగిజడలుగ
బన్నుకొమ్మనిపలుక నీ కెటు వాయి వచ్చినదో !
అనయమున్ ప్రియుఁ గూడుకొని నగులాటు సరసా లాడిపాడుచు
మను నుడికి వాకట్టుమందుగ మౌన మూన్పింతే !
రంగు బంగరుకమ్మలన్ హరి రవణదిద్దిన చెవుల ద్రవేలెడు
భంగి పటికపు బూసలూనఁగ బలుకు టిది యేమో !
చీనిచీనాంబరము లూనెడు చెలుల మేనులఁ గావిలుంగిల్
బూనికిం గకపాల బొంతయు బూనుమం దపురా ।
గంధలేపము గాగ, బూదిని గయిని గొమ్మును డమరుకమ్మును
గంధరమ్మున నక్షమాలయు గట్టుకొమ్మందే !
చాలు నీ జ్ఞానంబు తెలిసెను జాల మొనరుప కరుగు మా వన
మాలి నెపుడేఁ గందు మాతఁడు మనుఁ జిరాయువుగన్.

260

ఉ॥ క్రొత్తగ నత్తుకొన్న యల గూనెది గూనెను దాచికొన్నదో
యెత్తుల నిన్ని శౌరి మన కెద్దడి సేసిన స్వీయరూప సం
పత్తికి మాఱు జ్ఞానవిభవంబును బంచిన దెత్తుకెత్తుగా
జిత్తులమారి రూప రససింధువు శ్రీహరి నంత వానినిన్.

ఉ॥ పొత్తున గూడఁగట్టుకొని బుద్ధులు సెప్పెను యోగపద్ధతిన్
హత్తుకొనుం డటంచు జవరాండ్రకు గన్నుల దుమ్ముగొట్ట నే
యెత్తునకైనఁ జాలు నది యెల్లజగాల్ భ్రమయించు జెట్టి నే
జిత్తున వైచె రూప మెదఁ జిక్కి నిరాకృతిఁ జేసివైచుచున్.

తే॥ భళిర! సాకార రూపవైభవము దాను
జిక్కఁబట్టి, నిరాకారుఁ జేసిపంచి
కొంటెనగవుల జగలి మగువల భ్రమయఁ
బెట్టు మాయావి శౌరినే, బేలుపుచ్చె.

26

చ॥ మనసుల మ్రుచ్చిలించి చన మారమమోహరుఁ డుత్తమేనులన్
బెనఁచి నలంప నేమిటికి, విత్తును దుల్లిన వట్టిగడ్డిఁ ద్రొ
క్కిన ఫలమేమి తేఁటి! శ్రమగిట్టునె గాలిని మూటఁగట్ట, మా
వనితలతోడ నేల చలపట్టెదు! గొంటె నడంగి యుండుమా!

ఉ॥ ఏ మనుకొందొ, కాని సతులెల్లరు నీ యుపదేశమున్ వినం
గా మతిపోయి చిత్తరులుగా నయి చేష్టలుదక్కి రిట్టిచో
శ్యామలమూర్తి నిర్గుణకథాదులు విన్చి కలంతు మిళింద! గొంటె నెం
దో మఱగారి కర్మఫలమొందక తీరని దం చెఱుంగుమా!

262

ఉ॥ ఎన్నఁడు బిడ్డ పెద్దయగు నెన్నఁడు మమ్ముల నుద్ధరించునో
కన్నకుమారుఁ డంచు హితకాంక్షఁ దపోనియమ వ్రతంబులం
దన్నుగురించి సేయు తలిదండ్రుల యాశ నిరాశఁజేసినన్
పిన్నఁడు పెద్దయై విడిన బెంచిన మోహము దుస్త్యజంబగున్.

ఉ॥ కాకము సోకఁగాఁ బెరుఁగఁగా శది యాకలురాఁ దసంతద్దై
సోకిన కాకులం బొడిచి చయ్యనఁ దాఁ దలఁదన్ని పోవు నా
కోకిలపిల్ల మాదిరిగ గోకుల మాకుల పెట్టి పోయె గో
పీకుల భూషణుం డతఁడు వేయుగముల్ మనుగాక యెందునో!

క॥ దీవింతుము హరి సుఖపడ
వేవాడల రాచటికపు ప్రేఁగుల వెన్నెన్
దా వలచివచ్చి పడినను
వే వేలేండ్లెందొ యొకటు, వెలయుత, మంచున్.

**264**

తే॥ సుమవిలాసినులను జేరి సుఖవిలాస
సంగతులఁ దేలి తుదకు వంశమునఁ జేరు
భ్రమరగతి శౌరి ఆత్మవంశమునఁ గలిసె
నేటి కబ్జాస్యలిఁక వాని కెదురుచూడ ?

ఉ॥ కోరినకాంతనెల్ల నొడి గూరుచుకొంచుఁ రసప్రియుం డహం
కార సురాప్రమత్తుఁడయి, కంసు నడంచి, పురీవిలాసినీ
వారముఁ జేరి, వారి జతబట్టెనుగాఁ దగుణాత్మకంబె వే
నూఱుమడుంగు లా యువగుణుండగు శౌరియె మేలు చూడగన్.

**270**

ఉ॥ బెల్లపుముక్కఁ జూపి మఱపింపఁగఁ బిల్లల మేము గాము, నీ
వల్లిన పన్నకాన వివశాత్ముల మౌటకు, నీదు చాతురిన్
మొల్లముజూపఁ దమ్మివిరి ముద్దియ లంతకుఁ గాము, నీ పసన్
దెల్ల మొనర్చి మెచ్చి వినుతింపఁగఁ గుబ్జయుగాము, మే మళీ!

**279**

ఉ॥ వెన్నుఁడు పెద్దమానిసయి పిల్లన గ్రోవికి సిగ్గుఁజూపు మున్
బిన్నటునాటి యూసు లవి భిత్తుల ప్రేలెడు చిత్రరాజిఁ గ
న్గొన్నను, నెమ్మిపించియపుఁ గుంచెఁగనన్, బిడియంబు నెందు మా
యన్నులమిన్నలన్న తలఁపోరిన, సిగ్గున గుప్పగూలెడిన్.

చ॥ బిసరుహనేత్రుఁడం దిపుడు పెద్దయి పిన్నటనాటి వేణువున్,
బసువుల నెమ్మిఁ బించె తలపాగలఁ, దల్చుచు గద్దెనుండియే
ముసిముసినవ్వు నవ్వునఁట, ముచ్చటతో మనయూసు వింటకే
కొసరుచు నట్టి గోష్ఠవిముఖుం డెటుఁ గ్రోలునొ పాలుపెర్వు లన్.

281

ఉ॥ మందపొలమ్ము గుత్తఁగొని మారుఁ డిదే తన దండు దింపె సం
క్రందనుఁడీయ జాగిరుగఁ గైకొని యల్ల బలాకపంక్తియే
పెం దలపాగగా, మొగిలు భృత్యుఁడుగా, మెఱుపే పతాకగ
న్వందులుగాఁగఁ జాతక వనప్రియముల్, చిఱుగాడ్పుతోడ్పడన్

చ॥ శుక పిక కేకి నాదములు జుమ్మని గింగురువెట్ట వీనులన్
సకలబలమ్ముతో మన వ్రజమ్మున వీఁ డిదె తిష్ఠవేసె, బ్ర
హ్మకు దరమయ్యెనే వ్రజకులాగ్రణి వీటఁ గలంతకాలమం
కెకుఁగొని మందఁ ద్రొక్క, హరికేసరి లే కతనుండె పైకొనెన్

287

మ॥ సకి! పత్యాగమన ప్రతిక్షణ ప్రతీక్షం గల్పమ ట్లయ్యెఁ బ్రొ
ద్దిఁ కనేనిన్ హరి రాఁడుగా! బ్రతుకు ప్రొద్దెల్లన్ వృథాయై చనెన్
సెకవెల్లై చలివెల్లు ఁడుదుకు పాల్సేయన్ వియోగార్తి వీన్
బెకలింపన్ బికచాతకారవము, లెవ్వీఁకన్ శ్రవశ్శూలమై.

తే॥ అల నరుఁడు బేర్చు నంపశయ్యను బరుండి
యుత్తరాయణపుం బ్రొద్దు కుసురు లుగ్గ
పట్టు భీష్మపితామహుపగిది నేము
నలరు విలుకాని యంపసెజ్జల బరుండి.

తే॥ వ్రజకిశోరుఁడు వ్రేపల్లెవచ్చు ప్రొద్దు
కెదురుజూతుము, ప్రాణము లదెమిపట్టి
యొడలుగై సేతు మతని రాకడకుఁ బోరఁ
గడఁగు జోదు మైజోడుఁ దొడుగునట్లు.

**289**

తే॥ నాఁడు హరి మందవిడనాఁడు నాడుమొదలు
రాతిరింబవ లతని తోఁపే తలిర్పు
గేళిఁ బ్రియుఁగూడి కలనే సుఖింప నిదుర
ముంచుకొని వచ్చి సుస్వప్నముం గలంచె.

చ॥ 'కదిసి' ప్రియుండు నన్ గరము గైకొనినట్టు కలన్ సుఖించుచో
నిదుర పగాయెనమ్మ! కల నెమ్మిఁగలంచుచుఁ జక్రవాకి తా
నుదకములందు నీడను బ్రియుం డనుకొంచు వియోగదుఃఖమున్
వదలినఁ దత్సుఖం బలలవంకఁ గలంచెడు గాలివోలికిన్.

**290**

తే॥ ధనకనక వస్తుసంపన్న ధనికగృహముఁ
దూఱి తా నెది దోచుకోఁ దోఁపక రెయి
రిత్తబుచ్చిన ముచ్చుమాడ్కిగ రమింప
మైత్రి మఖిలాంగ సుందరు నంగ మొకఁడు.

శా॥ మా కందోయికి విందు నందసుతుఁ డీమా మంద నున్నంతలో
నేకైకాధిక సుందరం బతని ప్రత్యేకాంగమం దెందునేన్
మా కందోయి రమింపఁజాలకయె లో మందాక్ష సంకోచముల్
బైకో నేఁడు దిదృక్షమీఱ వగచున్ వాపోవు నంతంతకున్,

**293**

సీ॥ నీ రూపుఁ దెల్లార్చ నిన్న స్తగిరిఁ జేర్చ
నరుణుఁ డెందరిగె, నెందరిగెఁ గోళ్లు
మబ్బు లెందేగె నమాస యెందున డాగెఁ
దెరమఱుం గిడి నిన్న దృశ్యుఁజేయ
జరరక్కసి యు దొక్కపరి రాహుకేతుల
దలయు మొండె మతుకఁగలిపి నిన్ను
విరహిణీ సంతాపకరుని శాశ్వతముగా
నుడిపిన నెంత బాగుండునయ్య!

తే॥ సంద్రమును మందరమ్ము నాగేంద్రుఁ డాది
కమఠమూర్తియు నంద జేకమయి నిన్ను
నేల వెదిదీసి రీవు మ మ్మిట్టు గినియఁ
గుముదినీ మోదసంధాయి ! హిమమయూఖ !

**296**

చ॥ సజల ఘనాఘనాకృతి, వ్రజస్మరమూర్తిఁ దలంపుదెచ్చె నం
బుజముఖి ! కంటివే ! యుఱుత ముత్తెపుబేరె బలాకపంక్తి మే
ల్మిజిగులుగుల్కు పచ్చడమె, మెచ్చగు వింద్రధనుస్సు, చా
యజిలుకు లేతనవ్వు మెఱుమై యుఱుమై కలనాద మొప్పగన్॥

**299**

సీ॥ ఋతుధర్మ మెడసి కం డ్లెడపక కురిసి క
న్నీటివానల మబ్బు నోటుపఱుప
సాంజనాశ్రుల నీలిచాటిక ల్ కుచసీమఁ
గైలాసగిరి నల్లకాల్వ నెనయు
వదలని నిట్టూర్పు ప్రావృ ణ్మహావాయు
వై సుఖద్రుమము లల్లాడఁజేయ
నోటి తొఱ్ఱలనుండి నుడి పులుంగులు బాఱ
వుడుగని కన్నీటి జడుల జడిసి
తే॥ బిట్టుఱుముగాఁగ బ్రియునిపే ర్పేరుకొంటె
వడిఁగ వర్షించు భీషణ వర్షధార
మునుఁగు వ్రేపల్లె నెవ్వారు మనుచువారు !
గిరివరోద్ధారి ! నీవుగా కొరులుగలరె ?

**300**

తే॥ కనకగిరిధన్వు ముక్కంటి కంటికినుక
చిచ్చునంబడి మేను వుచ్చిశివికనుక
దేహతాప మెదో నీకుఁ దెలియుఁగనుక
వలపు సెగ వేగు మము న్నోటు వైచుకొనక,
పంచశగ ! ప్రోవుమా ! హరివచ్చుదనుక.

302

ఉ॥ అద్దమరేయి లేపికొని, యాటులకుం గొనిపోదు రర్భకుల్
నిద్దురమాన్చి వేకువ వనిం బసుమందలఁ గాయఁ బన్తు రే
ప్రొద్దున, వెన్నమీఁగడల మ్రుచ్చిలఁ దన్ను నతుల్ యశోదకుం
బద్దున బట్టియిత్తురని, వల్లభుఁ డీదెన రాఁ దలంకెడున్.

చ॥ విజనగృహంబు సొచ్చి తను వెన్నయుఁ బాల్పెఱుఁగులాహరింపఁ బో
ప్రజసతు లెల్లరుం బొపెవిపట్టి యశోదకు నొప్పగించి పే
రజమున లేనిపోని యపరాధము లెన్నియొ యంటుగట్టి రన్
గసిబిసి సెంది శౌరి మనకర్జములన్ మధురన్ దిరంపడెన్.

304

మ॥ చెరలాడన్ మధురాపురిన్ మనసు మ్రుచ్చిల్లం ప్రియుం డీకనుల్
మురళీభృన్మధుమూర్తి డాచె నతఁ డా మూర్తిన్ నిరాకార యో
గరహస్యంబను పుల్లచల్ల నిడి వెల్ గ్రక్కించె మానుండి యా
విరహిణ్యేకశరణ్యమూర్తిఁ గొనిపో భేదింపఁ బంపెన్ సఖున్.

305

తే॥ తియ్యమునఁ దియ్యపల్కులఁ దేర్తు వనఘ!
యోగమున స్వర్గ మఱచేత నొదవు నంచు
చెప్పు టలఁతియ కా కనుష్ఠించి చూపు
టలుప మనరాదు కర మసాధ్యంబుగాని.

తే॥ ఉఱక చందనమంచుఁ జిచ్చుఱుకు సాధ్వి
కత్తు లవి పూలగుత్తుల కెత్తుగాఁగఁ
బోటుబం టూటుపట్టుగఁ బోరి కుఱుకు
చిచ్చు గదంబొ! చెరలాడు విచ్చుకత్తు
లలరుగుత్తులో సెప్పఁగలార లెవరు
అగ్గి నొడలొగ్గి అనిఁ దలయొగ్గి చన్న
డెలుప నెవరుండ్రు యోగమ్ము సులువుబరువు
లాత్మ పరమాత్మలో లీన మైనపిదప.

## 307

తే॥ నగరి విచ్చినదైనఁ గ్రొందమ్మి మంద
తెలన గలవెల్ల నిర్గంధ కింశుకములె
వీడువిడి యేటి కా మధుప్రియుఁడు వచ్చు
ప్రేఁతలను జేర నాగరీ ప్రీతినుడిగి,

తే॥ పద్మమునమండి తన పనివడనిదైన
సంపెఁగల కువ్విళున్ గొనుఁ జంచరీక
మట్టి విరిద్రాపుడులఁ జెట్టవట్టి విభుఁడు
మరగి మధుపురి మఱచెను మనలనిపుడు.

## 309

చ॥ కనివినియే నెఱుంగ మఱి, కద్దఁట సంద్రపుదీవె ద్వారకా,
ఖ్యను బుర మొందు గట్టెనటె, కంసవిదారి, యచోట నిండ్లు గాం
చనమయమంట, బీదలును సొదులు బూరిలు గట్టరంట యీ
జనపదవాసులన్నఁ బొడసైఁపరటే యలనాటి నాగరుల్.

చ॥ నదికడలిం గలట్టి పురి నాటున నంతటిదవ్వునుండి యె
వ్వఁడు సనుదెంచు వార్త ననుపంగల మంతటిదూర మేనిచే,
వడువెది యెందు జొత్తు హరిపాలికి మమ్ము నెవండు జేర్చునె
వ్వఁడు లభియించు మాదు వలవంతలనేన్ హరికంపిపుచ్చగన్

## 310

ఉ॥ బన్నములెల్ల వాపెడు విపన్నశరణ్యులు రామకృష్ణు లా
యన్నయు దమ్ముఁడుండఁ దదుదగ్రబలాఢ్యుల ప్రాపుప్రోలమే
మన్నెము లెక్కసేయ కడరందక మందల మేపుకొందు మే
మన్నను వెన్నుఁ బల్మిసకియల్ గరువింపక మాన రుద్ధవా!

క॥ తటుకున గోవర్ధనగిరిఁ,
జిటికినవ్రే లెత్తి నిలిపి, జిష్ణునికినుకం,
గొటికను బ్రోచిన మా హరి
ఘటనాఘటనార్ధ ఘటుకుఁగని కనమొకనిన్

తే॥ మున్నుఁ గేశిఁ దృణావర్తు మన్నిఁగొన్న
దాది హరి నమ్మఁగాఁదగు చైద మొందు
నలుపఁ డింతకు మధురలో సామఁగరిడి
మామ నడచినవాఁడంటు మహితశక్తి.

324

ఉ॥ కందొకఁ డుండిపోయినదిగా, కల ! రాధ ముఖేందుబింబ మం
డిందు విశిష్టలక్షణము లెవ్విగనంబడ వింత, తద్వపుః
కుందనకాంతియుం గరఁగి క్రుమ్మరిలన్ విరహాగ్నిఁ, దచ్ఛర
త్సుందర పద్మలోచన రుచుల్, గళఁదప్పెఁ బ్రియాననేక్షణస్

మ॥ అరఁటాకుం బురడించువెన్ను మెలివేయంబడ్డ, యత్తె పొరిం
బొరిఁ జీకాకయి చిక్కిసొక్కి మెయి నెమ్ములీమాత్రమై నిల్చె నా
సరసీజాస్యకు వేయునేమిటికిఁ దత్సర్వాంగ సౌందర్య మ
య్యరవిందాక్ష పరోక్షమందు వికృతంబై తారుమాఱయ్యెఁజూ!

328

ఉ॥ చెల్లి! యనంగుఁడయ్యె నల చిత్తజరాహువు రాధమోము జా
బిల్లిని, గందువై యొదిగి వేచుకయుండి, వియోగవార్ధి తాఁ
బెల్లుబుకంగఁ గ్రుక్కఁగొని పీలిచె నశ్రుసుధల్ ద్రవింపఁగా
వెల్లనగాఁ దదాస్యశశి వెన్నెలార్చిన చల్లయుంబలెన్.

తే॥ అతనురాహుగ్రహముబట్టి యశ్రుసుధలఁ
బీల్చ రాధికాముఖ చంద్రబింబమునకు
ముక్తిలేదమ్మ ! గ్రహణంపుబుణ్యవేళ
హరిసుదర్శన దానపుణ్యమునఁగాక

329

ఉ॥ ముచ్చదనంబు వెన్ననకు ముచ్చటయౌఁ చిననాఁడె వెన్నపాల్
ముచ్చిలి తిన్న సైఁచితిమి బుద్ధివివేకములున్ మనోగతుల్
క్రచ్చరఁ దోచుకో నయిఁపఁగల్గుదుమే ! యదురాజునయ్యె నీ
యొచ్చెపు నబ్బెసంబు విడనొల్లఁ డి కేమని యందు మాతనిన్.

330.

క॥ ఏణాంకు నెదురుకొన, సుమ
బాణుని దెరగనుల గన్న, భ్రమరస్వనని
క్వాణములఁ జెవుల నిడ్డ, నవి
ప్రాణంబులఁ దీయ వాడల్లు నాయుదమన్నన్.

ఉ॥ చాఁ దలపోసి మిత్తికయి సాధనముల్ బొనరింప మల్లెలున్
జాదులు పెజ్జఁజల్లినను, జంద్రిక నిల్చిన, కేకికోకిలన్
నాదమొనర్ప నూకొనిన, నన్ గెలువందు మరుండు కామమో
హాదివిజేత నాతలఁపు, నాదుక నిచ్చ వసించియుంటనో!

ఉ॥ పాయక హార్దిశల్ హరిజపం బొనరించుచు నుంట, శ్రీహరి
ప్రేయసిగా నెఱిఁగి నరవిన్ జతురంగ బలంబుఁగూడి నాం
చాయకు రాఁదలంకు, సుమసాయకుఁ డాఁజగజెట్టి విస్మృత
ప్రాయ మొనర్చె శక్తి హరిభక్తులపై నది మొక్కవోవునో!

333

క॥ కమ్మనినుడు లితనివి ని
క్కమ్మని మది భ్రమసి నమ్మకమ్మునఁ బడ కా
కమ్మలిలుతు విలు ఝుంకా
రమ్మవు నళి, ప్రియుఁడు నొక్కరకమైన సకుల్.

సీ॥ మురళీధ్వని నొకండు ముజ్జగాల్ సొక్కించు
మధురఝాంకృతిఁ బూలమాఱుప్ప నొకఁడు
నాగరీనహవాన వాగురి నొం డాఁగు
మరఁగు నొకండు దామ్మురలయిండ్ల
భువనమ్మోహనమూర్తిఁ బొల్చు యొకం డలరింప
గిల్లినంతవెత్తు నొం డులురుచెలుల్ల
ద్విపద చతుర్పద విభ్రమఁ గొను నొండు
జన్ము నొండు మొత్తాన షట్పదమ్ము

తే॥ సొంతపని సంతరించుకో సుళు వెఱుంగు,
ధూర్తు లిర్వురు, విరహాలో కార్తికరులు,
శ్యామగాత్రులు, చలచిత్తు, లఖిలరస బు
భుక్షు, లీ యిర్వురన్ నమ్మబోల దొకని.

334

చ॥ హరివిరహార్తి నాలు గసువంటువు లేగలు పాలకోసమై
పలువిడఁబోక పాల్పితుకుపట్టుల కట్టులుసాపి చూచెడున్
హరి యరుదెంచునంచు, భవనమ్ము వన మ్మొకచాయ వేచ మా
హరి విరహార్తిఁ గంటివికదా! కనులన్ వచియింతు మేమిఁకన్.

తే॥ మంచిదె! సెబాసు పదినాళ్లు మధురనుంటి
చెడిన దే మింతలో నాలసింపకుండ
వేగ ర మ్మింకనైన నీ బెంగతోడ
రేవగలు మేఁత లుడిగి వాపోవుఁ బసులు.

తే॥ తోఁచ దేమియు, మా కీవు తోఁడులేమి
ప్రేఁతలము తాళలే దింక విరహవేద
నం, బఠుంచును మామాలు నచ్చఁబలికి,
నందనందనుఁ దేవయ్య! మంద కెటులొ!

336

స్యుతాల సరాలు :—

చెన్ను మీాఱెడు మోము చిర్నగు చెలువు నొకపరి చూపిపోరా!
చిన్నికృష్ణా! మురిసిపోదుము చెలుల మందులకే
బంధుగుల నీవారి నందఱఁ బ్రాముకొన్నను నీవు, నీకై
వందు నందయశోదలం గని పట్ట లేమయ్యా!
అనద కు య్యాలించి మచ్చెదు నార్తరక్షకుఁ డీవు చన్నను
నినువినా మా కొండు దిక్కెది? నెవ్వఁ గడవంగన్
ప్రిదిలిపోయిన బ్రదుకు నావల విరహవార్ధిఁ దరింపఁగా నిను
వదలినన్ మ మ్మెవ్వ రొం డవ్వలకుఁ జేర్చెదరో!

మందపుట్టి మునుంగనున్నది మందకాపరి ! వేగరారా !
త్రుందకుండఁగ మమ్మునందఱ మనుపఁ దలకొంటే !

337

చ॥ భృగుపద లాంఛనం బొకఁడు వెల్తిగ నుద్ధవ శౌరి మూర్తులం
దగపడ దింతభేదము నఖాదిశిఖాంతము రూపుజాడలం
దగపడు వారువీరు నొకయచ్చునఁ బోతనుబోసినట్లు చి
త్తగతులెకా దొడళ్ళునయితంబును గార్కొనఁ దేంట్లకుంబలెన్.

క॥ అగుణ పరబ్రహ్మంబను
పుగయేన్గు నొకండుఁ జూపి బోధింతును వీ
రగుణమతము మగువల, కా
నగ రట్టి వలంతులకును, న ట్టగునేమో !

340

తే॥ కూడంబల్కక తోడుదొంగలటు, లక్రూ రోద్ధవుల్ మంద వేఁ
టాడన్వచ్చి కిరాతవృత్తిఁ, గపటవ్యాహార పాశంబులన్
దా డక్కించుకపోయి కృష్ణమృగముం, దత్ప్రేయసీవ్రాతముం
గూడన్ ముట్టి రయోగదావము రగుల్కొబెట్టి బృందావనిన్.

తే॥ సతత కృష్ణానురాగ రంజితములైన
సతుల మతు లంటువు విరాగమత, మి దనక
మొయిలువిడు చాతకములట్లు ప్రియునిఁబాసి
బ్రతుకరనియైనఁ గనక తత్వంబుఁ గఱపు.

341

ముత్యాల సరాలు :-

త్రేఁతలమ్మున బవలురాతిరి వెలుఁగు భ్రూకుటివేది సగుట
జ్యోతి గోపిస్నేహ సుమన స్సురభి తైలమునన్,
నెగడు నెడ మూకుళ్ళ నీరా గ్నెలలు గప్రపుదావితో మా
సుగుణగణమే ప్రత్తివత్తిగ సురభు లీనంగన్,

బగబగన్ మా యెడల మండుచు వానకాఱునన్నైన నాఱక
రగులు ప్రియువిరహాగ్ని దీనిని రాజుకొల్పుఁజుమా
ఆఱిపోకుండఁగను దివ్వెను నా యశోదకుమారుఁ డీవును
మూరుఁ దూపిరిఁబోయుదురు పవ మానచోదకులై
గడ్డుకొలువుల నొడ్డుగానక గడ్డిపఱకగ నెంచి కొ త్రీ
దొడ్డిపట్టు గలార లెపు డీ దొడ్డదివ్వియునే.
అంటుఱుంగక కంటఁగనక సుఖానుభవ మమనస్కయోగము
నంటి యవివేకాంధకారము నడఁచుకొంటిమయా!

నవ్విపోవఁగ జవ్వతల కీ నవ్య నిర్గుణమతమునిడి మా
దివ్వె కెగసనద్రోచు పుడకక దీటుకొం దిట్టుల్.

సగుణదీపము నాఱ్పుఁదెచ్చిన జ్ఞానరూపానిలమె మా యీ
సగుణదీపికఁ బ్రాణనాయుపు చందమై మనిపెన్.

వడిఁదలంకక నడితలకుఁజని భక్తిదీప జ్వాల రగులుచు
చెడుతలఁపులను మిడుతలను మసిఁ జేసి మనుఁగలిపెన్

దగ్గరించిన సకుఁడ వా హరితలపువచ్చిన పగ్గెలాడవు
ప్రెగ్గడవునై యెఱుఁగ వెటు మా ప్రేమపద్ధతులన్ ?
సన్నిహితఘన పుణ్యమటు నీ సన్నిధిన్ వడ్డింప హరి పర
మాన్న మెన్నక తన్నుకొని జొన్నన్న మానెదవా!

347

క॥ అపథమునఁ జనక మధురకు
సుపథమ్మున నిలిచి, శ్యామసుందరుమీఁదన్
శపథముఁగొని, నిజమాడుమ
యెపుడే హరి మమ్ముఁ దలచునే హితమారన్.

క॥ ఆపన్నావన బిరుదము
గాపాడుకొనంగనేని, కాపాడి మమున్
గోపాలుఁడు సదివాపునొ!
వ్రేపల్లెతలంపె విస్మరించెనొ ! చెపుమా !

ఆ॥ "నన్ను ముట్టుకొనకు నామాలకాకి" నా
గెంటుచున్న వలచి వెంటఁబడెదు
సుద్దిబుద్ధిలేని ముద్దరాండ్రము మేము
కుటిలమయుఁడు కపటనటుఁ డతండు.

క॥ నిండునెఱజాణ యాతఁడు
నిండిన నిలువెల్ల మాయ నిర్మోహి యౌతం
డుండినది మధుర నాగరి
కుం డోర్చునె! వెఱ్ఱి గొల్లకూఁతుల చెలుముల్!

348

సీ॥ హరిపదం బెడబాసి హరిపదోద్భవ గంగ
పాఱె ముప్పోకల పా లగుచును,
వెన్నుక న్వ్రేలువడి మిన్ను దెరువరి యయ్యె,
జగముకన్నా నెల స్రగ్గి తగ్గె
హరివాణి విడి వాణియపురూపమౌ వావిఁ
దన్ను బుట్టించు ధాతను వరించె
బొడ్డుతామర వెన్ను బొడ్డుపొత్తెడబాసి
కంటకనాళమై గఱుకుఁగాంచె
తే॥ వెన్నుపొడ వాసి బడబాగ్ని వేఁగెఁ గడలి;
యొక్కొకొం డంగ మెడసి వియోగ మోపఁ
జాల రన శౌరి సర్వాంగసంగ ముడిగి
బ్రతుకఁదలకొన్న మన కున్నెఁ బ్రతుకుతెరువు.

349

ఏలపాట :—

మందఁగాసే చిన్నవాఁడా ! మందలో నీ వింతచెయ్వుల
మంది ముచ్చటులాడుకొం ద్రయ్యా! అవి వించు గోపి
సుందరుల్ నిను గేలికొం ద్రయ్యా !
దచ్చికడలూ నెఱుఁగఁ గడలిని ద్రచ్చి సుధనూ సురలకిచ్చియు
మెచ్చుమాటల బేలుపుచ్చుమనూ ఆ యుబ్బులిఁగని
కిచ్చినావా ! విసముఁ ద్రావంగన్ !
కంసరాజును గసిమసంగి, కంసరాజ్యం బొకనికిచ్చియు
గంసదాసిని జేరఁదీసితివా ! ఆ గూనెదానిని
హంసగమనోత్తంసఁ జేసితివా !
నీదు కొంటెతనంపు చేష్టలమీఁద వాదా లాడుకొనుచును
నీదు విరహవ్యథల మఱచెదమూ క్షణకాల మెపుడో
యాదవ మఱచి సుఖింపఁబోయెదమూ

351

ద్విరదగతి :—

నిర్గుణుని నెల్కతలకు నెఱపవచ్చిన, నీవ
నిర్గుణుని యట్లు క న్పింతు మా కీతేవ
శ్యామసుందరుఁగొల్చి సారూప్య సాలోక్య
సామీప్య సాయుజ్య చతురాపవర్గముల
సాధించి తమయంత జ్ఞానరూపిణు లైరి,
మా ధవళలోచనలు మధురభావనఁ గూరి,
ప్రేమ చరమావస్థ భిన్నమతినే మఱచి
శ్యామమయముగఁ గందు జగ మహామ్మతి మఱచి
జ్ఞేయమయ్యుఁడై జ్ఞాని సిద్ధిఁ గాంచినయట్లు
ధ్యేయమయ్యుఁడై సిద్ధి నెనయు సుగుణార్చకుఁడు

శ్రద్ధ భక్తి జ్ఞాన చరమదశ లద్వైత
 సిద్ధితోడనెకదా ! చెందు సాదృశ్యంబు
జ్ఞానరూపిణులకే జ్ఞానోపదేశంబుఁ
 బూని పొనరుతు వేమి బుద్ధిచాతుర్యంబు
అనఘ ! నీ సుజ్ఞాన మంగనల యజ్ఞాన
 మున నేదొ యియ్యదవ నరయవచ్చె జగాన
పెడదారిఁ జనక మా వినుచుదారికి రమ్ము
 జడదారిమత మూన్చి సాధింతు వెది మమ్ము

355

సీ॥ అక్రూరుఁ డలనాఁడె హరిని దోడ్కొనిపోయి
 యొక్కట మముఁ గంసుఁ జక్కబెట్టె
హరియంపు పరమార్థ మలవరించుచు మమ్ము
 నుద్ధవ! నీవిట్టు లుద్ధరింతు
ప్రియుఁ డందు గుబ్జాప్రణయకీర్తిఁ గొనసాగఁ
 జేసి యోగము నంపె మా సఖులకు
సగుణ సేవానౌకఁ దగిలి తరించు మ
 మ్మగుణమ్మునం గ్రుక్కి హరివియోగ
తే॥ సింధువున ముంచు నుపకారశీలు రవుర!
మధురవాసులు మీ రెంత మంచివారు!
తత కృపాస్వాంతు లతుల కృతజ్ఞమతులు
దైవభయమేనిఁ గన రెంతధర్మపరులో!

356

తే॥ నిన్ను మఱపించి యోగమ్ము నెపమున హరి
చిక్కువడె దానునుం గుబ్జచేతఁ జిక్కి
మాయనటరాజు నుడి బేలుపోయినట్లు
కానుపిం తీవు నీతెల్వి గానవచ్చె.

తే॥ మధుర రసరాజమూర్తికి మాఱుటగను
యోగ తిక్తౌషధము నెవ్వ లొప్పుకొంద్రు
చనుము వేవేగ యోగముఁ జక్కబెట్టి
రాఁ గనవచ్చెనయ్య! నీ జాణతనము.

357

శా॥ యోగాంభోధి మథించి కాంచిన మహాయోగుల్ గనన్‌రాని యా
యోగారూఢ నిగూఢతత్త్వము యశోదోలూఖలాబద్ధమై
దోఁగాడెం బసిగాపునింటఁ దనుదాఁ దోతెంచి ప్రేమంబునన్
మా గోపాంగన లంతరంగముల నెమ్మైఁ సొమ్ముఁ గావించుకోన్.

క॥ యోగమును గట్టిపెట్టు వి
యోగవ్యథఁ బెంచు యోగ మపయోగము గా
దేగతి నీకు మథించిన
పేఁగక నవనీత మొదవు విధవుం గలదే!

తే॥ మాటికిం దన్ను మఱపింప మాయబన్ని
నల్లవాఁ డల్లు పన్నాగమెల్ల దెలిసె
వింగడములాడి నీ వెంతసేఁచుచున్న
నమ్మఁ పాటింప రెవ రీ మతమ్ము ననఘ!

358

ఉ॥ ప్రేఁతలపైఁ బురాతనపుఁ బ్రేమఁడి నొక్కెడ నాగరాంగనా
వ్రాతముపైఁ బెనంగొను నవప్రణయంబు మఱొంట నొక్కటం
జాతురి నిర్వహింపఁ దగి శౌరికి మందఁ ద్రిభంగి మాకృతిన్
ప్రేఁతలకై నృపాకృతి నవీన సఖీనివహమ్ముకోసమై॥

క॥ ఒక్కటి నిరురూపులుగా
మక్కువ నెఱపంగవలసి మాధవుఁ డెటు లా
టక్కరి యక్రూరునిచేఁ
జిక్కి మమున్ యోగమంపి చిక్కడకుండున్.

క॥ మకుట చ్ఛత్ర ధరుండయి
సకుఁ డేలిన మథుర నేలు సకియలయెడ నం
దకిశోరు మోహనాకృతి
యొకఁడె చిరంజీవియౌచు నుండు సతమ్మున్

359

తే॥ తొంటిబాముల పున్నెంపు టుంటుకతన
పెన్నుతోఁ జెల్మి మా కంటుకొన్న దాది
పెలుచనౌఁగాని నానాఁడు కొలచుకొన్న
సకుడు దవ్వేగి తడసినన్ సన్నవడదునన్

తే॥ ప్రియుఁడు రాఁడాయె దవ్వుల వెడలి తడసె
మమ్ము రానీఁడు తానున్న యిమ్మనకును
విరహ మను దర్జిజేతి కత్తిరిని బడ్డ
కట్టుగుడ్డయ్యె మా బ్రతు కిట్టు లనఘ !

363

ఉ॥ జాణ వటన్న నీదు నెఱజాణతనం బెదొ కానరాదు మా
ప్రాణముదీయుచున్న లిటు బంభర! నీ యెదురెత్తు బోధనల్
ప్రాణముతోడ నీర మెడబాయ సహించునె మీలు నంచలుం
ద్రాణలు దప్పి ముత్తెములు దప్పిన నత్తల మేంయనేర్చునె !

ఉ॥ తావులుజిమ్ము పూలు బలుతావుల నున్నను నీవు తమ్మికే
తీవర మందనేల ! నిజతేజమునం బరతేజ మోర్చుతే
జోవిభు వేవెలుంగువిడి చొక్కి చకోరము రేవెలుంగుకై
దేవురులాడనే! లటులె దేవురులాడుదు మేము శౌరికై.

తే॥ ధూర్త! మధుమత్త! నీనోట దొరలెడు తడ
బాటుమాటల మాయెడన్ పగిలె వొగిలె
అల్లనేరెడు తా మధురామ్రఫల్లముఁ
బూసి కాయఁగ వింటిమె! పుడమి నెందు.

364

ఉ॥ పండు నరంటిచెట్టుదిగువం దలయెత్తిన రేఁగఁడొంకలా
గుండెను నీదునున్కి వనజోదరు నాదరలబ్ధి కడ్డమై
కొండొక నిర్గుణుం దలఁచుకో సగుణాకృతి నాకు మబ్బునన్
దండి పసిండికొండ నటు దాఁపఁతలంతువె నిర్గుణావృతిన్.

క॥ తునిఁగిన త్రాటిని ముడులన్
బెనఁచినఁ బెం పొదవఁజన్నె? పేరిమి విఱుగన్
మనసరితనమున నతికిన
మనసులు ప్రేమానుభూతి మగుడం గనునేఁ

క॥ కాలు నిలఁగట్టి మొదవును
బాలు బితుకునొంపు విరుగుపాల్ ద్రావిన నిం
పేలా!యగు నట్టిద వన
మాలి తలఁంపుమాలి రూపుమాలిన తలపుల్.

తే॥ రక్తివిడిచి విరక్తుఁడై క్రమ్మఱ నను
రక్తిఁ గనుకెట్టు లా రక్తి రక్తియగునె!
ఎన్ని యెత్తులువన్ని నీ వెఱుకసెప్ప
విన రొకరు నీదుయోగ మీ ప్రేఁతలమున,

తే॥ హరికి మనసిచ్చి యమనస్కలైన మాకు
యోగము పనేమి పుతిమాలు నువిదలకును?
చాకిపనియేమి? యూరెల్ల కోక లేని
దిస్సమొలవారలైన తద్దేశమందు.

367

ముఖారి వరాళి :—

కంకణంబులు దండకడెములుగా భవద్విరహార్తిఁ జిక్కుచు
పంకజాక్షులు నీదు రాకే వంకఁ గాం త్రనుమా।
మగిడిరా నీ విడిన గడువున మాపులుంబవ లీశు మ్రొక్కుచు
నిగుడుచూపుల నెదురుచూతురు నీదు తెన్నునుమా!

నిచ్చలును గ్రొంగొత్తవెతలను నెక్కొలుప వలవంతచిచ్చది
మచ్చెకంటులు నినుగనం బ్రాల్మాలి రం చనుమా,
చీటి వ్రాయుద మన్న గన్నీర్ జిమ్మి పత్రము చెమ్మగిలునని
నోటిమాటగఁ బంచె నిది యని నుడువుమా హరికిన్.

**368**

ఉ॥ పూలు త్రిశూలమై తొగరుపూవులగుత్తులబంతియే శిఖి
జ్వాలగ నిప్పుకల్ గురియుచందము బూలను రాల్చు చుండగా
మాలిక గుత్తునెట్లు వనమాలికి బొత్తెడవాసి యెట్టులో
వ్రేలుచుఁ గండ్లఁ బ్రాణములుబెట్టుక నిల్చితి నింతకాలమున్.
తే॥ వఱదలై వారు కన్నీటి పారుదలను
యమున యుప్పొంగ బండుకొన్నట్టి సెజ్జ
తెప్పవలెఁదేలఁ గన్నీటఁ దెప్పరిల్లి
ప్రియునిఁ జేరఁగఁబోద మన్పించు దాన.

**369**

చ॥ పదములఁబట్టి వేఁడెదఁ గృపాకర! మాసఖు నొక్కసారి మా
కదుపులఁ జూడఁబంపు, మసకల్ గొనెఁ గన్నులు వానిఁగాంచుకో
నిదురయు నోగిరమ్ముడిగి నిచ్చలుఁ దగ్గతబుద్ధి వెఱ్ఱినై
వదరుచుఁ దిగ్గుదానఁ దలవంపనకే హరిఁ గూడుకొన్నెడన్.
క॥ ఇలువాసి వన్నెఁదలఁపక
యిలువాసి ప్రియానుషంగ మెదఁగోరి చనన్
వలవంత సెగనొగులు నీ
చెలి కగపడి నిలుపు మనుము శ్రితరక్షకతన్.
తే॥ మంద యెంత సస్యశ్యామమై తనరిన
యామునాంబువు లెంత సుశ్యామమైన,
శ్యామసుందరమూర్తివినా మఱొండు
శ్యామలం బెది మెచ్చదు మా మనంబు.

372

తే॥ భామ! కనుఁగొంటె! హరిమనపైని జూపు
బూటకపుప్రేమ బఁగటుసిటి ప్రూఁత
వోలె నది తేలె నేఁడు గోపాలు నింత
కొంటెగఁ దలంప హితుఁ డనుకొంటె కాని.

తే॥ పొంచి నగరాంధ్రుడు దన్నుఁ దక్కించుకొన్నఁ
దలఁవఁబోఁ డింత కతఁడు వ్రేఁతల తలంపు!
కూర్మినెఱపుటు యెడ నాగోల్లఁ డేడ,
యెఱుఁగులే డని వగచి రయ్యెగురుబోండ్లు.

373

చ॥ భ్రమరమటుల్ విడెన్ హృదయపద్మ మరందముఁ గ్రోలిశౌరి మా
రమణుల శూన్యదేహముల రక్కసిఁబూతనఁ బాలతోడఁ బ్రా
ణములనుగూడ గ్రోలె నదెనాడె మిటుల్ మనుకంటె మున్ను వాఁ
డమృతపు జూడ్కి పీడ్గొను మహత్త్వమచూ మముఁ బ్రోచె నింతకున్

374

తే॥ రగుల విరహాగ్ని లోలోన బొగిలె రాధ
గడెగడెయు రాయిడింబడి కడచి బ్రతికి
సూరసుందర సాంగత్య దూరమైన
యొడలు నిలనోపుకొను తే ప్రయోజనంబు।

చ॥ హరి విరహాగ్నిఁ గాయ మిసుమంతలుగాఁగ, ననుక్షణంబు, ని
ట్లరిగి కృశించుకంటె విషమానియొ, యామునవారి నిఁగ్నియో
గిరికొననుండి దూకియొ, శిఖిం జొరఁబాటియొ, శంభుసన్నిధిన్
శిరముఁ గదాసి దూసుకయొ, చెచ్చెర జీవమువాయు టొప్పగున్

* యశోదా సందేశము *

ఉ॥ పిన్నటు నీసుతుం బెనిచి పెద్దయొనర్చు యశోదదాదిపైఁ
గన్నడసేఁయు కొక్కపరిఁ గన్నని గన్నులఁబెట్టు మంచు నా
విన్నప మియ్యదొండ్లు వినిపింపవె! కన్నని కన్నతల్లి కో
యన్న! దయామయేక్షణములారఁ గనుంగొనుచుండుమంచిటుల్,

క॥ నిద్దుర లేచినతోడనె,
పొద్దుటనే చద్దిగుడుచు బుడుతని యలవా
టుద్ది గనుగొందు రెవ్వరు
ముద్దులకొడు కడుగ నందు మోమాటపడున్!

చ॥ తలగడు గన్న నీ కొడుకు దవ్వులఁ బాలుఁజుమమ్మ! నూనెయున్
నలుఁగును వెచ్చనీరన మనంబున మెచ్చఁడ టిచ్చకాలతో
వలసిన వస్తువుల్ మనసువచ్చిన విచ్చుచు బుజ్జగించుచున్
జలకములార్చు, బిడ్డ చవిజాడలఁ దల్లి వెరుంగకుందువే।

376

తే॥ ముద్దుకృష్ణుని యారగింపునకు గాక
కడవఁ బేర్కొన్న వెన్న నా కంటఁబడ్డ
బిడ్డ తలఁపున ప్రాణముల్ పీకినట్లు,
లైనఁ గుందుదు నెంద ఊరార్చిరేని.

శా॥ వెన్నల్ రొట్టెల వడ్డకుండఁగనె వేవేపెట్టి నామచ్చునన్
గన్నయ్యం గనుపెట్టువా రెవరు భాగ్యం బెంతయున్నన్ హరిన్
నన్నుంబోలిన తల్లి యింట మనియుండంగాఁ బ్రవాసశ్రమం,
బన్నా! యేలర మీకటంచుఁ గొనితెమ్మా యన్న నుం దమ్మునిన్

377

ఉ॥ ఉక్కలులైన మొక్కలుల నుక్కణఁపం గొనిపోవవచ్చు నా
యక్కఱదీరుపైన సుతు నంపనువచ్చును గోపమౌళిపై
త్రొక్కటఁగూరి బెంగటిలి తొట్టుల వట్టులుసాచి మందలన్
దిక్కులుసూచు మేయక పదింబది వాని నెవందు సాకెడిన్.

ఉ॥ ఆ వసుదేవు దేవెరి ప్రజాంగన నన్నుఁ దలంపుసేసి యీ
నా వెతలోసఁ బాల్గొను మనంబిదునే సుతు నొక్కసారి బృం
దావనిఁ దెచ్చి చూపుమను, వాడపుభోగము లెన్నియున్న నా
పోవదు కన్న తండ్రిదిచిఱుబొజ్జ, తటిం దనిపోయినట్టుగన్.

* కుబ్జావచనము *

తే॥ మందనతు లేల యిటు నన్ మచ్చరించి
విఱుచుకొనివత్తు రని కుబ్జ వ్రేతల కనె
తమదుభాగ్యాలె తమకు భోగ్యములుగాక
యొకరిభాగ్యముఁ బాల్గొంద్రె! యొంద్రొకండ్రు

తే॥ పూని తుంబీఫలంబుఁ దంబురనొనర్చు
తెరువునన్ హరి చెసేఁత దిద్దితీర్చె
హరి విలక్షణ కరుణాకటాక్ష మెవని
నేక్షణంబునఁ బొదవునో యెవఁ డెఱుంగు

క॥ కొఱమాలు చేఁతిసొరయే
తరమరయు గుణజ్ఞచేత దంబురయయి సు
స్వరముల నీనెడుగతి
హరిచే నవరింప స్పర్శనార్హగ నయితిన్.

క॥ జగమెఱుఁగు గూనెదానిని
వగఁగని చేసేత నంటి వంకరఁ దీర్చెన్
నగధరుఁడు కంసదాసిని;
దగు నెవ్వని కతని కరుణతర మెన్నంగన్.

—: ఉద్ధవుని యుపదేశము :—

ముత్యాల సరాలు :—

ఆలకింపుఁడు సతు లిదే! పర మాత్మతత్త్వము నుడువుదున్ గో
పాలదేవుఁడు నన్నిటుల్ మీ పాలి కంపింపన్
బ్రహ్మమయమౌఁజుండి యెల్లప్రపంచ మొక్కంచుకయు లేదా
బ్రహ్మకన్యమువస్తు, వఖిలవ్యాపకుం డతడే.
తానె స్త్రీపుమ్రూపుఁడౌఁ దలి దంద్రియుం దోఁబుట్టు దానౌ
దానె వానప్రస్థుఁడున్ యతి తానె జ్ఞానియునౌ
తానె రాజును రాణియగు విభు దాసదాస్యంబులును దానగు
దానె నేలయు నింగి పూవుం దానె తేఁటియునౌ

తానె గోవున్బాలకుఁడునై తానె మేపై మేపుకొనుఁ దను
దాన యీ పరమాత్మతత్త్వముఁ దలఁచి భ్రమ విడుఁడీ
ధనిదరి ద్రాంతరము లే దద్వైతతత్త్వమునన్ నిరంజనుఁ
గన జరామరణ భ్రమంబులు గదియ వవ్వారిన్.

—: గోపికాగీతము :—

షట్పద :—

శ్రవణకీర్తన ముఖ్య నవవిధ భక్తిగా
కవలి యూసోపని మాసఖుల
నవిధిఁ బెట్టెద వేల ! వివిధోపదేశముల
జెవిఁజొన్పి యోగంపుఁదగులమ్మున.

షట్పద :—

తొట్టుపట్టులవారు కట్టివేల్పునుజూడ
వెట్టులెత్తినవారు గా కీ విటు
తట్టయోగముఁ దెచ్చి యట్టాడిన నెటింగి
యుట్టులు సాచెదు వారే ! వీరు

షట్పద :—

హరిరూప రసముగ్ధ లరవిందలోచన
లరయరాని పరాత్మఁ గన్గొందురే !
ధర వంధ్య బిడ్డకు బెట్టిఁగిన ట్టౌ మాకు
నరయవి బ్రహ్మతత్త్వానుభవము

షట్పద :—

ఘనఘనాభవి నీలతనుడు శ్రీవత్సలాం
ఛన వనమాలికా కనదురస్కుఁడు
గొనబుగడ్డము వాడు గొనముల గనివాఁడు
వనధాతు విరచిత తనుచిత్రుడు.

షట్పద :—

కడెము లందెలు గజ్జె లడుగిడన్ మొరయుఁగన్
బుడుతలంగూడి నడతెంచుచో
నుడుగణద్యుతి మదం బుడుపు ముక్తాహార
మెడ వెల్గులీన గోపార్భకుండు.

షట్పద :—

ఉంగరమ్ముల వం పెసంగు ముంగురులాఁడు
రంగు కస్తురి తిలకమ్ము వాఁడు,
దొంగిల్లినాఁ డెదన్ సింగారముల ప్రోఁక
రంగారుబంగారుకోక వాఁడు

షట్పద :-

దాడిమ బీజము పోడిమి పలునిగ
వాఁ డెదనిల్చినవాఁ డెపుడు
నాడెపు లేనగుపోడిమితో నత,
డోడుచు బూవిలుకాని వగల్।

షట్పద :-

కుండల మణిమయ మండన యుతముఖ
మండలుఁడు శిఖండమకుటుఁడు శ్రీ
ఖండలిప్తాంగుండు పుండరీకాక్షుండు,
నిండారియుండు మా డెందంబులన్,

షట్పద :-

నఖశిఖాసుందరుం డఖిలాత్ముఁడౌ గోప
సఖుని త్రిభంగిమరూపము మా
సఖుల మనమ్ముల సుఖమయమై హరి
సఖ! నిలుచుంజుమ సంతతమున్.

షట్పద :-

లీలఁ బిల్లనగ్రోవి కేల్కఁగొని కెమ్మోవి
నాలపించుచు రాగ మమృతమొలుకు
బాలగోపాలు మాపాలివేల్పును దెచ్చి
మేళవింపవె! మాకు మేలించితే.

సీ॥ నందనందనుని సందర్శేచ్ఛ బ్రతుకుదు
మెదురుతె న్నరయుదు మెపుడు హరికి,
బ్రియవిరహవ్యథన్ రేవగల్ వేఁగింతు
మారోదు మా మోహనాకృతిఁ గని,
హరిరూప రుచిసుధం దొఱఁగి గాలిఁ గ్రోల!
మచ్యుతుబ్రాపు లే కలరఁబోము
ప్రియునిరాకను గాని ప్రీతిల్ల వుల్లముల్,
శౌరిఁగానక కనుల్ చల్లవడవు.

తే॥ అనఘ! మా భక్తిపథమున కడ్డమైన
యీ పరబ్రహ్మయోగ మే మోపఁజాల
మేపనికి మాకు గొఱమాలు నీ మతమ్ము
కానువీసము సేయ వీ యూసు లిచట.

—: ఉద్ధవుని ఉపదేశము :—

సీ॥ మౌనులు జ్ఞానులున్ మన్నించు బ్రహ్మమున్
గోపికల్ మీ రేల కొలువఁబోరు?
రూపురేకలులేక రూపొందు జ్యోతిగాఁ
గనులుమూసి కనిన మనసులందు
తలిదండ్రితోడుల తగులమ్ము లేకుండు
స్థలజలమ్ముల నభస్థలిని నిండి
యచ్యుతుం డఖిలాత్ముఁ డవినాశియు గుణాతి
గుఁడు బ్రహ్మ మన్నింటఁ బొడవుసూపు

ఆ॥ సొంతఁ డేలుదాసి యతని నేలెడు రాణి
గాని తే రెవాప వాని కొకరు
దమ్ము నెవిరి నెల్ల దర్శింపుఁడీ బ్రహ్మ
మయముగ వెలి యన్న మాట నుడిగి.

— గోపికాగీతము :—

షట్పద :—
వ్రేపల్లె నాబాలగోపాల మాబాల
గోపాల కోపాసనా పరులే
యీపాటఁ గొనితెచ్చి తీపాటి యోగమ్ము
నోపాలు గాకుండె! యీసాటిపై

షట్పద :—
మా మాధవుఁడు మున్ను రామావతారమం
దామై దపసివేష మూనుఫల
మీమెయి నీకుబ్జ యీమెలాడిగ వచ్చి
భూమిజా విరహార్తి మఱపించెనో!

షట్పద :—
ఇంతులవంచించు వింతగోపాలునే
సొంతముగావించి మరపుకొనుచు
నెంతజంతయొ కుబ్జ కాంతల కంపింప
కొంతున కలవర్చె నీ యోగమున్.

షట్పద :—
ఆసలెల్ల నిరాశజేసెడు యోగ మే
మాసింప మది యింతకుం గనము
కాసుసేయని పరోపాసన మాకేల?
దాసితలన యది కట్టంబెట్టు.

షట్పద :—
మత్తమధుప! మాకుఁ బొత్తుకాఁడగు నా య
దూత్తముఁ డఖిలమ్ము నేడుగడయు
చిత్తవిత్తములు యీవత్తు సొత్తతఁడె కిం
చితును హరిపరం బేమి లేద.

—: ఉద్ధవుఁడు గోపికల నభినందించుట :—

షట్పద :—

మదనగోపాలునే మది నేడ్గడగ నమ్ము
సుదతులు మీ రెంతధన్యమతులు!
ఒదవ భక్త్యుపదేశ మెద నిర్గుణోపాస్తిఁ
బ్రిదులించె మీ సఖీసాంగత్యమే.

షట్పద :—

గురుపు లీ రేను గింకరుఁ డైతి మీ నుండి
పరమభక్తి ప్రేమమహిమఁ గాంచి
హరిదర్శనోత్కంఠ మరగి వెఱ్ఱెత్తిన
హరిసఖీమణు లెంత పుణ్యాత్మలో !

షట్పద :—

ధరణి నీ గోపీభ్రమర గీతల నెవారు
పెరిమమీఱఁగ విం|దొ విన్పింతురో
హరిపద ప్రేమమాధురి గాంతు రవ్వారు
హరికృపాస్పదు లౌచు నత్యంతమున్.

## 380

—: ఉద్ధవుని పునరాగమనము - శ్రీకృష్ణసందర్శనము :—

— గోపికా భక్తిమాధురీ మహిమాభివర్ణనము —

క॥ సందేశ వ్యాజంబున,
మందపాలం బనిచి నన్ను మన్నించి మహా
నందానుభవము గూర్చితి,
నందాత్మజ ! యే మనందు నా పుణ్యంబున్.

ముత్యాల సరాలు :—

కన్నవిన్న యచోటివింతలు కలవితం బే నున్న దున్నటు
విన్నవించెద నవధరింపుము విభు ! కృపాళుఁడవై

స్వామి నను యోగోపదేశ వ్యాజమున దనవానిగాఁ గని
శ్రీముఖంబునఁ జెప్పి పంచిన చిత్స్వరూపమ్మున్
నందుపల్లెను వినను నీ సందర్శ నానందానుభూతికి
డెంద ముర్విళ్ళూరుచే చే డెలకు మనుగడయా
బ్రతుకు బ్రొద్దులనెల్ల సొడం పఁగను బడయని భక్తి రాధిక
శ్రుతిలన త్సిద్ధాంతసారము జులక వినిపించెన
శేషభా షాధీశ్వర శ్రుతి శేషభూషల కందరాని వి
శేష చిత్సుఖ మాడిపాడిరి చేడె లవ్వాడన్
గోపికా ప్రేమామృతోద్ధఁ గ్రుంకువెట్టిన దాని యోగము
రూపు వెగడై తోఁచె నాత్మష రూపడంగెఁజుమా
మందఁజని నిన్నొండుమాపున మలిచికొంటి నకథ్యనిన్ గ
న్గొందురే మాబోంట్లు విభుఁ గన్గొందు నిను నీవే.
అంచు సూరశ్యాము రమణీ యాంఘ్రులం గన్గొంచుఁ దమిఁ గ
న్నంచు లశ్రుల ముంచుకో వెఱగందె నుద్ధవుఁడున్,

381

శా॥ స్నేపల్లెం బదినాడులన్ నిలిచి గోపీగోప గోవ్రాత సం
తాపంబున్ విడిపించి రాఁగదె! భవత్సంయోగ భాగ్యంబుకై
గోపాలప్రభు! వానకాఱుననె కేకుల్‌గూడి నట్టాడవుం
గ్రేపుల్ వేణురవామృతం బొదవకున్కిన్ బక్కలై చిక్కెఁజూ.

క॥ కేలుంగేలుఁ బెనంగఁగ
బాలుర నీ విరహచింత బాల్పడు వారిం
దేలింపుము నీపాళెముఁ
బాలింపుము కనులఁ గాంచి స్వయముగ నీ వే

382

సీ॥ నిర్గుణయోగమ్ము నెఱపనేగిన నేన
సగుణభావన శిరసావహించి
దాసోహ మంటి వ్రేతలకు నే దూతనై
బ్రహ్మతత్త్వము నలవఱుపఁ బోయి

మమకార మేర్పడ మైత్రిఁజేసితి వారి
  మోల నా ప్రజ్ఞయు మొఱడువారె
జ్ఞానగాథల బోధసారముల్ దరిఁజేర
  నీరుగా కెద వేఱుగారు వాని
తే॥ కనిశ ముప్పొంగు ఘోషాంగనానురాగ
సాగరోల్లోలముల వెల్లు నాగలేక
పొలుపుఁ గోల్పడి, జ్ఞానంబుపుట్టి మునుఁగ
మధుర కోట్పడి వచ్చితి మోహితచరిత !

383

ఉ॥ వాదవివాదముల్ సలిపి వారల ప్రేమరహస్య మేఁ గనుం
గోఁదలకొంటి నార్నెలలు కోమలు లీమిము రామకృష్ణులన్
సాదరవృత్తి లో నిలిపి స్వాశ్రుజలమ్ము ల వర్ఘ్యపాద్య శు
ద్ధోదకధారగాఁ గరపయోజములుం గుచకుంభపాళిమై.
ఉ॥ నూఁదు పటాంచలమ్ము లవి యొప్పనసేయుచు నర్చనావిధిన్
లోఁ దమ దన్ను దంత మిగులుం దిగవెట్టక తా సమర్పితం
బౌదురుఁ దేవ ! నీకుఁ దలఁపంతయు నీపయిఁ జేర్చి నిచ్చ లా
పైదలు లూను నా మధురభావనతో వెగడాయె యోగమున్.
క॥ ఎడ మీ గుణలీలాకృతు
లెడమీ కొకసుద్ది కెల్లయెడఁ బొడకట్టన్
విడనాడక మీ తలఁపే
గడె నాడుచుఁ బాడుచుం ద్రుగ రితలు కృష్ణా !

384

ద్విరదగతిరగడ :—
వ్రజతిలక ! వినుము గోపకుల యుత్తలపాటు
  వ్రజపల్లి నినుబాసి బ్రతుకు వ్రేఁతలపాటు
వసివాడె నినుబాసి పసు లోడె మేపు లవి
  పసిలేక నీబెంగ సన్నగిలెఁ గ్రేపు లవి

హేమంతశిశిరముల హిమహతాబ్జములవిధి
  సీమంతినులు వంతఁ జిక్కి సొమ్మై రవిధి
మధుర వెసనుండి చను మనుజు లెవ రగపడిన
  మధురవార్తలు చుట్టు మలగొంచు నయ్యెడన
కదలనీ రవ్వారి కాళ్ల వేళ్లఁ బెనంగి
  కదిసి నీ కుశలంబుఁ గనుఁగొనఁగ నేభంగి
కాకిసకినా లడిగి కాకులన్ నిలనీకు
  కోకిలముఁ జాతకముఁ గూపెట్టఁగా నీరు
ప్రేమాతురత వెత్తి విరియ నందునిపట్టి
  సేమంబు లడుగ స్మృతిసీమలన్ నిలఁబెట్టి
తెరువరులు శ్యామసందేశములతో నెదురు
  తెలివలకు బెగరి యా తెరువుడిగి తిరుగుదురు

**385**

ఉ॥ నందకుమార ! మందజని నాల్గుదినంబులు నున్న డెంద మా
నందపరీత మౌచు వ్రజనాగుల పొంగుఁటవారు ప్రేముడిన్
విందయి పాలుగొన్న తనిపించును వారివినోదలీల లే
మందును జూచి తీరవలె నట్టిసుఖంబు లభింప దొండెడన్.

క॥ ఘనపుణ్యాత్ముల కబ్బెడు
ననితఃపూర్వానుభూత మాభీరవధూ
జన సాంగత్యసుఖం బది
చను నే నాకనుభవింప జగమున మగుడన్.

తే॥ సుంత డాపక త్రికరణశుద్ధి నందుఁ
బ్రేమమయులకు జ్ఞాన మొప్పింపఁబోవఁ
బాలలో నీఁగ లాగునన్ బాఱవైచి
రచటు నాయెత్తుఁ బాఱనీ కతివలెల్ల

386

శా॥ నీ సందేశము విన్న వెన్క తన సందేశం బెదో నీకు రా
ధాసీమంతిని సెప్పఁబోయి యడుగుల్ దాఁదాఁడ నొడ్డాణమున్
బూనుల్ జారఁగ సొక్కి సోలి, నిలువంబూనున్ భటుం దాజి ఘో
రాసిం ద్రెళ్లియు లేవఁబూనిసటు నీ యాలోక నాకాంక్షమై.

క॥ అఖిలసుఖము లొసఁగితి నీ
ముఖ దర్శనసుఖము వెలిగ ముదితామణి కో
నిఖిలాత్మ ! యింతకున్ మనె
సఖి, భవదీయాంఘ్రిపద్మ సంసేవేచ్ఛన్.

387

ఉ॥ లాలసమొప్ప శ్వేతల తలంపుబొలాలలు నే వచించు యో
గా లవి గాలిపోల్లయి పొకాలెను పీనుల కెక్కఁబోక గో
పాలక ! రేపుమాపులు భవ ద్గుణరూప విలాసచేష్టలన్
బాళి విరాళిపొల్పడుచు వారి వ్రతం బితరంబు లేటికిన్.

ఉ॥ నందకుమార ! నిన్దలచి న్రాతుకయోర్తుక దండమూని యా
ల్మందలఁగాయు; నోర్తుక నెలంతలు చుట్టును గూడుచుండఁగా
సందడిఁ జద్దిఁబంచు; నొకజవ్వని తాండవకృష్ణలీలనాఁ
జిందులుఁద్రొక్కు; నీకృతివిశేషము లోర్తుక యాలపించెడిన్

క॥ తమతలఁపుల నీతలఁపులు
తమసుడిబడి మీ నుడులును, తమచెయ్యములన్
దమి నీ చైదంబులుగాఁ
దముఁదా మర్పించుకొనిరి తరుణులు నీకున్.

388

ఉ॥ అవగ నిన్ దలంచుచు దృగంచలముల్ గనుసిటఁ దోఁగ వా
పోవఁగ బ్రేమభావ మది పొంగులువాఱగఁ వారితోడఁ బ్రే
మావిలమానసుండనయి హత్తుకపోతి సుమయ్య ! వారి కీ
దేవర శ్రీముఖోక్తు లుపదేశములే యొకగాథ యయ్యెడిన్.

ఉ॥ నా వలనైనయంతయు, మనస్ఫురణవ్మ్న వచ్చినంత నా వా
వెలువార్చినంత, తరువా యొకఁడుంచ కుపన్యసించి, నే
నావిధి జాముసే పవిధినందిన, నన్ బ్రతివాదమందుఁ బ్రే
మావిలచిత్తుఁజేసీ క్షణమందు నిరుత్తరుఁజేసి రంగనల్.

ఉ॥ చిత్తును జిత్స్వరూప మొకచిత్తుగ సన్నొక చిత్తులానిగాఁ
జిత్తములం దలంచి నిను జిన్మయునే తమ పొత్తులానిగాం
హత్తుకయుంటి మన్న ! నగలాంద్రకడన్ దలయెత్తలేక నో
రెత్తక యోడిపోతి సివమెత్తిన టుందఱు దుయ్యబట్టగన్.

389

ద్విరదగతి :—

విందువే గోవింద ! వినుపింతు నా పాటు
మందసకియలబ్రోల మైకొన్న నా యోటు
ఉవిద లొల్లమిగనక యోగమ్ము మెడఁగట్టి
యవిధిపడకుందునే యఘఫలం బొడగట్టి
నుడువ నిర్గుణమతను సోర్మ్కదల్చితి నిట్టె
కడముట్టఁగా దాని కడలి కెరటములట్టె
ఉప్పొంగి ప్రేమమహిమోల్బణంబుల ముంచి
యుప్పనుచు నా వాద మూఁడివై చిరి మించి
ఎదిరిఁ గడముట్టనీ కెదుకవాద మొనర్తు
గొదిగి నే నేరకని యుత్తరము లీనేర్తు
ఆటు దేశ్త్రములందు నారితేరినవారు
వారె! నా యోనమాల్ పాఠంబు వినువారు!
తలరి పాపటఁదీయఁ దలకొనిరి నాఁతులకుఁ
దలకు రోకలిఁజుట్టఁ దలకొన్న నాతలకు
తీయబోండ్లను గప్పఁ దెచ్చు యోగపుఁగంత
నాయొడలనే కప్పి నా రేమనుదు వింత!

నాయూఁటు గట్టించి నా నోటు బిగమ్ము
  వేయ వా యాడకయె వీఁగి వచ్చితిఁజుమ్ము
త్రాపుబో. తంధుఁ డం తర్దృష్టిహీనుండు
  పావకోళ్లను దొడిగి పఱువ నెటుపడకుండు ?

**390**

సీ॥ జడ కీడుగాలేక జడత డాగిన నాగు
  బైలులఁ గదుపారఁ గాలిమేసె
బెదరుచూపుల కోడి బెదరి వనిం డాఁగు
  లేళ్లు గంతిడె సీదులేని ప్రతిభ
నెలుఁగున కోడు కోయిల గూసె గొంతెత్తి
  విహగసభావేది విఱ్ఱవీఁగి
ఉలిపిరి నడుమునఁ దులదూఁగలే కోడు
  కేసరి తోకనిక్కించి యెగసె
తే॥ నడలమెల్లన కోద్వుడు నడవియేన్గు
లొడలఁ గులుకులుఁజూపుచు వెడలె గుహల
దేవ ! నీ వంపు కటువుసందేశము విని
పిడుగుపాటుగ రాధిక పుడమి వ్రాల.
క॥ పెనుమచ్చికఁ గనవచ్చెదొ,
మన మచ్చపడంగఁ, దన్నుమనుపన్ లేదెన్
దను మచ్చరించువారల
పెనుపే నిలిపెదవొ, రాధ పృచ్ఛించె నినున్.

**391**

సీ॥ కలవెన్నయంత ముచ్చిలుచున్న వెన్నుఁడీ
  సీమఁ గాపుర మెట్లుసేతు మనుచు
ఇదె కృష్ణుఁబట్టుద మింటింటఁగల త్రాళ్ళు
  పెం డిదే రోటు బంధింత మనుచు

మునుమాపు వేళాయె వనమాలి రాఁడాయె
　గనుల మనకగ్రమ్మె గాన నసుచు
మురళిపై మనపేరు మ్రోయించుచుం బిల్చు
　వినుఁడిదేవచ్చె గోవిందుఁ డనుచు
తే॥ చంద్రుతోఁ దోఁచె మనవ్రజచంద్రుఁ డనుచు
శ్యామవిరహార్తి రాధికాచంద్రమూర్తి
కందువారె నటుంచునిన్ గలవరింత్రు
వెఱ్ఱివలపూని నీయెడ వ్రేఁత లెపుడు.
క॥ నీవగలెఱాక, రేవగ
లేవగలున్ లేవ చెలుల కెద నీ గుణ లీ
లావిభవ విలాసములు వి
నావినఁబడఁ దొండుయూసు నందునిపల్లెన్.

393

చ॥ నిరతము రాధికారమణి నీ గుణరూప విలాససంస్మృతిన్
మరఁగుచుఁ దన్నుదా మఱచి మాధవభావముఁ బూని రాధికా
విరహమునందు, రాధయయి పిమ్మట నీవలవంతఁ గూరు నా
ఇరుకొన లగ్గిరాజుకొను నిధ్మమువం గ్రిమివోలె వేఁగుచున్.
తే॥ తానెనీవైన సాయుజ్యధర్మ మూనీ
తానెతానైన, వలవంత తప్పదాయె
తెలుపుమలుపుల రెంట రాధికకుఁ గృష్ణ!
రాదికామాధవాహ్వాయ రటన మెపుడు,

95

సీ॥ ప్రబలి విరహమేఘవాహనుఁ డానాట
　నిరతమ్ము గుర్తియు గన్నీటిజడులు
గడెగడె రాధ కనడవల నిండారి
　యెడపొలావ వీరిసి విడుపులేవ

శ్వాసానిలంబె ప్రవాహవేగంబుగా
భుజశాఖి కుచగిరివ్రజము ముంచి
అవయవ పథికాళి నలయించెఁ దనుసీమ
మలయజ పంకసంకుల మొనర్చి
తే॥ నీవిరహ మేమి సెప్పుదు దేవదేవ!
తాఱుమాఱొనరించె విధాతృ కాల
మానధర్మంబు ముక్కాఱు మాఱటుగను
నేటి కేడాది వానకా లేర్పరించి,

396

చ॥ పలికితి నీదుమాఱటుగఁ బల్కు మటన్నదిగాక నాకునేఁ
తెలుపఁ గలంతవట్టు పలుతీరుల బోధపడంగ నైన నా
పలుకులు వారికిం గలలభంగి నవిశ్వసనీయ మయ్యె వే
పలుకు లివేల? వారినుడి కారిదకాని గణింప రెద్దియున్.
చ॥ ఘటమున మోమువెట్టి పలుకం దమపల్కులె క్రమ్మఱన్ శ్రవః
పుటముల మాఱుమ్రోగి చొరఁబోనియట్టుల్ వెలిపల్కె దందమం
తటు నెలకొన్న నిన్నెనయుతల్పు ప్రలాపము దక్క వారి కొ
క్కటి చెవి కెక్కదాయె నిలుగట్టుక పోరిన నాదువాదముల్.
క॥ నినుఁ గనుపెట్టెదు పుట్టుదు
గని ధన్యల ప్రేమరూపికల గోపికలం
గని నెనరుప్పొంగ పెనఁ గొనఁ
బెనువలఁబడు జింకవోలె వెఱమాన్పడితిన్.

397

ఉ॥ పట్టొకయేన్గుపట్టువలెఁ బట్టిన నీనుడి మేరమీఱకే
నెట్టనపోతి నన్నిటులు నేరనివాని నెఱింగియుండి నా
యట్టిడిఁ బంచి యిట్లడిగి యాఱడి నొందుటకంటె నీవ యా
పట్టునకేగి కన్నఁ గనుపట్టుఁజుమీ! కనుఁగొంట నన్నియున్.

క॥ మోహకుఁడగు నాయట్టిడి
వేఁడిడి నన్నెటిగియెటిఁగి ప్రేఁతల మేలా
ప్రేరేచి పంచి తిత్తటి
వారితలఁపుఁ బాటిఁగొంటె వాడిగఁదోఁచెన్.

క॥ కలకాలము వాదాడఁగఁ
దలయెత్తని పగిది నోడ్చి తరుణులు నన్నున్
వెలలంగొట్టిరి వేఱొక
వలఁతిన్ బోధప్రవీణుఁ బంపవె యటుకున్.

398

క॥ భక్తలుగారో ప్రేఁతలు,
భక్తివశుఁడ వీవు గావొ భక్తపరాధీ
నోక్తి యదత్యుక్తియొ!
భక్తులఁ గాపాడుబిరుదుఁ బాటింపయూ!

ద్విపదగతిపగడ :-

అక్కటికకు నిక్క వనిపించుకొను నీవ
అక్కటుకటా! కటికి వైతె! ప్రేఁతలు నోవ
ఘన దయామయదృష్టిఁ గాంచి యనదల నోమి
ఘనదయాళుఁడ వన్న ఘనత నిల్పవె స్వామి!
భక్తవశుఁ డీ వన్న ప్రానుడులు కల్లలే
భక్తులే గారొ ప్రేపఁల్లెగల గొల్లలే
స్వామి ! నాప్రోలఁ దలవాల్చి చూపుబ్రాల
మోమెత్తి, మాటాడ, మోమోటపడుదేల !
అనుచు నెచ్చెలి ఫల్క హరి వించుఁ దలడించు
నెనరుకన్నీ ర్నించు నిట్టూర్పు నిగుడించు.

399

శా॥ నన్నే క్రమ్మఱ వేల పంపెదవు మందం దిర్వీరా, నిట్టు రా
కిన్నాళ్లాయెను గాని జాణయగు నాం డెవ్వాని నంపించినన్,
మున్నాళ్లన్ మగుడున్ వ్రజాంగనలు మోమున్ ముద్దు రేనన్న చో;
నన్నా! మన్నన హారతిత్తు రొకమా ర క్రూరునిం బంపుమా!

క॥ అనుడు నరవిందలోచనుఁ
డనుఁగుం జెలికాని పలుకు వ్యంగ్య మరసి మో
మునఁ జిర్నగవు విరాజిల
నెనరున వక్కంటఁ దీసి నెమ్మి వచించెన్.

400

ద్విరదగతి :—

మఱపురా దుద్ధవా! మందలోఁ చిననాఁడు
పెరిగి సుఖములుమరగు వృత్తాంత మేఁనాడు
యమునయొద్దునను నయ్యాటలాడఁగ గొల్ల
కొమరితల గేల్పట్టి కొంపోవు సొగసెల్ల
అలఁ గ్రేపులఁ గట్టు నాలపట్టుల హరువు
నాలఁ బొల్చితుకుచె ల్వాటలాడెడు మురువు
కుందనపుఁ దళుకుబెళుకుం దనరెనేన్ మధుర
మంద మనిపించు మా మందతలఁ పెదఁ గదుర
అల్ల వ్రజదంపతుల యనుఁగుఁబెంపును మమ్ము
నల్లారుముద్దుగా నరయు నిర్వాహమ్ము
చిన్నారికన్నియలు చెట్టవట్టుక చుట్టు
వెన్నెలల నట్టాడు వేడుకలఁ దలపెట్టు
ప్రేఁతలపుఁ దలపుఁ దనుఁ బ్రేమవిహ్వలుఁ జేయు
చేత మూప్పొంగించి చేష్ట లుడుగంజేయు
ననుచు నూరక్కొమఁ డలమరెనుఁ దినసాటి
యనుభవించిన సుఖము లంతరంగమ్ము తాట్య

## భ్రమరగీతా సంగ్రహము

ద్విరదగతిరగడ :—

అనుచుఁ బ్రేమోన్మత్తలై మత్తకాశినులు
వినుచు నా ప్రేమప్రవృత్త్యుపన్యాసములు
విని వార లలవఱుచు ప్రేమయోగముఁ గఱచి
వినుచుఁబోయిన యోగవృత్తాంతమును మఱచి
హరిసఖుం డుద్ధవుఁడు హరిపదాంబుజరక్తి
వరసఖ్యభావ సంభావితుండై భక్తి
ఆడెఁ బాడెను దాండవం బాడెఁ జెరలాడె
జోడియలఁ గొనియాడె స్నేహతత్త్వముఁ బాడె
సకలమ్ము లో మఱచి సకుల నభినందించె
నికటు కుటనికురంబు నెమ్మిఁ గౌఁగిలించె
ధన్యలున్ ధన్యమూర్ధన్య లీ గోపికలు
మాన్యమున్ లోకసమ్మాన్య మీ గోకులము
ధన్యమౌ నందనందనుఁ డాలమేపఁగను
వన్యభువి తత్పద స్పర్శభాగ్యంబునను
బుద్ధిఁ గఱపఁగ వచ్చు బోద్ధకే కనువిప్పు
బుద్ధిసెప్పిరి ప్రేమమూర్తు లీ రనువొప్పు
యోగోపదేష్టకే యొదవె నాకిటు ప్రేమ
యోగోపదేశ మీ యుగ్మలుల పోరామి
అని వారి మెచ్చు, గోపాకల్పము ధరించి,
కనవచ్చెఁ గృష్ణవిభు కట్టెదుట కరుదెంచి
"యదువీర! యదునాథ" యను తొంటిసంబుద్ధి
మదిమఱచి గోపభామా ప్రేమసంబద్ధ
"గోపగోపీలోల! గోపాలనాలోల
గోపాలకస్వామి గోవింద" యని చాల

కూర్మి జాల్వారు కొంగ్రొత్త పిల్పులఁ బిల్చి
  అర్మిలి సకుం డతం డనె నిట్లు హాళిఁ దల్చి
వ్రేఁతలము వేంచేసి వ్రేఁతలను గనిరమ్ము
  నీ తలపు వలపుల్లఁ బుష్పిత్తై రనయమ్ము
నందగోకుల మహానంద సుఖములు నిండ
  నిందందఁ దిరుగస్త్రీ శౌల్లొప్పిన దడందఁ
డెందమున నిం దలఁచి డింది కుంబెదు గోప
  సుందరికి నీమోవఁ జాపిర మ్మొకతేప
వ్రేఁతలూనిన నీదు ప్రేమవ్రతముఁ గన్న
  వే తపోయోగంబు లెదకెక్కి వోయన్న
అని కృష్ణవిభు నెంచి సాక్షాత్పరేశునిగ
  మొనసి సాగిలి మ్రొక్కి మోదాశ్రు లలముఁగా
నుడులు తడబాటుతో, నుడియాడకున్న నా
  వడువుఁగని ప్రేమవిహ్వలుఁడౌచుఁ గన్నులన్
నీరిడుచు మాధవుఁడు నేలఁపైఁ గూలఁబడి,
  నీరొత్తుకొని పసిఁడి నిగవలువకొంగు నిడి,
తరుణులకు యోగవిద్యలఁ గఱపి వచ్చితివా,
  పరమసఖ! యన్ని యడిగె వ్యంగ్యముగ నా ప్రభువు.

## సూరసాగర కావ్యప్రశస్తి

తే॥ నందగోపాంగ నా ప్రాంగణద్యుతి నిధి,
కువలయోల్లాసి నందగోకులవిలాసి,
హరి సుధారాశిఁ గన్న క్షీరాంబు రాశి
గోపదంపతీవాత్సల్యగుణవిభాసి,

బహుముఖాఖ్యాత వేణుతత్త్వప్రకాశి
వ్రజసఖీవ్రజ విమలానురాగరాశి,
రాధికాకృష్ణప్రేమతంత్రప్రకాశి,
సూరవారాశి, హరిభక్తివారిరాశి॥,

తే॥ వ్రేతల తలంపుతీపుల వెల్లివిరిసి,
వలపుఁగన్నిటి యుప్పుతేరులనుఁ గలసి,
మధుర లావణ్యరసముసంపన్న మయ్యె
రాగరసవాహిస్వపూర్ణసాగర మిది.

తే॥ సఖ్యవాత్సల్య శ్రవణ, సంస్మరణ దాస్య,
వంద, హర్చన, కీర్తనా, నందతాండ,
వాత్మహృదయార్పణాది, నవాప్తభక్తి
భావరసవాహినుల్ పొంగువారు, నిందు
సూరసుందర పదసుధాసౌరభాబ్ధి॥

తే॥ జ్ఞాననిష్ఠైకరతి, భక్తి సరకుగొనని
వృష్ణిసఖు వ్రేలవలపు నుప్పైనలముంచె
సఖ్యవాత్సల్య రససుధాసాగరంబు
సూరదాసపదాస్వాద్యసౌరభంబు.

## స మ ర్ప ణ ము

ఉ॥ సులలితశ్రీ సారమూర్తి పరిశోభిత సాకృతి సారమూర్తిర
త్నాలయము "సూరసాగర" మనః ప్రియకావ్యము నీకునిత్తు "రా
మచరితమానసంబు" నిజమానసమానసరాజహంసిగా
సుచితగతిన్ శివుండు గొనునోజ గ్రహింపవె! వేంకటేశ్వరా!

ఇది శ్రీమద్భారద్వాజసగోత్ర పవిత్ర సుబ్బమాంబా
రామనార్యతనూభవ సుజనవిధేయ సూర్యనారాయణ
నామధేయ ప్రణీతంబును, భక్తసూరదాసకృత
"సూరసాగర" వ్రజభాషాభాగవత
పురాణమున దశమస్కంధ సంగ్రహా-
ధ్రీకరణము సమాప్తము

శ్రీరాధాకృష్ణ పరబ్రహ్మణే నమః

# సవరణ పట్టిక

| పేజీ | లైను | తప్పు | ఒప్పు | పేజీ | లైను | తప్పు | ఒప్పు |
|---|---|---|---|---|---|---|---|
| 2 | 16 | వలన | వరుస | 48 | 22 | తెమ్మ | తెత్తు |
| 3 | 9 | అంఁదుదు | అందుదు | 50. | 20 | గాందుచుంటి | గాంధుధుంటివా |
| 8 | | నవవిూన | నవవిధాన | 54 | 5 | హరి | హాలి |
| 10 | 4 | మొగిశేవైంటమ | మొగిశ్లేవె టను | 56 | 1 | మమ్మన్ను | మమమ్నః |
| 10 | 5 | ఉులుయును | ఉులుమను | 57 | 12 | ఒకిత | ఒకింత |
| 11 | 4 | నమ్మిక | నమ్మక | 61 | 4 | పతితావని | పతితావన |
| 11 | 26 | వారని | వారిని | 62 | 6 | విపించున్ | వవిపించున్ |
| 18 | 7 | మరలి | మలరె | 65 | 21 | వియొగ్గాది | విన్నొగ్గాది |
| 13 | 23 | షులికించు | పులకించు | 68 | 18 | ఉడికింత్రు | ఉరికింత్రంబు |
| 15 | 13 | తెసు | తేదు | 69 | 23 | పడిదాపు | పడిఁదాపు |
| 17 | 21 | దానంబు | దానాంబు | 74 | 2 | మహత్వ | మహత్వం |
| 19 | 12 | ఎన్నో | ఎవ్నో | 84 | 13 | మొలలాడి | సోలలాడి |
| 25 | 18 | దాపుస | దాపుచు | 87 | 12 | వందాన | నందాన |
| 22 | 1 | మాయబు | మాయిబు | 88 | 2 | కనుబొమ్మల | కనుబొమల |
| 28 | 8 | ఇంవేలుపు | ఇలువేలు: | 104 | 8 | గమ్ము | యోగమ్ము |
| 28 | 19 | అనుభవింపనేమొ | అనుభవింపగనేమొ | 104 | 10 | మామంద | మామంద |
| 29 | 2 | విలువ | వలువ | 104 | 10 | కులుగుచుండి | కులుకుచుండె |
| 29 | 8 | అప్పట్టి | అప్పటి | 108 | 11 | ఇట్టట్టెయాపక్క—ఎక్కరింతగలారు | |
| 30 | 3 | తల్గడల | వల్క్రవం | 108 | 17 | వెట్టురే | వెట్టులే |
| 31 | 18 | ట | టైటి | 108 | 18 | తట్టురే | తట్టురే |
| 32 | 10 | కటువు | కటు | 113 | 12 | ప్రేదం | ప్రేతం |
| 36 | 13 | రావినో | రావివా | 118 | 24 | మవదు | మదువ |
| 36 | 4 | గాంచిన | గాచిన | 119 | 10 | గాకి | గాకి |
| 37 | 5 | గుజ్జారై | గుజ్జాపై | 121 | 9 | విర్గుణం | విర్గుణం |
| 38 | 6 | గేల | గేల | 122 | 1 | శేవగలు | రేవగలు |
| 39 | 1 | మహిముండా | మహిముడా | 123 | 12 | అలందు | అలదు |
| 40 | 21 | లీలపై | లీవపై | 124 | 11 | వట్టి | వట్టు |
| 41 | 2 | వరమాత్మ | వరమాత్మ | 126 | 9 | పీలకాళ | పీలాకాళ |
| 44 | 6 | నెక్కవన్ | నెక్కొవన్ | 126 | 16 | ముచ్చెమలు | మచ్చెములు |

| పేజీ | లైను | తప్పు | ఒప్పు | పేజీ | లైను | తప్పు | ఒప్పు |
|---|---|---|---|---|---|---|---|
| 123 | 4 | విందుల | విరుదుల | 184 | 22 | యొదన్ | యొదలీ |
| 125 | 15 | యోగులు | యోగమ్ము | 185 | 12 | తలంపు | తలఁపు |
| 127 | 19 | వీక్షింతు | వీక్షింత్రు | 188 | 1 | ఇటు | ఇట్టు |
| (పైపద్యంలో 4వ పాదంగా చదువుకొనవలెను) | | | | 188 | 7 | వగలాంధ్రి | వగరాంధ్రి |
| 134 | 11 | ఏవేణుమోహనవిక్యంబునఁద్రొక్కి | | 189 | 12 | ఒడిగట్టి | ఒడిగట్టి |
| 134 | 12 | చిక్కి మోహాపులు జింకలయ్యె" | | 190 | 14 | దావి | రావి |
| 160 | 20 | పదాబ్జమాలా | "పదాబ్జయుం | 199 | 19 | దేప్రము | శాప్రము |
| 161 | 9 | పేయుచు | సేయుము | 200 | 18 | లేడెన్ | లేదేన్ |
| 166 | 16 | "అద్దకమున | అద్ధకమున్న | 201 | 29 | 'లాదికా | రాధికా |
| 168 | 10 | మకున్ | మాకున్ | 204 | 1 | ఇట్టురా | ఇట్టునా |
| 164 | 22 | సిద్దనుదుం | శ్రీపెద్దనుదుం | 205 | 6 | చెకంద | దెకంద |
| 148 | 19 | నగులు | నగును | 206 | 14 | విహ్యాలు | విహ్వాలు |
| 164 | 13 | దిటు | వెటు | 207 | 14 | హార్చన | సార్చన |